మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2021-23
Date of Posting: On 29th & 30th
Date of Publication: 25.3.2023

మిసిమి

చింతనాత్మక సారస్వతం




లతాంగి



అందానికి అంచులు

మాసపత్రిక, ఏప్రిల్, 2023 ₹ 50/-

ISSN 2454–4329



ఆరని రంగులు



చెదిరిన కలలు

మిసిమి

మాసపత్రిక

సంపుటి 34 సంచిక 4

ఏప్రిల్ - 2023

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI Since 1946

Printed & Published by

BAPPANNA ALAPATI

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

Hyderabad - 500 020.

Ph: 040 - 27612436, 27645538.

Editor: **Ph: 949 121 6363**

(11.00 am to 4.00 pm)

చందా వివరాలు:

₹ 600/- (సంవత్సర చందా),

₹ 1200/- (రెండు సంవత్సరాలకు),

₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : వి. ఆశారాణి

040 - 27645536

Scan QR to Pay

Misimi Publication

LIBRARY OF CONGRESS

LCCN 91-903060

UGC Care

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

ISSN 2454-4329

misimi90monthly@gmail.com

www.misimimonthly.com

e-magazine : www.kinige.com/misimi

facebook.com/misimimaasapathrika

YouTube : **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

మిసిమి

ఏప్రిల్ నెల సూచికలు...

కమ్మతెమ్మెరలు : ... 5

రాజేశ్వరి (నటరత్నాలు) : మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి... 6

భవిష్యత్ విద్య – ఆల్గొరిథంల పాత్ర : ఆచార్య కోదాటి వియ్యన్నరావు... 7

తరిగొండ వీరతరుణి – వేంకటాచల మహాత్మ్యం : జంధ్యాల కనకదుర్గ... 10


ఎబికె

ఎబికె ప్రసాద్ : *మిసిమి* ... 13

అనర్ఘ రత్నాలు : ఆచార్య పప్పు వేణుగోపాల రావు... 21

కాశీలో తమిళులు : కిల్లాడ సత్యనారాయణ... 23

క్రీడాభిరామంలో సాంఘిక చరిత్ర : డి. ఎస్.ఎమ్.ఎస్. రావు... 27

నాటకరంగ స్థితిగతులు : డాక్టర్ వేమలి త్రినాధరావు... 31

'సీరపాణి' తెలుగు 'వందేమాతరం' గేయం : పిళ్లా తిరుపతిరావు... 34

స్త్రీల పాటల్లో అప్పగింతలు : దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు... 37

మూడుశాసనాల వెలుగులో... : గార రంగనాథం... 40


సఫారీ

కబీర్ దాస్ – 12 : ప్రొ. లక్ష్మీ అయ్యర్... 45

పులినాడు – జానపద సిరిగములు : డి. కృష్ణారెడ్డి... 49

తెలుగు పదాల మార్పులు : షేఖ్ మహబూబ్ బాషా... 53

ఆఫ్రికాలో సఫారీ : డా. నిమ్మగడ్డ శేషగిరిరావు... 58

చిత్రగీతాలు: జావళీలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య... 65

భౌతిక సత్యాలు: కలయా – మిథ్యా – మాయా? : అవధానం రఘుకుమార్... 69

టూలూజ్ లాట్రెక్ – పోస్టర్ సృష్టికర్త : టి.వి. ప్రసాద్... 73

కాలాతీత వ్యక్తులు : వి. రాజారామమోహనరావు... 77

చదవండి... : *మిసిమి* ... 80

అట్టమీది బొమ్మలు


అందానికి అంచులు

చిత్రకారుడు: **Darren Davis**


ఆరని రంగులు

చిత్రకారుడు: **Yossi Kotler**


చెదిరిన కలలు


చిత్రకారుడు: **Jochem Bakker**


లతాంగి

చిత్రకారుడు: **Pat Brennan**

కమ్మతెమ్మెరలు

"... కాలపు పెను తుఫాన్లు తట్టుకుంటూ, తరతరాల మేధస్సులను దాటుకుంటూ సత్యానికి సాక్షి శ్రీ కిల్లాడవారి వ్యాసం **మిసిమి** ఫిబ్రవరి 2023 సంచికలో చదివి ఆనందిస్తున్నాను. చారిత్రక నవల ఒక తులనాత్మక పరిశీలనము పేరుతో – రమేష్ ప్రసాద్ రావెళ్ల వారి రచన నోరి నరసింహశాస్త్రి – అడవి బాపిరాజు – మహీధర, విశ్వనాథవంటివారి రచనలను జ్ఞాపకానికి తెస్తూ సద్విమర్శతో కూడిన చర్చ చేశారు. చారత్రక రచనలు చేయడంలో పైన పేర్కొన్న కవులందరూ విశిష్ట గుణసంపన్నులే. డా. నిమ్మగడ్డవారు వారి పర్యటన ద్వారా మనల్ని ప్రపంచం అంతా చూపిస్తున్నారు. కోడూరి పుల్లారెడ్డి విశ్లేషణ బాగున్నది. చాలా బాగా స్పందింపజేసిన రచన. పుల్లారెడ్డిగారు వ్రాసారంటే దీనికొక విశిష్టత ఉంటుంది. శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారితో ఇంటర్వ్యూ పాఠకులను కదిలిస్తుంది. ఇలాంటి నిజాయితీగల రాజకీయ నాయకుల గురించి వ్రాయించమని నా ప్రార్థన. రచనలన్నీ బాగుంటున్నాయి. అదే **మిసిమి** ప్రత్యేకత సుమా!.."




– చెరుకువాడ వెంకట్రామయ్య, విస్సాకోడేరు – ఫోన్: 954 211 8184

"... మహాశయా, **మిసిమి** మార్చి 2023 సంచిక అనర్ఘ రత్నాల లో పప్పు వేణుగోపాలరావు 'రమణీ ప్రియదూతికను' సౌందర్యవతి అని తెనిగించారు. ఇది పొరపాటు '[ప్రేయసి కబురు తెచ్చిన స్త్రీ' అని దాని అర్థం. వెలగా కృష్ణమోహన్ పరిచయంలో హిరాలి అని ఉంది. అతని అసలు పేరు విష్ణుదాస్ షిరాలి. ప్రఖ్యాత నాట్య కళాకారుడుకు ఉదయ్ శంకర్ నిర్మించిన "కల్పన" (1948) చిత్రానికి ఇతనే సంగీత దర్శకుడు. ఇక శ్రీ రజనీకాంతరావు గురించి చాలామందికి తెలియని విషయం. త్యాగరాజు రసాళి రాగంలో ఒకే ఒక కీర్తన చేసారు, 'అపరాధములనూర్వ'. ఇదే రాగంలో రజనీ ఒక సినిమా పాట చేశారు – స్వర్గం, సాహిత్యం – "మానవతి" (1952)లో ఆర్ బాలసరస్వతి దేవి పాడిన 'తన పంతమే తానిడువడు'. శ్రీ నేదునూరి కృష్ణమూర్తి 'ఈ రాగంలో మరొక కృతి లేదు' అని చెప్పారు, తదుపరి శ్రీ మధురై కృష్ణన్ ఆ రాగంలో నా కోరికపై ఒక జతిస్వరం చేశారు ఇది మద్రాసులోని భరతనాట్య కళాకారులకు, ప్రేక్షకులకు అభిమానపాత్రమైనది..."

– వి.ఎ.కె. రంగారావు, బొబ్బిలి

"... **మిసిమి** పత్రిక సంపాదకులు, విజ్ఞులు, అశ్వినీకుమార్‌గారికి హృదయపూర్వక అభినందనలు. అయ్యా! **మిసిమి** మార్చి – 2023 సంచికలో ఆకాశవాణి లలిత సంగీత దర్శకులు శ్రీ కలగా కృష్ణమోహన్‌గారితో మీరు చేసిన ఇంటర్వ్యూ సంగీత, సాహిత్య ప్రియులకు అపారమైన ఆనందాన్ని అందించింది. రేడియోల్లో ఆయన నిర్వహించిన నాటి లలిత సంగీత కార్యక్రమాలను మరొక్కసారి గుర్తు చేసినందుకు చాలా సంతోషంగా ఉంది. ప్రముఖ లలిత సంగీత గాయనీమణులు శ్రీమతి వేదవతి ప్రభాకర్, ద్వారం విజయలక్ష్మివంటివారు గుర్తుకొచ్చారు. ఇంకా ఎంతోమంది ప్రముఖ సంగీత దర్శకులు, గాయనీ గాయకుల గూర్చి చక్కగా వివరించారు. ఈ సందర్భంలో నా మనస్సులో మాట ఒకటి బయటపెట్టాలి... పెద్దలు, కళాపోషకులు శ్రీ రామోజీరావు వంటి ప్రముఖులు సంకల్పిస్తే, ఈ తరంలో కూడా 'పాడుతా తీయగా'లాంటి కార్యక్రమాల క్రమంలోనే 'లలిత సంగీతం' కార్యక్రమాలు కూడా ప్రసారం చేయగలిగితే (దూరదర్శినిలో) ఎంతోమంది శ్రోతలకు అమితానందాన్ని అందించినవారౌతారు... చివరిగా ఇలాంటి ఇంటర్వ్యూలు ముందు ముందు కూడా ప్రచురించగలరని ఆశిస్తూ...."



– దూబ వేణుగోపాల్, హైదరాబాద్


రాజేశ్వరి

రాజేశ్వరి

ప్రసిద్ధ రంగస్థల నటీమణి రాజేశ్వరి గుంటూరు జిల్లాలో అమరావతికి సమీపంలోని నెమలికల్లులో జన్మించింది. రాజేశ్వరం వంశం పారంపర్యంగా సంగీత, సాహిత్య, నాట కళల్లో ప్రసిద్ధి చెందిన వంశం. 1915లో రాజేశ్వరి జన్మించింది. వంశాచార విద్యలన్నింటినీ చిన్ననాడే అభ్యసించింది. 1933వ సంవత్సరంలో కొప్పరపు సుబ్బారావుగారు గ్రామఫోను రికార్డులివ్వడానికి బెంగుళూరు ఆహ్వానించి కొన్ని రికార్డులిప్పించారు. ఆ తరువాత విజయవాడలో ప్రసిద్ధ సంగీత దర్శకులు ఓగిరాల రామచంద్రరావుగారి పర్యవేక్షణలో వారి ప్రోత్సాహంతో నాటకాలలో పాత్రలు ధరించింది. రాజేశ్వరి ప్రప్రథమంగా రంగస్థలంమీద చిన్నచిన్న పాత్రలు ధరించి అనుభవం గడించిన తరువాత ఆమె ధరించిన పెద్ద పాత్ర సావిత్రి. తొలి ప్రదర్శనం రాజమండ్రిలో భయంతో, వణుకుతో సావిత్రి వనవిహారం పాటపాడుతూ రంగస్థలంలో ప్రవేశించింది. ప్రథమ నాటకంతోనే నాయిక పాత్రకు జేజేలందుకున్న రాజేశ్వరి ఆ తర్వాత పి.ఎస్.ఆర్. ఆంజనేయులుగారితో తులాభారంలో సత్య పాత్రనూ, యడవల్లివారితో బొబ్బిలిలో మల్లమాంబ, అద్దంకివారితో పాదుకలో కైక మొదలైన ఉత్తమ నాయకి పాత్రలను అద్భుతంగా అభినయించి ప్రథమశ్రేణి రంగస్థల నటీమణిగా కీర్తిప్రతిష్టలను ఆర్జించకుంది. ఆ రోజుల్లో కోటమర్తి పున్నయ్యగారు నాటకాలను కాంట్రాక్టు తీసుకుని ప్రదర్శిస్తూ ఉండేవారు. ఆ నాటకాలలో బందా, పులిపాటి, పి. సూరిబాబుగార్లతో కలిపి సారంగధర, చింతామణి, కాళిదాసు, కోకిల, ధరణికోట మొదలైన నాటకాలలో ప్రముఖ పాత్రలు ధరించి పేరెన్నికగన్నది. విడిగా ఆమెను చూచినవారు నువ్వేనా రాత్రి ఫలానా పాత్ర ధరించిందని విస్తుపోయేవారు. ఆమె పాత్రను అంత రమణీయంగా అలంకరించుకునేది. రాజేశ్వరి, బళ్లారి రాఘవాచారి, బందావారితో కలిపి అనంతపురం, బళ్లారి జిల్లాలలో సారంగధర నాటక ప్రదర్శనాలను విరివిగా ప్రదర్శించింది. ఆ ప్రదర్శనంలో రాఘవ – రాజరాజు, బందా – సారంగధరుడు, రాజేశ్వరి – చిత్రాంగి. స్త్రీలే స్త్రీ పాత్రలు ధరించాలనే రాఘవ, రాజేశ్వరి చిత్రాంగి పాత్రను యెంతగానో మెచ్చుకొన్నారు.

బాల్యం నుండీ నాటకరంగానికే జీవితాన్ని అంకితం చేసి సినిమాలలో కూడా నటించి గంధర్వ గాయకుడుగా పెద్ద పేరు తెచ్చుకున్న పి. సూరిబాబుగారు రాజేశ్వరిని నీవు నాయకి పాత్ర ధరిస్తే నేను సమాజం నడుపుతానన్నారు. అందుకు అంగీకరించిన రాజేశ్వరి ఆయన వద్ద డబ్బు లేకపోయినా తానే సీనరీలు వ్రాయించి, లైటింగ్ సామగ్రికీ, దుస్తులకూ దాదాపు పదివేల రూపాయలు ఖర్చుపెట్టి రాజరాజేశ్వరి నాట్యమండలిని స్థాపించి కొప్పరపువారి తారాశశాంక నాటకాన్ని ప్రాక్టీసు చేసి ప్రథమ ప్రదర్శనాన్ని ఏలూరులో ప్రదర్శించారు. తొలి ప్రదర్శనం అఖండ విజయం సంపాదించింది. తారాశశాంక నాటకం ఎంతో ప్రజాదరణ పొందింది. కొన్ని వేల నాటకాలను ప్రదర్శించారు. తరువాత వారణాసి సీతారామశాస్త్రిగారిచే భూకైలాస్ నాటకం వ్రాయించి పెద్దపెద్ద సెట్టింగులతో ఆంధ్రదేశంలోనేకాక, మైసూరు, బెంగుళూరు ప్రాంతాలలో ప్రదర్శించారు. ఒక్క తారాశశాంక నాటకం బెంగుళూరులో వరుసగా నూరు రోజులు ప్రదర్శించారంటే అది ఎంతటి ప్రజాదరణ పొందిందో ఊహించవచ్చు. మైసూరు మహారాజా సమక్షంలో నాటకాలాడి మన్నన పొందడమేకాక మన పారితోషికాలను అందుకున్నారు. బొంబాయి, కలకత్తా, హైదరాబాదు, ఒరిస్సా మొదలైన రాష్ట్రేతరాంధ్ర ప్రాంతాలలో నాటకాలాడి ప్రశంసలందుకున్నారు. ఆంధ్రనాటక కళాపరిషత్తులో సూరిబాబు, రాజేశ్వరీగార్లకు వారు చేసిన బహుముఖ నాటక సేవలకు ఘనంగా సన్మానించారు.

ఈ విధంగా 1960 వరకూ అజరామరంగా నాటకాలు ప్రదర్శించారు. కాని, సూరిబాబుగారి ఆరోగ్యం దెబ్బతినడంతో తాత్కాలికంగా నాటకాలను ఆపు చేశారు. చివరికి 1968 సంవత్సరం మార్చి 11వ తేదీన సూరిబాబుగారు కన్నుమూయడంతో రాజేశ్వరి జీవితంలో అంధకారం ప్రవేశించింది. నాటితో సరి.

నటరత్నాలు – మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి

భవిష్యత్ విద్య - ఆల్గొరిథంల పాత్ర

– కోదాటి వియ్యన్నరావు

కంప్యూటర్ విజ్ఞానానికి ప్రాతిపదిక అయినటువంటివి, కంప్యూటర్ల పనితనాన్ని నిర్దేశించి, మెరుగుపరచేవి ఆల్గొరిథంలు. గణిత శాస్త్రంతో పుట్టి, కంప్యూటర్ విజ్ఞానంతో బహుళ ప్రాచుర్యం పొందాయి. స్థూలంగా చెప్పాలంటే 'ఆల్గొరిథం' అంటే ఒక గణితశాస్త్ర సమస్యను, ఒక నియమిత పద్ధతిలో కొన్ని నియమిత అంచెలలో (steps) పరిష్కారం చూపేది. ఉదాహరణకు, 100 సంఖ్యను 10తో భాగిస్తే ఎంత జవాబుగా వస్తుంది. దీనిని రెండు అంచెలలో సాధించవచ్చు. మొదటి అంచెగా, ఏ సంఖ్యతో అయితే భాగహారించాలో, ఆ సంఖ్యను హెచ్చించుకుంటూ పోవాలి. ఆపైన, కొంత దూరం హెచ్చించిన తరువాత విభజించవలసిన సంఖ్యకు దగ్గరగా హెచ్చించిన సంఖ్యలు వస్తాయి. వాటిలో ఏదైతే విభజించవలసిన సంఖ్యకు సమానంగా లేదా దగ్గరగా ఉంటుందో అది ఫలితం లేదా జవాబు అవుతుంది. పై ఉదాహరణలో జవాబు '10' అవుతుంది. శేషం ఏమీ లేదు. కొన్ని సమస్యల విషయంగా, శేషం (Remainder) మిగలవచ్చు. ఇదే పద్ధతిన, ఆల్గొరిథంలను ఉపయోగించి కూడికలను, తీసివేతలను, హెచ్చవేతలను చేయవచ్చు.

గణిత సూత్రాలను ఉపయోగించి చిన్న సంఖ్యలకు ఫలితాలను ఎవరైనా ఇట్టే సాధించగలుగుతారు. అదే పెద్ద సంఖ్యల విషయంలో ఫలితం సాధించాలంటే చాలా సమయంపడుతుంది. జవాబు సరైనదేనా అని కనిపెట్టడం కూడా కష్టమే. ఒకప్పుడు ముఖ్యంగా 1970-1980 ప్రాంతాలలో బాంకు పోటీ పరీక్షలలో ఇటువంటి సమస్యలే ఎక్కువగా ఇవ్వబడుతుండేవి. కంప్యూటర్ల ఆగమనంతో ఈ విధమైన సమస్యలు క్షణాలలో పరిష్కరించబడుతున్నాయి. అయితే సమస్యను గుర్తించడంలోను, దాని పరిష్కారానికి ఉపయోగించదగ్గ క్రమపద్ధతిని నిర్ణయించడంలోనే పరిష్కర్త యొక్క తెలివితేటలు ప్రస్ఫుటమవుతాయి. పరిష్కరించవలసిన సమస్యను బట్టి ఇవి మారుతుంటాయి. అందుచేతనే 'ప్రోగ్రామింగ్' అనేది ఒక వ్యక్తిగత నైపుణ్యం (Individual Skill)గా రూపొందింది.

ఆల్గొరిథంలు ఇన్‌పుట్ – అవుట్‌పుట్ (Input-Output) చట్రంలో పని చేస్తాయి. అంటే సమస్యను ఇతమిద్ధంగా స్పష్టం చేయలేకపోయినా, పరిష్కారం ఉండే అవకాశం లేకపోయినా, ఇవి నత్పలితాలను ఇవ్వలేవు. ఈ సందర్భాలలో కూడా ఇవి అసలు పనికిరావని చెప్పలేము కాని, అవుట్‌పుట్‌ను స్పష్టీకరించడం కష్టమవుతుంది. ఉదాహరణకు ఒక వ్యక్తి జ్వరంతో బాధపడుతున్నాడనుకొందాం. కొన్ని మందులు సూచించబడ్డాయి. ఆల్గొరిథంలు ఏ మందు యొక్క ప్రభావం ఏ విధంగా ఉంటుందో అంచనా వేయగలవు. కాని అతని జ్వరం పూర్తిగా ఎప్పుడు నయమవుతుందనేది గంటలు, నిమిషాలు, సెకన్లు ఆధారంగా స్పష్టం చేయలేవు. ఎందుచేతనంటే రోగి యొక్క పరిస్థితి అనేక ఇతర కారణాల వలన ప్రభావితం చేయబడుతుంది. అంటే ఇన్‌పుట్ ఖచ్చితంగా లేదన్నమాట. అటువంటి సందర్భంలో ఆల్గొరిథంలు ఖచ్చితమైన జవాబులు ఇవ్వలేవు. ఇవ్వగలిగినది ఒక అంచనా మాత్రమే. ఈ అంచనా యొక్క నిర్దిష్టతను పెంచే దిశగా ఆల్గొరిథంలను ఉపయోగించి నిపుణులు మెరుగైన ఫలితాలను సాధించడానికి ప్రయత్నం చేస్తుంటారు. మరొక ఉదాహరణగా రాకెట్ ప్రయోగాన్ని తీసుకుంటే ఇక్కడ ఖచ్చితత్వం యొక్క అవసరం ఎంతైనా ఉంది. రాకెట్ ప్రయోగానికంటే ముందే ఆల్గొరిథంల ద్వారా ఇన్‌పుట్ అవుట్‌పుట్ చక్రాన్ని లేదా బంధాన్ని నిర్ధారించాలి. ఆపైన ప్రయోగం జరుగుతుంది. అయితే అనేక సందర్భాలలో కొన్ని ప్రయోగాలు విజయవంతం అవుతాయి, కొన్ని పరాజయం పొందుతాయి. అంటే ఈ ఇన్‌పుట్-అవుట్‌పుట్ బంధంలో ఎక్కడో స్పష్టతలేని అంశాలు ఉన్నాయన్నమాట. వాటిని గుర్తించి, పరిష్కరించగలిగితే, అన్ని ప్రయోగాలు విజయవంతం అవుతాయి. కాబట్టి తేలినదేమంటే ఏదైనా ఒక క్రమపద్ధతులో పరిష్కరించదగిన ప్రతి సమస్య పరిష్కారానికి ఆల్గొరిథంలు పనికి వస్తాయి. ఇవి ఒక్క గణితం, కంప్యూటర్ సైన్స్‌లలోనే కాకుండా ఇంటిలో వంట చేయడం

దగ్గర నుండి కార్యాలయ పనుల పరిష్కారం వరకు వీటిని ఉపయోగించవచ్చు. ఉదాహరణకు ఒక ఆట ఏవిధంగా ఆడి, ప్రావీణ్యం సంపాదించాలో కూడా వీటి ద్వారా తెలుసుకోవచ్చు. చదరంగం దీనికి పెద్ద ఉదాహరణ. 64 గళ్ళు ఖచ్చితంగా ఉండే ఈ ఆటలో ఉద్దేశించబడినవి అన్ని నిర్ధారించబడిన పావులే. కావున ఆటను ఏ విధంగా ఆడి, గెలుపు సాధించవచ్చునో ఈ ఆల్గొరింథంల ద్వారా ప్రయత్నం చేయవచ్చు. ఇటువంటి ప్రోగ్రాంనే ఐ.బి.యం. (I.B.M.) కంపెనీవారు 1989లో చదరంగం ఆడటం కోసం తయారు చేశారు. ఆ కంప్యూటర్‌ను, అప్పటి ప్రపంచ ఛాంపియన్ అయిన గారికాస్పరోవ్‌తో ఆడించారు. మొదటి ప్రయత్నంలో ఆరుగేముల రౌండులో కంప్యూటర్ 2 గేములను గెలిచి, నాలుగు ఓడిపోయింది. ఆ అనుభవంతో కంప్యూటర్ ఆల్గొరిథంలను మెరుగుపరచి అందించగా, రెండవ దఫా మూడు గేములను గెలిచి, ఒక గేమును 'డ్రా'గా ముగించి, కాస్పరోవ్‌పై విజయం సాధించింది. ఆల్గొరిథంల శక్తి (Power)కి ఇదొక పెద్ద ఉదాహరణ.

అట్లే 1990-2003 ప్రాంతంలో 'హ్యూమన్ జెనోమ్ ప్రాజెక్టు' ద్వారా మానవుల డి.ఎన్.ఎ. రహస్యాన్ని ఛేదించడానికి, మానవుల జీన్ల సంఖ్య, వాటి క్రమము (Sequence) నిర్ధారించడానికి ఈ ఆల్గొరిథంలు సహాయకారి అని గుర్తించడం జరిగింది. ప్రస్తుత కాలంలో బహుళ ప్రచారం పొంది, అది లేని ప్రపంచాన్ని ఊహించడం వీలుకాని అంతర్జాలం (Internet) యొక్క మనుగడ, ఈ ఆల్గొరిథంల పైనే ఆధారపడి ఉంది. అంతర్జాలంలో సమాచారాన్ని వెతికి, ఒక క్రమపద్ధతిలో అమర్చే వెతుకు యంత్రాలు (Search Engines) ఈ ఆల్గొరిథంల పైనే ఆధారపడి పని చేస్తాయి. అదే విధంగా వర్తక, వాణిజ్య రంగాలలో సంప్రదాయ పద్ధతులను త్రోసిరాజని, నూతన పద్ధతులైన ఎలక్ట్రానిక్ కామర్స్ (e-Commerce) ద్వారా వస్తు, సేవల వినియోగదారులకు అందించే విప్లవానికి, ఈ ఆల్గొరిథంలే నాంది. ఈ-కామర్స్ వ్యాపకానికి ప్రాతిపదికలైన పబ్లిక్‌కీ క్రిప్టోగ్రఫీ (Public Key Cryptography) మరియు డిజిటల్ సంతకాలు (Digital Signatures) వీటిపైనే ఆధారపడి పని చేస్తాయి. నేటి కాలంలో వర్తక, వాణిజ్యంలో దరిదాపు 40 శాతం వ్యాపారం ఈ-కామర్స్ వేదికల ద్వారానే జరుగుతున్నది. అర్థశాస్త్రం యొక్క మూల సూత్రమైన పరిమిత వనరులను సమర్థవంతమైన ప్రత్యామ్నాయ మార్గాలలో ఉపయోగించబడాలని సూచించే లక్ష్యం నెరవేరాలంటే మనం ఈ ఆల్గొరిథంలనే ఆశ్రయించాలి. ప్రతి పని తక్కువ ఖర్చుతో, ఎక్కువ ప్రయోజనం చేకూరే విధంగా నిర్ణయం చేయాలంటే వీటి ద్వారానే సాధ్యపడుతుంది. ఏ దేశంలోనైనా ఆర్థిక కార్యకలాపాలు నిరంతరం జరుగుతుంటాయి. ఈ కార్యకలాపాలు సమర్థవంతంగా నిర్వహించబడాలంటే వాటికి ఒక క్రమవద్ధతిని ఏర్పాటు చేయాలి. ఆ వద్ధతులను ఈ ఆల్గొరిథంలు సులభతరం చేస్తాయి.

ఆల్గొరిథంల నిర్మాణానికి ఒక నిర్దుష్టమైన పద్ధతి లేదా వరుసక్రమం (Sequence) ఉంటుంది. ఇవి సక్రమంగా నిర్మించబడాలంటే సమస్యను ఏ మాత్రం అసంబద్ధత (Ambiguity) లేకుండా నిర్వచించగలగాలి. వీటి నిర్మాణానికి, కంప్యూటర్ ప్రోగ్రాంలలో వేటినైనా ఉపయోగించవచ్చు. ఎందుచేతనంటే ప్రోగ్రాం అనేది కొన్ని ఆదేశాల సమాహారమే (Program is a set of commands). అయితే ఈ ఆల్గొరిథంల నిర్మాణం కావించేటప్పుడు కొన్ని అంశాలను పరిగణనలోనికి తీసుకోవాలి. అవి: మాడ్యులారిటి (Modularity) అంటే పరిష్కరించవలసిన సమస్యను చిన్న చిన్న భాగాలుగా విభజింపబడే స్వభావం ఉండాలి. నిర్మాణంలో ఖచ్చితత్వం ఉండాలి. నిర్మాణం నిర్వహణకు తగిన విధంగా ఉండాలి. సరళంగాను, నిర్మాణం గట్టిగాను ఉండాలి. ప్రతి ఆల్గొరిథం విస్తృతం చేయడానికి వీలుగా ఉండాలి. ఈ షరతులకు లోబడి నిర్మింపబడే ఆల్గొరిథంలు సమర్థవంతంగా ఉంటాయి.

ఆల్గొరిథంల నిర్మాణాన్నిబట్టి, ఆశించిన ఫలితాన్ని బట్టి, వీటిని అనేక రకాలుగా పేర్కొంటారు. ఉపయోగించే ప్రోగ్రాంలనుబట్టి కూడా ఈ రకాలు మారుతుంటాయి. బాగా ప్రచారంలో ఉన్న ఆల్గొరిథంలను బట్టి బ్రూట్‌ఫోర్స్ ఆల్గొరిథంలని, రికర్సివ్ అని, రాండమైజ్‌డ్ అని, సార్టింగ్ అని, సర్చింగ్ అని, హాషింగ్ ఆల్గొరిథంలని చెప్తుంటారు. ఒక్కొక్క సమన్య పరిష్కారానికి, ఒక్కొక్క రకం ఉపయోగపడుతుంది. ఉదాహరణకు 'డెబిట్ కార్డు' ద్వారా నగదును బదలీ చేయడానికి లేదా పొందడానికి ఉపయోగించే నాలుగు అంకెల 'పిన్' లేదా 'కోడ్' సంఖ్యను

తెలుసుకోవడానికి గాను, నాలుగు అంకెలలో ఉన్న అన్ని కలయికల (combinations)ను ప్రయత్నించవచ్చు. ఈ పనిని మనిషి చెయ్యాలంటే చాలా సమయం పడుతుంది గాని, ఆల్గొరిథంలను ఉపయోగించి, కంప్యూటర్ ప్రోగ్రాం ద్వారా అతి తక్కువ సమయంలో సాధించవచ్చు. వీటిని బ్రూట్‌ఫోర్స్ ఆల్గొరిథంలు అంటారు.

జనాభాకు సంబంధించి సమాచార సేకరణలోను, అనేక రకాల సర్వే కార్యకలాపాలలోను రాండమైజ్ ఆల్గొరిథంలను వినియోగిస్తారు. ఆరోగ్య సంబంధిత సమస్యలను గుర్తించడానికి, ప్రయోగ ఫలితాల విశ్లేషణకు, భవిష్యత్ కార్యాచరణ రూపకల్పనకు, వీటిని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఉదాహరణకు నేడు ప్రపంచాన్నంతా కుదిపి వేస్తున్న 'కరోనా' మహమ్మారికి సంబంధించి ఒక నిర్ధారణకు రావాలంటే ఆ లక్షణాలు పొడసూపిన కొద్ది మంది వ్యక్తులను 'రాండమ్'గా ఎంపిక చేసి పరీక్ష నిర్వహిస్తారు. ఈ మధ్యన కేంద్ర ప్రభుత్వం కూడా విదేశాల నుండి దేశం లోపలికి ప్రవేశించిన ప్రయాణికులలో 2 శాతం మందికి రాండమ్‌గా ఈ పరీక్షలు నిర్వహించే ఏర్పాట్లు చేశారు. ఆ ఫలితాలను ఆల్గొరిథంల సహాయంతో విశ్లేషించి, మార్గదర్శకాలను తయారు చేయవచ్చు.

ఆధునిక కాలంలో పెరుగుతున్న జనాభా, ఆర్థిక కార్యకలాపాల దృష్ట్యా, ఆల్గొరిథంల అవసరం, ప్రాముఖ్యం పెరుగుతున్నది. భవిష్యత్తులో ఇది మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది. అందరికీ నేడు సుపరిచితమైన, అంతర్జాలంలో ప్రముఖ పాత్ర వహిస్తున్న 'గూగుల్' వంటి వ్యవస్థను, దాని వ్యాపారాన్ని గమనిస్తే ఆల్గొరిథంల పాత్ర ఇట్టే బయటపడుతుంది. 2002లో గూగుల్ తన 'సెర్చ్‌ఇంజన్'ను ప్రారంభించి, ఆల్గొరిథంల ద్వారా సమాచార నిర్వహణ (Data Management) చేపట్టిన కాలంలో కేవలం ఈ ఒక్క కార్యకలాపం ద్వారానే ఆ రోజులలో గూగుల్ 500 మిలియన్ డాలర్లను సంపాదించింది. ఈ రోజున గూగుల్ యొక్క స్థాయిని గమనిస్తే ప్రపంచం మొత్తం మీద అంతర్జాలాన్ని ఉపయోగిస్తున్న దరిదాపు 4.72 బిలియన్ మందిలో 92 శాతం మంది గూగుల్ వినియోగదారులే. అంతర్జాలంలో ఇంకా అనేక కంపెనీల సెర్చ్ ఇంజన్లు ఉన్నప్పటికీ గూగుల్ ప్రాచుర్యం తిరుగులేనిది. అట్లే అత్యంత ప్రజాదరణ పొందిన ముఖపుస్తకం (Face Book)ను 2.91 బిలియన్ల మంది వినియోగిస్తున్నారు. అదే విధంగా ట్విట్టరు, ఇన్‌స్టాగ్రాం, వాట్స్‌అప్ మొదలైనవి రోజు వారి కార్యకలాపాల నిర్వహణలో అంతర్భాగమైపోయాయి. ఈ రోజున వాట్స్‌అప్ లేని చరవాణి (Mobile)ను ఊహించడం కష్టం. ఈ కార్యకలాపాల నిర్వహణ మొత్తం ఆల్గొరిథంల నిర్మాణం, నిర్వహణల పైనే ఆధారపడి ఉంది. మెరుగైన, సమర్థవంతమైన సమాచార సేకరణ, విశ్లేషణ, నిర్వహణ చేయాలంటే అవి ఆల్గొరిథంల ద్వారానే జరగాలి. కావున ఎవరైతే వీటి నిర్మాణం, నిర్వహణల పై పట్టు సాధిస్తారో వారే భవిష్యత్తును శాసించగలుగుతారు.

మరొక ఉదాహరణగా రవాణా రంగాన్ని తీసుకొంటే, నేడు లాజిస్టిక్స్ పేరుతో వ్యాపార రంగంలో విప్లవాలను సృష్టిస్తున్నది. అమెరికాలో యు.పి.ఎస్. అనే సంస్థ 55,200 ట్రక్కులను కలిగి యుండి, రోజుకు 16 మిలియన్ బట్వాడాలను (Deliveries) చేస్తున్నది. అట్లే ఈ-కామర్స్ దిగ్గజాలైన అమెజాన్ (అమెరికా), ఆలీబాబా (చైనా), మేట్యున్ (Meituan, చైనా) కంపెనీల మార్కెట్ విలువ 100 బిలియన్ డాలర్ల పై మాటే. భారత దేశం నుండి కూడా నైకా (Nykaa), ఇండియా మార్ట్, ఇన్‌ఫిబీమ్ ఎవెన్యూ, ఎం.ఎస్.టి.సి. వంటివి మొదటి 100 ప్రపంచ కంపెనీల జాబితాలో చోటు సంపాదించాయి. ఈ కంపెనీలన్నీ వాటి కార్యకలాపాలను ఆల్గొరిథంల ద్వారానే నెరపుతాయి. కాబట్టి అంతర్జాతీయంగా వ్యాపార, సేవల నిర్వహణ సమర్థవంతంగా జరవవలెనంటే ఆల్గొరిథంల నిర్మాణం, నిర్వహణలపై గట్టి పట్టు సాధించాలి.

శరవేగంగా జరుగుతున్న యాంత్రీకరణ,స్వయం చలిత యంత్రాల గమనం, రోబోటిక్స్,సెన్సార్లు వంటి రంగాల కార్యకలాపాల నియంత్రణలో, నిర్వహణలో ఆల్గొరిథంలు ప్రముఖ పాత్ర వహిస్తున్నాయి. ముందు కాలంలో వీటి ప్రాముఖ్యం మరింత పెరుగుతుంది. అట్లే గణనీయంగా విశ్వవ్యాప్తం అవుతున్న కృత్రిమ మేధ (Artificial Intelligence)నకు ఆల్గొరిథంలే ప్రాణం. కావున భవిష్యత్తులో ఈ విద్య మరింత ప్రాముఖ్యతను సంతరించుకొంటుంది.

ఆచార్య కోదాటి వియ్యన్నరావు - పూర్వ వైస్ ఛాన్సలర్
ఆచార్య నాగార్జున యూనివర్శిటి, గుంటూరు.
ఫోన్: 709 326 0655.

తరిగొండ వీరతరుణి - వేంకటాచల మహాత్మ్యం

– జంధ్యాల కనకదుర్గ

క్రీ.శ. 1817 సంవత్సరం వరకు జీవించిన కవయిత్రి తరిగొండ వెంకమాంబ బహుకావ్య రచయిత్రి. ప్రకృతిశక్తి ప్రసాదితంగా తాను రచన చేస్తున్నట్టుచెప్పి తనది బాలభాషయని విమర్శించవద్దనీ, తాను అన్ని కావ్యాలను రాయటం మాటలుకాదని చెప్పి తన ఆత్మశక్తిని వ్యక్తం చేసుకొనే చైతన్యంతో రచనలు చేసింది. ఆమెను ఒక ఆధ్యాత్మిక భక్తురాలిగా భావించే ఆనవాయితి ఉన్నా ఆమె రచనలలోని సామాజిక స్పృహ మాత్రం అపూర్వమైనది. ఆమె రాసిన నృసింహ శతకం లో ఆధ్యాత్మిక, రాజయోగ సారానికి సంబంధించిన విషయాలే కాక, సామాజిక స్పృహతో భార్యను కుటుంబ హింసకు గురిచేసే పురుష ప్రవృత్తిని ప్రశ్నించటం కనపడుతుంది. భర్త అన్యస్త్రీల సంపర్కపు మక్కువతో తన ఇల్లాలిని కొట్టి తిడుతూ, భార్యను హింసకు గురిచేయటానికి ఆమె చేసిన పాపమేమిటని అడుగుతుంది. పాటిగనగ్ని సాక్షిగా వివాహమైన పతివ్రతామణిన్ నీటున నొల్లకన్ మిగుల నేరమలనెన్నుచుఁ గొట్టితిట్టుచున్ ధాటిగనన్య కాంతను ముదంబున రక్షణచేసి దానితోఁగూటమి పాపహేతు! – (ప.95) అంటూ సమాజంలో పురుషుల అనైతికతను, దాని ఫలితమైన కుటుంబ హింసను ప్రశ్నించే స్త్రీగా తరిగొండ వేంకమాంబ యొక్క చైతన్యం ఆమె రాసిన నరసింహ శతకం లో తెలియటం విశేషంగా భావించాలి. అంతేకాక స్త్రీల ఋతుకాలధర్మం యొక్క మర్మాన్ని గ్రహించమంది. (ప.85) తరిగొండ వేంకమాంబ వితంతు సంస్కృతిని వ్యతిరేకించినట్లు జనశ్రుతిలో వినపడే విషయం కాని ఆమె ఆ విషయాన్ని తన కావ్యాలలో పేర్కొనకపోవటం విచారణీయం. ఆ విషయంలోనే వేంకమాంబను సమాజం వెలివేయగా, ఆమె తలకోన అడవుల్లో తపసు చేసుకుందని వినికిడి. ఆ అడవులలో ఉన్న చెంచుల యొక్క జీవన విధానాన్ని పాత్రోచిత భాషా వ్యవహారిక ప్రయోగంతో రాయటం వేంకమాంబ యొక్క రచనా నైపుణ్య చైతన్యం అర్థమౌతుంది. అంతేకాక ఈమె యోగవిద్యకు సంబంధించిన రాజయోగసారమనే కావ్యాన్ని, ద్విపదలో భాగవతాన్ని రచించింది.

సాహిత్య చరిత్రలో 17-18 శతాబ్దాల కాలం యక్షగానయుగం. యక్షగానం అంటే అటు పద్యకావ్యం ఇటు నాటక లక్షణాన్ని పొందుపరచుకొన్న సాహిత్య ప్రక్రియ. ఈమె శివనాటకం, రమాపరిణయంవంటి యక్షగానాలను, విష్ణుపారిజాతం, వేంకటాచల మహాత్మ్యం అనే కావ్యాలను రచించింది. శివనాటకంలోను, విష్ణుపారిజాతంలోను సవతుల మధ్య ప్రత్యక్షంగా వాగ్బాణాలతో పోరాటం జరగటం, ఆ కావ్యాలలో శివుడు, కృష్ణుడు ఆ విషయంలో తమ తప్పులేదంటూ వారి జగడాలను వినోదంగా చూడటంవంటి పితృస్వామ్య రాజకీయాలను అర్థం చేసుకోవాల్సిన చైతన్యాన్ని కలిగించే రచనలవి. పురాణపాత్రలపరంగా సామాజిక కుటుంబ వ్యవస్థలో పురుష ప్రయోజనాలకు వీలుగా తమ తప్పు లేదంటూ బహుభార్యాత్వపు సంస్కృతిని తమకు అనువుగా ఉంచేటట్లు చేసుకొనే కుటుంబ రాజకీయ సంస్కృతీ కుట్రను గ్రహించే చైతన్యాన్ని అందించిన కావ్యాలు అవి. కేవలం గ్రహిస్తే నరిపోదని స్త్రీలలో క్రియాశీల చైతన్యం కలగించాలనుకొని ఆ లైంగిక రాజకీయాలకు విరుగుడుగా తరిగొండ వేంకమాంబ వేంకటాచల మహాత్మ్యమనే కావ్యాన్ని రాసింది. అయితే సవతులు పురుష ప్రయోజన రాజకీయాలను అర్థం చేసుకోకుండా తమలో తాము కలహించుకుంటే ఆ సమస్యకు పరిష్కారం కాదని గ్రహించగలిగిన తరిగొండ వేంగమాంబ స్త్రీలలో కలగాల్సిన విప్లవాత్మక చైతన్యానికి 18వ శతాబ్దపు ఉత్తరార్ధానికే వేంకటాచల మహాత్మ్యమ నే కావ్యంలో పాదులు వేసింది. ఈ కావ్యంలో వేంకమాంబ తాను కావ్యంలోని మొదటి ఐదాశ్వాసాలలో బ్రహ్మాండ, భవిష్యోత్తర, పద్మ పురాణ విషయాలను పొందుపరిచి రాసినట్లును, ఆరవ ఆశ్వాసంలో పద్మపురాణమందు వింతగు వేంకటాద్రి విభుడు సిరిని గూరిచి చేసినట్టి చరితములు కొన్ని లభియింప, సంగ్రహముగ సరవినాశ్వాసమునకవి చాలవనుచు వేఱుకల్పన కొంతగావింపవలసె – (6-3) అని తాను రాసినట్టు తరిగొండ వేంకమాంబ చెప్పింది. పైపెచ్చు దీనికి – పెద్దల అనుమతంబున వీరలక్ష్మి విలాసమనెడు నామంబు –

పెట్టాలనుకొన్నట్లు (6-5) చెప్పింది. ఈ కావ్యంలో సగభాగంవరకు కథావిషయం పురాణ విషయమైనా మిగిలిన కథావస్తువులో పద్మపురాణంలో వింతలు మెరిసిన విషయాలకు తాను కొంత కల్పనను జోడించి రాస్తున్నట్టుగా పెర్కొంది. ఆమె అలా కల్పించాలనుకోవటానికి కారణం ఆనాటి వ్యవస్థలోని బహుభార్యాత్వపు సంస్కృతిని వ్యతిరేకించి స్త్రీలు ఆత్మగౌరవంతో బ్రతికే చైతన్యాన్ని కలిగించటం కొరకని అర్థమౌతుంది. బహుభార్యాత్వపు సంస్కృతివల్ల భార్యాభర్తలు గొడవలుపడి విడిపోతే, ఆతడు మళ్లీ వివాహం చేసుకుంటే నష్టపోయేది స్త్రీయే అని, స్త్రీదే తప్పని భావింపచేసే సామాజిక ప్రచారం జరుగుతుంటుంది. దానికి కారణం కుటుంబం ఏర్పడినప్పటి నుండి స్త్రీ పోషింపబడే స్థితిలో ఉండటమే. భర్తను ఎదిరిస్తే ఆమెకు సామాజిక మనుగడ కష్టతరం అవుతుంది. పితృస్వామ్యపు స్త్రీపురుష లైంగిక సంబంధాలలో బహుభార్యాత్వపు సంస్కృతివల్ల స్త్రీలకు గౌరవ ప్రదమైన జీవితం లేకపోవటమేకాక జీవిత భద్రత కూడా కరువవుతుంది. దానికి పరిష్కారం స్త్రీలు స్వీయపోషకత్వం కలిగి ఉండటం. స్త్రీలకు విద్య, ఆస్తి సామాజిక జీవితం లేని రోజుల్లో స్త్రీలు నోరుమూసుకొని పడి ఉండటమే పరిష్కారంగా పెద్దలు చెప్పేవాళ్ళు. నిస్సహాయ స్థితిలో ఉన్న స్త్రీలు తమ అస్తిత్వానికై పెనుగులాడే క్రమంలో సవతులతో కొట్లాటపెట్టుకోవటం రివాజుగా తయారయింది. కాని 18వ శతాబ్దపు కథాకావ్యాలలో స్త్రీలు అప్పుడప్పుడే తమ ఆర్థిక స్వావలంబనకై అడుగులువేసే క్రమంలో వారు కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసుకున్నట్టుగా అర్థమౌతుంది. ఆ పరిణామ క్రమంలోనే ఆర్థిక స్వావలంబనగల స్త్రీ బహుభార్యత్వపు సంస్కృతిగల సామాజిక వ్యవస్థలో ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకొనే మార్గముంటుందనే వ్యక్తిత్వ చైతన్యాన్ని కలిగించాలనుకొంది. అందుకే కవయిత్రి ధనానికి చిరునామాగా భావింపబడే వైకుంఠలక్ష్మిని పాత్రగా చేసుకొని కథాకల్పనతో వేంకటాచల మహాత్మ్యమనే భక్తిపూర్వక గ్రంథాన్ని రాసింది. అందుకే కావ్యార్ధ భాగం నుండి పద్మపురాణంలో లేని కథను సృష్టించి సమాజంలో స్త్రీ ఆత్మగౌరవంగా బ్రతికే మార్గాన్ని సూచించింది. పద్మపురాణంలో పద్మావతి అనే పేరుగల స్త్రీపాత్ర ఉంది. అందుకే ఆధ్యాత్మిక కేంద్రం చుట్టూ సామాజిక కుటుంబ సంస్కృతిని నిక్షేపిస్తూ తరిగొండ



తరిగొండ వెంకగమాంబ
(ఊహాచిత్రం)

వేంకమాంబ - రమ్యతరమగు పద్మ పురాణమునను వింతలగుచుఁ బ్రకాశించు వెంకటాద్రిపతి చరితములుగొని యేర్పరచి మీకుఁజెప్పితిని - (6-227) అని చెప్పి తాను అల్లిన కథయే ఈ వేంకటాచలమహాత్మ్యం లో ఉంటుందని చెప్పింది. పద్మావతి శ్రీనివాసుల కల్యాణాన్ని తిరుమలక్షేత్రం చుట్టూ ఉన్న కథావిషయంగా చెప్పబడటం ఈ వేంకటాచల మహాత్మ్యమ నే కావ్యంలోనే ఉంది. ఈ కథావిషయం పద్మపురాణంలో కన్పడదు. పద్మపురాణంలోని పద్మావతి అనే స్త్రీ వేరుగా చిత్రీకరింపబడింది. కాని తరిగొండ వేంకమాంబ ఈ కావ్యంలో ఒక స్త్రీ బహుభార్యాత్వపు సంస్కృతిని నిరసించే విధంగా ఎటువంటి విప్లవాత్మక చైతన్యం తెచ్చుకుంటుందో పితృస్వామ్యానికి రుచిచూపించాలనుకొంది. దానికోసం వైకుంఠంలోని లక్ష్మీహరులను పాత్రలుగా చేసుకొని వారి మధ్య విభేదాన్ని సృష్టించటానికే భృగుమునికి కొత్త భావనను జోడించి సృజించింది. పురాణాలలో భృగువు వేఱు. ఈ భృగువు భూలోకమందలి పూజార్హతకై హరిని తన్నినా ఆతడు సహించి ఊర్కొనటం లక్ష్మికి కోపకారణం అయింది. భర్త తన హృదయంలో భార్యను పెట్టుకొని చూడటం అంటే పరస్పరం ఒకరికొకరుగా మానసికంగా నమ్మకంతో ఉండటం. అప్పుడే స్త్రీకి గౌరవప్రదమైన జీవితం ఉంటుందనేది తరతరాల కుటుంబ స్త్రీల సామాజిక దృక్పథం. ఆ ముని హరి యొక్క హృదయాన్ని తన్నటం అంటే ఆ స్థానంలో ఉండే తనని ఆ ముని తనని తన్ని అవమానించినట్లుగా లక్ష్మి భావించటమేకాక భర్త కూడా దాన్ని ఆమోదించటం భార్య యొక్క ఆత్మగౌరవానికి భంగకరమైన విషయంగా భావించింది లక్ష్మి. సామాజిక కుటుంబాలలో ఇలాంటివి జరుగుతూనే ఉంటాయి. భృగువు చేసిన పనిని తాను ఖండించినా హరి దాన్ని తప్పు పట్టకపోయేసరికి లక్ష్మి భర్తయైన హరిని, వైకుంఠాన్ని వదిలి భూలోకంలోని కొల్లాపురానికి వచ్చి అక్కడ తపస్సు చేసుకుంటుంది. వచ్చేటప్పుడు భర్త తనని అనుమానించకుండా ఉండేందుకు తాను హరిని హృదయంలో పెట్టుకొని తపస్సు చేసుకోవటానికి వెడుతున్నట్టు చెపుతుంది. అంటే లక్ష్మి అన్యపురుషాసక్తితో భర్తను వదిలి వెళ్ళలేదని తెలియచెప్పటమే. ఇదంతా వేంకమాంబ కల్పనయే. ఈ విషయం ఏ పురాణ గాథలలోను లేదు. అంతేకాక, ఇక్కడ

పైకి మునిశాపం కారణంగా కన్పడినా వైకుంఠంలో హరి భూదేవి, నీళలతో కూడి ఉన్నట్టు ఉంది (4-139) కాబట్టి బహుభార్యాత్వం ఉన్నచోట లక్ష్మి తనకు ఆత్మగౌరవం ఉండదనే స్థితిలో ఆమె అప్పటికే ఉండటంతో ముని చేసిన వనిని అవకాశంగా తీసుకొని లక్ష్మి హరి నుండి విడిపోవాలనుకొందా అని అనిపించక మానదు. లక్ష్మి అలా వెళ్ళిపోవటమనేది, పితృస్వామ్య కుటుంబ వ్యతిరేక సంస్కృతి. పితృస్వామ్యపు పుట్టకీళ్ళుకదిలే విషయం. భార్య వదిలిపెట్టి వెళ్ళిందంటే భర్త పురుషాధిక్యతకు మాయని మచ్చ. అవమానం కూడా. బహుభార్యాత్వపు సంస్కృతికి ఆటవట్టువైన పితృస్వామ్యంలో భర్తగాబట్టి హరి శ్రీనివాసుడి రూపంలో పద్మావతిని మరొక పెళ్లిచేసుకొంటాడు. కాని హరి తనకు ధనంకావాల్సి వచ్చి స్వప్రయోజనార్థం ధనానికి మూలమైన లక్ష్మిని తిరిగి రమ్మంటాడు. అయినా వ్యక్తిత్వంగల స్త్రీగా లక్ష్మి, లోకాన్ని కూడా పట్టించుకోవాల్సిన అవసరంలేదనే స్పృహతో, వ్యూహలక్ష్మిని సృష్టించి ఆమెను హరి తీసికెళ్ళేటట్టు చేసింది, కాని లక్ష్మిమాత్రం భర్తదగ్గరకు తిరిగి వెళ్ళలేదని కవయిత్రి తెలియచేసింది. 18 వశతాబ్దపు ఉత్తరార్ధానికే వివాహ సంస్కృతిని వ్యతిరేకించే చైతన్యంతో తరిగొండ వేంకమాంబ రాయటం ఆశ్చర్యమనిపించక మానదు.

ఇంతకీ ఆ తరువాత లక్ష్మి ఏమయిందనే విషయంలోనే తరిగొండ వేంకమాంబ విప్లవాత్మక వైవాహిక సంస్కృతిని నిక్షిప్తం చేసింది. నిజలక్ష్మి పాత్ర మాత్రం ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని భావించి అతనితో కాపురం చేయటం ఇష్టంలేక పద్మతీరానికి వచ్చి వీరలక్ష్మిగా తపసు చేసుకుంటుంటే, ఆమెను ప్రజలు పూజిస్తుంటారు. దాన్ని తెలిసికొన్న హరివచ్చి ఆ వీరలక్ష్మిని రమ్మనమని అడుగగా ఆమె ఆత్మలో నిన్ను చూసుకుంటూ అక్కడే ఉంటానంటుంది గాని హరితో వెళ్ళదు. చేసేది లేక శ్రీనివాసుని రూపంలో ఉన్న హరి వెళ్ళిపోతాడు. అయితే బలరామకృష్ణులకు అక్కడ అంతకు మునుపే తమకు శుకుడు ఆవాసం కలిగించటంతో, అక్కడే ఉన్న బలరాముడు అదే ప్రదేశంలో ప్రజలు వీరలక్ష్మిని అర్చిస్తున్నందుకు 'వరకాంతయగు లక్ష్మి హరిచెంతఁజేరి యుండక యిందుఁజేరియున్నప్పుడు నేనిచ్చట నిల్చియుండుట నీతికాదు' (6-200) అని 'వరనతివేడ్కగనిమ్ముడుదానిందు నిలిచెనింపుతలిర్పన్' (6-201) అని అంటూ భర్తనువదిలి ఒంటరిగా ఉండగలిగి వీరలక్ష్మిగా ప్రసిద్ధి చెందినది కావున 'నేనిందు నిలువ వెఱతునని' (6-205,) అంటాడు. ఇక్కడ బలరాముడు ఆమెను వదిలి వెళ్ళాలనకోవటమంటే ఆమెను వెలివేయటమనే భావనయే. అంతేకాక ఒకసారి భర్తని వదిలిన స్త్రీని తిరిగి ఆదరించకూడదనే సామాజిక భావనను ప్రతిబింబిచే విధంగా బలరాముడు అనేటట్లుగా కవయిత్రి చేసింది. అంటే అటువంటి ఆత్మగౌరవ వ్యక్తిత్వంగలస్త్రీ అంటే అతడికి భయం వేసి ఉండవచ్చు. అయినా లోకానికి వెరవాల్సిన పనిలేదంటూ, లక్ష్మి తనకు తెలియకుండా హరి మరొక పెళ్ళిచేసుకొన్నందుకు, భర్త దగ్గరకు వెళ్ళాల్సిన అవసరం లేదని అనుకొందని వీరచైతన్యంతో వీరలక్ష్మిని తీర్చిదిద్దింది. అంటే ఆర్థికస్వావలంబనగల స్త్రీలు తమ ఆత్మగౌరవ వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకొనే మార్గాన్ని కవయిత్రి సూచించింది. దీనినే బహుభార్యాత్వపు కుటుంబ సంస్కృతిలో స్త్రీలు సవతులతో గొడవపడకుండా ఉండే పరిష్కారంగా చూపించి తరిగొండ వేంకమాంబ తన క్రాంతదర్శనంతో భవిష్యత్తులోని ప్రజాస్వామ్యంలో విడాకుల చట్టానికి బాటలు వేసిందని అర్థమౌతుంది. ఇక్కడ బహుభార్యత్వపు సంస్కృతిపట్ల స్త్రీలు తెచ్చుకోవలసిన విప్లవాత్మక చైతన్యాన్ని తెలియచేస్తూ తిరుమల అనే ఆధ్యాత్మిక క్షేత్రం చుట్టూ తరిగొండ వేంకమాంబ అల్లిన కథయే వేంకటాచల మహాత్మ్యమనే కావ్యం. ఆధ్యాత్మిక విషయంలో అంతర్గత సామాజిక స్పృహ తరిగొండ వేంకమాంబది. ఆ తర్వాత ఆ వీరలక్ష్మియే అలివేలుమంగగా ప్రసిద్ధి పొందినట్లు (6-248) వేంకమాంబ పేర్కొంది. పద్మావతి శ్రీనివాసుల కథను 'వింతలుమెరియగ తాను కల్పించినట్లు' తరిగొండ వేంకమాంబ పేర్కొనటం నాటికి విచిత్ర చైతన్యపు వింతజ్ఞానం ప్రకాశించటమే. ఓనమాలైనా నేర్వనితాను ఈ కావ్యాన్ని రాయటమంటే అది శ్రీనివాసుని దయ అనిచెపుతూనే, 'నాస్వతంత్రతకిలబుధుల్నవ్విపోరె' అని (1-20) అనటంలోని ఔచిత్యాన్ని ఆలోచిస్తే తరిగొండ వేంకమాంబ దైవంగా భావింపబడే వేంకటేశ్వరుని చుట్టూ సామాజిక కుటుంబ సంస్కృతికి వ్యతిరిక్తంగా సామాజిక స్పృహతో కథావస్తువును స్వతంత్రంగా అల్లి రాయాలనుకోవటమే. ఇలా రాసినందుకు పురుషులు హేళన చేస్తారని ఆమెకు తెలుసు. అయినా భక్తి భావంతో చదవటానికి ఉద్యుక్తులయ్యేవారు – కుటుంబ వ్యవస్థలో భర్తలు బహుభార్యాత్వాన్ని పాటించాలనుకొంటే భార్యలు తమనుండి విడిపోయి బతకగలరననే జ్ఞానాన్ని అందిస్తూ హెచ్చరిక చేసినట్లు భావించాలి.

జంధ్యాల కనకదుర్గ - గుంటూరు. ఫోన్: 949 114 0299.



ఎబికె ప్రసాద్

ఎబికె ప్రసాద్

ఎ.బి.కె. ప్రసాద్ పూర్తి పేరు అన్నే భవానీ కోటేశ్వర ప్రసాద్. వివిధ తెలుగు పత్రికల సంపాదకునిగా, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షునిగా పనిచేశారు. తొలి ఉద్యోగం విజయవాడ (1958) విశాలాంధ్రలో సబ్‌ఎడిటర్.

తెలుగు భాషకు ప్రాచీనహోదా దక్కించటంలో తెలుగు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షుడుగా, కేంద్రంలో ఉన్న కమిటీకి నివేదికలు ఇవ్వడం, సచివాలయంలో సంప్రదింపులు జరపడం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడితేవడంలో ఏ.బి.కె. ప్రసాద్ కీలక పాత్ర వహించారు. తెలుగు భాషా పతాకాన్ని రూపకల్పన చేసి ఆవిష్కరింపజేశారు. సరిగ్గా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవానికి ఒకరోజు ముందు కేంద్ర ప్రభుత్వం పాచీన హోదా కల్పించడంతో రాష్ట్రమంతా పండుగ వాతావరణం నెలకొంది. స్వంత భాషలకు తిలోదకాలిచ్చి నిజమైన అభ్యుదయాన్ని సాధించలేరన్న గాంధీజీ మాటలు తనకు స్ఫూర్తి అంటారు ఏబికే.

''ఏ తరానికాతరం విద్యార్థులు తెలుగులో చదువుతుంటేనేగదా తెలుగు బ్రతికేది? తెలుగు మీడియంలో చదివితే ఉద్యోగాలు రావనే భయం వెన్నాడుతుంటే మన పిల్లలు తెలుగులో ఎందుకు చదువుతారు? రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ఉద్యోగ పరీక్షలు, నియామకాలన్నింటిలో తెలుగు మీడియంలో చదివిన విద్యార్థులకు 5 శాతం అదనపు మార్కులిస్తే తెలుగు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటమే కాకుండా భవిష్యత్తులో కార్యాలయాల్లో తెలుగు వాడకం పెరుగుతుంది. మారుతున్న కాలంతోపాటు, కొత్తగా వచ్చిన పదజాలాన్నీ ఎప్పటికప్పుడు చేర్చుకుంటూ మన తెలుగు నిఘంటువుల్ని తాజా పరచుకోవాలి. తెలుగు విశ్వవిద్యాలయంతో పాటు, విశ్వవిద్యాలయాల్లోని తెలుగు విభాగాలన్నింటికీ నిఘంటువుల నవీకరణ వని అప్పజెప్పాలి'' అంటారు ఎ.బి.కె. కమ్యూనిస్టు పార్టీ కోసం, మార్క్సిస్టు పార్టీ పత్రిక 'జనశక్తి'ని నడపడంలో 15 ఎకరాల పొలాన్ని కరిగించేశారు. పాత్రికేయులకు ప్రభుత్వం ఇచ్చిన స్థలంలో ఇల్లు కట్టుకున్నారు. తర్వాత ఆ ఇంటినీ అమ్మేసి ఆ డబ్బుతో (ఎ.బి.కె., ఆయన భార్య సుధ) హైదరాబాద్, కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధాశ్రమంలో చేరారు. గత 20 సంవత్సరాలుగా అక్కడే ఉంటున్నారు.

కమ్యూనిస్టు ఉద్యమాన్ని చూశారు. పుచ్చలపల్లి సుందరయ్య, చంద్ర రాజేశ్వరరావు, వీరి మేనమామ వాసుదేవరావు, మద్దుకూరి చంద్రశేఖరరావు, మాకినేని బసవపున్నయ్య లాంటి ప్రముఖుల చర్చలను ప్రత్యక్షంగా చూశారు. వారందరి ప్రభావం వీరి మీద ఉంది.

ఆంధ్రపత్రిక, సాక్షిలో తప్ప తెలుగులో అన్ని పత్రికలకూ పనిచేశారు. ఈనాడు, ఉదయం, వార్త (విజయవాడ, వైజాగ్ ఎడిషన్లు) పత్రికలకు ప్రారంభ సంపాదకులు. 'జనశక్తి' సంపాదకుడిగా కేసులు ఎదుర్కొని జైలుకెళ్లారు. అక్కడ జక్కా వెంకయ్య, డాక్టర్ శేషారెడ్డివంటి పార్టీ సీనియర్ నాయకులతో అభిప్రాయాలు పంచుకునే అవకాశం వచ్చింది. కొత్తగా పత్రిక పెట్టేవారికి వీరి సేవలు కావాలి. బండి పట్టాలెక్కిన తర్వాత వీరి ముక్కుసూటితనాన్ని భరించాల్సిన అవసరం వారికి ఉండకపోవచ్చు. రాజీపడి ఉద్యోగం చేయడం వీరికి ఇష్టం లేదు.

✧ రాజీ పడాల్సిన సందర్భాలు ఎవరికైనా సరే చాలానే వస్తాయి. రాజీపడి ఉంటే పొలాలు, ఇల్లు అమ్ముకోవాల్సిన అవసరమే వచ్చేది కాదు. ఇన్ని పత్రికలు మారవలసిన అవసరం వచ్చేది కాదు అంటారు.

✧ "తృప్తిని మించిన ఆస్తి లేదు. పత్రిక అమ్మకాలు పెరగడం, తగ్గడం – రెండూ సంపాదకుడి ప్రతిభకు గీటురాళ్లే" అంటారు ఎ.బి.కె.

✧ "కుత్సితాల లోయలోకి వెళ్లేకొద్దీ మనలోని నైపుణ్యాలు అణగారిపోతాయి. కుహనా విమర్శను అక్కడితోనే వదిలేయాలి. మనసులోంచి తుడిచేయాలి. అప్పుడే లక్ష్యాలను చేరగలం. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మానసికంగా దెబ్బతినకూడదు. ఎంచుకున్న బాటను వదలకూడదు" ఇదీ వీరి సందేశం.

ఎబికె ప్రసాద్‌గారి గురించి ప్రముఖుల అభిప్రాయాలు:

"కొత్త పత్రికలకు పురుడు పోయడం, సరికొత్త ఆలోచనలకు వేదికనివ్వడం, అక్షరాన్ని ఆయుధంగా చేసుకోవడం ఎ.బి.కె. విలక్షణత. వస్తువు, రూపం కలిపిన మేలిమి కలయికలు, విజ్ఞాన పేటికలు ఆయన సంపాదకీయాలు. అక్షర నిబద్ధుడైన ఎ.బి.కె. కు నిశిత బుద్ధితో, సముద్రమంతటి గాంభీర్యంతో, భావనా వైశాల్యంతో సాగిన అద్భుత సాహిత్య దర్శనం, విశ్వ విజ్ఞానాన్ని పిడికిట్లో ఇముడ్చుకున్న రచన. ఆయని నిబద్ధాక్షరి" – సి నారాయణ రెడ్డి

"ఎ.బి.కె వచనానికి సోయగం ఉంది, పరిపక్వత ఉంది, పరిమళం ఉంది, అతను ఒక్కొక్కసారి రచనలో కవిత్వపు తళుకులు చూపిస్తాడు. ఒక్కొక్కసారి ఆవేశంలో అక్షర జలపాతాలు కురిపిస్తాడు. ఈ శిల్పం నిబద్ధత వల్లనే అబ్బింది. అతని సాహిత్య సంపాదకీయాలలో ప్రతీ రచనా ఒక కావ్యం." – దాశరథీ రంగాచార్య

"తమిళ సంప్రదాయంలో "కైవాసి" అనే పదం ఉంది. మీ చేతి చలువ అలాంటిది. మీరు ప్రారంభించిన పత్రికలు యాజమాన్యాలకు ప్రతిష్ఠ చేకూరుస్తున్నాయి. మీరు హైదరాబాదు, తిరువతి ఎడిషన్ల (ఆంధ్రజ్యోతి)ను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. మీ పరిశ్రమకు మీ మేధాశక్తికి అవి తార్కాణాలు." – దాశరథీ కృష్ణమాచారి

"ఎదుటివారు అసూయపడేలా బ్రతకడం, ఈర్ష్యతో గింజుకు చచ్చేటంత బాగా వ్రాయడం శత్రువులు కూడా ఔరా అనుకున్నంత "స్వచ్ఛంగా" నైతిక విలువల్ని కాపాడుకోవడం నా లక్ష్యంగా ఉంచుకున్నాను. నువ్వు నాకన్నా మొండివాడివి. గట్టివాడివి! నువ్వు శాపగ్రస్తుడివైన గ్రీకు మహాశిల్పి "ఫిడియస్"లాంటివాడివి. నువ్వు అదృష్టం కరువైన అతిలోక బలశాలి "అట్లాస్"లాంటివాడివి. నిజానికి ముందుగా 'నమస్కారం' అనాలి. కాని చివరికంటున్నాను."
– రావూరి భరద్వాజ

"ముట్నూరి, నార్ల, గోరాశాస్త్రి తదితర ఉద్దండులైన నైతిక విలువలు కల్గిన సంపాదకులలో ఎ.బి.కె. చివరివాడు. ఫ్రెంచి విప్లవం ద్విశత జయంతి సందర్భంగా (1989 జూలై) "ఆంధ్రభూమి" దినపత్రికలో ఆయన వ్రాసిన సంపాదకీయం చరిత్ర అధ్యాపకుడినైన నన్ను ఎంతో ముగ్ధుణ్ణి చేసింది. నాలాంటి చరిత్ర అధ్యాపకులకు కూడా అంతుచిక్కని అంశాలను ఆయన ప్రస్తావించడం ఆశ్చర్యం గొల్పింది." – వకుళాభరణం రామకృష్ణ

"తెలుగు పత్రికా రంగంలో అతి విశిష్ట స్థానం పొందిన ఎ.బి.కె, సాధారణ జనచైతన్య దిగంతరేఖను విస్తృతం చేస్తున్న వ్యక్తి. ఎ.బి.కె జర్నలిస్టు మాత్రమే కాదు. సాహిత్య వేత్త, తత్వచింతకుడు, పీడిత జనపక్ష పాతి, ఉద్యమశీలి. మానవుడు సాధించిన అన్ని వైజ్ఞానిక శాఖలతోనూ ఆయనకు పరిచయం ఉంది. వసంత రుతువులో అన్ని పూలగంధాలను పూనుకుని విహరించే వాయువులాంటిది ఎ.బి.కె. వ్యక్తిత్వం."
– గుంటూరు శేషేంద్ర శర్మ *(1996)*

✦ ✦ ✦



ఎబికె ప్రసాద్‌గారు జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ (ప్రెసిడెంట్, ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా) నుంచి పురస్కారం అందుకుంటూ..

ఎబికెతో మాటామంతీ

(ఫిబ్రవరి-20-2023)

మిసిమి : ఏబికె ప్రసాద్ గారు నమస్కారం.

మిసిమి మీకు స్వాగతం పలుకుతోంది. పత్రికా రంగంలో మీరు భీష్మాచార్యుల వంటివారు. ఎన్నియో యుద్ధముల ఆరితేరినవారు. ప్రతిష్ఠాత్మక రాజారామ్మోహన్ రాయ్ పురస్కారాన్ని మీకు ప్రకటించి ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మిమ్మల్ని గౌరవిస్తోంది. ఈ పురస్కారం తెలుగు పత్రికా రంగానికి మీరు తెచ్చిపెట్టిన అరుదైన గౌరవం. ***మిసిమి*** సంపాదకవర్గం పక్షాన మిమ్మల్ని అభినందిస్తూ.. ఈ పురస్కారం ప్రాధాన్యత గురించి, దానిని గ్రహించే మీ పత్రికారంగ ప్రయాణం గురించి మాకు కొన్ని విషయాలు చెప్పండి.

ఏబికె: పద్దెనిమిది, పందొమ్మిది శతాబ్దుల నాటి గొప్ప సంస్కర్త రాజారావ్మోహన్ రాయ్ పేరున ఈ పురస్కారాన్ని ప్రతి సంవత్సరం ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా జర్నలిస్టులకు ప్రకటిస్తోంది. ఆయన జీవితమంతా సంస్కరణ వాదంతోనే నడిచింది. పెద్దకులాలు అని మనమనుకునే దాంట్లో ఆయన పుట్టినా, ఆ కులంతో ఆయనకు సంబంధం లేదు. సంబంధం పెట్టుకోలేదు.

మానవతావాదంతో కూడిన సంస్కరణలవైపే ఆయన మొగ్గుతూ వచ్చాడు. సో కాల్డ్ పెద్దకులం అనుకునే ఒక కులంలో పుట్టినా కూడా దాన్ని కూడా మార్చగలిగిన ఉత్తేజకరమైన సంస్కరణలను ఆయన తీసుకున్నాడు

అందుకని ఆయన వద్దెనిమిది, పందొమ్మిది శతాబ్దులలో మొత్తం భారతదేశానికి అగ్రగణ్యుడిగా నిలబడగలిగాడు. ఆయన బెంగాలీ అయినా తూర్పు, దక్షిణ, పశ్చిమ, ఉత్తర భారతాలన్నింటిని చుట్టబెట్టాడు. అన్ని ప్రాంతాలను ఆయన సంస్కరణలు ప్రభావితం చేశాయి. సమకాలీన పాశ్చాత్య మేధావుల నుంచి కూడా తన సంస్కరణలకు ప్రేరణను తీసుకున్నాడు. ఫ్రెంచ్ సామాజిక వేత్త రూసోను ఆయన అనుసరించాడు. ఫ్రెంచ్ విప్లవానికి దారి తీసిన అనేక సంస్కరణలకు రూసో ఆద్యుడు. అలాగే ఆయన్ని ప్రభావితం చేసిన మరో ఫ్రెంచ్ మేధావి వోల్టేర్. ఆంగ్ల సాహిత్యంతో పరిచయముంటే వారిని పోల్చుకోవడం సులభం. చాలామందికిది గుర్తుండి ఉండదు. గమనించి ఉండరు.

అంచేత సంస్కరణవాద ఛాయలన్నీ అలా వారినుంచి పొందాడాయన. రాజారామ్మోహనరాయ్ సంస్కరణల ప్రభావం తెలుగునాట వీరేశలింగం మీద, చిలకమర్తి లక్ష్మీనరసింహం మీద గురజాడ మీద ఉంది. వాళ్ళప్పటికే సంస్కరణవాదులుగా ఉన్నా రామ్మోహన్ రాయ్ సంస్కరణ చర్యలు మరింతగా వారు ముందుకు సాగటానికి తోడ్పడ్డాయి. సదా ఆయన సంస్కరణల ప్రభావాన్ని మనం గుర్తుపెట్టుకోవలసి ఉంది.

మిసిమి : బావుందండీ, వారి పేరుతో ఇచ్చే పురస్కారాన్ని మీకిస్తున్న ప్రెస్ కౌన్సిల్ ప్రభుత్వ సంస్థా, ప్రైవేటు సంస్థా?

ఏబికె: ప్రెస్ కౌన్సిల్ ఒక తటస్థ సంస్థ. ఒక independent body.

మిసిమి : మీకు ఈ పురస్కారం ఇవ్వటానికిగల కారణమేమిటో చెప్పారా?

ఏబికె: అది నేనెలా చెప్పగలను. బహుశః తెలుగు రాష్ట్రాలలో ప్రసిద్ధుడయిన పాత్రికేయుడిగా, తెలుగు జర్నలిజానికి చేసిన విశేషమయిన కృషికి గణింపుగా ఈ పురస్కారానికి నన్ను ఎంపిక చేసినట్టు వారు పంపిన జాబులో పేర్కొన్నారు.

మిసిమి : మీ ప్రతిభకు పట్టం కట్టే పురస్కారంగా దీన్ని భావిస్తూ, ఈ పురస్కారం అందుకున్న తొలి తెలుగు వారు మీరే అనుకుంటాను.

ఏబికె: కృతజ్ఞతలు. తెలుగులో అందుకోబోతున్న తొలి పాత్రికేయుడిని నేనేనేమో..

మిసిమి : ఏ సమాజానికయినా సంస్కరణల అవసరం దేనికి ఉంటుంది?

ఏబికె: ఏ సమాజాన్నయినా కొన్ని రుగ్మతలు పట్టి పీడిస్తుంటాయి. వాటిని వదిలించకపోతే, వాటికి సరైన చికిత్స చేయకపోతే వెనకపడిపోతామని నడుంబిగించి, వాటిని తొలగించే ప్రయత్నం కొందరే చేస్తారు. వారే సంస్కర్తలు. అసలు సంస్కర్తలు లేకుంటే సమాజం ముందుకెళ్ళదు. వీటిలో కూడా రెండురకాలుంటాయి. ఒకటి పురోగమనంవైపు నడిపించేది. మరొకటి తిరోగమనం వైపు

నెట్టేది. అలా అన్ని సంస్కరణలొకటి కావు. సమాజాన్ని జాగృతం చేసి ముందుకు నడిపే సంస్కరణే నిజమైన సంస్కరణ.

మిసిమి : తెలుగు పత్రికా రంగంలో సుదీర్ఘ కాలం సేవలందించారు మీరు. అలాగే అధికార భాషా సంఘం అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు. తెలుగుకు మీరు చేసిన సేవలను ఎలా గుర్తుచేసుకుంటారు? కేబినెట్ హోదాలో ఆ పదవిలో ఉన్న మీరు సాధించిన విజయాలు, చేయలేకపోయినవి ఉంటే చెప్పండి!

ఏబికె: సాధించాలని అనుకున్నవాటిలో సాధించినవి పరిమితమనే చెప్పాలి. ఎన్ని సాధించామని కాకుండా మనకిచ్చిన అవకాశాన్ని దుర్వినియోగం చేశామా, ఉన్నంతలో సంస్కరణలను చొప్పించామా అన్న బేరీజు వేసుకోవాలి. 'కారు కావాలి'వంటి చిల్లర విషయాల మీద దృష్టి ఉండకూడదు. అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా జిల్లాలకు వెళ్ళినప్పుడు నా శ్రద్ధంతా అక్కడ భాషా స్వరూపాల మీద, అమలవుతున్న తీరు గురించే ఉండేది తప్ప, జిల్లా కలెక్టర్ నాకేమి సదుపాయాలు కల్పిస్తున్నారన్న అంశం మీద కాదు. అధికార భాషా సంఘం అధ్యక్షుడు కేబినెట్ హోదా కాబట్టి జిల్లా యంత్రాంగం తరఫున కలెక్టర్ తదితరులు సమావేశాలకు హాజరవుతుండేవారు. అన్నీ రాసుకునేవారు. ఆయన ఏమీ జిల్లా యంత్రాంగంపై ఎలాంటి వ్యక్తిగత ఒత్తిడులు పెట్టకుండా, ఉన్న నదుపాయాలను ఉపయోగించుకున్నారని వారు ప్రభుత్వానికి నివేదిక పంపించేవారని నాకు తర్వాత తెలిసింది. అది కూడా సాక్షాత్తు ముఖ్యమంత్రి వైఎస్ ముఖతా విన్నాను ఆ రోజుల్లో. నీకు మంచి పేరున్నదయ్యా అనేవాడు ఆయన. వేధించకుండా ఉంటే ఎవరికైనా మంచి పేరొస్తుందని నేను చెప్పాను. (నవ్వు)

జిల్లాలకు వెళ్ళినప్పుడు నేను కొన్ని టెస్ట్‌లు పెట్టాను. అందరూ కూడా తెలివికలిగిన ఆఫీసర్లు, సిబ్బంది ఉన్నారండీ. మనం ఉపయోగించుకోవటంలేదంటాను. వారిమీద అజమాయిషీ తప్పిస్తే, భాషా వినియోగంలో వారికి బాధ్యతలప్పగించాలన్న కోరిక కనపడదు. కానీ వాళ్ళకు సేవచేయాలని ఉంది. అసలు మొదటిసారి వావిలాల గోపాలకృష్ణయ్యగారు అసెంబ్లీలో అధికార భాషా తీర్మానం పెట్టారు.

మిసిమి : ఆయన అధికార భాషా సంఘం తొలి అధ్యక్షుడు కదా..

ఏబికె: ఆయన మొదటి అధ్యక్షుడు. ఆయన తెలుగు అధికార భాషగా ఆయన తీర్మానం పెడితే, నువ్వెందుకు, ప్రభుత్వం తరఫున మనం పెడదామని పి.వి. నరసింహారావు తీర్మానం అసెంబ్లీలో ప్రవేశపెట్టారు.. అది మంచి మాటే కానీ, అది ఆయనకు కలగలా. ఆ ఆలోచన వావిలాలకు కలిగింది.

మిసిమి : అధికార భాషా సంఘం అస్తిత్వంలోకి వచ్చి ఎంతకాలమయింది!

ఏబికె: అదిప్పుడేమిటి! యాభైఆరులోనే ఉనికిలోకి వచ్చింది. వచ్చినా తెలుగును పూర్తిస్థాయిలో అమలు చేసుకోలేకపోయాం. అన్నీ ఉన్నా శని ఉందంటారే.. అలా.. కానీ పూర్తిగా తెలుగును అమలు చేస్తున్న జిల్లాలు కొన్ని ఉన్నాయి. వారందరు ఆవురావురమంటూ ఉన్నారు, తెలుగుని అమలుచేద్దామని.

మిసిమి : కొంతమంది న్యాయమూర్తులు కూడా తమ తీర్పులు తెలుగులో ఇచ్చిన సందర్భాలున్నాయి.

ఏబికె: మీరు ఆ విషయం ప్రస్తావిస్తున్నారు కాబట్టి చెప్పాలి. ఆ రోజుల్లో జ్యుడీషియరీ వ్యవస్థతో అధికార భాషా సంఘం తరఫున తెలుగు ఆవశ్యకతను వెలిబుచ్చటం జరిగింది. వారికి శిక్షణ కార్యక్రమాలు కూడా నిర్వహించాం. వారందిరికీ తెలుగు పట్ల అభిమానం, ఆసక్తి ఉన్నాయి. కానీ ప్రభుత్వం తరఫున ఒక ప్రత్యేకమైన విధానం లేకపోవడం ఇబ్బంది. ప్రభుత్వ కార్యాలయాల్లో మంచి అనువాదకులున్నారు. వారిని ఉపయోగించుకోలేకపోయాం.

మిసిమి : అధికార భాషా సంఘం అధ్యక్షుడిగా మీరు అనుకుని పూర్తిచేయలేకపోయిన కార్యక్రమాలు ఏమన్నా ఉన్నాయా?

ఏబికె: అనుకుని పూర్తిచేయలేకపోయిన కార్యక్రమాలు అంటే నేను శాశ్వత అధ్యక్షుడిని కాదు కదా. మొదలుపెట్టినవి అనేకం. పూర్తికావాలంటే అక్కడ నేను లేనుకదా. అమలు చేసే దశలో వెనక్కి వెళ్ళకూడదుకదా. ఇంగ్లీష్‌నే అమలు చేయాలని ఆయన (వైఎస్) సభల్లో చెబితే నేను వీల్లేదని లిఖితపూర్వకంగా ఆయనకు రాసేశాను. మొదటనుంచి ఆంగ్ల భాష ఉండాలని ఆయనంటే ఐదో తరగతి తర్వాతే ఇంగ్లీష్ ఉండాలని వాదించాను. తెలుగు

గురించి పాటుబడుతుంటే మీ అబ్బాయిని ఎక్కడ చదివించారని వెనక్కు లాగే ప్రశ్న వేస్తుంటారు. ఇది కరెక్ట్ కాదు. నీ మాతృభాషలోనే నువు పటిష్టంగా ఉంటేనే ఏ అన్యభాషయినా అలవడుతుంది.

ఇప్పుడు ఇంగ్లీష్‌లో రాసే మిత్రులంతా తెలుగులో ఆలోచించి ఇంగ్లీష్‌లో రాస్తారని గుర్తుంచుకోవాలి.

మిసిమి : మీరు తెలుగులో ప్రధాన పత్రికలన్నింటిలోను పనిచేశారు. ఉదయం, వార్త, ఈభూమి వంటివి మీ ప్రమేయంతో మొదలయ్యాయి. మీ తర్వాత ఇవి ఎందుకు ఆగిపోవలసి వచ్చింది?

ఏబికె: అవి అంతకుముందు మనం ప్రవేశపెట్టిన వాటిని కొనసాగించకపోవటంవల్ల.

మిసిమి : అవన్నీ ఈనాడు కు పోటీగా వచ్చినవే కదా!

ఏబికె: అఫ్కోర్స్.. మేనేజ్మెంట్ నుంచి ఎంత స్కిల్ మేనేజ్‌మెంట్ ఉన్నా, ఈనాడు ను నిలబెట్టడానికి చాలా కృషి చేయాల్సి వచ్చింది. ఆ చేస్తున్న సందర్భంలో మేనేజ్మెంట్ జోక్యముండేది. అవన్నీ ఇప్పుడు చెప్పే సందర్భమూ కాదు.

చాలా పత్రికలు mismanagement కాదు. తెలివైన management చేశాయి. నువ్వు రాయి, నేను సంతకం పెడతా అనే టైపు. కానీ జర్నలిస్టు అనేవాడు తన వృత్తి స్వాతంత్ర్యాన్ని కోల్పోకూడదు. అందుకనే పేపర్ మారినప్పుడల్లా ఇబ్బంది పడ్డాను. ఎడిటర్‌గా apex levelలో ఉన్నా కాబట్టి నేను మరొకరికి ఉదాహరణగా ఉండాలి. మార్గాన్ని నిర్దేశించాలి.

మిసిమి : సాక్షికి విరివిగా రాశారు కదా. ఎడిటోరియల్ బోర్డు సలహాదారుగా ఉండేవారా?

ఏబికె: నేను సలహాదారుగా లేను. విరివిగా రాశాను వాస్తవమే. నచ్చకపోతే ఆపేసిన సందర్భాలు కూడా ఉన్నాయి.

మిసిమి : సమాచార హక్కు చట్టం ఉంది కదా.. దాన్ని నిలబెట్టిందెవరు.. నీరుకార్చిందెవరు?

ఏబికె: పేర్లు గుర్తుకురావటం లేదుకానీ, అంతకుముందు సామాజిక కార్యకర్తలుగా ఉన్నవారే సమాచార హక్కు చట్టం కోసం కృషి చేశారు. ఆ చట్టం కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సమయంలో అమలులోకి వచ్చింది. నా శిష్యుడు మాడభూషి శ్రీధర్ కొంతకాలం కేంద్ర సమాచార కమీషనర్‌గా పనిచేశాడు. మేమిద్దరం ఉదయంలో ఉన్నప్పుడు తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన అవినీతి బాగోతాన్ని బయటపెట్టాం.

సమాచార కమీషనర్ గా అతను చొరవతో తీసుకున్న నిర్ణయాలు ఇవాళ దేశంలో ఆదర్శంగా ఉన్నాయి.

మిసిమి : కోర్టు వ్యవహారాల్లో మీరు వేసిన కేసులు కొన్ని ఉన్నాయి. మిమ్మల్ని ఇరికించిన కేసులు కొన్ని ఉన్నాయి. ఎందుకు ఆ దిశగా వెళ్ళవలసి వచ్చింది?

ఏబికె: పత్రికల్లో పనిచేస్తున్నప్పుడు కొన్ని కేసులు వేయవలసి వచ్చింది. అలా కేసులు వేసినప్పుడు పత్రిక యాజమాన్యానికి బాధ కలిగేది. ఎందుకంటే ఒక ఎడిటరే కాకుండా వారూ సమాధానాలు చెప్పాల్సి ఉంటుంది కదా. కానీ వారికి ఇబ్బంది కలిగినా నేను రాజీపడలేదు.

మిసిమి : మీమీదేమన్నా పరువు నష్టం కేసు వేశారా, ఎవరైనా?

ఏబికె: ఎన్నో.. ఇప్పుడు రెండు రాష్ట్రాలు కానీ, అప్పుడు ఉమ్మడి రాష్ట్రమే కదా. ఎన్నో కేసులు ఎదుర్కొన్నాను. బాధ లేకుండా తిరిగాను. పత్రికలో వచ్చిన వార్తపై ఒకసారి మహబూబాబాద్ కేసులో అరెస్టు చేశారు. కానీ మా వాదనలవలన బయటపడ్డాను. కేసుల సమయంలో కొంతమంది మేజిస్ట్రేట్‌లు ఛాంబర్‌కి పిలిచేవారు.

ప్రసాద్‌గారు, మీ తప్పిదం లేదు.. మీ లాయర్ తప్పిదం ఉంది, అతను సరిగ్గా వాదించలేకపోయాడు అని చెప్పేవారు. మంచి లాయర్‌ని పెట్టండి అని సలహా ఇచ్చేవారు.. పరువు నష్టం కేసులో సరైన వాదనలు మా పక్షాన ఉన్నా కేసు కొనసాగించేవారు. తరవాత కొట్టివేసేవారనుకోండి. నేను ఎక్కడా కూడా కోర్టు ధిక్కారం చేయలేదు.

మిసిమి : పరువునష్టం చట్టం బ్రిటిష్ కాలం నాటిది కదా!

ఏబికె: ఏ చట్టం బ్రిటిష్ కాలం నాటిది కాదు? మనదంతా colonial legacy. ఆ legacy లోంచి బయటపడలేకపోయాం. ఆ legacy ఆధారంగానే ఇప్పుడు ఏదో ఒక క్లాజ్ చూపించి జరుగుతున్నాయి అరెస్టులన్నీ. 19 (a), 19 (b) సెక్షన్లున్నాయి పరువు నష్టం చట్టంలో.. ఒకదాంట్లో మాట్లాడేందుకు స్వేచ్ఛ ఉందంటారు. ఇంకో

దాంట్లో దాని నియంత్రణ ఉంటుంది. బ్రిటిషు చట్టం నాటి క్లాజ్‌లను తెచ్చి మనముందుంచుతారన్నమాట.

మిసిమి : మీరు వత్రికలు పెట్టి అన్నులు పోగొట్టుకున్నారంటారు.. నిజమేనా.. అసలు పత్రిక ఎందుకు పెట్టాలనుకున్నారు?

ఏబికె: నిజమే, మార్క్సిస్ట్ పార్టీలో ఉన్నప్పుడు పెట్టాల్సి వచ్చింది. పార్టీ ఆదేశాలమేరకు. స్వతంత్రంగా అన్నది పార్టీ నుంచి బయటకు వచ్చేసిన తర్వాత. రెండు, మూడు వార పత్రికలు పెట్టాను కానీ వెనక ఆర్థిక దన్ను లేకపోవటం దెబ్బ తీసింది. పత్రిక ఎందుకు పెట్టానంటే ఒక మంచి ఆలోచనను అందరితో పంచుకోవాలని.

మిసిమి : జనశక్తి పత్రిక నడిపినట్టున్నారు?

ఏబికె: అదా.. అది మార్క్సిస్ట్ పార్టీలో ఉన్నప్పుడు. తరిమెల నాగిరెడ్డి డివిజన్ వచ్చి వేరయినప్పుడు, నాగిరెడ్డికి ఆ పత్రికను బదిలీ చేశాను. అది పార్టీలో చాలామందికి కోపం తెచ్చింది. మళ్ళీ నామీద పరువు నష్టం దావా కేసు పడింది. కానీ న్యాయంగా నాగిరెడ్డి వర్గానికి మెజారిటీ ఉంది కాబట్టి పత్రిక వారికి చెందుతుందన్నది నా వాదన.

మిసిమి : ఇప్పుడు ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొన్న తర్వాత, మీరు నమ్మిన సిద్ధాంతం పట్ల రెండో ఆలోచన వచ్చిందా?

ఏబికె: లేదు.. ఇతరులు మారారు కాబట్టి నేను మారాల్సిన అవసరం లేదు. అలాగే ఆరోజు నుంచి ఈరోజు వరకు నా ఆలోచనల్లో ఎటువంటి మార్పులేదు.

మిసిమి : ఇప్పటికీ మీ సిద్ధాంతం ప్రాసంగికత (relevance) కలిగి ఉందా?

ఏబికె: ఖచ్చితంగా.. ఆశయాల అమలులో ఆచరణలో తగాదాలుండొచ్చు కానీ, సిద్ధాంతంలో మార్పేమీ లేదు. let workers of the world unite అనేది దేనికి. ప్రపంచంలోని కార్మికులందరికీ ఒకటే ఆలోచన ఉందని కాదు. నీవు పడుతున్న బాధలు నుంచి బయటపడాలంటే కలిసి పోరాటం చేయాలని.

మిసిమి : నేనడగబోయే దానికి సిద్ధాంతమే వెనకాల ఉంది. ఇప్పుడు విస్తృతంగా ప్రచారం జరుగుతున్న అంబేద్కరిజం, దళితవాదం, స్త్రీవాద పోరాటాలు మైనారిటీల రిజర్వేషన్లు.. వీటన్నిటినీ ఎలా సమన్వయ పరుస్తారు సిద్ధాంత పరిధిలో...

ఏబికె: సిద్ధాంత పరిధిలో అంటే వీటినన్నిటిని ఇముడ్చుకునేటట్టు పద్ధతులు, విధానాలు ఉండాలి. వ్యక్తులును కలిపే విధంగా సిద్ధాంతాలు ఇముడ్చుకోవాలి.

మిసిమి : ఇది ఎవరు చేయాలి. వాదాలు తెచ్చిన నాయకులు చేయాలి.

ఏబికె: నాయకులే deviation లో ఉన్నప్పుడు, ప్రాధమిక అంశాలను మరచిన స్థితిలో ఉన్నప్పుడు రెండుగా చీలిపోతున్నప్పుడు.. కమ్యూనిస్ట్ పార్టీగా రెండుగా విడిపోయింది కదా, తర్వాత మూడయిపోయిందికదా. ఎవరికివారే యమునా తీరే అన్న చందాన ఉందికదా. అయినా కూడా త్యాగాలు చేస్తూ జీవితాన్ని పణంగా పెడుతున్నవాళ్ళు ఇప్పుడు క్షేత్ర స్థాయిలోనే ఉన్నారు. వాళ్ళని న్యూనపరిచే విధంగా మనం మాట్లాడలేం. లక్ష్య సాధనకు అంబేద్కర్ ఎంత కష్టపడ్డాడు. ఆయన రాజ్యాంగాన్ని రచిస్తున్నప్పుడు డ్రాఫ్ట్‌నే మార్చుదామని ప్రయత్నించారు. ఇవన్నీ ఇటీవలి కాలంలో ఆయన రాసిన ఉత్తరాలను ప్రచురించినప్పుడు అప్పుడు బయటపడ్డాయి.

మిసిమి : అమెరికాలోనే ఒక వాదముంది. స్త్రీవాదంలో బ్లాక్ ఉమెన్స్ లిబరేషన్, అక్కడితో ఆగలేదు మళ్ళీ హిస్పానిక్స్ ఉమెన్స్ లిబరేషన్. ఇవి ఎట్లా వచ్చాయంటే చిలవలు పలవలుగా వచ్చేశాయి, మాకివి కావాలి, ఇవి కావాలి అంటూ..

ఏబికె: అమెరికాలో నల్లజాతి వారు తీవ్రమయిన అణచివేతను ఎదుర్కొన్నారు కదా. మన దగ్గర డా.బి.ఆర్. అంబేద్కర్ అణగారిన వర్గాల వారి కోసం ఎంతో పోరాటం చేశాడు. అందుకోనం ఆయన నమకూర్చుకున్న పద్ధతులున్నాయి. నిరాశపడిన సందర్భాలున్నాయి. ఆయన ఎంత గొప్పవాడంటే అన్ని దేశాల రాజ్యాంగాలను చదివిన ఏకైక వ్యక్తి ఆయనే. అలాగే రాజ్యాంగ పరిషత్తు సమావేశాలు ఎన్నో నిర్వహించింది. ఆ సమావేశాలలో ఒక్క రోజుకూడా గైర్ హాజర్ కాకుండా ఉన్న ఏకైక వ్యక్తి అంబేద్కర్. రాజ్యాంగ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషించాడు. రాజ్యాంగ నిర్మాతగా పేరు గడించాడు.

మిసిమి : మీ సుదీర్ఘమయిన పత్రికా రంగ ప్రస్థానంలో మీకు ఎందరో శిష్యగణం ఉన్నారు. అందులో వాసుదేవరావులాంటి నలుగురు పేర్లు చెప్పండి.

ఏబికె: ఒక్క వాసుదేవరావే కాకుండా, హిందూ

రిపోర్టర్‌గా పనిచేసి, తర్వాత వైజాగ్ ఈనాడు లో పనిచేసిన ఒక పెద్దాయన ఉన్నారు. పేరు గుర్తుకు రావటం లేదు. వయసులో నాకన్నా పెద్దవాడే, కానీ శిష్యుడిగా వ్యవహరించేవాడు. పాతతరం కాబట్టి కొన్ని పద్ధతులున్నాయి. తర్వాత పతంజలి ఉన్నాడు. కె. రామచంద్రమూర్తి, కె. శ్రీనివాస్, దళితమిత్రుడు సతీష్ చందర్ ఉన్నాడు. వయసురీత్యా పేర్లు గుర్తుకురావటం లేదు.

మిసిమి : వీళ్ళందరిలో వాసుదేవరావు మిమ్మల్ని అంటిపెట్టుకునే ఉండేవాడు కదా.

ఏబికె: వచ్చిన గొడవేమిటంటే అతను చాలా లాయలిస్టు ప్రతిభావంతుడు. నాకు బాగా సపోర్టింగ్‌గా ఉండేవాడు. అయితే రాతకు సంబంధించి మహా బద్దకస్తుడు.

మిసిమి : ఇటీవల మరణించిన రాడికల్ హ్యూమనిస్ట్ రావిపూడి వెంకటాద్రి తను నమ్మిన సిద్ధాంతాన్ని ఆచరించటానికి, ప్రచారం చేయటానికి కట్టుబడి ఉన్నాడు. అలాగే మీరుకూడా మీరు నమ్మిన సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం కోసం పత్రికా రంగం ద్వారా ప్రయత్నిస్తున్నారు. ఆయనెంతమందిని ప్రభావితం చేశాడో తర్వాత చెబుతాను. మీరెంతమందిని పత్రికా రంగం ద్వారా ప్రభావితం చేశారో చెప్పండి.

ఏబికె: నేను ఖచ్చితంగా ప్రభావితం చేయగలిగాను. కమ్యూనిజానికి, సోషలిజానికి, రాడికల్ సోషలిజానికి వ్యతిరేకంగా యాజమాన్యాలు ఉన్నప్పుడు ఆ పత్రికలను నేను టాక్టికల్‌గా నిర్వహించాను. ధనికవర్గ పత్రికల్లో నువు పనిచేస్తున్నప్పుడు ఏ మేరకు వాటిని ఉపయోగించాలో ఆ మేరకు ఉపయోగించాలి. నువు ఇమడగలిగితే ఇమడటం, లేదంటే ఏమేరకు జనాలను కాపాడగలవో ఆమేరకు కాపాడటం. టాక్టిక్స్ (tactics) ప్రజా సేవకోసం ఉపయోగించాలి. జేబు నింపుకోవడం కోసం కాదు.

మిసిమి : ఇప్పుడున్న మీడియాపై (వార్తాపత్రికలు, టీవీ ఛానెల్స్, సోషల్ మీడియా అన్నీ కలుపుకుని) మీ అభిప్రాయం ఏమిటి?

ఏబికె: ఇప్పుడు ప్రజలకు మీడియం లేదు. మీడియం లేకుండా చేసింది మీడియా.

మిసిమి : మీడియా ఒక మిథ్య అయిపోయిందంటారు.

ఏబికె: అవును. ఏదో మంచి చేస్తుందనుకుంటాం కానీ వాళ్ళంతా డివైడ్ అయిపోయి ఉన్నారు. divided loyalties అయిపోయాయి. అంచేత ఇప్పుడున్న మీడియం నిజమైన ప్రజాసేవకు తోడ్పడదు. ప్రజలను గందరగోళ పరచటానికి ఉపయోగపడుతుంది. అదీ ఇప్పుడొచ్చిన ప్రమాదం.

మిసిమి : మీరు రాసిన పుస్తకాలు గురించి చెప్పండి.

ఏబికె: ఎన్నని చెప్పను.. ఇప్పటికే ఎనిమిది వాల్యూమ్స్ వెలువడ్డాయి. ఇంకా ఎనిమిది వాల్యూమ్స్ పబ్లిష్ కావలసినవి ఉన్నాయి. మళ్ళీ నా ఆత్మకథ వస్తోంది.

ప్రజలపట్ల, ప్రజాసేవ పట్ల ఆసక్తి ఉన్నప్పుడు కళా, సాహిత్య రంగాలను విస్మరించకూడదు. నా వాల్యూమ్స్‌లో కళా సాహిత్యాల పట్ల చర్చతో కూడిన వ్యాసాలు కూడా ఉన్నాయి.

మిసిమి : జర్నలిజంలో మీకు గురువంటూ ఎవరన్నా ఉన్నారా?

ఏబికె : నేను స్వతంత్రంగా బతికాను. అయినా కూడా ముట్నూరి కృష్ణారావుగారిని ఆ విధంగా భావిస్తాను. ఆయన రచనలు చాలా పద్ధతిలో ఉంటాయి. తరవాతి వాళ్ళకంటే కూడా ఆ రోజుల్లో మంచి మంచి భావాలు వ్యక్తం చేసినవారు ముట్నూరి కృష్ణారావుగారు. ఇంకా నార్ల వెంకటేశ్వరరావు, తాపీ ధర్మారావుగారు. ఖాసా సుబ్బారావుగారు. ఆయనతో నేరుగ పరిచయం లేదు.

పరోక్ష పరిచయం. గోరాశాస్త్రి కూడా. తనతో బాగా పరిచయముండేది. గోరాశాస్త్రే నన్ను ప్రమోట్ చేసి ఆంధ్రభూమికి తీసుకొచ్చింది.

మిసిమి : మిసిమి పై మీ అభిప్రాయం?

ఏబికె: మీరొక నిర్దుష్టమైన లక్ష్యం కోసం పత్రిక నడుపుతున్నారు. పాఠకుల స్థాయి పెంచాలని – ఎన్నో తెలియని / వెలుగు చూడని విషయాలను పాఠకులకు అందిస్తున్నారు. తెలుగులోనే కాదు మరెక్కడా కూడా ప్రకటనలు లేకుండా పత్రిక నడిపినవారు లేరు. అన్ని వర్గాల వారిని వివక్ష లేకుండా ఆదరించే పత్రిక. సాహిత్య, సంగీతం, కళా, సాంఘిక చరిత్ర వంటి అనేక అంశాలను పాఠకులకు సమగ్రంగా అందిస్తుంది.

మిసిమి : మీరుంటున్న సి.ఆర్. ఫౌండేషన్ హోం గురించి చెప్పండి.

ఏబికె: ఈ హోం పెట్టిన మొదటి నుంచి ఉన్నాను.

ఒక పద్ధతి ప్రకారం ఉంటుంది. రాజేశ్వరరావుగారి సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తోంది. అన్నపానాదులు దగ్గర్నుంచి డాక్టర్ సౌకర్యం వరకూ అన్నీ చక్కగా ఉంటాయిక్కడ. జర్మన్ రిటర్న్స్ డాక్టర్ రజనీ చక్కని సేవలందిస్తున్నారు. సోవియట్ రష్యాలో కూడా పనిచేశారు.

మిసిమి : మా మిసిమి పాఠకులతో చాలా అంశాలు పంచుకున్నారు. మళ్ళీ మీరు ఢిల్లీ నుంచి అవార్డు అందుకున్నాక కలుస్తాం.

నమస్కారమండీ.

* * *

(మార్చి-3-2023)

మిసిమి : మళ్లీ స్వాగతం! ఢిల్లీ నుంచి ఎంతో గౌరవప్రదమైన పురస్కారం అందుకుని వచ్చినందుకు అభినందనలు! ఆ సభలో మీ ప్రతిస్పందన వినిపించారా?

ఎబికె: అవునండీ! వినిపించాను. ఈ సందర్భంగా అక్కడ చూసిన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వారి కొటేషన్ నన్ను ఎంతో ఆకట్టుకుంది. మన పాఠకులతో పంచుకుంటాను.

"వార్తాపత్రికలు: నాయకుల వ్యాఖ్యలను వక్రీకరించి
ఇవ్వకూడదు.
సంపాదకీయంలో నాయకుల ప్రసంగ
పాఠాల స్ఫూర్తిని నిజాయితీగా
వ్యాఖ్యానించాలి."

– ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా

ఆ రోజున ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు గౌ. శ్రీమతి జస్టిస్ రంజనా ప్రకాశ్‌దేశాయ్ గారు ఇంకా అనేకమంది పెద్దలు వేదికనలంకరించారు. వారితోపాటుగా ఎంతోమంది పాత్రికేయ మిత్రులు హాజరయ్యారు. వారికి నా హృదయపూర్వక నమస్కారాలు.

టాగూర్ అన్నట్లు రాజా రామ్మోహన్‌రాయ్ ఆధునిక భారతదేశానికి ప్రారంభకుడు. భారతదేశ చరిత్ర సుస్థిరతలో ఆయనొక ధృవతార.

భారతదేశంలో పత్రికా స్వేచ్ఛకు లార్ట్ హేస్టింగ్స్ ఆద్యుడు. ఆతని ప్రభావంతో రాజా రామ్మోహనరాయ్ మూడు పత్రికలు స్థాపించి, పత్రికా స్వాతంత్ర్యాన్ని ప్రచారం చేశాడు. "ఈ నేలమీద పేదరికం ఉన్నంతకాలం దేవుడు లేనట్లే" అంటాడు విల్ దురాంట్.

మార్క్స్ మరొక నగ్న సత్యాన్ని చెప్పాడు. "ముందు కాలంలో పెట్టుబడిదారులు, కార్మికులు ఏకమై సమాజాన్ని దోచుకుంటారు". ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ అమెరికన్ రాక్‌ఫెల్లర్ "చిన్నచిన్న మొగ్గలు చితికిపోతేనే పెద్ద పూలు పరిమళిస్తాయి" అంటాడు.

పౌరహక్కులు, వ్యక్తికాస్వేచ్ఛ.. ఈ రెండు విషయాలలో మనల్ని మనం విమర్శించుకునే దశలో జనసామాన్యం మనోభావాలను పరిగణనలోకి తీసుకోవలసిన అవసరమున్నది, అవి మన దృక్పథానికి వ్యతిరేకంగా ఉన్నా కూడాను. ఈ రోజు భారత రాజ్యాంగ పౌరుల పేరున అధికారంలో ఉన్న నాయకులు రాజ్యాంగ స్ఫూర్తిని ఇష్టారాజ్యంగా వాడుకుంటున్నారు.

ఈ సందర్భంగా ఆంగ్ల కవి పి.బి. షెల్లీ (1836) శ్రామికవర్గం కోసం చెప్పిన పద్యం గుర్తు చేస్తూ:

ఊయల నుండి సమాధి వరకు
నీ శ్రమను, రక్తాన్ని పీల్చేవారు
నీ సుఖాన్ని, నీ విశ్రాంతిని చివరికి
నీ ఆహారాన్ని దోచేవారు
నీ బాధలో, నీ భయంలో
నీవు సాధించేదేమిటి!
నువ్వు గింజలు చల్లితే వేరొకడు
పంట కోసుకుంటాడు!
నీవు సంపద కనుగొంటే మరొకడు
దోచుకుపోతాడు!
నీవు నేసిన వస్త్రాన్ని మరొకడు
అలంకరించుకుంటాడు!
నీవు తయారు చేసిన ఆయుధాలు
మరొకడు ధరిస్తాడు!
వీరంతా నీ శ్రమను దోచుకునేవారే!
నీ రక్తాన్ని పీల్చేవారే!

నేను వినయంతో శిరస్సు వంచి ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్నాను.

జై హింద్

(ఈ ధ్వని ముద్రను - రాతప్రతిగా మార్చిన **సి.ఎస్. రాంబాబు గారికి** వందనాలు)

అనర్ఘ రత్నాలు

– పప్పు వేణుగోపాల రావు

సంస్కృత సాహిత్యంలో బాణుడు వ్రాసిన 'కాదంబరి', దండి రచన 'దశకుమార చరిత్ర' వచన రచనలో ప్రసిద్ధమైనవి. బాణుని కావ్యం కాదంబరి. కాదంబరికి అర్థం సరస్వతి, కావ్యం, ఆడకోయిల, మద్యం..... కన్నడలో నవలను కాదంబరి అంటారు.

బాణుడి కాదంబరిని విద్వాన్ విశ్వం గారు తెలుగులోనికి అనువదించారు. బాణభట్టు శ్రీహర్షుని ఆస్థానకవుల్లో ఒకడు (క్రీ.శ. 606 – 645).

ఇందులో యువరాజైన చంద్రాపీడునికి మంత్రి శుకనాసుడు చేసిన ఉపదేశం ఒక అనితర సాధ్యమైన అద్భుత రచన. ఒక్కొక్క వాక్యం 2–3 పుటలుగా సాగే ఈ శుకనాసోపదేశంలో ఒక భాగంలో కొంత చూద్దాం.

శుకనాసుడు చంద్రాపీడునితో ముందు నాయనా అన్నీ తెలిసిన నీకు ఉపదేశించవలసినది ఏమీ లేదుకానీ పట్టాభిషేకానికి సిద్ధంగా ఉన్న నువ్వు కొన్ని–కొన్ని తెలుసుకోవడం మంచిది. అందులో మొదటిది లక్ష్మి గురించి చెప్తాను విను:

ఆలోకయతు తావత్ కల్యాణాభినివేశీ లక్ష్మీమేవ ప్రథమం.

ఇయం హి సుభటఖడ్గమండలోత్పలవనవిభ్రమభ్రమరీ లక్ష్మీః క్షీరసాగరాత్పారిజాతపల్లవేమ్యో రాగం,

– ఇందుశకలాదేకాంతవక్రతాం,

ఉచ్చైఃశ్రవసశ్చంచలతాం, – కాలకూటాన్మోహనశక్తిం

మదిరాయా మదం, – కౌస్తుభమణేర్నిష్ఠుర్యం,

ఇత్యేతాని సహవాసపరిచయవశాత్ విరహవినోదచిహ్నాని గృహీత్వేవోద్గతా.

న హ్యేవంవిధమపరిచితమిహ జగతి కించిదస్తి యధేయమనార్యా.

లబ్ధాపి ఖలు దుఃఖేన పరిపాల్యతే.

ధృధగుణపాశసందాననిస్పందీకృతా అపి నశ్యతి.

ఉద్దామదర్పభటసహస్రోల్లాసితాసిలతాపంజరవిధృతా అప్యపక్రామతి.

మదజలదుర్దినాంధకారగజఘటితఘనఘటాపరిపాలితా అపి ప్రపలాయతే.

న పరిచయం రక్షతి – నాభిజనమీక్షతే – న రూపమాలోకయతే.

న కులక్రమమనువర్తతే – న శీలం పశ్యతి – న వైదగ్ధ్యం గణయతి.

న శ్రుతమాకర్ణయతి – న ధర్మమనురుధ్యతే – న త్యాగమాద్రియతే.

న విశేషజ్ఞతాం విచారయతి – నాచారం పాలయతి – న సత్యమనుబుధ్యతే.

న లక్షణం ప్రమాణీకరోతి.

గంధర్వనగరలేఖా ఇవ పశ్యత ఏవ నశ్యతి.

ఇది మొత్తం అనువదించనుగాని కొన్ని కొన్ని ముఖ్యమైనవి చూద్దాం :

లక్ష్మీదేవి పాలనముద్రంలో పుట్టింది. ఆమె తోడబుట్టినవాళ్ళలో ఒక్కొక్కరి దగ్గిరనుంచి ఒక్కొక్క లక్షణం గ్రహించింది. చంద్రుని నుంచి వక్రత, ఉచ్చైశ్రవం అనే గుర్రం నుంచి చాంచల్యం, కాలకూటం నుంచి విష గుణం, మదిరం నుంచి మదం, కౌస్తుభం నుంచి వజ్రంవంటి కాఠిన్యం, ఇలా.

డబ్బు పొందడం కష్టం, దాచుకోవడమూ కష్టమే. ఎంత గట్టి త్రాళ్ళతో బంధించినా మదించిన ఏనుగులా త్రెంచుకుని పారిపోతుంది. అయ్యో ఇన్నాళ్లున్నామే అని పరిచయాన్ని కూడా లెక్కించదు, కులం, వంశము చూడదు. రూపం, శీలం గురించి పట్టించుకోదు. ధర్మమూ, త్యాగము, గుణం గమనించదు. బోయవాని వేణుగానానికి వశమైన లేడిలాగా ఇంద్రియాలను వశపరచుకుంటుంది, ఒక మెరుపుతీగలా కనిపిస్తూనే నశిస్తుంది.

ఇవి లక్ష్మీదేవి లక్షణాలు. ఆమె ఉన్నప్పుడు డబ్బున్నవారి లక్షణాలు. ధనంవల్ల నడిమంత్రపు సిరివల్ల మనుషులు బంధుత్వాలు, స్నేహం, ప్రేమ ఎన్నిటిని వదులుకుంటారో ఎన్నెన్ని దారుణాలకు తెగిస్తారో చూస్తున్నాం కదా! ఇది ధనంవల్ల వచ్చే దరిద్రం.

చాటువు

తెలుగున భక్తికి భక్తిభావ తరంగిత అంతరంగానికి మరోపేరు భద్రాచల రామదాసు. విచిత్రం ఏమిటంటే ఆయన ఇంటి పేరు భద్రాచలం కాదు, పేరు రామదాసు కాదు. ఆయన అసలు పేరు కంచెర్ల గోపన్న (1600–1660). రామదాసు రచనలని కీర్తనలంటాం, త్యాగరాజు రచనలను కృతులంటాం, అన్నమయ్యవి సంకీర్తనలంటాం, క్షేత్రయ్యవి పదాలంటాం. పాటలో భక్తికి ఎక్కువ, సంగీతానికి తక్కువ ప్రాధాన్యం ఇస్తే అది కీర్తన, సంగీతానికి ఎక్కువ ప్రాధాన్యమైతే కృతి, సామూహికంగా పాడడానికి యోగ్యమైనది సంకీర్తన, శృంగార ప్రదానమై నాయికా నాయకులవర్ణన పదం అని స్థూలంగా వింగడించవచ్చు. అలా భక్తిని రంగరించిన కీర్తనలకు ఆద్యుడు రామదాసు. అనన్య భక్తికి ఉదాహరణమైనవాడు. అనన్యభక్తి అంటే ఒకే ఒక దేవుడిని నమ్మి అతనియందే భక్తి కలిగియుండుట. నారద భక్తిసూత్రాలలో 'అనన్యమమతా విష్ణౌ మమతా ప్రేమసంగతా' అంటారు నారదులు. ఈ రామదాసుకి భద్రాచలంలో రాముడు తప్ప ఇంకొక కోవెలలో రాముడు కూడా అక్కరలేదు. అంతటి భక్తుడు, దాస్య భక్తి అంటే తను సేవకుడు అతను స్వామి. అందుకే పేరు గోవన్న అయినా లోకం అతన్ని రామదాసుగా గుర్తించింది.

స్వామి ఆలయ పునరుద్ధరణకు ప్రభుత్వధనం ఉపయోగించినందుకు ఈయనకు 12 సంవత్సరములు కఠిన కారాగార శిక్ష పడింది. కొరడా దెబ్బలు తిన్నాడు. ఇంకా రాముడు వినిపించుకోలేదు.

కలికితురాయిని మెలుపుగ చేయిస్తి రామచంద్ర నువ్వు కులుకుతూ తిరిగెదవు ఎవడబ్బ సొమ్మని రామచంద్ర!

అని భక్త్యావేశంలో స్వామిని దూషించి తరువాత

అబ్బ తిట్టితినని ఆయాసపడవద్దు రామచంద్ర ఈ దెబ్బలకోర్వక అబ్బ తిట్టితినయ్య రామచంద్ర

అని మొరపెట్టుకున్నాడు.

ఆయన వ్రాసినదే దాశరథీ శతకం, నేను ఆంగ్లం చేశాను, తెలుగు యూనివర్సిటీ ప్రచురణ.

అందులో ఆర్ద్రమైన, భక్తిభావోద్వేగ రసభరితమైన పద్యాలెన్నో ఉన్నాయి. అందులో ఒకటి:

ముప్పున కాలకింకరులు ముంగిట నిల్చినవేళ, రోగముల్ గొప్పరమైనచో గఫము కుత్తుకనిండినవేళ, బాంధవుల్ గప్పినవేళ, మీ నామస్మరణ గల్గునొ గల్గదొ నాటికిపుడే తప్పక జేతు మీ భజన దాశరథీ! కరుణాపయోనిధీ!

మనం తరచూ వింటూ ఉంటాం. ఎవరినేనా భగవద్గీతో, భాగవతమో, రామాయణమో చదివేరా అంటే ఇప్పటి నించి ఎందుకండీ, ఇంకా టైం ఉంది వాటన్నిటికీ అంటారు. వాళ్లకి సమాధానం ఈ పద్యం.

యమభటులు వచ్చి ఎదురుగా నించున్నప్పుడు, రోగాలు ఎక్కువై ఖఫంతో గొంతు పూడుకుపోయినపుడు, ఇంక పోతాడేమో అని బంధువులు చుట్టూ వచ్చి ఉన్నప్పుడు, అప్పుడు చెయ్యగలనో లేదో మీ నామస్మరణ, అందుకని ఇప్పుడే మీ పేరు స్మరిస్తున్నాను అంటాడు రామదాసు. తెలుగులో సరళంగా లలితమైన భక్తి చాటువులు వ్రాసినవాళ్లలో అగ్రగణ్యుడు రామదాసు.

ఏ పనయినా తరువాత చేద్దామని వాయిదా వెయ్యకూడదు. అందుకే కబీర్ – ***కల్ కరై సో ఆజ్ కర్ , ఆజ్ కరై సో అబ్ ..*** అంటాడు.

'రేపు చేద్దానుకున్నది ఇవాళ చెయ్యి, ఇవాళ చేద్దామనుకున్నది ఇప్పుడే చెయ్యి' అని.

ఆచార్య పప్ప వేణుగోపాల రావు - చెన్నై. e-mail: pappuvenu@gmail.com



కాశీలోని కేదారేశ్వర మందిరం

కాశీలో తమిళులు

– కిల్లాడ సత్యనారాయణ

అది మొఘలుల పాలన. విగ్రహాల విధ్వంసం విశృంఖలంగా జరుగుతుంది. మందిరాల కూల్చివేత సాధారణమైపోయింది. యాత్రికులపై పన్నువేటు బాధాకరమైపోయింది. దేవాలయాల నగరం కాశీకి వెళ్లాలంటే ప్రజలు గజగజా వణుకుతున్నారు. కాశీ నుండి ప్రజలు పలాయనం చెందుతున్నారు.

అప్పుడొక మద్రాసీ కాశీకి బయల్దేరాడు. పేరు కుమార గురుపరర్. ఊరు తిరునల్వేలి దగ్గర శ్రీవైకుంఠం. అతను పుట్టిన అయిదేళ్ల వరకూ మాట్లాడలేదట. తర్వాత భగవన్నామ స్మరణతో మాట్లాడాడట. మురుగ దేవుడి మీద పాటలు పాడాడట. ఆయన గురువు స్వామీ మసిల్మని దేశికార్. అక్కడ దీక్ష పొందాడు. గురువు సలహా మేరకు కాశీ చేరాడు. దారాషికో బాదుషా గురించి తెలుసుకున్నాడు. సింహం మీద ఢిల్లీకి బయల్దేరాడు. ఆ సింహాన్ని కుమారస్వామి మచ్చిక చేశారట.

అలా బయల్దేరేముందు 'సకల కళావల్లి మాలై' గీతాలను కూర్చాడు. తన వాక్కుతో బాదుషా ప్రభావితం అయ్యేట్లు అనుగ్రహించమని సరస్వతీ దేవిని కోరుతూ రాశాడు.

ఫకీరు వచ్చాడని దారాషికోకు చెప్పారు.

హిందీ, ఉర్దూ రానందుకు సిబ్బంది అతణ్ని హేళన చేశారు. బాదుషా కుమారస్వామిని విందుకు పిలిచారట. స్వామిని పరీక్షించాలని బాదుషా భోజనంలో రకరకాల మాంసాలు పెట్టించారట. కుమారస్వామి చుట్టుప్రక్కల చూస్తున్నాడట.

"ఏం కావాలి?" బాదుషా అడిగారు.

"పంది మాంసం" బదులిచ్చారు కుమారస్వామి.

"దాన్ని మా మతం అంగీకరించదు" కొంచెం కోపంగా అన్నారు బాదుషా.

"మా మతం ఏ మాంసాన్నీ అంగీకరించదు" అన్నారు స్వామి.

"భోజనంలో మాంసం తప్ప ఇంకేమీ ఉండవు. ఇవి తినాల్సిందే" అన్నారు బాదుషా.

కుమారస్వామి తన మంత్రశక్తితో మాంసాన్ని పువ్వులుగా మార్చారట. బాదుషా ఆశ్చర్యపోయారట. తన మాటల మాధుర్యంతో బాదుషాను ఆకట్టుకున్నారు. స్వామి తన బసకు వెళ్ళిపోయారు. బాదుషా అతన్ని రెండవ రోజు పిలిపించారు.

"మీ వల్ల మాకు చాలా ఆనందం కలిగింది. మీరు ఎందుకొచ్చారో చెప్పలేదు" అనడిగారు బాదుషా.

"నేను కాశీలో ఉండి, ఇక్కడకు వచ్చే దక్షిణాది యాత్రికులకు అన్నదానం ఏర్పాటు చేసి, ఆశ్రయం ఇవ్వాలనుకుంటున్నాను. అందుకు స్థలాన్ని భిక్షగా కోరడానికి వచ్చాన"న్నారు.

అప్పుడు కాశీ దారాషికో నియంత్రణలో ఉండేది. ఆయన వెంటనే స్వామి కోరికను అంగీకరిస్తూ ఫర్మాను జారీ చేశాడు. కుమారస్వామి కాశీలో కేదారేశ్వర మందిరాన్ని పునర్నిర్మించాడు. దగ్గరలో ఒక మఠం కట్టించాడు. ఈ మఠంలో కుమారస్వామి క్రీ.శ. 1658 నుండి 1688 వరకూ ఉన్నారు.

'కాశీ మహాత్మ్యాన్ని చెబుతూ స్వామి' కాశీ కలంబకం పాటలు కూర్చారు. ఆయన రచనల్లో 'మదురై కలంబకం', 'మీనాక్షీ అమ్మయ్ ఈరట్టై, మీనాక్షీ అమ్మయ్ కురం', మనీ మలై' ప్రసిద్ధమైనవి.

కుమారస్వామి మంచి వక్త. కంబ రామాయణంపై ఆయన ప్రవచనం గోస్వామి తులసీదాసును ప్రేరేపించినదని చెబుతారు. తులసీదాసు 'రామచరిత మానస్' రాయడంలో ఈ ప్రభావం కూడా కొంత ఉందని అంటారు. అంతేకాదు.



కుమారగురుపరార్

వీరిద్దరూ కాశీలో ఒకర్నొకరు చాలాసార్లు కలుసుకున్నారని కూడా చెబుతారు.

కుమారస్వామి మఠంలో అన్నదానం ప్రారంభించారు. వసతి కల్పించారు. దక్షిణ భారతం నుండి, ముఖ్యంగా తమిళనాడు నుండి భక్తులు ఎక్కువగా వచ్చారు. కొందరు ఇక్కడ స్థిరపడ్డారు. కాశీలోని కేదారేశ్వర మందిరాన్ని ఇప్పుడు కుమారస్వామి మఠమే చూసుకుంటుంది. ఈ మందిరంలో అన్ని పూజలూ దక్షిణ సాంప్రదాయంలో జరుగుతాయి. కుమారస్వామి వారసుడు తమిళనాడులోని కుంభకోణంవద్ద కావేరీ తీరంలో ఈ మఠం శాఖను స్థాపించారు. తమిళ ప్రాంతంలో దీనిని కాశీ మఠంగా పిలుస్తారు. దీని మఠాధిపతులను కాశీవాసి స్వామిగల్ అని పిలుస్తారు.

ఈ రెండు మఠాలు కలిసి కేదారేశ్వర మందిర ప్రాంగణంలో తిరువళ్ళువార్ విగ్రహాన్ని స్థాపించాయి.

క్రీ.శ. 2010లో భారత ప్రభుత్వం కుమార గురుపరార్ చిత్రంతో స్టాంపును విడుదల చేసింది.

రెండు శతాబ్దాల క్రితం ముత్తుస్వామి దీక్షితార్ కాశీలో చదువుకోవడానికి వచ్చారు. క్రీ.శ. 1750–1850ల మధ్య దక్షిణభారత సంగీత త్రిమూర్తులు ముత్తుస్వామి దీక్షితార్, త్యాగరాజు, శ్యామశాస్త్రి. ముత్తుస్వామి తన తండ్రివద్ద సంగీతం నేర్చుకున్నారు. ఒక జమీందారు కోరిక మీద మద్రాసు వెళ్లారు. అక్కడ పాశ్చాత్య సంగీతంతో పరిచయం ఏర్పడింది. మద్రాసులో కాశీ నుండి వచ్చిన స్వామి చిదంబరనాదయోగిని కలిశారు. ఆయన ముత్తుస్వామిని కాశీ తీసుకువెళ్తానన్నారు. అక్కడ సంస్కృతం, ఉపనిషత్తులు నేర్పిస్తానన్నారు. ఈ గురువుతో ముత్తుస్వామి కొన్ని సంవత్సరాలు కాశీలో గడిపారు. వేదాలు, వేదాంతాలు నేర్చుకున్నారు. గురువు వద్ద దీక్ష పొందారు. దీక్షితార్ అయ్యారు. కాశీలో యోగిన్ ఆయనకు దేవీ పూజ, యోగా, ఉపనిషత్తులు నేర్పారు. ఒకరోజు వాళ్ళు హనుమాన్ ఘాట్‌వద్ద గంగలో స్నానానికి వెళ్లారు. అప్పుడు యోగిన్ ముత్తుస్వామితో ఇలా అన్నారు.

"మీరు మూడు, నాలుగు మెట్లు కిందకు దిగండి. గంగలో చూడండి. మీకు ఏం దొరికిందో చెప్పండి" అన్నారు. దీక్షితార్ అలాగే చేశారు. అతనికి వీణ దొరికింది. దానిపై 'రామ' అని రాసి ఉంది. అది యోగిన్‌కు చూపించాడు.

"మిమ్మల్ని గంగామాత ఆశీర్వదించింది. మీరు గొప్ప వీణా వాయిద్యకారుడు కావాలని" అన్నారు యోగిన్.

ఆయన గొప్ప వీణావాద్యకారుడిగా ఖ్యాతి పొందారు. కాశీలో ఆయన ఆధ్యాత్మిక కవిగా, సంగీతకారుడుగా, వేదాంతిగా అభివృద్ధి చెందారు. హిందుస్తానీ, కర్ణాటక సంగీతాలను మేళవించారు. దానికి వేద వేదాంతాలను కూడా కలిపి అందించారు. కాశీ సంగీత వాతావరణం ముఖ్యంగా ద్రుపద్ సంగీతం, తులసీ రామాయణ పాటలు ముత్తుస్వామి మీద ప్రభావం చూపాయి. ఆయన కూర్చిన 'జంబూద్వీపే', 'గంగే మామ్ పాహి' మొదలైనవి ఇందుకు ఉదాహరణలు. కాశీలో ఆరేళ్లు గడిపారు. ముత్తుస్వామి శ్రీచక్రలింగేశ్వర మందిరం నిర్మించారు. ఇది కాశీలోని హనుమాన్ ఘాట్‌లో ఉంది. సంగీతకారులు ఈ మందిరానికి వెళ్తారు. కాశీ – తమిళ సంగమంలో ఇళయరాజాగారు ఈ గుడికి వెళ్లారు. గురువుగారి జీవసమాధి తర్వాత ముత్తుస్వామి తిరువారూర్ తిరిగి వెళ్ళారు. క్రీ.శ. 1835లో దీక్షితార్ ఎత్తాయపురంలో సమాధి పొందారు. సరిగ్గా 47 సంవత్సరాల తర్వాత అక్కడే తమిళ మహాకవి సుబ్రహ్మణ్య భారతి జన్మించారు. ఆయన కూడా సంస్కృత గ్రంథాల అధ్యయనం కోసం కాశీ వెళ్లారు. దీక్షితార్‌ను, వీరి గురువు చిదంబరనాథ యోగిని శ్రీచక్రలింగేశ్వర మందిరంలో శ్రీయంత్రంతో ఉన్న శివలింగాలలో ఆరాధిస్తున్నారు. ఇక్కడ శ్రీవిద్య ఆరాధనను నిర్వహిస్తున్న కేదార్‌గారిని నేను కలిశాను. వీరి కుటుంబం గత 80 సంవత్సరాల నుండి కాశీలో ఉంటుంది. అక్కడ చిదంబరనాథయోగి మఠం ఉంది.


ముత్తుస్వామి దీక్షితార్, త్యాగరాజు, శ్యామశాస్త్రి

సుబ్రహ్మణ్య భారతి:

నేనూ వెంకటరామన్ ఘనాపాటి కలిసి సుబ్రహ్మణ్య భారతి ఉన్న ఇంటికి వెళ్ళాం. అక్కడ భారతి మేనల్లుడు ప్రొ. కె.వి. కృష్ణన్‌ను కలిశాం. ఆయనకు 87 సంవత్సరాలు. భారతి గురించి చాలా భావుకతతో ఆయన నాతో మాట్లాడారు. ఆయన జ్ఞాపకశక్తికి నేను ఆశ్చర్యపోయాను. ఆయన రాసిన 'రాష్ట్ర కా అమూల్య ధరోహర్ మహాకవి సుబ్రహ్మణ్య భారతి' పుస్తకాన్ని నాకు ఇచ్చారు. సుబ్రహ్మణ్య భారతి తమిళనాడులోని ఎట్టెపురంలో 1882లో జన్మించారు. బాల్యం నుండి కవితలు రాసేవారు. పాడేవారు. ఇతని కవితలు విని ఎట్టెపురం రాజావారు 'భారతి 'అనే బిరుదు ఇచ్చారు. 1897లో వివాహం జరిగింది. భారతి మేనత్త అతన్ని 1898లో కాశీకి తీసుకొచ్చారు. ఇక్కడ మేనత్త ఇల్లు 'శివమట్'లో ఉండేవారు. అక్కడ జయనారాయన్ కళాశాలలో భారతిని 9వ తరగతిలో చేర్పించారు. అక్కడ హిందీ, సంస్కృతం నేర్చుకున్నారు.


కాశీలో అనీబిసెంట్ స్థాపించిన 'థియోసోఫికల్ సొసైటీ'కి భారతి ఎక్కువగా వెళ్ళేవారు. అక్కడ లాల్, బాల్, పాల్ (లాలా లజపతిరాయ్, బాలగంగాధర్ తిలక్, బిపిన్ చంద్రపాల్)ను కలిశారు. ఈ ముగ్గురిని అనుసరించి తన వేషధారణ మార్చుకున్నారు. తిలక్ అంటే అతనికి ఎనలేని అభిమానం ఏర్పడింది. ఎన్నో దేశభక్తి గీతాలు రాశారు.

అనిబిసెంట్ ద్వారా మహామాన మదన్‌మోహన్ మాలవ్యతో పరిచయం ఏర్పడింది. కాశీ హిందూ విశ్వవిద్యాలయ భవన నిర్మాణంలో విరాళాలు సేకరించడంలో ఆయనకు సహకరించారు.

సిస్టర్ నివేదితతో కూడా అతనికి పరిచయం ఏర్పడింది. ఆమె కాశీ వచ్చినప్పుడు శ్రీ శివప్రసాదుగారి ఇంట్లో ఉండేవారు. ఆమె ప్రభావంతో భారతి స్త్రీ స్వతంత్రత, సమాన అధికారం మీద కవితలు రాశారు. 1902లో ఎట్టెపురం రాజావారు భారతిని కాశీ నుండి తీసుకువెళ్ళారు. తమ ఆస్థాన కవిగా నియమించారు. 1905లో బనారస్‌లో జరిగిన 'అఖిల భారత కాంగ్రెస్ మహాసభ'లో భారతి పాల్గొన్నారు. భారతి రాష్ట్ర కవిగా, దేశభక్తుడుగా ఎదగడంలో కాశీ భూమిక ఎక్కువ. సుబ్రహ్మణ్య భారతి తన 'భారతదేశం' కవితలో ఇలా ఆశాభావాన్ని వ్యక్తం చేస్తారు.

కాశీనగర పులవర్ పేసుమ్ ఉరై ధాన్
కంచియిల్ కెత్పాధర్కొర్ కరువి నేయ్పోమ్

(కాశీ పండితులు ఏమి మాట్లాడితే, కంచి ప్రజలు దాన్ని నేరుగా వినగలిగే యంత్రాన్ని తయారు చేయాలి). దీన్ని 1900లో చదివారు.


సుబ్రహ్మణ్య భారతి

2021లో అతని 100వ వర్ధంతి సందర్భంగా భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీగారు భారతి పేరు మీదుగా బనారస్ హిందూ యూనివర్సిటీలో తమిళనాడు కోసం ఒక శాఖను ఏర్పాటు చేశారు. 2022లో కాశీలో జరిగిన కాశీ – తమిళ సంగమం సందర్భంగా కాశీలో భారతి నివసించిన ఇల్లును మెమోరియల్‌గా ప్రకటించారు.

ఈ ఇంటికి దగ్గరలో కంచి కామకోటి మఠం ఉంది. దీనిలో 20 గదుల వసతి సౌకర్యం ఉంది. హనుమాన్ ఘాట్, సోనార్పురా ప్రాంతంలో ఎక్కువగా తమిళులు ఉంటారు. చెట్టియార్ సమాజం కాశీ విశ్వనాథుడికి రెండు శతాబ్దాలుగా సేవలు చేస్తుంది. వీరు తమిళనాడులోని శివగంగ, పుదుకొట్టై జిల్లాల్లో ప్రముఖ వ్యాపార కుటుంబాలు. వీరు దేశ, విదేశాల్లో గుడులు కట్టించారు. కాశీలో విశాలాక్షి గుడి మరమ్మత్తు చేయించారు. ఆ గుడి నిర్వహణ కూడా చూస్తున్నారు. విశ్వనాథునికి వెండి నాగాభరణం చేయించారు. క్రీ.శ. 1820 నుండి విశ్వనాథునికి ప్రతిరోజూ మూడు హారతులను నట్టుక్కొట్టై చెట్టియార్ మఠం ఇస్తుంది. మంగళ హారతి, భోగ్ హారతి, శృంగార హారతులకు కావాల్సిన సామగ్రిని నుండి ఉత్సవంగా ఈ మఠం నుండి


లాల్, బాల్, పాల్

తీసుకువెళ్తారు. ఆ సామగ్రితోనే స్వామికి హారతి యిస్తారు. గత రెండు శతబ్దాలుగా ఈ హారతిని వీరు నిరంతరాయంగా చేస్తున్నారు. గొదౌలియాకు దగ్గరలో వీరి మఠం (కాశీ నట్టుకొట్టైనగర చత్రం) ఉంది. దానిలో 60 గదులతో వసతి, నగరేశ్వర మందిరం, భోజనాలయం ఉన్నాయి.

ఈ మఠానికి కేంద్రమంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్‌గారు వెళ్లారు. ఆమె హారతి సామాగ్రిని తీసుకొని విశ్వనాథ మందిరంవరకూ నడిచారు. ఆ తర్వాత నేను ఈ మఠానికి వెళ్ళాను. అక్కడ నిర్వాహకులు నాకు అన్నీ వివరించారు. సుందరర్ స్వామిగల్ 1831లో తిరునల్వేలి వద్ద జన్మించారు. అతను మంత్ర యోగశక్తులలో నిష్ణాతుడు. బాల్యంలోనే ఆయన కాశీ వచ్చారు. అతను మణికర్ణికాఘాట్ వద్ద గంగానది మీద నడవడం చాలామంది చూశారట. అలా నడిచివెళ్లి జలసమాధి పొందిన యోగి శ్రీగణపతిస్వామిని గంగ మధ్యలో కలిసేవారట. వీరిద్దరి విగ్రహాలను మణికర్ణికా ఘాట్‌లో పెట్టారు. ప్రస్తుతం అవి లేవు. చెట్టియార్ సమాజం వీరి శిష్యులు.

క్రీ.శ. 15వ శతాబ్దిలో పాండ్యరాజు హరికేసరి కాశీ నుండి శివలింగాన్ని తీసుకెళ్తున్నారట. మార్గంలో బిల్వచెట్టు కింద రాజుగారు విశ్రాంతి తీసుకున్నారు. బిల్వచెట్టు శివుడికి ప్రియమైనది. శివలింగాన్ని తీసుకొస్తున్న ఎద్దులు ముందుకు వెళ్ళకుండా మొరాయించాయి. అప్పుడు రాజుగారు అక్కడే శివలింగాన్ని ప్రతిష్ఠించారు. ఆ ప్రాంతం ఇప్పటి శివకాశీ పట్టణం. పాండ్యరాజు అధివీర్ రాం పాండ్యన్ క్రీ శ. 19వ శతాబ్దిలో కాశీ నుండి తిరిగొచ్చి, శివాలయాన్ని నిర్మించాడు. ఆ ప్రాంతం 'టెన్ కాశీ'గా పిలువబడుతుంది. కంచి చీరలు – బెనారస్ చీరలు, కాశీ కిచడి – తమిళ పొంగల్, కాశీ శహనాయి – తమిళ నాదస్వరం మధ్య సంబంధాలు లేకున్నా, పోలికలున్నాయి.

కాశీలో తమిళ జనాభా క్రమంగా తగ్గింది. ప్రస్తుతం 1200 మందివరకూ ఉన్నారు. కాశీలో హనుమాన్ ఘాట్ ప్రాంతంలో తమిళులు ఎక్కువగా ఉంటున్నారు.

"కాశీ – తమిళ సంగమం ఒక వినూత్న ఒరవడి. రెండు గొప్ప సంస్కృతుల ఆదాన ప్రదానానికి ఇది తోడ్పడుతుంది." అన్నారు వెంకటరామన్ ఘనాపాటి. వీరి కుటుంబం అయిదుతరాల నుండి ఇక్కడ స్థిరపడ్డారు. నూట ఇరవై ఏళ్ల క్రితం కాలి నడకన తమిళనాడు నుండి బయల్దేరిన 200 కుటుంబాలు ఇక్కడ స్థిరపడ్డాయని వెంకటరామన్ చెప్పారు. ఈయన కాశీ విశ్వనాథ మందిరం ట్రస్టీ. ఆయన నన్ను వాళ్ళింటికి తీసుకెళ్లారు. కింద సత్రం, పైన ఇల్లు. జనంతో నందడిగా ఉంది. ఆయన కృష్ణయజుర్వేద పండితులు. ఆయన నాకు వాళ్ళ తాత, ముత్తాతల ఫోటోలు చూపించారు.

సుబ్రహ్మణ్యశాస్త్రి ఘనపాటిగారు కుంభకోణం నుండి 150 సం.ల క్రితం కాలినడకన కాశీ వచ్చారు. వీరు మణికర్ణికా క్షేత్రంలో ఉండేవారు. వీరి రెండవ కుమారుడు లక్ష్మణశాస్త్రి ద్రవిడ్ 1874లో కాశీలో జన్మించారు. వీరు ఋగ్వేదంలో నిష్ణాతులు. వేదాంతం, సాంఖ్యశాస్త్రం అధ్యయనం చేసారు. వీరి విద్వత్తుకు మెచ్చి కాశీనరేష్ 11 రూపాయల పురస్కార వేతనం ఇచ్చేవారు. వీరు రణవీర్ సంస్కృత పాఠశాలలో బోధించేవారు. కలకత్తా విశ్వవిద్యాలయంలో బోధించారు.

రాజరాజేశ్వరశాస్త్రి ద్రవిడ్, వీరేశ్వర్ ద్రవిడ్, విశ్వేశ్వర్ ద్రవిడ్, గనేశ్వర్ శాస్త్రి ద్రవిడ్, చంద్రశేఖర్ ద్రవిడ్‌వంటి మేటి వేదపండితులు కాశీలో నివసిస్తున్నారు. వీరి ఆధ్యాత్మిక సంపదతో కాశీకి తోడ్పడుతున్నారు.

చంద్రశేఖర్ ద్రవిడ్‌గారు నన్ను కలిశారు. వైదిక అధ్యయనం గురించి వివరించారు. కాశీలో ఉంటున్న తమిళపండితుల గురించి చెప్పారు. కంచికామకోటి మఠంలో జరుగుతున్న వైదిక కార్యక్రమానికి నన్ను ఆహ్వానించారు.

ప్రముఖ సంగీత విద్వాంసులు కృష్ణమూర్తి ఘనాపాడిగల్ వారి కుటుంబం కాశీలో గత వందేళ్లుగా స్థిరపడ్డారు. గౌరవనీయులైన ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీగారు నవంబర్ 19, 2022న కాశీ – తమిళ సంగమం ప్రారంభించారు. ఇది ఈ రెండు సంస్కృతుల మధ్యనే కాదు, దక్షిణ – ఉత్తర భారత సంస్కృతుల మధ్య కూడా ఒక కొత్త అధ్యాయానికి తెరతీసింది.

కిల్లాడ సత్యనారాయణ - వారణాసి. ఫోన్: 833 398 7838.

క్రీడాభిరామంలో సాంఘిక చరిత్ర

– డి. ఎస్.ఎమ్.ఎస్. రావు

జీవనాధారం కోసం ప్రజలు తమ తమ కులవృత్తుల ద్వారా జీవితాన్ని గడుపుకుంటూ వచ్చారు కానీ కులవృత్తి లేనివాళ్ళు కూలీలుగా ఏ పనినైనాసరే సులువుగా చేయగల సమర్థులు ఉన్నారు. సమకాలిక ప్రజల జీవన విధానాన్ని వివరంగా తెలిపే కావ్యంగా క్రీడాభిరామానికొక ప్రత్యేక స్థానమున్నది. ప్రజలకు సన్నిహితంగా, వారి సమస్యలకు సన్నిహితంగా రచింపబడ్డ కావ్యాలనే ఆధునికులు ఆదరించడం జరుగుతుంది. జన జీవిత మన్నప్పుడు సామాన్యులైన ప్రజల జీవితమనే అర్థం. అంతేగాని రాజులూ, మంత్రులూ, వారి అంతఃపురాలూ, గణికా జనం అని అర్థం కాదు. పై అంతస్తులోని వారిని గురించి వ్రాసిన వ్రాతలు కొల్లలుగా ఉన్నాయి. కానీ మధ్యతరగతి ప్రజలను వారి జీవన విధానాన్ని అద్దంపట్టే రచనగా క్రీడాభిరామ కావ్యాన్ని చూడడం అవసరం. దీనిని పదే-పదే చర్చించి పరిశీలకులకు ఆలోచన అవగాహన ఏర్పడుతుంది.

వివిధ భాషలలో పురాణాలుకన్నా సంస్కృత పురాణ గాథానువాదాలు కుప్పలు కుప్పలుగా వచ్చి పడుతున్న కాలంలో ఆధునిక యుగ లక్షణాన్ని సంలీనం చేసుకొని ప్రత్యక్షమైంది ఈ వింతకావ్యం. ఎవరు వ్రాశారన్న మీమాంస ఇక్కడ అనవసరం. ఎవరు వ్రాసినా అతడు జీవితాన్ని అవగాహన చేసికొన్నవాడనేది మాత్రం నిజం. జీవితంలోని ఇరుపక్షాలనూ సమగ్రంగా చూచినవాడు మాత్రం అయి ఉండాలి. 14వ శతాబ్దిలోని ఓరుగల్లు పట్టణాన్ని. అందులోని వివిధ వర్గాల ప్రజల విశ్వాసాలను, ఆచారాలను, దురాచారాలను, భోగాలను, క్రీడావినోదాలను వాస్తవికతాబద్ధంగా పరిశీలించినవాడై ఉండాలి. ఈ కావ్యంలో కథకు ఎటువంటి ప్రాధాన్యమూ లేదు. మంచనశర్మ టిట్టభశెట్టి అనే ఇరువురు ఓరుగల్లు నగరాన్ని చూస్తూ ఒక్కొక్క సన్నివేశంలో వారి కెదురైన వేళ్యలను, వ్యభిచారిణులను వర్ణిస్తూ పోవడం జరుగుతుంది. ఇంతకంటే కథ ఏమీ లేదు. అంటే కవి కథ మీద మనసు పెట్ట లేదు; మనసు పెట్టింది ప్రజల జీవనాన్ని వర్ణించడం మీద అని తేలుతుంది. అంతేకాక పని విధానం మీద అనుభవంతో అర్థమవుతుంది.

కథ ఏకశిలా పురద్వార ప్రదేశంలో చలికాలపు ఒకనాటి ప్రొద్దున్నే ప్రారంభమవుతుంది. ఆనాటి సాయంకాలానికి జార దంపతులు చంద్రుడికి సమర్చన చేయడంతో అంతమవుతుంది. అంటే ఒక విధంగా ప్రతిరోజూ జరిగే ప్రజా కార్యక్రమం – అందులోనూ కొన్ని తరగతులవారి కార్యక్రమం చెప్పబడిందన్నమాట. ఆ కొన్ని తరగతుల్లోనూ విటవర్గం ప్రాధాన్యం వహిస్తుంది. కులమేదైనా తత్త్వమే ప్రధానం కనుక యిక్కడ మంచనశర్మ అయినా, టిట్టిభశెట్టి అయినా, కామమంజరయినా, కుమ్మరి, మేదర, కాపు, కరణ, కర్ణాట. ములికినాటి తెలికతోటి – ఎవరైనా ఒకేవర్గం. అందరిదీ ఒకటే మనస్తత్వం, చాతుర్వర్ణ్య వ్యవస్థ ఉన్నట్లు పద్యాల్లో ఎన్నో దాఖలాలు ఉన్నాయి. తక్కువ జాతుల వాళ్లు వేర్వేరు వాడలలో నివసించేవారు. అటువంటి వాడలన్నీ సాధారణంగా ఊరికి వెలుపల 'వెలిపాళెం'లో ఉండేవి. వెలిపాళెము కోట అగడ్తను చుట్టి ఉంటుంది. ఇప్పటికీ అట్టడుగున ఉన్నవారి నివాసాలు కాలవగట్ల పైనేగదా! ఈ 'వెలిపాళెమును బాహ్యకటకమనీ. వెలివాడ అనీ అంటారు. ఓరుగల్లులో అగడ్తకు ఒకవైపు మేదరవాడ, మరొకప్రక్క చండాలవాటికా ఉన్నాయి. వారికి ఆ అగడ్తలోని పాచిపట్టిన నీరే స్నానానికైనా, పానానికైనా. మామూలు స్నానానికేకాక, ఋతుస్నానానికి కూడా అదే ఆదరువు.

కనుక వారి ఆరోగ్య పారిశుద్ధ్యాల సంగతి పాఠకుడు సులభంగా గ్రహించగలడు.

నగరంలోకి పోయే హట్ట మార్గానికి ఉత్తరంగా మోహరివాడ ఉంటుంది. అందులో భటులు నివసిస్తారు. వాళ్లు శత్రువుల బారినుండి నగర బాహ్య ప్రదేశాన్ని రక్షిస్తూ ఉంటారు. ఈ వెలివాడలలో నివసించేవారికందరికి అక్కడే మైల సంతలుండేవి. వారికి కావలసిన మత్స్యమాంసాదులు ఆ మైలసంతల్లో లభిస్తాయి. పెద్దవాళ్లు, నాగరకులు రాకూడని ప్రదేశాలలో ఉండేవి కనుక వాటిని మైలసంతలనేవారేమో లేకపోతే ఉన్నత జాతులవారు తాకకూడని వస్తువులు అమ్ముతారుగనుక అలా అనేవారేమో? ఆ వెలిపాళెం మధ్యలో 'హాలికవాటి' ఉంది. అందులో రైతులు నివసించేవారు. ఇక బ్రాహ్మణులు, క్షత్రియులు, వైశ్యులు, వేశ్యలు 'లోపాళెం'లో నివసించేవారు. అవసరం కాని జాతుల్ని, వస్తువుల్ని అవతలికి నెట్టి అవసరం ఉన్న వేశ్యజాతిని, తదితర వస్తువుల్ని తమ కౌగిలిలో అంటే 'లోపాళెం'లో ఉంచుకున్నారన్న మాట. బ్రాహ్మణులకు వేశ్యాసంపర్కం సర్వసామాన్యమట. అది వారికి దోషంగా కనబడలేదు. తుచ్ఛమైన కామలోలుపతలో ఎటువంటి తప్పూ లేదటగాని, భోజనాదికాలు వచ్చేటప్పటికి తప్పుకునేవారు. అది భయమో లేక తమ ఇండ్ల మీద భక్తో చెప్పలేంగాని, బ్రాహ్మణులు ఎంత పొద్దు పోయినా భోజనానికి ఇండ్లకు వెళ్లేవారట. పరాయి ఊరి బ్రాహ్మణులయితే బ్రాహ్మణ విధవలు పెట్టిన పూటకూటి ఇండ్లకే పోయేవారు. 'తిలలకు తిలలే, బియ్యానికి బియ్యమే' అన్నట్లు వ్యభిచరణం వేరు, ఆచార వేరు అన్నట్లు ఉండేది. ఆ విప్రోత్తములకు ఆచారాలన్నీ తుచ తప్పకుండా పాటిస్తారు. సొమ్ము ఒకడిది, షోకు మరొకడిది అన్నట్లు బ్రాహ్మణుల అనుభవానికి డబ్బు దోచిపెట్టేవాడు మాత్రం సెట్టిగారు. ఓరుగల్లులో పెట్టిన మంచన శర్మగారి ఖర్చంతా టిట్టిభసెట్టిగారిదేగదా!

ఆ కాలపువారికి శకునాలపైన విపరీతమైన విశ్వాసం. గుడ్లగూబ తూర్పుదిక్కున కూయడం ప్రారంభిస్తే శోధన కార్యాలు ఫలిస్తాయట. పక్షంలో నెమలికూయడం, కోడి, ఏట్రింత, కొంకనక్క, నెమలి దర్శనం కావడం కూడా శుభశకునాలే. గోధూళి లగ్నంలో పురప్రవేశం మంచిదట. ఉషఃకాలం సర్వప్రయోజనారంభాలకూ ప్రశస్తమైందిగా భావించారు. ఇంకా–

గార్గ్యసిద్ధాంతమత ముషఃకాలకలన,
శకున మానుకోట యది బృహస్పతి మతంబు
వ్యాస మతము మనఃప్రసాదాతిశయము,
విప్రజనవాక్య మరయంగ విష్ణుమతము. *క్రీడా–66.*

ఆనిశుభశకునాలేమో చెప్పబడ్డాయి. పూటకూటి యిండ్లు ఆహార విహారాలకు రెంటికీ సంగమ స్థానాలు. 'పూటవంటకమువెట్టుబాడబులవాడ' ఆ కాలంలో ప్రసిద్ధమైంది. దాన్నే 'అక్కలవాడ' అనీ అంటారు. లక్ష్మణ వజల యింటిలో ఒక రూకకు ఈ భోజనం పెట్టేవారట.

కప్పురభోగివంటకము, కమ్మని గోధుమపిండి వంటయున్,
గుప్పెడు పంచదారయను, క్రొత్తగఁ గాచినయాలనే, పెన
ర్పప్పును, గొమ్మునల్లనఁటిపండ్లును, నాలుగునై దునంజులున్
లప్పలతోడ గ్రోంబెరుఁగు లక్ష్మణవజ్ఝలయింట రూకకున్ – *క్రీడా–168.*

ఇది ఒక విధంగా నాగరకుల భోజనం. ఇక శీతకాలంలో పల్లెటూరి భోజన సౌష్ఠవంయిలా ఉండేది.

శీతకాలంబు కడి మాడ సేయఁ గుడుచు
భాగ్యవంతుండు తేపాడి పల్లెపట్లఁ
క్రొత్త యొరెంబు నిగురావకూరతోడఁ
బిచ్చిలం బైననేతితోఁ బెరుగుతోడ – *క్రీడా–58*

ఇది అనాగరకుల భోజనమే అయినా ధనవంతుల దని మాత్రం మరచిపోకూడదు. ఈ పదార్థ సంచయం వెలిపాళెంలో ఉండేవాళ్ళకు లభిస్తాయని చెప్పలేం. వాళ్ళ విషయం ప్రత్యేకంగా చెప్పకపోయినా 'మైలసంత'ల్లో లభించే పదార్థాలనుబట్టి వాళ్ళ భోజనాదికాలు ఊహించవచ్చు.

వేశ్యజాతి అనేది ఒకటి ప్రత్యేకంగా ఉన్నప్పటికీ. వ్యభిచరించే ఏ కులంవారినైనా వేశ్యలనడం కూడా కనిపిస్తుంది. కర్ణాటక వేశ్య, మేదరకరణ వేశ్య ఇత్యానిగా. వ్యభిచారతత్వం మీదనే నిరసన ఉందిగాని, ఆకులం మీద కాదని అర్థం. పైగా ఆ కులంవారికి కొన్ని నియమాలుండేవి. కన్నెరికం. ముగురవీక్ష మొదలైనవి. 'ముకుర వీక్షా విధానంబు మొదల లేక వెలసడంతికిఁ గారాదువిటులఁ గవయ' అని చెప్పబడింది. వీరిలో ఏదైనా వినాదం వస్తే తీర్పులు చెప్పడానికి జార ధర్మాసనాలు ఉండేవి. విటధర్మాలు చాలా విచిత్రంగా ఉండేవి. వేశ్య మాతలు

అప్పుడప్పుడు పరాయి వూరివాళ్ళను మోసం చేస్తూ ఉండేవారు. అటువంటి మోసానికి...

ముక్కుసోణంబుదాఁకను జెక్కు టొకటి
బోసినోరుగఁ బండ్లూడ బొడుచు టొకటి
గూబ లంటంగఁ జెవిదోయి గోయు టొకటి – క్రీడా–271.

ఇలా శిక్షలున్నాయని గోవింద మంచనశర్మ ధర్మనిర్ణయం చేస్తాడు.

జూదాలు, అందులో మోసాలు, మోసగాళ్ళవల్ల అమాయకులైనవారు పడే బాధలూ వర్ణింబడినాయి. పనిలేని సోమరిపోతులకు జూదం మీద ఎంత అపేక్షో చెప్పలేము. గుంపులు గుంపులుగా ఒకచోట చేరేవారు. వారందర్నీపశ్యతోహరుడు మోసపుచ్చడం ఉంది. అందుకే *'ఈ పన్నిదంబంగీకారమునేయువారిమొలలంబ్రాపించుఁగౌపీనములో'* అని భావించారు. జూదాల్లో చివరికి మిగిలేది గోచిపాతే. ఈ జూదాలతో పాటు వ్యసనాల్లో చెప్పదగినవి కోడిపందాలు, పొట్టేళ్ళపందాలు. సజీవ ద్యూతమైన కోడిపోరు కావ్యంలో 235వ వచనంలో సవిస్తరంగా చిత్రితమైంది. ఈ జూదాలూ, కోడి, పొట్టేళ్ళపోర్లు సామాన్య ప్రజల వినోద కార్యక్రమాలక్రిందకొస్తాయి. పాపపుణ్యాల అర్థం తెలియని అమాయకులైన ఆ సన్నకారు ప్రజలు వాటి పోరులో ఆనందాన్ని పొందుతారు. రక్తం స్రవిస్తూ మేనులు తూలిపోతున్నా. వాటిని ఇంకా పోరాడమని ఎగదోస్తుంటారు, పోరులో చచ్చేకోళ్ళను వీరుల పంక్తిలో నిలబెట్టి–

పోవుచున్నారె దేవతాభువనమునకు?
మీరు రంభాతిలో త్తమమేనకాది
భోగకార్యార్థ మై కోడిపుంజులార! – క్రీడా–238

అని అనడంలో వ్యంగ్య వైభవం గమనించదగింది.

ఆ కాలపు వినోదాలు, ఇతర క్రీడావిశేషాలు, కళలూ ఈ విధంగా ఉన్నాయి. పల్నాటి వీరుల కొలుపులు, ఆ వీరుల కథాగానాలు చాల వ్యాప్తిలో ఉండేవి. పల్లెప్రాంతాల్లో జనప పెద్దలు ఈ ఐతిహ్యాల కోసం చెవులు కోసుకొనేవారు. అంతే కాదు. ఆ చరిత్రకు సంబంధించిన స్థలాలను పేరు పేరున చూపించడానికి కూడా ఆతురత చెందేవారు. ఈ పద్యంలో ఆ విషయమే చెప్పబడింది.

ఇచ్చోట భుజియించి రేకకార్యస్థ లై
సామంతనృపతులు చావకూడు,
ఇచ్చోటఁ జింతించె నిచ్చ సుపాయంబు
నల్లినాక్షి యార్వెల్లినాయురాలు,
నిజ మనుశుద్ధికై నిప్పుల యేటిలో
నోలాడె నిచ్చోటఁ బీలసాని,
యిచ్చోటఁ బోరిరి యిల పణంబుగ గొల్ల
సవతితల్లులబిడ్డ లవనిపతులు,
ధీరు లగువార లేవురు వీరపురుషు
లై, మదోద్ధతి నిచ్చోట నాటిఁ బడిరి – క్రీడా–122.

అని చరిత్ర ప్రసిద్ధమైన స్థలాలకుపోయి చూచి రావడమేకాక ఆ వీరుల మీద భక్తితో వారి పేర్లమీద లింగాలు నిలిపి గుళ్లుకట్టి కొలుస్తుండేవారు. అటువంటి గుడి ఒకటి ఆ కాలంలో 'ఓరుగల్లు'లో ఉండేది. అక్కడ ఆ వీరుల కొలుపు జరుగుతున్నప్పుడు ఒక పడతి పలనాటివీరుల కథను గానం చేస్తుంది. ఆ వీరకథాగాన పద్ధతి ఎలా ఉండేదో క్రింది పద్యంవల్ల విశదమౌతుంది.

ద్రుతతాళంబున, వీరగుంఫితకదుంధుంధుంకిటాత్కారసం
గతి వాయింపుచు, నాంతరాళికయలి గ్రామాభిరామంబుగా
యతి గూడన్, ద్విపదప్రబంధమున వీరానీకముం బాడె నొ
క్కతె ప్రత్యక్షరముం గుమారకులు ఫీట్కారంబునం దూలఁగన్

– క్రీడా – 116.

వీరగుంభితకను వాయించేది ఒక స్త్రీ. పాడింది ద్విపద ప్రబంధమట. ఈ సందర్భంలో మన బుర్రకథలు జ్ఞాపకం వస్తాయి. కాకతీయుల కాలం నుంచీ ఈ ప్రక్రియలు వీరగాథా ప్రచారానికి వాహికలుగా ఉండేవని అర్థమౌతుంది. ఈ మౌలికమైన సంగీత రూపకం ఎదుటివారిని సులభంగా ఆకర్షిస్తుంది. 'ధుంధుంకిటాత్కార సంగతితో' పాడుతుంటే శ్రోతలకు పూనకం కలిగేది. చెప్పతరం కాకుండా ఎగురుతుండేవారు. వారికి తెచ్చిపెట్టుకొన్న నాగరికత అనే అడ్డుగోడలు లేవు. అందుచేత నిసర్గంగా చిందులేస్తూ ఉండేవారు. ఇదే విధంగా 'బవనీల' కథలు కూడా ప్రచారంలో ఉండేవి. అందులోనూ 'కాకతమ్మకు పై దో'దని ప్రసిద్ధి గాంచిన ఏకవీరాదేవి కథలు చాలా ప్రౌఢంగా పాడేవారు. ఏకవీరకు మాహురమ్మ, ఎల్లమ్మదేవర అని పేర్లు. ఏకవీర గుడి ఎదురుగా నిలిచి బవనీండ్లు, మాలెతలుజవనిక వాయిస్తూ పరశురాముని కథలు పాడేవారు. జక్కులవాళ్లు కామేశ్వరీ పాటలను పాడేవారు. బ్రాహ్మణుల్లో నంతాన

కాంక్షులయినవారు కామేశ్వరీ వ్రతాన్ని జరపడం, ఆ సమయాల్లో ఉద్రేకపూరితమైన ఈ కామేశ్వరి పాటను జక్కులవాళ్ళచేత పాడించడం ఆచారం.

కొందరు మైలారు దేవుణ్ణి సేవించేవారు. వాళ్లను మైలారవీరభటులు అంటారు. వీరు తమ భక్తి ప్రదర్శనలో అతిసాహస కార్యాలు చేసేవారు. ఒక విధంగా వీరిది మూఢభక్తేననాలి. అందుకే తమ మొక్కుబడులు చెల్లించేటప్పుడు భక్తి పారవశ్యంతో ఆత్మబలిదాన కృత్యాలు చేసేవారు. గుండాల్లో చింతనిప్పులుపోసి దూకడం, నేలమీద శూలాలు పాతి పెద్ద గడపై నుండి వాటిమీద దూకడం, వెదురు గడపై తిరిగే ఇనుప కడియానికి కట్టిన త్రాటికొనన ఉన్న యినప కొండిని చర్మానికి గుచ్చుకొని గిరగిరా తిరగడం, గండ కత్తెర అనే సాధనంతో తలలు తరుక్కోవడం, కళ్లలో బాణాలు గుచ్చుకోవడం, అరచేతుల్లో కర్పూరం వెలిగించుకోవడం మొదలైన సాహస కృత్యాలెన్నో చేసేవారు.

ఈ సమయాల్లో గొరగపడుచులు 'గొండ్లి' అనే నృత్యాన్ని చేస్తుంటారు. వెనుకకు మొగ్గవేసి నీళ్ళతొట్టిలో ఉన్న ముంగురును ముక్కున గుచ్చుకొని లేవడం, నాలుకతో నల్లపూసను చాలా త్వరగా గుచ్చడం మొదలైన వింత పనులు చేసే గొరగపడుచులుండేవారు, నాగస్వరం, పాము పాటలు నాటి ప్రజలకు మిక్కిలి ప్రీతిపాత్రాలు. ఉత్సవాల్లో వారి ఉత్సాహం మేర మీరుతుంది. సింహధ్వజాలు ఎత్తి, నింబదళమాల్యా తోరణాలు కట్టి, పూర్ణకలశాలు నిల్పి ఆ బాలగోపాలం ఉత్సవాల్లో పాల్గొంటారు. శీధువులో మునిగి తేలి తప్పెట్లు, తక్లెతాళాలు మొదలైన వాద్యాలతో రంపిల్లుతూ గుంపులుగుంపులుగా వీధుల్లో విహరించేవారు.

నాటి ప్రజలకు చిత్రకళలపై గొప్ప అభిమానం ఉంది. మాచల్దేవి అనే వారాంగనయింట ఉన్న చిత్రశాల ప్రత్యేకంగా చెప్పదగింది. చిత్రకారులా చిత్తవురుల్ని మయ్యెరతో వ్రాసేవారు. సన్నని వెంట్రుకలతో కట్టబడిన కుంచెమయ్యెర చిత్రశాలలో ఉన్న చిత్రాల వివరాలన్నీ రెండు – మూడు వద్యాల్లో వర్ణింపబడినాయి. గమనించదగిన విశేషం ఏమిటంటే ఆ చిత్రాలన్నీ మన్మథుడికి సంబంధించినవి. ఏ అంగడికి తగిన హంగు ఆ అంగడికి ఉండాలి. మాచల్దేవి అంగట్లో మన్మథ సంబంధమైన చిత్రాలు కాక మమహాదేవుడికి చిత్రాలెందుకుంటాయి? సంగీతం పైన కూడా ప్రీతి అధికమే. అయితే జనసామాన్యానికి 'జతిగ్రామ' విధానం మీద మక్కువ ఎక్కువ.

ఆనాటి వ్యవహార మంతా 'టంకములు, రూకలు' అనేవాటితో జరుగుతుండేది. ఒక కర్ణాటవేశ్య తాను కొనే 'రోవెల'ను 'శాటీహాటకనిష్క'మంటుంది. ఇంకొకతె రెండు 'సొన్నాటంకాలు' కోరింది. కుమార్తె పసుపు కొరకు ఒక పసిడిటంకం ఇవ్వమని మంచెనశర్మ టిట్టిభనెట్టిని ఆజ్ఞాపిస్తాడు. లక్ష్మణవజల ఇంట్లో రూకకు రోజనం పెట్టేవారు. భూములు కుదువపెట్టడం కూడా రూకల లెక్కలోనే.

ఆహి పెట్టితి జొన్న గడ్డాగ్రహార
వృత్తి యేనూరు రూకలవృత్తమునకు – క్రీడా–245

అని చెప్పబడింది. ఆడవాళ్ళు బొమ్మంచు చీరలు, కుసుమంబెట్టిన చీరలు (ఎర్ర రంగు అద్దకపు చీరలు) 'చిరుత చౌకంబుల తొగరు పుట్టము'లు కట్టేవారు. గోళ్ళకు గోరింటాకు, సింధూర తిలకమూ, తాంబూల సేవనం అలవాట్లు. చలికాలాల్లో రెట్టనేత (జమిలినేత) దుప్పట్లు, ఉన్నితో నేసిన కంబళ్ళు కప్పుకొనేవారు. ఇండ్లలో ఏదైనా శుభకార్యం జరుగుతుంటే గృహాన్ని బాగా అలంకరించేవారు,

చందనంబునఁ గలయంపి చల్లినారు.
మ్రుగ్గు లిడినారు కాశ్మీరమున ముదమున
వ్రాసినా రిందురజమున రంగవల్లి
కంజములఁ ధోరణంబులఁ గట్టివారు – క్రీడా–178

అనే పద్యం దీనికి నిదర్శనం.

శ్రీనాథుని క్రీడాభిరామంలో ప్రజల జీవన చిత్రకళలపై, సంస్కృతి సాంప్రదాయాలపై ఎక్కువగా కులవృత్తి లేనివాళ్ళు సృజనాత్మకంగా ఒక ప్రయోగ పద్ధతిలోకి తీసుకువచ్చారు. దేవుళ్ళకన్నా ఎక్కువగా దేవతలను ఆరాధించడం, జాతర్లను పండుగలను ఎక్కువగా చేసేవారు. మైలారు దేవతల పండుగలు నేడు నందెమ్మగొంతెమ్మ పండగలుగా, జాతర్లుగా చాలాచోట్ల జరుగుతూనే ఉన్నాయి.

డి. ఎస్.ఎమ్.ఎస్. రావు
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
ఫోన్: 855 582 2648.



- వేమలి త్రినాధరావు

దుఃఖార్తానాం, శ్రమార్తానాం, శోకార్తానాం తపస్వినామ్
విశ్రాంతి జననం కాలే నాట్యమేతద్భవిష్యతి

దుఃఖంతో బాధపడువారికి, శ్రమవలన అలసిపోయినవారికి, అనంతమైన శోకాన్ని అనుభవిస్తున్న వారికి, దీనులకు బాదితులకు అందరికి వారి వారి బాధను క్లేశాన్ని, శ్రమను మరపింపచేసి ఆనందం కలిగించేదే నాటకం.

ధర్మ్యం యశస్యం యాయుష్యం హితం బుద్ధి వివర్ధనమ్
లోకోపదేశ జననం నాట్యమేతద్భవిష్యతి

నాటకంలో ధర్మం, హితవు, కర్మము, యోగము ఉండి, సర్వకాలాలకు, సర్వ జనులకు, యశస్సు, ఆయువు, జ్ఞానం కలిగి బుద్ధిని వికసింప చెయ్యడమే నాటక లక్షణం అని భరతముని నాట్యశాస్త్రంలో నిర్వచించాడు.

"రసానుభూతికి పరాకాష్ట నాటకం" అని లాక్షనికుల అభిప్రాయం. "కాళిదాసు" ఒక నాటకం పది కావ్యాలతో సమానం అని చెప్పారు. నాటకం అనేది ఒక ప్రక్రియ అయినా, తెలుగు నాటకరంగం మాత్రం రెండు భాగాలుగా విభజింపబడ్డది. 1. పౌరాణికం, 2. సాంఘికం, పౌరాణిక నాటకాన్ని సంప్రదాయ నాటకం అని కూడా పిలుస్తారు. ఈ విభాగంలో చారిత్రక, జానపద కళారూపాలు కూడా చేరి ఉన్నాయి. పద్య, గద్య రసాత్మకం పౌరాణిక నాటకం అని పెద్దలు పలు సందర్భాలలో తెలిపారు. తొలినాళ్లలో నాటకరంగానికి ప్రాణ ప్రతిష్ఠ చేసినవి ఈ నాటకాలే. కేవలం ప్రేక్షకులకు ఆనందం కలిగించటంవరకే ఈ నాటకాలు ఆగిపోలేదు. ప్రేక్షకుల దృష్టి ఆధ్యాత్మికం వైపు మరల్చడానికి ఉపకరించాయి. పౌరాణిక నాటక విభాగానికి మరొక గొప్పతనం కూడా ఉంది. ఏ భారతీయ భాషలో లేని పద్యం తెలుగు భాషకు కలిగిన అదృష్టమైతే, గద్యాన్ని, పద్యాన్ని సమాంతరంగా తనలో ఇముడ్చుకొని సౌభాగ్యవంతం అయింది తెలుగు పౌరాణిక నాటకం. జాతికి పెన్నిధి పద్య నాటకం. ఆ పెన్నధిని తరతరాలకు అందించాలనే తాపత్రయంగల పూర్వాంధ్ర కవులు, రచయితలు ఇతిహాసాల నుండి ఇతివృత్తాలను ఎన్నుకొని నాటక రచన చేశారు.

నాటకం ఒక అద్భుతకరమైన అనూహ్యమైన అనుభవంతో సమాజంలో పరిస్థితులకు తగ్గట్టుగా నాటకాలను రూపొందించి, ప్రదర్శించడం సుధీర్ఘకాలం నుంచి వస్తున్న ప్రక్రియ. కానీ సినిమా ప్రభావం, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం కారణంగా ప్రజలు ఆచరిస్తున్న అనుసరిస్తున్న ఆధునిక జీవనశైలి, పాశ్చాత్య సంస్కృతి, యాంత్రిక జీవనం, మానవ నాగరికతా విలువలు తగ్గిపోవడం, అనేక కారణాలవలన నాటకం ఆటుపోట్లకు గురైంది. రచయిత రూపొందించిన నాటకాలను దర్శకుడు సూచనలు, సలహాలమేరకు నటీనటులు ప్రదర్శించి, ప్రజలకు వినోదం, విజ్ఞానంతో పాటు, హాస్యాన్ని అందించడంలో నాటకం యొక్క పాత్ర చెప్పుకోదగ్గది. రచనా పరంగా సంస్కృత సాహిత్యంలో "బాస మహకవి" నాటకానికి శ్రీకారం చుట్టాడు. "బాస నాటక చక్రం" పేరుతో 13 నాటకాలను రచించారు. "కర్ణభారం, దూతవాక్యం, దూతగటోద్ఘచం, మధ్యం వ్యాయోగం, పంచరాత్రం, ప్రతిజ్ఞ యౌగందరాయనం, స్వప్నవాసవదత్తం చారుదత్తం", మొదలైనవి రచించారు. తర్వాత "కాళిదాసు" రచించిన "అభిజ్ఞాన శాకుంతలం" అతని రచనా శక్తికి ప్రతీక. శూద్రకుడి "మృచ్ఛకటికం" నాటకం అప్పటి రాజరిక వ్యవస్థనీ, సమాజ స్థితిగతులను అద్భుతంగా కళ్ళకి కట్టినట్లుగా చిత్రీకరించిన సాంఘిక నాటకం, సంస్కృత నాటకానికి నరైన ఆకృతిని, రసరూపాన్ని ఇచ్చింది కాళిదాసు. తర్వాత కవులందరూ కాళిదాను రీతిని అవలంబించారు. ఈ విధంగా సృజనాత్మక నాటక కళ సంస్కృత భాషలో ఆవిర్భవించి,

తెలుగు నాటకాలు రూపొందడానికి మార్గాన్ని చూపాయి. తెలుగులో అనేక నాటకాలు ఆవిర్భవించాయి. అనంతరం సంస్కృతం నుండి తెలుగులోకి చాలా నాటకాలు అనువదించబడ్డాయి. మొదటగా కొక్కండ వెంకటరత్నం పంతులుగారు "నరకాసుర విజయం" అనే సంస్కృత నాటకాన్ని తెలుగులోకి అనువదించారు. దీనికి 1872 సం॥లో ప్రచురింపబడిన మొట్టమొదటి తెలుగు పద్య నాటకం అని చెప్పవచ్చు. 1874 సం.లో "వావిలాల వాసుదేవశాస్త్రి" షేక్స్పియర్ రాసిన ఏ జూలియస్ సీజర్ నాటకాన్ని సీజర్ చరితము అనే పేరుతో అనువదించారు. ఇదే మొట్టమొదటి ఇంగ్లీషు నాటకానికి తెలుగు అనువాదం. మహకవి కాళిదాసు రచించిన "అభిజ్ఞాన శాకుంతలం సంస్కృత నాటకాన్ని వ్యవహారిక తెలుగులోకి అనువదించిన ఘనత పరవస్తు వెంకట రంగాచార్యులకు దక్కుతుంది. వావిలాల వాసుదేవ శాస్త్రిగారు "నందకరాజ్యం" అనే సాంఘిక నాటకాన్ని వ్రాశారు. మొట్టమొదట సాంఘిక వద్యనాటక కర్తగా వావిలాల వారు చరిత్రలో నిలిచిపొయారు. ఈ విధంగా వావిలాలతో పాటు, కొక్కండ, కోరాడ, పరవస్తు, కందుకూరివారు, నాదెళ్ల పురుషోత్తమ కవి, కొండుబట్ల సుబ్రహ్మణ్యశాస్త్రి, వడ్డాది సుబ్బారాయుడు మొదలగువారిని చెప్పుకోవచ్చు. వీరిలో కందుకూరివారు సాంఘిక, తెలుగు భాషా, చైతన్యానికి నాయకత్వం వహించి, తెలుగు నాటకానికి సరికొత్త రూపాన్ని రూపొందించినవారిలో ఆధ్యుడు. "వ్యవహార ధర్మభోధిని" అనే సాంఘిక వ్యంగ్య నాటకాన్ని రచించి ప్రదర్శించారు. కందుకూరిగారికి ఇది తొలి తెలుగు హాస్యనాటకంగా పరిగణించవచ్చు.


ధార్వాడ్ నాటక సమాజం వారు హిందీ నాటకాలను రాజమండ్రిలో ప్రదర్శించినప్పుడు అక్కడ ప్రజల నుండి విశేష స్పందన రావడంతో కందుకూరివారు ఉత్తేజితులై "శ్రీ హర్షుడు" రచించిన "రత్నావళి" సంస్కృత నాటకాన్ని తెలుగులో చమత్కార రత్నాళి పేరుతో అనువదించి వారి నాటక సమాజం తరఫున ప్రదర్శించి ప్రేక్షకుల మన్ననలు అందుకున్నారు. తర్వాత గురజాడ అప్పారావు రచించిన "కన్యాశుల్కం" అనే నాటకం ఎంతో ప్రాచుర్యం పొందింది. ఈ నాటకం ద్వారా ఆనాటి రోజుల్లో ఉన్న వరకట్నం, బాల్యవివాహాలు, అనే మూడాచారాలవలన సమాజం ఏ విధంగా కృంగిపోతుందో ప్రజలకు తెలియపరచి, వారిని చైతన్యవంతులను చేసి, సాంఘిక దురాచారాలను రూపుమాపుటకై కన్యాశుల్కం నాటకం ఎంతో ప్రాచుర్యం పొందింది. ఈ నాటకాలువలన ప్రజలు చైతన్యం అవడం, ఆ రోజుల్లో నిరక్ష్యరాస్యత ఎక్కువగా ఉండడంవలన నాటకాలు ద్వారా ప్రజలు పొందిన మానవత్వం, విలువలుగలిగిన మార్పుకు అవకాశం ఉండేది. అంతేకాకుండా, ఇతిహాసాల గురించి, చారిత్రక అంశాల గురించి సులభంగా అర్థం అయ్యేవి. రామాయణ, భారత, భాగవత పురాణాలలోని కథల ప్రభావం నాటకాలపై చాలా ఎక్కువగా ఉండేది. వీటిలోని ఘట్టాలను, చిన్నచిన్న కథలను, పద్యనాటకాలుగా విరివిగా రూపొందించి ప్రదర్శించేవారు. అందుకే పూర్వరోజుల్లో పద్యనాటకానికి ప్రజాదరణ ఎక్కువగా ఉండేది. అప్పటిలో సుప్రసిద్ధ జంటకవులు తిరువతి వెంవటకవులు రచించిన "పాండవోద్యోగ విజయాలు" నాటకంలోని పద్యాలు ప్రతి పశువుల కాపరి దగ్గర నుండి పామర జనం నోళ్లల్లో నానుతూనే ఉంటాయి.

విశ్వనాధ సత్యన్నారాయణ, పానుగంటి, చిలకమర్తి, మొక్కపాటి, భమిడాపాటి, జంధ్యాల పాపయ్యశాస్త్రి, సముద్రాల, ఆత్రేయ, ఆరుద్ర, రావిశాస్త్రి, ఎన్.ఆర్. నంది, నరసరాజు, భమిడిపాటి, గొల్లపూడి, తనికెళ్ల భరణి, యుండమూరి తదితర ప్రముఖులు వారి రచనా పాఠవంతో నాటకాలు వ్రాసి సమాజ అభ్యున్నతికి కృషి చేసారు. నాటకం పండిత పామరులను రంజింపచేస్తుంది. నాటకం రాణించాలంటే నటీనటులు అద్భుతమైన నటనని ప్రదర్శించాలి. మంచి కంఠస్వరం కలిగి పాత్రకు తగ్గ నటీనటులున్నప్పుడే ఆ నాటకం జనామోదం పొందుతుంది. కాలానుగుణంగా యక్షగానాలు, భాగవతాలు, వీధినాటకాలు, బుర్రకథలు, సగటివేశాలు, గంగిరెద్దాటలు, హరిదానులు, జంగం కథలు, తప్పెటగుల్లు, ఏకపాత్రాభినయాలు, పిచ్చికుంట్లు, బైండ్ల కదలు, బుడబుక్కలు, వివిధ రూపాల్లో ప్రదర్శనలు జరుగుతూ ఉండేవి. కాలానుగుణంగా, సామాజిక పరిస్థితులు, ప్రజల జీవన విధానంలో మార్పులు కారణంగా కళారూపాలు నేడు అంతరించిపోవడానికి చేరువలో ఉన్నాయి. సురభి నాటక సమాజం వారు పౌరాణిక నాటకాలను ప్రదర్శించడం

జరుగుతుంది. వీరు అప్పుడే పుట్టిన పసిబాలుడు నుండి, వండు మునలివాళ్లవరకూ మూర్తిగా నాటకానికి అంకితమైనారు. ఒక దశలో సినిమా, బుల్లితెర (టి.వి.) ప్రభావం నాటకంపై పడింది. నాటకానికి ఆధరన తగ్గింది. అందుకే నాటకాన్ని ఉచ్చస్థితి నుండి ఉన్నత స్థితిలోకి తేవడం ఎంతైనా అవసరం. నాటకాన్ని భావితరాలవారు కాపాడుకోవడం చాలా అవసరం. సామాజిక అంశాలతో ముడిపడిన ప్రజలను ప్రభావితం చేసిన "చింతామణి, సత్యహరిశ్చంద్ర, సారంగధర" మొదలగు నాటకాలు సామాన్య ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశాయి. చింతామణి ప్రభావానికి లోనైన సుబ్బిశెట్టి, భవానీ శంకరుల కుటుంబ జీవితం, ఆర్థికస్థితి, సాంఘిక హోదా కోల్పోయి ఏ రకంగా దిగజారిపోయారో చింతామణి నాటకంలోని ప్రధానాంశం. ఈ నాటక ఇతివృత్తం ప్రేక్షకులను ఎంతోగానో ఆకట్టుకున్నది. సత్యం కోసం ఆడిన మాట తప్పక ఏ విధంగా జీవించాడో, దానికి విశ్వామిత్రుడు, ఆయన శిష్యుడు నక్షత్రకుడు ఎన్ని కష్టాలు పెట్టినా భరిస్తూ, ఇచ్చిన మాట కోసం సర్వమూ కోల్పోయి, చివరికి తన భార్య చంద్రమతిని కూడా కడజాతివాడికి దానీగా హరిశ్చంద్రుడు అమ్ముకుంటాడు. చివరకి తను కోల్పోయినదంతా తిరిగి దక్కించుకుంటాడు. ఈ సందేశాత్మక నాటకాన్ని చూసిన ప్రజలు వారి జీవితాలకు అన్వయించుకొని ఆనందించారు. సారంగధరుని తండ్రి రాజరాజ నరేంద్రుడు. తన కుమారుడు వివాహం కోసం అమ్మాయిని (వధువు) చూసి, ఆమె అందచందాలకు పరవశుడై రాజరాజనరేంద్రుడే వివాహం చేసుకుంటాడు. కొన్నాళ్ల తర్వాత ఆమెకి విషయం తెలిసి, సారంగధరుడ్ని ప్రమించమంటుంది. దానికి సారంగధరుడు నిరాకరిస్తాడు. ఈ విషయాన్ని తన తండ్రికి సారంగధరుడు ఎక్కడ చెప్పేస్తాడోనని భయపడి, రాజరాజ నరేంద్రుడు రాగానే సారంగధరుడిపై కల్పించి చెప్తుంది. దానికి కోపోద్రేకుడై సారంగధరుడిని వధించమని భటులకు ఆజ్ఞాపించాడు. వేంటనే రాజ భటులు సారంగధరుడ్ని కొండపైకి తీసుకెళ్లి శిరస్సు ఖండించడం, తర్వాత వాస్తవం రాజు తెలుసుకొని కుమిలిపోవడం జరిగింది. ఇటువంటి నాటకాలను ప్రజలు ఎక్కువగా ఆదరించేవారు. నేటి తరం నాటక రచయితలు సమాజంలోని జరుగుతున్న మార్పులు, సంఘటనలను సాంఘిక నాటకాలుగా మలిచి, వివిధ సమాజాలు ప్రదర్శించి ప్రేక్షకులను ఆలోచింప చేస్తున్నారు. నేటి తరం రచయితలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులు, పరిషత్తు నిర్వాహకులు, విశ్వవిద్యాలయాలు తదితర వాటి వలన నాటకం నేటికీ జీవించగలుగుతుంది. దీనిని కాపాడుకోవాలసిన బాధ్యత మనందరిదీ!

డాక్టర్ వేమలి త్రినాధరావు
విశాఖపట్నం. ఫోన్: 939 104 0081.


ఎం.డ్లూరి సుధాకర్ తెలుగు సాహిత్యంలో తనకంటూ ఒక స్థానం కల్పించుకున్న కవి, రచయిత – వారి కుమార్తె మానస



– ఆమె సంకలనం చేసిన ఈ దళిత కథలు – ఒక నిర్దుష్టమైన లక్ష్యంతో చేసినవి – 23 మంది రచయితల కథలను సేకరించి – ఎక్కువమంది పాఠకులకు పరిచయం లేని సమాజంలోని ఒక పార్శ్వాన్ని తెలుగులోకి తేవటమే ఈ కథల లక్ష్యం – ఒక్కోసారి నిగ్గుతో తలవంచుకోవలసి వస్తుంది – ఎక్కువ శాతం అనుభవించే సుఖమయ జీవితానికి ఎవరి శ్రమ దోహదం చేస్తుందో తెలుసుకుంటే – చివరిలో రచయిత పరిచయం వివరంగా ఇచ్చారు.

పేజీలు: 186, వెల: పేర్కొనబడలేదు.
ప్రతులకు: ఫోన్: 707 541 4466.

బహుముఖ ప్రజ్ఞుడు, సుదీర్ఘ అనుభవశాలి రామాయణం దగ్గర్నుంచి రాయలసీమవరకూ భారతం మొదలు దళిత కథలు వరకూ వీరు స్పృశించని ప్రక్రియా అంశం లేదు. జగన్నాథశర్మగారు విస్తృతంగా ఆంగ్ల – ఐరోపా సాహిత్యాలు అధ్యయనం చేశారు – అందుకేనేమో – వీరి రచనాశైలి సార్వజనీనంగా ఉంటుంది. ఈ కొత్త సంపుటి పేగు కాలిన వాసన శీర్షిక నుంచే



భిన్నంగా ఉంది – లోతుల్లోకి వెళితే – మరెన్నో అన్యాయపు వాసనలు – మిమ్మల్ని వెంటాడి – ఏమిటీ అన్యాయం అని నిలదీస్తాయి.

పేజీలు: 231, వెల: ₹ 200/– ప్రతులకు: పాలపిట్ట బుక్స్, హైదరాబాద్. ఫోన్: 984 878 7284.

'సీరపాణి' తెలుగు 'వందేమాతరం' గేయం

– పిల్లా తిరుపతిరావు

ఇటీవల ప్రఖ్యాత అభ్యుదయ కవి 'సీరపాణి'ని వారి స్వగృహంలో కలిశాను. ఆ సందర్భంగా ఆయన సాహిత్యాన్ని గమనించే క్రమంలో, వందేమాతరం తెలుగు అనువాద గేయం నా కంటబడింది. అది నన్నెంతగానో ఆకర్షించింది. ఎందుకంటే మొత్తం మూలానికి పూర్తి అనువాదమది. సాధారణంగా తెలుగు వాచకాల్లో పిల్లలచే చదివించేది వందేమాతరంలోని ఒక చరణం మాత్రమే. పాఠ్యపుస్తకాలలోగల గేయానికి దిగువన భావాన్ని కూడా ముద్రిస్తారు. పిల్లలకే కాదు చాలామంది వ్యక్తులకు పూర్తి పాఠం తెలియదంటే సత్యదూరం కాదు. భారతీయ పౌరులమైన మనలో ఎక్కువమందికి మన జాతీయ గేయంలో ఏముందో! తెలియకపోవడం విచారకరం. ఆ లోటును పూరించడానికి సీరపాణి తనవంతుగా ప్రయత్నించి, ఈ వందేమాతరం గేయానికి చక్కని తెలుగు అనువాద గేయము రాయడం జరిగింది. భారత స్వాతంత్ర్య స్వర్ణోత్సవాల సందర్భంగా 1997 ఆగస్టు 22వ తేదీన ఆ గేయం 'ఆంధ్రజ్యోతి' సచిత్ర వారపత్రికలో మొదటిసారిగా అచ్చయ్యింది. అంటే అది ప్రచురించబడి నేటికీ పాతిక సంవత్సరాలు అయ్యింది. మనం స్వాతంత్ర్యం సాధించి 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్నాం. ఈ సందర్భంగా భారత స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు ఘనంగా జరుపుకుంటున్నాం. ఈ నేపథ్యంలో వందేమాతరం గేయాన్ని సమగ్రంగా తెలుగువాళ్లంతా అవగాహన చేసుకోవడానికి నేను చేసే చిరు ప్రయత్నమే ఈ వ్యాసం యొక్క ముఖ్యోద్దేశం. బంకించంద్ర చటోపాధ్యాయ 'వందేమాతరం' గేయం నాలుగు చరణాలుగా విభజించబడి ఉంటుంది. తొలుత అందులోని పల్లవి, ఒక చరణాన్ని తీసుకుని చూద్దాం.

"వందేమాతరం వందేమాతరం/సుజలాం సుఫలాం మలయజ శీతలాం/నన్యశ్యామలాం మాతరం వందేమాతరం/శుభ్రజ్యోత్స్నా పులకిత యామినీం/ఫుల్ల కుసుమిత ద్రుమదళ శోభినీం/సుహాసినీం సుమధుర భాషిణీం/సుఖదాం వరదాం మాతరం"

దీనికి అనువాదంగా 'సీరపాణి' ఇలా వ్రాశారు.

"భారతమాతా వందనం–పవిత్ర భూమీ వందనం/ నిర్మలమైనది నీ చరితం–సరళ తరళ గుణ సంభరితం/ నిండుగ పారే నదీజలాలు/మెండుగ పండే మధురఫలాలు/ నల్లని ఛాయల పంట పొలాలు/చల్లని గాలులు నీ విలాసములు/తెల్లని వెన్నెల తేలే రాత్రులు/పెల్లుగ విరిసే పూల తోటలు/నవ్వు మొగముతో తేనె పలుకులతో/ సుఖముల వరముల నిచ్చేతల్లీ"

అనువాద గేయ పల్లవిని పరికించి చూస్తే, తొలుత గేయకర్త అలౌకిక రూపమైన భారతమాతకు వందనం చెబుతూ, భౌతిక రూపమైన భూమాతకు నమస్కరించారు. దీనికి అనుపల్లవిగా ఓ మాతా! నీ చరితము స్వచ్ఛమైనది. నీవు సరళమైన సద్గుణాల తల్లివి అని కీర్తిస్తారు కూడా. ఈ ప్రథమ చరణంలో నదీజలాలు, మధుర ఫలాలు, పంట పొలాలు, చల్లని పైరగాలులు భారతమాత విలాసములుగా వర్ణించారు కవి. అలాగే వెన్నెల రాత్రులతోనూ, పూల తోటలతోనూ శోభాయమానమైనదని వర్ణిస్తూ, నవ్వు మొగముతో, తేనె పలుకులతో, సుఖాలూ వరాలూ ఇచ్చే తల్లిగా కవి అభివర్ణిస్తారు. పై చరణంలో కవి భారతమాత నైసర్గిక స్వరూపాన్ని వర్ణించారు. అంతమాత్రం చేత 'దేశమంటే మట్టే' అని అనుకోవడానికి వీలులేదు. దేశమంటే రక్తమాంసాలు నిండిన మనుషులే కదా! ప్రకృతికి మానవునికి మధ్య సంబంధం నిత్యం. అందుకే కవి గేయంలో ప్రకృతిమాతను దేదీప్యమానంగా దర్శిస్తారు.

రెండో చరణాన్ని బంకించంద్ర ఇలా పూరిస్తారు.

"త్రింశత్కోటి కంఠ కల కల నినాద కరాళే/కోటి కోటి భుజైర్ ధృత కర కరవాలే/కేబోలే మాతుమి అబలే/ అబలా కే యనో మా ఏతో బలే/బాహుబల ధారిణీం

నమామి తారిణీం/రిపుదల వారిణీం మాతరం”

దీనికి సీరపాణి అక్షరాక్షరానికి శౌర్య పరాక్రమములు జోడిస్తూ, గాంభీర్యంగా ఇలా తర్జుమా చేస్తారు.

‘‘ఎత్తిన గొంతులు ముప్పది కోటులు/ఒత్తిన శంఖములై గర్జించగ/మొత్తములై శతకోటి కరమ్ములు/కత్తులుగా శత్రుల తర్జించగ/అబలగ నిన్నెవరాక్షేపింతురు/సబలవు నీవు మహాబలశాలిని/అరులను త్రుంచే అండవు నీవు/అందుకోవె మా వందన శతములు”

ద్వితీయ చరణంలో గతంలో కోట్లాదిమంది భారతమాత బిడ్డలు చేసే స్వాతంత్ర్య సమర ఘోష ఒత్తిన శంఖనాదంవలే గర్జిస్తున్నదనీ, ఎత్తిన శతకోటి భారత వీరుల పిడికిళ్లూ కత్తులుగా శత్రువులను బెదిరిస్తున్నాయనీ పోల్చారు. ఇది భరతజాతి పౌరుష పరాక్రమాలకు చిహ్నం. దేశభక్తికి సంకేతం కూడా. ఇక భరతమాత స్త్రీమూర్తి కదా! సాధారణంగా స్త్రీలను అబలలని చులకనగా చూస్తారు. కానీ ఆమె సాధారణమైన అబల కాదు మహాబలశాలనీ, శత్రువులను చెండాడి తన బిడ్డలను కాపాడుకునే వీరవనిత. అంతే కాదు ఆమెయే భారతీయ ఆత్మ నరజాతిని నడిపించే ధర్మ స్వరూపిణి. కార్యాచరణశీలి, అనేక గోప్యమైన శక్తులు కలది కూడా అని కవి యథేచ్ఛగా పొగుడుతారు.

మూలంలో తృతీయ చరణం ఇలా సాగుతుంది.

“తుమి విద్యా తుమి ధర్మ తుమి హృది తుమి మర్మ/త్వం హి ప్రాణాశ్శరీరే, బాహుత్ తుమి మా శక్తి హృదయే తుమి మా భక్తి/తోమారయి ప్రతిమా గడి మందిరే మందిరే”

సీరపాణి అనువాదం కూడా లోతైన భావాన్ని ద్విగుణీకృతం చేస్తూ ఇలా కొనసాగుతుంది.

“నీవే విద్యవు హృదయము నీవే/ధర్మము కర్మము మర్మము నీవే/మదిలో భక్తివి భుజబల శక్తివి/దేహము నందలి ప్రాణము నీవే/సుందరమగు నీ విగ్రహమును ప్రతి/మందిరమున నిడి పూజించెదము”

ఈ మూడో చరణములో భరతమాతను సర్వ విధాలుగా కవి కీర్తిస్తారు. మనిషి యొక్క ధర్మము, కర్మము, మర్మము మొత్తంగా హృదయమే నీవని అంటారు.

అందరి ప్రజల హృదయాలలో గూడు కట్టుకొన్న భక్తి, భుజబలశక్తి. ఇంతెందుకు మా అందరి శరీరాల్లో చైతన్యాన్ని నింపే ప్రాణశక్తివి నీవే! అని కవి ఆమె అతిశయాన్ని అద్భుతంగా స్తుతిస్తున్నారు. పైగా ఆమెను దేశమాత స్థాయి నుండి ఒక దేవతా స్వరూపిణిగా ఉన్నతీకరించి, ఆమె సుందర విగ్రహాన్ని ప్రతి మందిరములోనూ ప్రతిష్టించి పూజిస్తామంటున్నారు.

నాలుగో చరణం మూలంలో ఇలా ఉంటుంది.

“త్వం హి దుర్గా దశ ప్రహరణ ధారిణీ/కమలా కమల దళ విహారిణి/వాణీ విద్యాదాయినీ నమామి త్వాం/నమామి కమలాం అమలాం అతులాం/సుజలాం సుఫలాం మాతరం/శ్యామలాం సరళాం సుస్మితాం భూషితాం ధరణీం భరణీం మాతరం”

దీన్ని సీరపాణి యథాతథంగా అనువదించారు.

“ఆయుధములు ధరియించిన దుర్గవు/అంబుజమున విహరించిన లక్ష్మివి/విద్యలనొసగే వీణాపాణివి/వందే వందే సుందర ధరణీ/నిగనిగలాడే నీలపు తనువున/ధగధగ మెరిసే నగలు ధరించి/చల్లని మనసున తెల్లని నవ్వులు/జల్లిన దయగల తల్లీ వందే”

ఇక ఈ చివరి చరణంలో ఆమెను ఆయుధపాణియైన దుర్గగనూ, అంబుజవిహారి శ్రీలక్ష్మిగనూ, సకల విద్యలు ప్రసాదించే వీణాపాణిగనూ, సృష్టి స్థితి లయకారకులైన త్రిమూర్తుల దేవేరులుగనూ వర్ణించి, ముగ్గురమ్మల ముమ్మూర్తులూ మూర్తిభవించిన మూలపుటమ్మగా అత్యున్నత స్థానానికి తీసుకుపోయి ప్రతిష్టించాడు కవి. ఈ చరణం విగ్రహారాధన, ఈశ్వరోపాసన భావనలను ప్రేరేపిస్తున్నదని అప్పట్లో కొన్ని వర్గాలు అభ్యంతరాన్ని వ్యక్తం చేసాయి. కావున కొన్ని చరణాలను పక్కన పెట్టి కేవలం మూలంలోగల ‘పల్లవి–మొదటి చరణాన్ని’ మాత్రమే జాతీయ గేయంగా ప్రభుత్వం తీసుకోవటం జరిగింది. బంకించంద్ర చటర్జీ మూలంలో తొలి చరణాల్లో ఆమె భౌగోళిక స్వరూపాన్ని, తదుపరి ఆమె పౌరుష పరాక్రమాలనూ, తదనంతరం ఆమె గత వైభవ ప్రాభవాలను మాత్రమే గేయంలో చూపించాడు. కానీ ఆమె ముద్దుబిడ్డలైన భారతీయులకు ఆమె భౌతిక స్వరూపాన్ని కళ్లకు కట్టించలేదు. కాకుంటే శ్యామలాం, సరళాం, సుస్మితాం, భూషితాం, ధరణీం, భరణీం వంటి కొన్ని పదాలను సంకేతాలుగా చెప్పి ముగించాడు. సీరపాణి మాత్రం స్వతంత్రంగా ఒక మెట్టు పైకి వెళ్లి ఆయా పదాల అర్థాలనే కరచరణాద్యవయవాలుగా శిల్పం చెక్కినట్లు ఒక

సుందరాకృతిని మన మనోనేత్రాల ముందు పెట్టారు. అదే ధగ ధగ మెరిసే నగలు ధరించిన నిగనిగలాడే నీలపు తనువు. ఆమెయే సస్య శ్యామల శ్యామల. ఆమెయే సుహాసిని. చల్లని మనసున తెల్లని నవ్వులు జల్లిన దయగల తల్లీ! భరతమాత!! అంటూ కవి గేయంలో ముక్తాయింపుగా పలికిన పలుకులు మనల్ని మరింత ముగ్ధులను చేస్తాయి.

భారత రాజ్యాంగ సభ 1950 జనవరి 24 వ తేదీన 'జనగణమన, వందేమాతరం' గేయాలను జాతీయ గీతాలుగా గుర్తించింది. వందేమాతరం గేయం జనగణమన గీతంకంటే ప్రాచీనమైనది. 1882 సంవత్సరంలో బంకించంద్ర చటర్జీ బెంగాలీ భాషలో రచించిన 'ఆనందమఠ్' నవలలోనిది ఈ గేయం. ఈ గేయం సంస్కృతం-బెంగాలీ భాషల మిళితమై ఉంటుంది. వందేమాతరం గేయం భారత స్వాతంత్ర్యోద్యమ సంగ్రామంలో ప్రతీ భారతీయ పౌరుని నోట రణన్ని నాదంగా మారుమ్రోగింది. వలస పాలకుల గుండెలను గడగడలాడించింది కూడా. అంతటి మహత్తర గేయానికి 140 సంవత్సరాల వయస్సు నిండినది. ఆమె ముద్దుబిడ్డ భారత స్వాతంత్ర్యానికి మాత్రం నేటికీ 75 సంవత్సరాలు పూరైనది.

ఇక ప్రస్తుతానికి వస్తే ఇంత విలువైన 'నీరపాణి' తెలుగు అనువాద గేయం ఈ పాతికేళ్ళ కాలంలో ఏ విధమైన ప్రచారానికీ, ప్రోత్సాహానికీ నోచుకోలేదు. కనీసం ఏ తరగతి పాఠ్యగ్రంథం లోనూ వెలుగు చూడలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం గుర్తించి ఈ గేయానికి సముచితమైన స్థానం కల్పించవలసి ఉన్నది.

పిళ్లా తిరుపతిరావు - ఫోన్: 709 518 4846.

బాంక్సీ మ్యూరల్

- టి.వి. ప్రసాద్

రష్యా బాంబు దాడిలో శిథిలమైన ఉక్రెయిన్ రాజధాని కీవ్, దాని సమీపంలోని బోరోడ్యాంకా పట్టణంలో శిథిలమైన గోడమీద చిత్రించిన సరికొత్త మ్యూరల్ బాంక్సీ స్పందనకు నిదర్శనం. ఒక చిన్న పిల్లవాడు బలవంతుడైన పుతిన్ పోలికలున్న బ్లాక్ బెల్టు ధారిని జుడోలో నేలకేసి కొట్టటం చిత్రాంశం. పిల్లవాడు చిన్న దేశమైనా ఉక్రెయిన్‌కు ప్రతీక ఐతే బ్లాక్ బెల్టు సాధించి, మార్షల్ ఆర్ట్‌ను ఇష్టపడే పుతిన్ బలమైన రష్యాకు ప్రతీక, కె.జి.బి. రహస్య పోలీస్ దళ సభ్యుడు కూడా. 2023 ఫిబ్రవరి 24 నాటికి రష్యా దాడి చేసి సంవత్సరకాలం గడచిపోయిన సందర్భంగా ఉక్రెయిన్ ప్రభుత్వం బాంక్సీ మ్యూరల్‌ను పోస్టేజీ స్టాంపుపై ముద్రించి విడుదల చేసింది. స్టాంపు ఎడమ భాగంలో కూలిపోయిన గోడ, క్రింద మూలలో FCK PTN అక్షరాలు కనిపిస్తాయి. Stop War & PUTIN అని వాటి అర్థం. దీనిపై గార్డియన్ పత్రిక వెంటనే ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది – ప్రభుత్వం స్మారక స్టాంప్‌ను విడుదల చేస్తే ఉక్రెయి సెంట్రల్ బ్యాంక్ దాడికి గుర్తుగా కరెన్సీ నోట్‌ను విడుదల చేసింది. 1.5 మిలియన్ స్టాంపుల్ని అమ్మగా వచ్చిన ఆదాయాన్ని దాడివల్ల నష్టపోయిన జనాన్ని ఆదుకోవడానికి వినియోగించబడుతుంది అని ప్రకటించింది. బాంక్సీ 2022 శిశిరంలో కీవ్‌ను రహస్యంగా సందర్శించి, యుద్ధ వినాశనాన్ని చూచి చలించినదానికి ప్రతిస్పందనే ఈ మ్యూరల్. యుద్ధ వినాశనాన్ని, దాన్ని ఆపవలసిన అవసరాన్ని ప్రపంచ దృష్టికి తేవడం బాంక్సీ ఉద్దేశం. జాతీయ, అంతర్జాతీయ సమస్యలపై బాంక్సీ రాజకీయ చైతన్యం ఎంత వేగంగా, తీవ్రంగా ఉంటుందో అతని మ్యూరల్సు, గ్రాఫిటీ తెలియజేస్తాయి. ఉక్రెయిన్ జనానికి శత్రుదేశంపైన ఎలాంటి భావం కలిగి ఉందో సరిగా చెప్పే ప్రతీకాత్మక చిత్రం ఇది అని పోస్టేజీ స్టాంప్ కొనడానికి వచ్చిన గుంపులోని ఒకరు వ్యాఖ్యానిస్తారు.



టి.వి. ప్రసాద్ - హైదరాబాద్. ఫోన్: 798 139 8250.



స్త్రీల పాటల్లో అప్పగింతలు

– దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు

స్త్రీల పాటల్లో అప్పగింతలు పాటలు ముఖ్యంగా గుర్తుకొచ్చేది సీతమ్మ. భూమ్మీద సీతమ్మ కన్నా గొప్ప స్త్రీ లేదా అని ప్రశ్నించుకుంటే చాలామంది ఉన్నారు. వివిధ ప్రక్రియల ద్వారా సీతమ్మ పాత్ర వ్యాపించడంవల్ల సీతమ్మను ఉదాహరణగా తీసుకుంటారు. పాటల పుట్టుక, ఏరుల పుట్టుక తెలుసుకోవడం కష్టమంటారు. రెండింటి గుణం కూడా సమానమే. రెండూ ఉధృతంగా ప్రవహిస్తయి. ఒకటి మాగాణిని తడిపి మానవులను తనిపితే, మరొకటి హృదయాన్ని తడిపి మస్తిష్కాన్నే తనుపుతుంది. జానపదుల్లో ఉరకలు వేసే ఆనందం, దుఃఖం, భయం, ఆందోళన మొదలైన గుణాలకు మారురూపే జానపద సాహిత్యం. దానికి అడ్డుకట్టలు లేవు. లోకవ్యవహారమే వ్యాకరణం. జానపదులేన వీటి ఛందస్సు గ్రంథాల్లో ఉండదు. ఆ జానపదుల కాళ్లల్లో. నోళ్ళల్లో ఉంటుంది. నోటికీ. కాలికీ పొందిక కుదిరిందంటే అదే ఛందస్సు. సాహిత్య జగత్తుకన్న సామాన్య జగత్తు సత్యసామీప్యమని అందరికీ తెలుసు. అందుకే ఈ పాటలలోని అలంకారాలు వేరుగా లోకంనుండే పుట్టుకొస్తాయి, లోకాన్ని కదిలిస్తాయి.

స్త్రీల పాటలకు పూర్వం రచయితలు, రచయిత్రుల నుండి రాసినవారు ఎవరూ లేరు. కానీ స్త్రీల తమతమ పదాల అల్లికలను నేర్పరితనంగా వచ్చే పాటలే పాటలు. అందులో పల్లెపదాల జానపదాల్లో ఒక ఊపందుకున్నాయి. ఈ పాటలకు కర్తలెవరో చెప్పడం దుర్లభం. వారిలో చాలామంది తమ పేరు ఎక్కడా చెప్పుకోరు. తమ పేరు ప్రచారానికి రావాలని వారు ఆశిస్తేగదా? తామల్లిన పాటను ప్రక్కవారూ పాడుతుంటే విని ఆనందించడంవరకే వారి తృప్తి. తర తరాలు తమ పాట నిలిచి ఉండాలని ఆశిస్తే ఆశించి ఉండవచ్చుగాని వారి పేరు నిలవాలని వారికున్నట్లే లేదు. నేటి పరిస్థితులు తద్భిన్నాలు. ప్రజల పరిస్థితి మెరుగెకొద్దీ తమతమ ఆలోచనలకు పదును పెట్టేవాళ్ళు. అలా ఆలోచించి చూస్తే నాగరికత పెరిగేకొలదీ ఈ జానపద సాహిత్యం ఉత్పత్తే నశిస్తుందని చెప్పవచ్చు. ఉత్పత్తే కాదు, ఉన్నవాటి ప్రచారమూ తగ్గుతుంది. వీటి ప్రచారం తగ్గడానికి హేతువు చెప్పడం సులభం. కాయకష్టం చేస్తూ, ఆ కష్టాన్ని మరువడానికి తీసే కూని రాగాలు, రాగంలో జనించే సాహిత్యం మరుగుపడడానికి కారణం యాంత్రికయుగ మాహాత్మ్యమని చెప్పొచ్చు. వడ్లు దంచవలసిన పని లేదు. వడ్లే కాదు, కనీసం కారం దంచుకోవలసిన పనీలేదు. అందుకే దంపుడు పాటలు పుట్టవు. పుట్టినవాటిని పాడే అవసరంలేదు. కోడెలను కట్టుకొని మోట తోలుతూ మోకుమీద కూర్చుండే అవసరం ఉంటేగదా రైతు యువకుడు ఏల పదాలు సాగదీయడానికి. మంచెమీద కూర్చుండి వడిశెల విసురుతుంటేగదా వడిశెలలో గీతం పరుగెత్తేది. కాలానుగుణంగా పద్ధతులు మారినాయి, పాటలూ మారినాయి.

జానపద కళాకారుల గుర్తింపు రాకముందే స్త్రీలు తమదైన శైలిలో పాటలు పాడేవారు. ఈ పాటల్లో కొన్ని గాథాసహితా ఉన్నవి. అవి వీర, శృంగార, కరుణ, అద్భుత రసాదుల నాధారం చేసుకొని పుట్టినవి. రామాయణ భారతాది, పురాణం గాథలు ఈ పాటల్లో కనుపిస్తవి. అందులోనూ ఒక్క సీతాదేవిని గురించి వెలసిన పాటలే చాలా ఉన్నాయి. కరుణరసాత్మకమైన 'సీతమ్మ అప్పగింతలు' అనే మూడు పాటలను పరామర్శించడమే ఈ నా ప్రయత్నం. ముందే అనుకున్నట్లు ఈ పాటలకాధారం కూడా లోకమే. వాల్మీకి కాదు. భాస్కరాదులూ కాదు.

పెళ్లయిన తర్వాత ఒకరకంగానూ పెళ్ళికాకముందు మరోరకంగానూ పాటలు ఉండేవి. వివాహానంతరం బిడ్డనత్తవారింటికి పంపడం ఒక ముఖ్యఘట్టం. అది ఆడబిడ్డ జీవితంలో ఒక ముఖ్యమైన మలుపు. ఇంతకు ముందరి జీవితం వేరు. తానిక గడపబోయే జీవితం వేరు.

తల్లిగారింట్లో తన ఇష్టానికి ఎదురు లేకపోవచ్చు. ఇక అలా సాగదుగదా! తను ఇతరుల కొరకు కొన్ని అలవాట్లు మార్చుకోవలసి రావచ్చు. తలిదండ్రుల దృష్టిలో ఆమె ఎప్పుడూ చిన్నపిల్లే. ఈ విషయం 'సీతమ్మ అప్పగింతలు' అనే పాటలో ఎంతో చక్కగా నిరూపించబడింది. నిజంగా సీతాదేవి రాజపుత్రి. ఆమె కనుసన్నలలో ఉపచరించే చెలికత్తెలెందరో ఉంటారు. ఆమె చిన్న-చిన్న పనులన్నీ చేయవలసిన పనిలేదు. కాని, తల్లి 'జానకిని దెచ్చి కౌసల్య చేతిలో చెయినొవ్వగించి ఆవనిజ భారము మీ భారమంటుంది. అంతేగాక-

నెయి కాచ నేరదు నెలత సుమి వదినె
చల్ల చేయ నేరదు సఖియసుమి వదినె

అవి అంటుంది. ఈ పై రెండు పనులూ సామాన్యమైన పని పాటలు. ఇవి సీతపరంగా చెప్పబడినా, ఆలోచిస్తే లోకానికి చెప్పినట్లయింది.

ఒక సామాన్యుల యింటి ఆడబడుచు నేర్చుకోవలసిన, చేయవలసిన నిత్యగృహకృత్యాలివి. అత్తవారింటికి వెళ్ళేటప్పటికి కనీసం ఊడ్వడం, ముగ్గువేయడం, చల్ల చేయడం, నెయ్యి కాచడం మొదలైన పై పనులైనా నేర్చుకొని ఉండాలని వారి ఊహ. ఇవైనా తెలియకపోతే లోకులు, - పక్కింటి అమ్మలక్కలు 'ఏవమ్మాయమ్మా, చల్లకవ్వం పట్టడం చేత గాదు' అని మెటికలు విరుస్తారు. అత్తగారూ ప్రక్కింటావిడతో అంటుంది- 'ఏమి యీవరాలో? అమ్మాయికి చీపురుకట్ట పట్టుకోను నేర్పలేదు. మేమూ పెంచాం ఆడపిల్లల్ని' అని సాగదీస్తుంది. నిజానికి ఆమె ఆలాగే పెంచినా. అందుకే ఈ ప్రాథమిక కృత్యాలను గురించి ఈ పాటలో యింత నొక్కి చెప్పడం జరిగింది. అంతేగాని, సీత యీ పనులు చేయవలసిన అవసరం ఉండి కాదు. వరుల దృష్టిలో బిడ్డ పెద్దదయినా, తల్లి దృష్టిలో చాలా చిన్నదిగానే ఉంటుంది. అందుకే ఈ పాటలో సీతను అప్పగిస్తూ తల్లి - ***ఎడంటి బిడ్డనన్నెడబాయ దమ్మ*** అని అంటుంది. తనను ఎడబాయకపోవడం నిజమే కావచ్చుగాని, ఎడచంటిబిడ్డ మాత్రంగాదు. సీత. అయితే ఆమె మమకారం అట్టిది అని అర్థం.

తలయెత్తి చూడకుమి తరుణి మగవార్ని
పలుకు మని యొకమాట బయట పెట్టకుమీ'పెట్టకుమీ

అని బుద్ధులు చెబుతుంది. అంతేకాదు, 'పతియన్నమాట ఎంత హితులకైనా ఎరిగించరాదు. విభుడు మన్నించెనని విర్రవీగరాదు. పలుమార్లు పల్లెత్తి నవ్వరాదు.'

ఇన్నీ చెబుతూ ఒక ఆణిముత్యంవంటి మాట చెప్పడం జరిగింది. అది 'పలుమారు మామీదప్రేమ లుంచకుమీ' అనేది. స్త్రీలు చాలామంది పొరపాటు చేసేది ఇక్కడే. తన పుట్టింటివారిని మరువలేక ప్రవర్తించడం, అది ప్రమాదాలకు దారితీయడం లోకంలో చూస్తాం. పుట్టింటివారి గొప్పదనాన్ని అత్తవారింట అదేపనిగా ఉచ్చరించడం మంచిదిగాదనే ఆలోచనే కొందరికి ఉండదు. అత్తగారింటివారి మనసుకు నొప్పి కల్గుతుందనే సంగతి తెలియక పొరపడుతారు. సంసారంలో చిచ్చు రగుల్కొంటుంది. అందుకే సీతనాధారంగా చేసుకొని లోకానికి 'పలుమారు మామీద ప్రేమ లుంచకుమీ' అని హెచ్చరించడం జరిగింది.

రెండవ పాట 'సీత అప్పగింతల పాట'. ఈ పాటలో జనకుడు ప్రముఖంగా కనిపిస్తాడు. జానకిని తెచ్చి దశరథుల చేతిలో చెయ్యొప్పగించి. 'కై కిమ్మచేతిలో చెయ్యొప్పగించి' అని వర్ణించుకుంటూ పోయి 'శాంతమ్మ చేతిలో చెయ్యొప్పగించి అపుడు జనకరాజు కన్నీరు బెట్టె' అని ఉంటుంది. ఈ వ్రాసిన వారి లోకజ్ఞానం యిక్కడే ఉంది. ఏఆడబిడ్డ సగంమొగుడు' అని వ్యవహారం గదా! అందుకే జనకునికి శాంతను చూడగనే కన్నీరు వచ్చి ఉంటుంది. అయితే శాంత అందరిలాంటిది కాదు. అందుకే ఆమె

జనకుడా! మీ బిడ్డ కేమి కొదువయ్యా
అలరుపాన్పూమీద అమరుండగలదు

అని అంటుంది. ఆమెననుసరించి రాముడూ, కౌసల్యా ఆవే మాటలు పునశ్చరణ చేస్తారు. ఆడబిడ్డ, అత్త, భర్త మువ్వురూ 'అలరు పాన్పూ మీద అమరుండగలదు' అవి పల్కడం జనకునకు ఊరటగల్గించింది.

ఈ పాటలో మాతృహృదయం కూడా చక్కగా ప్రదర్శింపబడింది. సీత తల్లినియపరాలు కౌసల్యను చెయిపట్టి పిలచి-

నెయి కాచ నేరని నెలత సుమి వదినె
ఆకలికి నోర్వవి యబల సుమి వదినె
ఆకలికి యెన్నడు అడగనేరదు
వేళ యెరిగి పెట్టుమా వెలది మావదినె అని అంటుంది.

ఇక్కడ సీత సీత కాదు. తల్లి సీతతల్లి కాదు. లోకంలో తన కూతుర్ని పంపేప్పుడు ఒక తల్లి హృదయం ఎలా తల్లడిల్లిపోతుందో వర్ణింపబడింది. తను రాణిననే సంగతి మరచిపోయింది. బేల అయింది. రాచగాంభీర్యంతో ఇక్కడ పనేలేదు. మాతృ హృదయం ప్రదర్శింపబడాలి. ఇక్కడ అదే జరిగింది. సీత జగన్మాత కావచ్చు. కానీ ఇక్కడ అత్తవారింటికి పంపబడే ఆడపిల్ల మాత్రమే. అందుకే తల్లి దృష్టిలో ఏమీ తెలియని అమాయిక. ఎట్లో వారిచేతుల్లో పెట్టింది. హృదయం బ్రద్దలైంది.అందుకే ఆపుకోలేక

అమ్మమ్మ నిన్నెట్లు అంపుదును నేను
బొమ్మరిండ్లు గట్టి బొమ్మలను బెట్టి
ఆట యెవరాదెద రమ్మ మా యింట
బొమ్మలకు సొమ్ములు పోరి తెమ్మనుచు
నన్నెవ్వరడుగుదురు నా తల్లి సీత
ఇంట గుజ్జనగూళ్లు ఇట్టె పండుచును
అట్లేవ్వ రొండెదరు అమ్మ మాయింట
ఆడుచు పాడుచు నట్టేర మ్మనుచు
నన్నెవరు పిలచెదరు నా తల్లి సీత

అని దీనంగా బొమ్మలవైపు, తన అందాల బొమ్మ సీతవైపు చూస్తుంది. వేరే సంతానమూ లేదు చూచి సంతృప్తిపడడానికి. ఈ పరిస్థితుల్లో ఉన్న తలిదండ్రుల స్థితి కనులకుగట్టి, కన్నులు చెమ్మగిలేట్లు సాగిం దీరచన.

పై రెండు పాటలలో కరుణరసం అతివేలంగా ప్రవహించింది. ఇక 'సీతను అత్తవారింటికి పంపుట' అనే పాటలో కరుణరసంతో పాటు శృంగారం కూడా చోటుచేసుకొన్నది. పై పాటలలో సీత చాలా చిన్నపిల్లవలె వర్ణన జరిగింది. ఈ పాటలో సీతరాముని కౌగిలి చవిచూచింది. చెలికత్తెలు వరిహాసమాడుతూ వాకిట నిలుచుండి, సీతారాములను గదిలోకి నెట్టి, తలుపులు మూసినారు. కొక్కారొకోయని కోటి కుక్కుటములుకుయ్యగా వారిరువురూ పసుపంపిన చీరలతో, పై చిట్లిన గంధంతో, విడివిడికొప్పులతోనూ, ముసిముసి నవ్వులతోనూ గదినుండి బయటికి వచ్చారట, అది చూచిముచ్చటపడి చెలులు 'చెలియెంగిలి తింటివిగా' అని 'వింతగ పకపక నవ్వుచు, యింతిని చూచిరి వారు' అని చెప్పబడింది. ఇంతిని (సీతను) చూస్తూ, కాంతుని గేలి చేయడంలో భావం? రాముడు వారికి కొత్త. సీతతో చనువు. కానీ రాముని గేలి చేయాలి. అందుకే సీత పెదవులు చూస్తూ గేలి చేస్తారు. రాముడు చెలియెంగిలి తినినట్లు వారికే విధంగా తెలిసింది? సీత పెదవులపై రాముని దంతక్షతాలున్నందువల్ల. మా సీతమ్మ పెదవుల నింతకఠినంగా కొరికావు అని కఠినంగా అనడంకన్నా ధ్వనించేటట్లు 'చెలియెంగిలి తింటివిగా' అని గేలి చేయడం బావుంది. రాముడు తన చర్యను గురించి తానే ఆలోచించుకొనేట్లు చేసింది. ఈ శృంగార మిళితమైన హాస్యం.

ఈ పాటలో ఇంకొక ప్రత్యేకత ఉంది. పై రెంటిలో తల్లి సీతకు బుద్దులు చెబుతుంది. ఈ గేయంలో తల్లి ప్రవనక్తి ఉండదు. అంతా జనకుని చేతిమీదుగా జరుగుతుంది.

జనకభూపతి కూతురం బిలిచీ
రావే నను గన్న కూతురా రావే చంద్రవదనా!

* * *

అని పిలిచి అన్ని బుద్ధులూ చెప్పి రామునితో
అల్లుడవూ చెలికాడవు, తల్లివి తండ్రివి నీవే

అని అప్పగిస్తాడు. ఇక మాటలుపెకలి రావు. అది సహజం. అందరికన్నా సీతను పంపే జనకునిది, శకుంతలను పంపేకణ్వునిది పరిస్థితి వేరు, ప్రేమలు వేరు. కన్న ప్రేమకన్న పెంచిన ప్రేమ మిన్న. బిడ్డలు లేని కొరత తీర్చారు సీత. శకుంతలలు. కానీ ఆ సంతోషం జనక, కణ్వులపాలిటికి తాత్కాలికమై తల్లడిల్లజేసింది. అందుకే ఇక్కడ జనకుడు సీతతో 'నను గన్నకూతురా' అని అంటాడు. తను ఆమెను కనకపోయినా ఆమెని 'నను గన్న' అని అనిపించడంలో జనకుని స్థితి విదితం.

ఈ విధంగా ఈ పాటలు అతి మనోహరంగా ఉంటాయి. పండితుల దృష్టికి గోచరించే దోషాలెన్ని ఉన్నా హృదయాన్ని కదిలించే శక్తిమాత్రం వాటికుంటుంది. అందుకే అవి మనసుల్లో నిలిచి ఉంటాయి. ఒక్కొక్క పాట ఒక్కొక్క రత్నం. అయితే, వెలికితీసి ఒక్కొక్క దాన్ని సానబట్టి కోణాలు చెక్కితేగానీ వెలుగులనీయవు.

దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు - విజయవాడ. ఫోన్: 949 303 3535.

మూడు శాసనాల వెలుగులో...

– గార రంగనాథం

గనిని ఎంత తవ్వుతుంటే అంత విలువైన వజ్రాలు లభిస్తాయి. చీకటి గుహను టార్చిలైటు వేసి వెతుకుతున్నకొద్దీ అపురూపమైన విషయాలు కనిపిస్తూనే ఉంటాయి. చరిత్ర కూడా అలాంటిదే! రోజూ చూస్తున్న సాదా వస్తువులే చరిత్రకారుడి వైపు చూచి తమ చరిత్ర కనుక్కోమంటాయి. గత రెండేళ్ళుగా రాజాం ప్రాంత చరిత్ర రచన చేస్తూ, ఆ పనిమీద ఈ ప్రాంతంలోని అనేక విగ్రహాలను, శాసనాలను పరిశీలిస్తున్నాను. చారిత్రక గ్రంథాలు చదువుతున్నప్పుడు వాశిష్ఠుల రాజధాని సిరిపురం అని చదివాను. దానికోసం ముద్రితమైన శాసనాలు మూడు లభించాయి. ఒకటి ఆ సిరిపురం చెఱువులో దొరికిన అనంతవర్మ వేయించిన సిరిపురం తామ్రశాసనం, రెండు ఆ చెఱువుకు ఎగువన ధవళపేట పొలాల్లో దొరికిన ధవళపేట శాసనం, మూడవది విశాఖపట్టణంలోని విశాఖేశ్వర ఆలయ నిర్మాతగా చెప్పుకుంటున్న విశాఖవర్మ శాసనం. ఈ మూడు శాసనాల వెలుగులో రెండువేల ఏళ్ళ సిరిపురం చరిత్రను అక్షరం చేద్దామన్నదే ఈ ప్రయత్నం.

పై మూడింటిలో ముందుగా సిరిపురం, ధవళపేట శాసనాలను ప్రక్కప్రక్క పెట్టి పరిశీలించి, బేరీజు వేద్దాం. ఈ రెండు శాసనాలను శ్రీకాకుళం పట్టణానికి చెందిన అరసవల్లిలోగల బోర్డు హైస్కూలులో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు మండా నరసింహం పంతులు తొలుత లోకానికి తెలియజేశాడు. ప్రస్తుతం శ్రీకాకుళం జిల్లా పొందూరు రైల్వేస్టేషన్‌కు దగ్గరలో ఈ సిరిపురం చెఱువు ఉంది. అది జిల్లాలోనే అతి పెద్ద రెండవ చెఱువు. ఆ చెఱువు తవ్వుతుండగా ఓ రాగి శాసనం దొరికింది. ఈ శాసన వివరాలను 1931 సెప్టెంబరు నెల భారతి లో నరసింహం పంతులు ప్రకటించారు. శ్రీకాకుళానికి ఏడెనిమిది మైళ్ళదూరంలోగల సిరిపురంలో దొరికిందని చెప్పారు. శాసనం దొరికిన స్థలాన్నిబట్టి దీనిని సిరిపురం శాసనం అని పిలుస్తారు.

మూడు రేకుల శాసనంలో చివరి రేకు లభించలేదు. దొరికిన రెండు రాగి రేకులలో మొదటి పుట అట్టవలె ఖాళీగా ఉంచగా, మిగిలిన మూడు పుటలలో పుటకు 6 లైన్ల వంతున 18 లైన్లతో నిండి ఉంది. బ్రాహ్మీలిపిలో, సరళ సంస్కృతంలో, చక్కటి దస్తూరీతో, లోతైన అక్షరాలతో రాయబడిన శాసనం.

ఇందులో అనంతవర్మ (400–450) తాను కళింగాధిపతినని, మాతాపితృపాద భక్తుడనని, వాశిష్ఠి వంశీయుడనని చెప్పుకొన్నాడు. తన తాత గుణవర్మ (300–375) అని, తండ్రి ప్రభంజన వర్మ (375–400) అని రాసుకున్నాడు. దేవపురం నుండి వేయించినట్టు అందులో ఉంది. ఈ దేవపురాన్ని శృంగవరపుకోట దరి దేవాడ అని చరిత్రకారులు నిర్ణయించారు.

"అష్టాశ్వక సంఖ్యభ్యః మహాశ్వయుజ సంవత్సరే, మాఘమాస పౌర్ణమాస్యా" అని తిథిని చెబుతూ, అత్రిగోత్ర, చరణ సంబంధి ఎనమండుగురు బ్రాహ్మణులకు పట్టణ (పాతపట్టణమా?) భోగ (డివిజన్)లోని, ఖరపురి మదంబ (11గ్రామాలతో కూడిన ఖరపురి సబ్‌డివిజన్)లో, తోంతాపర (తోటాడ) అనే గ్రామాన్ని అగ్రహారం చేసి ఇచ్చాడు. ఈ తోటాడ పాలకొండకు దగ్గరలోని బూర్జ మండలంలో ఉంది. యుద్ధంలో విజయం సాధించినందుకు ఈ దానాన్ని ఇచ్చినట్లు తెలుస్తోంది.

రెండవ శాసనం ధవళపేట శాసనం. దీనిని ఉమవర్మ (350–380) వేయించాడు.

"భగవద్భక్తుడు, బప్పభట్టారక పాదభక్తుడు, అయిన మహారాజా ఉమవర్మ మహేంద్రభోగానికి చెందిన కుత్తూర

అనే గ్రామాన్ని ఛాందోగ శాఖకు చెందిన వత్సగోత్రుడు అయిన ఖల్లస్వామికి 'సునగరము' నుండి అగ్రహారంగా ఇచ్చాడు" అనేది శాసన సారాంశం.

ఈ శాసన కాలానికి చెందిన ఏరకమైన ఆధారాలు ఇందులో దొరకనందున ఈ కళింగానికి చెందిన చండవర్మ వేయించిన కోమర్తి శాసనాన్ని, ఇంద్రవర్మ వేయించిన జర్జంగి శాసనాన్ని పోలిన రాత ఇందులో ఉండడంవలన ఇది క్రీ.శ. 400-450 సంవత్సరాల మధ్య వేయించిన శాసనమని చరిత్రకారులు నిర్ధారించారు. దీనిని కూడా అదే నరసింహం పంతులు సంపాదించి వెలుగులోకి తెచ్చారు. ధవళపేటలో దొరికింది కనుక ఇది ధవళపేట శాసనం అయింది. శ్రీకాకుళానికి 12 మైళ్ళదూరం ధవళపేట అని పంతులుగారు పేర్కొన్నారు. ఈ ఊరు కూడా అదే పొందూరుకు సమీపాన ఉత్తరాన ఉంది. ఈ శాసనం కూడా రైతు పొలం దున్నుతుండగా దొరికింది. మూడు రేకులలో ఒక రేకును బంగారం అనుకొని రైతు కరిగించగా, మిగిలిన రెండు రేకులు దొరికాయి. మొదటిదానిలాగే తొలిపుట ఖాళీగా ఉండగా, మిగిలిన మూడుపుటలలో పుటకు నాల్గు లైన్లవంతున 12 లైన్లు కలిగి ఉంది. సరళ సంస్కృతంలో రాయబడి ఉంది. అంతే కాకుండా మొదటి శాసనం దొరికిన సిరిపురం చెఱువు గర్భానికి ఎగువనే ఈ ధవళపేట ఉంది. చెఱువు ఎంత పెద్దది అనుకొన్నా ఈ రెండు గ్రామాల మధ్య వ్యాసం మైలు మాత్రమే! పై అన్ని విషయాలను అంచనా వేసి చూడగా ఇక్కడి పెద్దచెఱువు తవ్విన ప్రదేశం, దానికి ఇరువైపులగల రెండు గ్రామాల పరిధిలో ఒకప్పుడు 'సునగరం' అనే పట్టణం ఉండేదని అర్థమౌతుంది. అది వాశిష్ఠుల రాజధానిగా విలసిల్లిందని నిర్ధారించవచ్చు. దీనిని ఉమవర్మ వేయించగా, ఇతడు కూడా వర్మ నామాభిధేయుడు, పితృభక్తుడు. శాలంకాయనులు, మాఠరులు, వాశిష్ఠులలో కొందరు పితృభక్తులమని, మరికొందరు బప్ప భట్టారకులమని చెప్పుకోగా ఈ ఉమవర్మ పితృభక్త వంశీయుడని బి.యస్.యల్. హనుమంతరావు తన *ఆంధ్రుల చరిత్ర* లో రాశారు. ఆయా రాజుల ప్రక్కనగల సంవత్సరాలను కూడా ఆ గ్రంథం నుండే గ్రహించాను. 'వీరిలో ఉమవర్మ శాసనములు మూడు దొరకినవి. ఒకటి వర్ధమానపురము నుండియు, మరియొకటి ను నగరము నుండియు, ఇంకొకటి సింహపురము నుండియు ఈయబడినవి.... ఈ దృష్టితో చూచినచో ను నగరము కూడా సింహపురము అగునేమోయని తోచుచున్నది'.

-తెలుగు విజ్ఞాన సర్వస్వం-మూడవ సంపుటము-తెలుగు సంస్కృతి-తెలుగు భాషాసమితి-మద్రాసు-పుట-103.

ఇందులో రెండవదైన 'ను నగ'రాన్ని కూడా సింగుపురంగా భావించడంకంటే అది ఈ సిరిపురం అని భావించడమే సమంజసం. ఈనాడు దక్షిణ కళింగంలో పిఠాపురంతో పాటు, దేవాడ, సింగుపురం, వర్ధమానపురం, సిరిపురంలు రాజధానులుగానో ఉపరాజధానులుగానో ఉండేవన్నది చరిత్ర. తొలుత వాశిష్ఠ వంశీయులు దేవపురాన్ని పాలించారు. విజయనగరం జిల్లాలోని శృంగవరపుకోట తాలూకాలోని దేవాడే దేవపురం అని దానిలో రాశారు. దేవపుర వాశిష్ఠులు శాలంకాయనుల ధాటికి భయపడి సిరిపురంలో స్థిరపడి ఉంటారు.

ఇక్కడ రాజధానికి చెందిన భౌగోళిక పరిస్థితులను అంచనా వేయవచ్చు. చెఱువు దక్షిణ హద్దున ఓ పెద్ద రాతికొండ ఉందికదా! దానికి దక్షిణ దిశ నుండి లైదాం గెడ్డ (వాగు) ప్రవహిస్తుంది. ఉత్తరవైపు నుండి మండాకురిటి గెడ్డ పారుతుంది. ఈ ఎత్తైన రాతికొండ శత్రువులను అడ్డుకొనే పెట్టని కోటగోడ. దానిపైనుండి శత్రువుల రాకను కూడా కనిపెట్టవచ్చు. అయితే కొండ ఉపరితలం భవనాలు కట్టగలంత సమతలమైంది కాదు. అలాగే వాగులు అగడ్తలలా శత్రువులను కొంతవరకు అడ్డగలవు. ఆ రెండు వాగుల మధ్య భాగంలోను, మండాకురిటి గెడ్డకు ఉత్తరాన శత్రుదుర్భేద్యమైన ఓ నగరం వెలసిందని చెప్పవచ్చు. ఆ వాగులు నగరానికి తగినంత నీటిని నరఫరా చేయగలవు. మంచి పంటలు పండించగలవు. అందుచేతనే ఇది శ్రీపురం, సిరిపురం, సునగరం అయిందని అంచనా వేయవచ్చు.

ఇక మూడవది విశాఖ వర్మ వేయించిన శ్రీ పురంశాసనం.

వైశాఖేశ్వర ఆలయ నిర్మాత ఎవరు? అనే ప్రశ్నార్థకమైన వ్యాసాన్ని ఎ. విజయ దత్తాత్రేయ శర్మ మార్చి 1990 భారతి పత్రిక 5,6,7 పుటలలో రాశారు. వాటిలో "ఇతడు తన రాజ్య సంవత్సరము, ఏడవయేట,

హేమంతర్తువులోని, ఏడవపక్షమున, ఇరువదవ దినమున తన తండ్రి పుణ్యార్థముగా కొరోసోటక పాంచాలిలోని టాంపాయక అను గ్రామమును విష్ణుశర్మ, శ్రేష్టిశర్మ, అగ్నిశర్మ, నాగశర్మ, శివశర్మ అను ఐదుగురు ఆత్రేయ గోత్రజులగు బ్రాహ్మణులకు దానముగా ఇచ్చిన తామ్రశాసనం లభించినది. ఆ శాసనములో ఇతడు బప్ప భట్టారక పాదభక్తుడని విశేషించి చెప్పబడుట అందుకు తగినట్లే ఉన్నది. శాసన లిపిని బట్టి మాఠర కులజుడైన శక్తివర్మకంటే ముందుండినవాడని తోచుచున్నది. ఈతని రాజధాని 'శ్రీ'పురము. అది నేటి శ్రీకాకుళం జిల్లాలోగల సిరివురము (పాలకొండ, సోంపేట, చీపురువల్లి తాలూకాలలో నేదేని) కావచ్చు. ఈతడు తన రాజ్యమును అశ్వమేధ, రాజసూయములు నిర్వహించిన విష్ణుకుండిన మొదటి మాధవవర్మవలనగాని, కళింగములోనివాడే అయిన వాశిష్ఠ గుణవర్మవలనగాని, శైలోద్భవులవలనగాని యుద్ధములలో కోల్పోయి ఉండవచ్చునని బి.వి. కృష్ణారావు అభిప్రాయం" అని రాశారు. అయితే విశాఖవర్మ కాలానికి చెందిన ఆధారాలు ఇదమిత్థంగా లభించలేదు. అతడి శాసనాక్షరాలు పితృభక్త, మాఠర, వాశిష్ఠ రాజుల శాసనాక్షరాలతో పోలి ఉండడంవలన వీరికి చెందినవాడే అని చరిత్రకారులు నిర్ధారించారు.

అయితే పై మూడు తాలూకాలలో, ఇతరత్రా సిరివురం అన్న పేర్లున్న గ్రామాలు ఉన్నప్పటికీ మాఠరులకు, వాశిష్ఠులకు చెందిన మూడు శాసనాలకు సంబంధించిన గ్రామం పొందూరు దగ్గరిదే!

మొదటి శాసనం వాశిష్ఠ కులజుడైన అనంత వర్మ శాసనం ఈ ఊరి చెఱువులో దొరికింది. ఆ శాసనం దొరికిన చెఱువుకు ఎగువన మైలు దూరంలో ధవళపేట శాసనం దొరికింది. అందులో నునగరం నుండి వేయిస్తున్నాని ఉమ వర్మ రాసుకున్నాడు. విశాఖవర్మ శ్రీపురంనుండి కోరోషండ శాసనాన్ని వేయించాడు. ఇది పర్లాకిమిడి దగ్గరి దానగ్రామమైన కొరసవాడలో పొలం దున్నిన రైతువద్ద దొరికినందున పర్లాకిమిడి దగ్గరి సిరిపురం నుండే విశాఖ వర్మ వేయించాడని బీహార్, ఒరిస్సా రీసెర్చ్ సొసైటీకి చెందిన గ్రంథంలో సత్యనారాయణ రాజు నిర్ధారించినా, ఎఫిగ్రాఫియా ఇండికాలో జి. రామదాసు ఇది పొందూరు దగ్గరి సిరిపురమేనని నిర్ధారించారు. ఈ సిరిపురానికే ఒకప్పటి రాజధాని చిహ్నాలున్నాయి. విశాఖవర్మ పైన చెప్పిన ఈ సిరిపురాన్ని పాలించిన వాశిష్ఠుల లేదా మాఠర వంశీయుడు. ఈ విశాఖవర్మ విశాఖవట్నంలో విశాఖేశ్వరుని ఆలయాన్ని నిర్మించాడు. విశాఖకు పొందూరు దగ్గరిదిగాని పర్లాకిమిడి కాదుకదా!

ఇక ఈ శ్రీపురము రాజధానిగా చేసుకొన్న ఈ విశాఖవర్మ, ధవళపేట శాసనం వేయించిన ఉమవర్మ ఇద్దరూ బప్పభట్టారక పాదభక్తులు. వర్మ నామాభిధేయులు. 1600 ఏళ్ళక్రిందట రాజులచే ప్రయోగింపబడిన ఈ బప్పభట్టారక వాసన ఈ సిరిపురంలో నేటికీ ఉంది. తండ్రిని పేర్కొనే 'బప్ప' పదాన్ని కళింగాంధ్రలో బావుగా మార్చి వాడుకుంటుంటే, అదే 'బప్ప'ను అదే అర్థంలో నేటికీ ఒరియావారు వాడుకుంటున్నారు.

ఈ సిరిపురంలో ఓడ్రదేశానికి చెందిన పొందర్లు (కూరాకళ్లు), అటుకుళ్ళవారు నేటికీ తండ్రిని బప్ప అనే వ్యవహరిస్తారు. 343లో సముద్రగుప్తుడు కళింగంపై దండెత్తాడు. ఆతరువాతి కాలంలో "శాలంకాయనులు పిఠాపురం మీద దాడిచేసి తరిమి వేయడంవల్ల, వాశిష్ఠీవంశీయులు తమ రాజ్యాన్ని శ్రీకాకుళం దగ్గర సింగుపురానికి, టెక్కలి సమీపంలో ఉన్న వర్ధమానపురానికి, పొందూరు సమీపంలో ఉన్న సిరిపురానికీ మార్చుకొన్నారు" -శ్రీకాకుళ జిల్లా చరిత్ర- పుట25- ఆదిభట్ల వేంకటరమణ." the Mathara kings were also distressed by wars and rebellions in Kalinga as the frequent change of their capital from Simhapura to Vardhamanapura and then to Sripura, and the events of the reigns of Umavarman would indicate"- Early dynasties of andhradesa - Bhavaraju venkata krishna rao- pages. 630,631.

ఇక్కడ తలదాచుకోడానికి ఇది ఓ మూలనున్న, సంపద్వంతమైన గ్రామం కావడం కారణంగా చెప్పవచ్చు. దాని పేరే సిరిపురం కదా! గుప్త వంశానికి చెందిన సముద్రగుప్తుడు (క్రీ.శ 340 – 375) తూర్పుతీరం వెంబడి ఉత్తరదిశ నుండి దక్షిణకు పయనించి, క్రీ.శ. 343లో ఆయా రాజులను జయించి కంచివరకు వెళ్ళినట్లు అలహాబాదులో శాసనాన్ని వేయించుకున్నాడు.

ఆ దాడులలో ఈ విశాఖవర్మగాని అతని పూర్వులుగాని తమ రాజధానులను వదిలి ఈ శ్రీపురానికి చేరుకొని తలదాచుకొని ఉంటారు. ఈ విధమైన అంచనావలన క్రీ.శ. 350 నుండి, గాంగరాజులు కళింగంలో కాలుమోపి స్థిరపడిన తరువాతి 550 వరకూ కనీసం రెండువందల సంవత్సరాలపాటు ఈ సిరిపురం పెద్ద రాజధానిగా వెలసి ఉంటుందని నిర్ధారించవచ్చు. అయితే ఇక్కడ ఓ రాజధాని ఉండేదనడానికి పైన చెప్పిన శాసనాలు కాకుండా మరికొన్ని ఆధారాలను చూపించవచ్చు.

ఆ చెఱువు గట్టుపై చిన కంచెమ్మ, పెద కంచెమ్మ అని రెండు విగ్రహాలు ఉంటాయి. మన తెలుగు రాష్ట్రాల్లో చాలా చెఱువులకు ఉన్నట్టే ఈ ప్రతిమలకూ ఓ కథ ఉంది. ఒకానొక కాలంలో ఈ గ్రామంలో పెద కంచెమ్మ, చినకంచెమ్మ అనే దేవదాసీలైన ఇద్దరు అక్క చెల్లెళ్ళు ఉండేవారు. వారు ఒక రోజు పళ్ళుతోముకుంటూ, ఉమ్మి ఊసుకుంటూ వెళ్ళడం ఓ బ్రాహ్మణుడు చూశాడు. ప్రజలు నడిచేదారిని అపవిత్రం చేయడం పాపమని మందలించి, పాపపరిహారార్థం వారు ఆ సమయంలో సంచరించినంత మేరా ఓ చెరువు తవ్వించమని వారికి బ్రాహ్మణుడు సూచించాడు. రాజాశ్రయం కలిగి కోటికి పడగెత్తిన ఆ వేశ్యలు అతడి సూచన మేరకు తవ్వించిన చెఱువే ఇది. భారీ వర్షాలకు చెఱువు గట్టు ఎప్పటి కప్పుడే గండి పడుతూ, ఊరుని ముంచెత్తడం, ఊరి ప్రజలు భయకంపితులు కావడం జరుగుతోందట. అందుచేత ఆ అక్కచెల్లెళ్ళు మిక్కిలి బాధపడేవారట. పూర్వం సలహా ఇచ్చిన బ్రాహ్మణుడే ఒకరోజు కలలో కనిపించి, ఇద్దరూ గండిలోపడి ఆత్మార్పణ చేసుకుంటే గట్టు నిలుస్తుందని సూచించాడట. ఆ విధంగా వారిద్దరూ ఒక రాత్రి చెఱువు గండిలోదూకి మరణించడం, గట్టు నిలవడం జరిగిందట. తెల్లారేసరికి వారు రెండు ప్రతిమల రూపంలో దర్శనమిచ్చారని, అప్పటి నుండి వారిని ఆ చెరువు గట్టుపైనే నిలిపి గ్రామదేవతలుగా పూజిస్తున్నామని ఊరివారు చెప్పారు. కంచెమ్మలు ఆత్మార్పణ చేసుకోవడం నిజం కావచ్చు. మధ్యయుగాలలో ఆత్మార్పణ దైవకార్యంగా భావించేవారు కదా! వారి త్యాగానికి గుర్తుగా, పరిమాణంలో కొంత తేడా కలిగి, ఒకే విధంగా ఉన్న రెండు స్త్రీ ప్రతిమలను అదే గట్టుమీద పెట్టి వాటిని కంచెమ్మలుగా పూజలు చేయడం ప్రారంభించారని నిర్ధారించవచ్చు. ఇంకా మిగిలిన విగ్రహాలకూ మరొక కథ చెబుతుంటారు. కంచెమ్మల మెడలో విలువైన ఆభరణాలుండేవి. వాటిని ఉత్సవాల సందర్భంగా విగ్రహాలకు అలంకరించేవారు. అయితే ఆ ఊరిలోని కుమ్మర్లు కొందరు వాటిని తీసుకొని వాడుకున్నారట. తిరిగి ఇవ్వని కారణంగా వారు శిలలుగా మారారట. వారే కంచెమ్మల పాదాల వద్ద ఉన్న విగ్రహాలని ఆ ఊరివారి నమ్మకం. అందు చేతనే సుమారు పాతిక కులాలు ఉన్న ఈ పెద్ద గ్రామంలో కుమ్మర్లు లేరని చెబుతున్నారు. పనిమీదో, వ్యాపారం నిమిత్తమో వచ్చిన కుమ్మరులు రాత్రయేసరికి మరొక ఊరు వెళిపోతారు. నేటికీ ఇది నిజం.

కంచెమ్మల ప్రతిమల ఆధారంగా చరిత్రను పరిశీలిద్దాం. ఒక శిలమీద ఒక స్త్రీమూర్తి తలపై ఏడు పడగల నాగేంద్రుడు, మరో చిన్న శిల మీద వేరొక స్త్రీమూర్తి ఐదు పడగల క్రింద చెక్కబడి ఉంది. వాటినే పెద కంచెమ్మ, చినకంచెమ్మ అని కొలుస్తున్నారు. ఈ కంచెమ్మలను పద్మావతి అనే పేరుగల జైన దేవతగా పురాతత్త్వ వేత్తలు చెబుతున్నారు. కంచెమ్మలతో పాటు అక్కడున్న చిన్న చిన్న విగ్రహాలకు కొన్నింటికి తలలపై పడగలు ఉన్నాయి. జినముని తలపై నాగపడగలను చూడగలం. అలా అయితే జైన మత ఆనవాళ్ళు ఇక్కడ ఉన్నట్టే. తొలి కళింగ చక్రవర్తి ఖారవేలుడు జైన మతస్థుడే కదా! అతని ప్రభావంతో ఇక్కడ జైనం బాగా విలసిల్లిందని చెప్పవచ్చు. ఖారవేలుడు క్రీ.పూ. రెండవ శతాబ్దం వాడుకదా!

ఆ కాలంలోనే వల్లభనారాయణ స్వామి కోవెల నిర్మించి ఉంటారు. సిరిపురం వారు చెబుతున్నట్టు అది గాంగరాజులు కట్టింది మాత్రం కాదు. గాంగరాజుల ఆలయాలన్నింటా గుడి గోడల మీదగాని, ఆలయం లోపలగాని దేవతా విగ్రహాలు ఉంటాయి. చాలావరకు శైవ సంబంధి శిల్పసంపద ఉంటుంది. శాసనాలు ఉంటాయి. ఈ కోవెలకు ఏ శాసనమూ, ఏ శిల్పమూ లేదు సరికదా అందులోని వల్లభనారాయణస్వామి విగ్రహం కూడా అధునాతనమైన నల్లరాతి పై చెక్కినదే! జైనం అస్తమించిన తరువాత వైష్ణవం ఉద్యమరూపం సంతరించుకొన్న రోజుల్లో ఈ విగ్రహాన్ని ఈ గుడిలో

ఎవరో పెట్టి ఉండవచ్చు. దేవాలయం కూడా మహేంద్ర గిరులను పోలిన రాతి పేరుపుతో రాళ్ళు మీద పడతాయా అన్నంతగా శిధిలా వస్థలో ఉండేది. అవి జైన లేక బౌద్ధమత సంబంధి అని చరిత్రకారులు చెబుతారు. ఈ గుడి కూడా అలాంటిదేనా? నాలుగైదు శతాబ్దుల వరకు కళింగంలో జైన బౌద్ధాలు విలసిల్లాయని చరిత్ర.

అయితే ఇక్కడే గతంలో రాజధాని ఉండేదని ఎలా చెప్పగలం? అని ప్రశ్నిస్తే పైన చెప్పిన రెండు శాసనాలూ ఈ చెఱువు లోపల ఒకటి, చెఱువు ఎగువనగల ఊళ్ళో ఒకటి దొరికింది. ఈ చెఱువులోనే ఇటీవలి కాలంలో చిన్న చిన్న విగ్రహాలు దొరికాయి. చెఱువు ఎండిపోయిన సమయంలో దాని గర్భంలో కొంత, కొంతగా పైకి కన్పిస్తున్న విగ్రహాలను అదే సిరిపురానికి చెందిన బూరాడ శంకరరావు అనే ఉపాధ్యాయుడు గ్రామస్థుల సహకారంతో బైటకు తీయించి కంచెమ్మల విగ్రహాల చెంత పెట్టించాడు. అక్కడ పదికి పైగా చిన్న-చిన్న విగ్రహాలను నేడు చూడవచ్చు. చెఱువు లోపల విగ్రహాలు, శాసనాలు దొరకడంవలన శిధిల రాజధాని ప్రాంతంలోనే చెఱువు నిర్మింపబడిందని చెప్పవచ్చు. చెఱువు నిర్మాణ సందర్భంలోగాని, ఆ తరువాతగాని దొరికిన అతి సౌష్ఠవమైన విగ్రహాలను కంచెమ్మలుగా ఈ గ్రామస్థులు పూజ చేయడం ప్రారంభించి ఉండవచ్చు. కొండకు ఉత్తరాన మండాకురిటి గెడ్డకు అడ్డంగా చెఱువును నిర్మించారని నిర్ణయించవచ్చు. ఈ చెఱువుకు నాల్గువైపుల రాతికొండ, ధవళపేట, సిరివురం, అదపాకవారి పాటిపొలాలు ఉన్నాయి. పాటిపొలం, పాటిమన్ను అంటే పాడుపడిన గ్రామానికి చెందిన పొలం అని, అక్కడి మన్ను అని అర్థం. ఒకప్పుడు అక్కడ ఓ గ్రామమో, పట్టణమో ఉండేదని అర్థం. గ్రామాలలో ఈ పాటిదిబ్బల నుండే మన్ను తెచ్చుకొని, మట్టి గోడల్ని అలకడం, మట్టిపొయ్యిల్ని నిర్మించడం చేసేవారు. సిరిపురంలో అర్ధశతాబ్ది క్రిందట అదపాకవారి దిబ్బ, పొందర్ల పాటిగుడ్డిలు (కూరగాయల మెరక) తవ్వితే మట్టిపాత్రలు, ప్రాచీనమైన నాణేలు దొరికేవని అదపాక సత్యారావు నాతో చెప్పాడు.

చెఱువు నిర్మాణం ఎప్పుడు జరిగింది?

చెప్పుకుంటున్న కథలు, ఇంతవరుకు చెప్పుకొచ్చిన చరిత్ర ఆధారంగా చెఱువు ఎప్పుడు కట్టబడిందో అంచనా వేద్దాం. కళింగంలో గాంగరాజులు క్రీ.శ. 500లకు ఇటు అటుగా తొలుత దంతపురం, పిదప శ్రీముఖలింగం, అంతిమంగా కటకం చేరి సుమారు 950 సంవత్సరాల పాటు సుదీర్ఘమైన, శత్రు దుర్నిరీక్ష్యమైన సామ్రాజ్యాన్ని ఏలారు. వారి ధాటికి కళింగాంధ్రలోని విష్ణుకుండినులు, వాశిష్ఠులువంటి చిన్న-చిన్న రాజ్యాలు అంతరించాయి. దాదాపు రెండువందల ఏళ్ళపాటు రాజధానిగా విలసిల్లిన సిరిపురం (సునగరం) కూడా రాజధానిగా రూపు మాసింది. ఆ తరుణంలో ఆ గ్రామానికి చెందిన వేశ్యలు ఆ చెఱువును తవ్వించారు. రాచరిక వ్యవస్థలో వేశ్యలు రాజభోగాలనుభవించేవారు కదా! ఈ ఊరిలో రాజులుంటే వేశ్యలెందుకు తవ్విస్తారు? గాంగరాజుల సహకారం ఆ వేశ్యలకుగాని, వారి తరువాతగాని ఈ చెఱువు నిర్మాణంలోను, అభివృద్ధిలోను అంది ఉంటుంది. అందుకే చెఱువు లోపలి నుండి గట్టు బైటకు ఈదుకు రాగలిగినంత విశాలమైన అతి పెద్ద మదుము, వందల ఏళ్ళుగా శైథిల్యం చెందని అతి పటిష్ఠమైన చప్టా దీనికి ఏర్పడ్డాయి. సున్నం, ఇసుమువంటివి లేని కేవల రాతి పేరుపుతో కూడిన నిర్మాణం అది. రాళ్ళను అతి ప్రాచీనమైన లాకింగ్ సిష్టమ్‌లో అతికి ఉంటారు. వర్షాకాలం నాలుగు నెలల పాటు కనుచూపు మేర నీరు కలిగిన చెఱువు.ఈ పెద్ద చెఱువుకు ఉత్తరాన ఆని ఉన్న సిరిపురం ఇప్పటికీ అతి పెద్దగ్రామం. పట్టణీకరణవలన పల్లెలు చిన్నవైపోతున్న నేటి కాలంలోనూ, జనసమ్మర్దం కలిగిన గ్రామం. సుమారు పాతిక సామాజిక వర్గాలతో, కళింగ, ఆంధ్ర మూలాలు కలిగిన ఊరు. పొందూరు నుండి తారు రోడ్డు సదుపాయం ఉన్న ఊరు.

ఈ కళింగంలోను, ఇతరత్రా ఎక్కడెక్కడ సిరిపురం అనే గ్రామాలున్నా, మూడు శాసనాల వెలుగులో గుర్తింపునకు నోచుకొన్న, రెండు వేల ఏళ్ళ క్రిందట రాజధానిగా వెలసిన, 'సునగరం' ఈ పొందూరు దగ్గరి సిరిపురమే! నేటికీ ఈ ఊరిలోని ఆనాటి ఆనవాళ్ళు అదే విషయాన్ని నిర్ధారణ చేస్తున్నాయి.

2021 జనవరి నెల ***మిసిమి*** సారస్వత మాన పత్రికలో ముద్రితమైన 'సు నగరమే సిరిపురమా!' అనే వ్యాసంలో ఈ సిరిపురం గ్రామాన్ని గురించి మరికొన్ని విశేషాలను చదువుకోగలరు.

గార రంగనాథం రాజాం. ఫోన్: 988 575 8123.



కబీర్ దాస్ - 12

– లక్ష్మీ అయ్యర్

(గత సంచిక తరువాయి)

ఇక 42వ అధ్యాయము చిత్త కపటి కౌ అంగ్. చిత్త అంటే చిత్తము (మనస్సు) కపటీ కల్మషమైన. కల్మష హృదయాలున్న వ్యక్తుల నుండి మనం దూరంగా ఉండాలని పదేపదే చెబుతున్నారు. ఇక్కడ కబీర్ మనసులో కల్మషాన్ని ఉంచుకుని మాట్లాడేవారి దగ్గర నుండి దూరంగా ఉండమని చెప్తున్నారు. ఇందులో మొత్తం మూడే దోహాలు ఉన్నాయి. ఇందులో మొదటిదోహాలో కబీర్ గారు–

కబీరా తహాన్ న జాయియే, జహాన్ కపట్ కా హేత్
జాలూన్ కలీ కనీర్ కీ తన్ రాతా మన్ సేత్

బయట ప్రేమతో నటిస్తూ లోపల విషపూరితమైన మనసు కలిగినవారి దగ్గర నుండి దూరంగా ఉండమని ఇందులో కబీర్ చెప్తున్నారు "ప్రేమకు చిహ్నమైన రంగు ఎరుపు, ప్రేమ – శూన్యతను తెలియజేసే రంగు తెలుపు". ఇందులో కబీర్‌గారు ఒక ఎర్ర గన్నేరు పువ్వును ఉదాహరణంగా తీసుకుంటూ చెబుతున్నారు. బయట ఎర్రగా కనిపించినా ఆ పువ్వు లోపల ఉన్న రంగు తెలుపే. అలాగే కొంతమంది ప్రేమతో ఉన్నట్లు బయట నటిస్తారు కానీ నిజానికి వాళ్ళ హృదయంలో ప్రేమ ఉండదు. మనసు అనే అంతరంగిక ప్రేమకు ప్రతిరూపము. శరీరం అనేది బాహ్య ప్రేమకు ప్రతిరూపం. మనస్సులోని భావాల కనుగుణంగా శారీరిక భంగిమలు కనబడుతాయి. ఇవి రెండూ కలిస్తేనే మనిషి ప్రేమస్వరూపడనబడతాడని చెప్తున్నారు కబీరు (face isthe index of the mind). మనస్సులో నిజమైన ప్రేమ ఉంటే అది శబ్దాల ద్వారా, భావనల ద్వారా వ్యక్తమవుతుంది. అదేలా రెండవ దోహాలో కబీర్ గారు శాక్తులను, వైష్ణవులను, వాళ్ళ స్వభావాలను గురించి తాను చూసినది శబ్దాల ద్వారా తన ఉపదేశంలో తన అనుభవాన్ని పంచుకుంటున్నారు. మనసులోని భావనలు, బయట భావనలు ఒకేలా ఉంటేనే అతను ప్రేమ పూర్ణ మనిషి అనబడతాడు. మనసులో ఉన్న ప్రేమ మాటల ద్వారా వ్యక్తమవుతుంది. అంటే మనసులో ప్రేమ ఉన్నవాళ్లు దాన్ని దాచుకోలేరు. ఒకవేళ అది సహజమైన ప్రేమ అయితే ఉప్పెనలా పైకి పెల్లుబికి వస్తుంది, కానీ కొందరు కృత్రిమ ప్రేమను బయట కనబరుచుచూ లో లోపల కల్మష భావాలతో సంచరిస్తుంటారు. అలాంటి కపటమైన మనసులోగలవారి దగ్గర నుండి దూరంగా ఉండాలని కబీర్ చెప్తున్నారు. మంచి స్వభావంగల వ్యక్తి లోపలా బయటా ఒకేలా ఉంటాడు. స్వచ్ఛమైన మననుకలవారే నిర్భయంగా స్వచ్ఛంగా నత్యాన్ని మాట్లాడగలరు. ఇక రెండవ దోహాలో –

"శాక్తులకు వైష్ణవులకుగల స్వభావ విశేషాలను కబీర్ చెప్తున్నారు. శక్తిని ఆరాధించేవారు వైష్ణవులను ఆనాడు కబీరుగారు ఆ సమాజంలో ప్రత్యక్షంగా చూశారు. లోపల బయట వేర్వేరు మనోభావాలు కలవారు మదిలో కల్మషంకలవారు. లోపల బయట ఒకే మానసికత కలవారు నిజమైన మంచివాళ్లు. బయట భక్తుడుగా కనబడుతూ లోపల దురాచారాన్ని ఆచరిస్తూ తిరిగే వాళ్ళమీద కబీర్ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ ఆ కాలంలోని శాక్తేయుల స్వభావాన్ని కబీరు ఒక కుమారితో (పెళ్ళికాని అమ్మాయితో) పోలుస్తున్నారు. స్వచ్ఛమైన మనసుగల పెళ్లి కాని పిల్ల, పెళ్లికి ముందు మనస్సులో కానీ బయటగానీ ఎవరిని ప్రేమించదు. ఆమెకు అందరూ సమానమే. అదేలా శాక్తులు అందరితో ఒకేలాగా ఉంటారు. బయట ఎలా ఉంటారో

లోపల మనస్సులో కూడా కల్మషం లేకుండా సహజంగా అదేలా వ్యవహరిస్తారు. కానీ వైష్ణవులు దానికి భిన్నంగా కొంతమంది త్రిపుండ్రాలు పెట్టుకొని మాలలన్నీ వేసుకుని తిరుగుతూ ఉంటారు. కానీ లోపల నుండి చాలా దుష్టులుగా వ్యవహరిస్తారు. వారు బయటకు మాత్రమే భక్తులుగా కనబడతారు. లో లోపల కుళ్లుతూ స్వార్థంతో వ్యవహరిస్తారు. కబీరు తన సమాజంలోగల అన్ని మతాలతో జాతులతో కలసి జీవించారు. ఆయన చెప్పినదంతా అనుభవసారమే. ఇక మూడవ అంతిమ దోహాలో కబీరు –

నిర్మల్ హరి కా నావ్ సో న్ నిర్మల్ సుద్ భాయి
కే లై న్ దూ నో న్ కాలీమాన్ భావై సా మన్ లాయి

"ఓ జీవుడా! భగవంతుని మీద పవిత్ర భక్తి ఉంచు. ఆయనపై భక్తి ఉంచాలంటే ముందు నీ అంతరంగం శుద్ధం కావాలి. నీ మనస్సు శుభ్రంగా లేకుంటే నువ్వు భక్తుడు కాలేవు. బాహ్యంగా కనిపించే ఆకారంలో భక్తి యొక్క తీవ్రత ఉండదు. ఎంత అంతరంగం త్రికరణ శుద్ధిగా, పవిత్రంగా ఉంటే అంత బయట కూడా నిర్మలంగా ఉంటుంది. మనము ఏది అనుకుంటావో అదే ఆచరించాలి. అందులో పవిత్రత నిండి ఉండాలి అని నొక్కి చెప్పారు కబీరు.

ఇక 43వ అధ్యాయము గురు శిష్ హేరా కౌ అంగ్. ఇందులో కబీర్ గురు శిష్యుల సంబంధాన్ని గురించి చక్కగా వివరించారు. పరమార్థ తత్వాన్ని చూపి నిస్వార్థముతో సాధకుడైన గురువు లభించడం అందరికీ సాధ్యం కాదు. అలాంటి గురువుల సాక్షాత్కారం పొందాలంటే పూర్వ జన్మ కృప కావాలి. అదేలాగా అలాంటి సద్గురువుకు ఒక మంచి సుపాత్రుడైన శిష్యుడు దొరకడం కూడా దుర్లభం. అందుకే గురుశిష్యుల సంబంధము చాలా గొప్పది. మన వేమన గారు గురుడనగా పరమాత్ముడు అని చెప్పి గురు శిష్యుల సంబంధాన్ని జీవాత్మ పరమాత్మలతో పోల్చారు.

ఈ అధ్యాయములో మొత్తం 13 దోహాలు ఉన్నాయి. తమ పంచేంద్రియాలు భగవంతుని సేవలో గడిపే మార్గాన్ని గురువు బోధిస్తాడని చెబుతున్నారు కబీర్ ఇక్కడ ఆరవ దోహాలో కబీరు–

ఐసా కోయీ న మిలై జాసాన్ రహియే లాగి
సబ్ జగ్ జర్తా దేఖియా అపనో అప్ నీ ఆగి

ఎంత వెదికినా మంచి గురువులు లభించడం అరుదు. గురువు యొక్క ఘనత చెప్పుతూ సాధకులైన సద్గురువులు చాలా తక్కువ వారి ముందు మనము మన హృదయాన్ని విప్పి సమస్యలను చెప్పుకోవచ్చు. సాధకుడైన గురువు మాత్రమే శిష్యులను అర్థం చేసుకోగలరు. గురువు పేరుతో చలామణి అవుతున్న దుర్జనులు శిష్యులపై వ్యంగ్య బాణాలను కురిపిస్తారు. పదవ దోహాలో –

మాయా మిలై మహో బంతి కూడై అంఖే బైన్
కోయీ ఘాయల్ బేధా న మిలై సాయీ హోందా సైన్

కబీరు ఇలా అంటున్నారు–

"మాయను ప్రేమించేవాళ్ళు అంటే ఈ సంసారం మోహ బంధంలో చిక్కుకునేవాళ్లు వ్యర్థంగా ఏదో మాట్లాడుతూ తిరుగుతుంటారు. కానీ కొందరివల్ల మాత్రమే మనకు భగవంతుని కటాక్షము, దీవెనలు దొరుకుతాయి. అంతిమ దోహా అయిన 13వ దోహాలో కబీరు ఇలా అంటున్నారు–

హం ఘర్ జారా అపనా లియా ముర్దా హోథీ
అబ్ ఘర్ జాలోన్ తాస్ కా జే చలై హమారే సాథీ

నా అహంభావాన్ని ఈ సంసార బంధంలో మండింపజేసి అంటే దగ్ధపరచి భస్మం చేసేశాను. నా చేతిలో జ్ఞానం అనే చేయూత ఉన్నది. సాధన మార్గంలో రావాలంటే అహంకారాన్ని విడిచి మోహపాశాలను దగ్ధము చేసి వస్తేనే జ్ఞానాగ్ని రగులుతుంది.

ఇక 44వ అధ్యాయము "హేత్ప్రీత్సనేహ్ కౌ అంగ్". హేత్ అంటే ప్రేమ. ఇక్కడ పవిత్రమైన ప్రేమను గురించి కబీర్ గారు వ్యాఖ్యానిస్తున్నారు. దానితోపాటు తన ప్రియ శిష్యుడైన మలూక్దాసు గురించి కూడా చెబుతున్నారు (ఈ మలూక్దాసు కబీరు తర్వాత ఆ శాఖలో వచ్చే నిర్గుణ కవి మలూకు దాస్ కాదు).

ఈ దోహా సర్వసాధారణమైన ప్రేమకు కూడా వర్తిస్తుంది. మనసులో ప్రేమ ఉంటే ఒకరికొకరు కలుసుకోవలసిన పనిలేదు. ఒక హృదయం ఇంకొక హృదయాన్ని ప్రేమిస్తుంది. అది భావాలతో సంబంధ పడ్డది. ఒకరికొకరు చూసుకొని మాట్లాడుకోవాల్సిన అవసరం లేదు. కరచాలనం చేసుకోవలసిన అవసరం

అంతకంటేలేదు. ఎక్కడ ఉన్నా మనసు మాత్రం ఇంకో మనసుతో ముడిపడి ఉంటుంది. ఇక్కడ కబీరు తనతో పాటు ఉండి జగన్నాథపురి పోయి స్థిరపడిన తన శిష్యుని గురించి అతని గొప్పదనాన్ని చెబుతూ రాశారు. ఆ దోహా యొక్క వివరణ ఇలా ఉన్నది –

కమోదని జలహరి బసై చందా బసై అకాస్
జో జాహీ కా భావ్ తా సో తాహి కై పాస్

"కుముదపుష్పము అంటే కలువలు సరోవరములో ఉంటాయి. చంద్రుడు ఎక్కడో ఆకాశములో దూరంగా ఉంటాడు. కానీ చంద్రుని కిరణాన్ని చూసినప్పుడే కలువలు విచ్చుకుంటాయి. ఇక్కడ దూరాలతో పనిలేదు. ప్రేమించిన హృదయం ఇంకొక ప్రేమించిన హృదయాన్ని చూసినప్పుడే వికసిస్తుంది అని అర్థము. అదేలా గురుశిష్యులు విడిపోయినా గురువు ఆశయం శిష్యుడికి తెలుసు. ఈ అధ్యాయంలో మొత్తం నాలుగే దోహాలు ఉన్నాయి. ఇక రెండవ దోహాలో కబీర్ "గురువు ఎక్కడో బనారస్‌లో అంటే కాశీలో కూర్చుని ఉన్నా శిష్యుడు ఎక్కడో సముద్ర తీరాన్ని దాటి అవతలి ఒడ్డున ఉన్నా కూడా వారి ఇరువురి హృదయంలో ప్రేమ ఉంటే జీవితాంతం వారు ఒకరినొకరు మర్చిపోరు అంటున్నారు. ఇదేలా వళ్ళువర్ కూడా పవిత్ర ప్రేమను గూర్చి చర్చిస్తూ ఒక అధ్యాయం రాశారు. ఒక వ్యక్తి మనస్సులో ఇంకొకరు మీద ప్రేమ ఉంటే కొన్ని సంవత్సరాల తర్వాత కూడా వారిని తలచినపుడు వాళ్ళను అనుకుంటేనే కన్నీళ్ళు జలజలా రాలుతాయి. వారు పక్కన లేకున్నా వారిపైగల ప్రేమ ఎల్లలు లేనిది అన్నారు.

ఇక అంతిమ దోహాలైన మూడు నాలుగులో గురు శిష్యుల సంబంధాన్ని గురించి కబీర్ వివరిస్తున్నారు. ఇక్కడ ఒక విషయం గమనించవలసి ఉంది. హిందీ నిర్గుణ భక్తి సాహిత్యంలో ఉన్న కవులందరూ గురువును భగవంతుడి కంటే ఎక్కువగా పూజిస్తారు. ఆయన మహిమను ఎప్పుడూ కొనియాడుతారు. ఇక సగుణ భక్తి సాహిత్యం వాళ్లు గురువుని భగవంతునికి సమానంగా పూజిస్తారు. వారికి గురువు ఈశ్వరుడు సమానమైనవాళ్ళు. కానీ నిర్గుణ భక్తులకు గురువు ఈశ్వరుడి కంటే గొప్ప. ఈ విషయంపై చర్చిస్తూ ప్రముఖ విమర్శకులు డాక్టర్ రామచంద్ర శుక్లాగారు ఇలా రాశారు– "నిర్గుణ భక్తి సాహిత్యంలో ఉన్న కవులందరూ చదువు లేనివారు నిమ్న జాతికి చెందినవారు అగుటచే, వారు గురువు చేత అత్యధికంగా ప్రభావింపబడ్డారు. కబీర్ నేతగాడు, రైదాస్ గారు చెప్పులు కుట్టేవారు (రైదాస్ గురించి ఒక సామెత కూడా ఉత్తర భారత దేశంలో జగత్ ప్రసిద్ధం – (మన్ చంగాతో కటౌతిమే గంగా మనసు శుభ్రంగా ఉంటే చేతిముష్టిలో గంగ వస్తుందని అర్థము).

దీనికి సంబంధించి కథలు కూడా ఉన్నాయి.

కబీరు ఈ అధ్యాయపు చివరి దోహాలో ఇలా అంటున్నారు–

"ఇష్టపడినవాళ్లు మన నుంచి ఎంతో దూరంలో ఉన్నా కూడా వారు శారీరకంగా దూరమైనవారు, కానీ మానసికంగా కాదు. ఎందుకంటే ఒకరి హృదయం ఇంకొకరికి సమర్పణం అవడం చేత వారిద్దరి మధ్య అభిప్రాయ భేదాలు రావు, కొట్లాటలు అసలే రావు. ఒకరినొకరు బాగా అర్థం చేసుకున్నవాళ్ళు. ఎందుకంటే వారి మనసు మరొకరు మనసుతో ముడివడి ఉంది. అందుకే ఎంత దూరంలో ఉన్నా కూడా ఇద్దరి మధ్య ప్రేమ మాత్రమే వికసిస్తూనే ఉంటుంది.

ఇక 45వ అధ్యాయము సూరా తన్ కౌ అంగ్. ఇందులో కబీరు ఆధ్యాత్మికుడైన శూరుని గురించి చర్చిస్తున్నారు. అంటే ఇంద్రియాల్ని జయించినవాడు, ఎటువంటి కోరికలు లేనివాడు, ఏ భేద భావం లేకుండా అందరినీ సమదృష్టితో చూసేవాడు. ఇలాంటి వాళ్లంతా ఆధ్యాత్మికంగా శూరులైనవారు. ఇది అన్నిటికంటే అతి పెద్ద అధ్యాయము.

ఇందులో మొత్తం 41 దోహాలు ఉన్నాయి. ఈ అధ్యాయమంతా కబీరు జీవాత్మను సంబోధిస్తూ పరమాత్మపై మొగ్గు చూపమని రాసిన జ్ఞానంతో నిండిన దోహాలు. మొదటి దోహాలో–

కాయర్ హు అన్ న ఛూ టి సై కఛు సూరా తన్ సాహి
భరమ్ భలాకా దూరి కరి సుమరిన్ సేల్ సెంబాహి

"మోహము రాగద్వేషాలు అధ్యాత్మక జీవితానికి శత్రువులు. వీటిని జయించినప్పుడే జీవులు మోక్షాన్ని పొందుతారు అని చెబుతున్న కబీరు రూపక అలంకారం ద్వారా ఆత్మను సంబోధిస్తూ ఇలా అంటున్నారు–

"ఓ జీవుడా! నీవు పిరికి పందలా బతుకుతూ ఈ సంసారం నుండి అంటే ఈ సుఖ భోగాల సాగరాల

నుండి విముక్తి చెందలేవు. అందుకే శూర వీరుడుగా తయారై ధైర్యంతో సాహసంతో హృదయాల్లో దాగి ఉన్న మోహమాయలనే గుచ్చుకున్న బాణాలను ధైర్యంగా పెకలించి బయటపడేసేయ్! భగవంతుని పేరు చెబుతూ జీవితపు యుద్ధభూమిలో ముందుకు సాగు! అంటే శరీరంలోని హృదయాంతరాలలో ఉన్న అంటే హృదయంలో గుచ్చుకున్న విషయ వాంఛలనే కోరికల బాణాలను భయపడకుండా ధైర్యంగా పెకిలించి తీసివేసి ఈ జీవన యుద్ధ భూమిలో అంటే జీవితమనే సమరభూమిలో భగవంతుని ధ్యానిస్తూ ముందుకు సాగు! అప్పుడే నీవు ఆధ్యాత్మిక శూరుడు, అనబడతావు.

12వ దోహాలో ఆనాటి సాంఘిక పరిస్థితుల వివరణ స్త్రీల స్థితులు కనబడుతున్నాయి. ఇందులో కబీర్ ఇలా అంటున్నారు –

అబ్ తో ఐ సీ హోయి పరీ మన్ కా భావతు కౌన్
మర్ నై తై క్యా దరవ్ నా జబ్ హోథీ సింధా రా లీన్

"నా మానసిక స్థితిని వివరిస్తున్నాను "నేను సతి అవ్వాలని దృఢనిశ్చయం తీసుకున్న పతివ్రత స్త్రీలాగా నా మనసును ఉంచుకున్నాను. ఆమె ఎలా తన సింధూర పాత్రను (కుంకుమ భరణిలాంటి పాత్రను) చేతిలో తీసుకొని మృత్యు భయం లేకుండా వెళ్లి చితిలో కూర్చుంటుందో అదేలా నేను సాధన చేసి మృత్యువును గెలుస్తాను. ఇక్కడ 15వ శతాబ్దపు ఉత్తర భారత స్త్రీల యొక్క దయనీయ పరిస్థితిని చక్కగా స్పష్టంగా మనం చూడవచ్చు.

ఇక 13వ దోహాలో–

జిస్ మరనే తైన్ జగ్ డరై సో మేరే అనంద్
కబ్ మరి హూం కబ్ దేఖిహూం పూరన్ పరమానంద్

కబీర్ దాను అత్యద్భుతంగా మరణాన్ని ఎలా ఛేదించాలా? ఎలా ఎదుర్కొనాలని చెబుతున్నారు. ఈ శరీరం పై మితిమీరిన ప్రేమ మోహంగలవాడికి మరణం అంటే భయం వెంటాడుతూ ఉంటుంది.

కబీర్ తన గురించి మాట్లాడుతూ–

"మరణాన్ని చూసి ఈ ప్రపంచంలోనివాళ్లంతా భయపడతారు. కానీ నాకు అది మహాదానందమైన విషయం. నాలో ఉన్న అహంభావంవల్లనా శరీరం ఇంకా భగవంతుని చేరకుండా ఉన్నది. అహంభావమనే శరీరాన్ని నేను వదిలిపెడితే జీవన్ముక్తుడనై ఆ సర్వవ్యాపి చైతన్యంలో కలిసిపోతాను. అదే నాకు వాస్తవిక ఆనందము. నేను ఆ రోజుకై ఎదురు చూస్తున్నాను. నా అహంకారం నశించిననాడు నాకు మరణం లేదు. నేను చైతన్యవంతమైన భగవంతునితో కలిసిపోతాను" అంటున్నారు.

అందరూ మరణాన్ని చూసి భయపడితే కబీరు దాన్ని ఆహ్వానిస్తున్నారు. ఎందుకంటే ఈ శరీరాన్ని వదిలి ఆత్మ ఆ పరమాత్మలో కలిసిపోతుందనే సంతోషంలో కబీరు దీన్ని చెప్పారు. ఇక్కడ సాఖీకి వ్యాఖ్యలు రాసిన విమర్శకులు డాక్టర్ జయదేవ్ సింగ్, డాక్టర్ వాసుదేవ్ సింగ్, భక్తతుకారం యొక్క పద్యాన్ని తులనాత్మకంగా వివరిస్తున్నారు" తుకారం యొక్క పద్యాలను అభంగాలని అంటారు. తుకారాం తన అభంగంలో ఇలా అంటున్నారు–

ఆపులే మరణ్ పాహిలే మ్యాన్ డోలా
తో జూలా సోహలా అనుపమ్య
ఆనందే దాదలి తిన్ హీ త్రిభువనే
సర్వో తమ్ కప ణే భోగ్ ధూ లా (మరాఠీలో)

"నేను నా మరణాన్ని నా కనులారా చూస్తే దివ్యానందాన్ని పొందాను. అది చూసి నేను అత్యంత ఆనందపడ్డాను. ఆ ఆనందం నన్ను సర్వేశ్వరునితో కలిపింది. పరమ భక్తుడైన తుకారామ్ గారు సశరీరంతో పుష్పక విమానంలో వెళ్లడం ప్రతీ వ్యక్తి చూచాడని ప్రామాణికంగా మహారాష్ట్రలో చెప్పబడింది. భారతీయ భాష సాహిత్యాలన్నింటిలో ఇదేలా వివరింపబడింది.

ఇక 19వ దోహాలో కబీర్ ఇలా అంటున్నారు –

కబీర్ యహ ఘర్ ప్రేమ్ కా ఖాలా కా ఘర్ నహీ
సీస్ ఉతా రై న్ హా థ్ సా న్ తబ్ పైసే ఘర్ మాహీ

"భగవంతుని దర్శించాలంటే పవిత్రమైన ప్రేమ మంచి మనసు మాత్రమే కావాలి. అందరూ ఆయన సందర్శించలేరు. మనం మన పిన్ని ఇంటికి ప్రేమతో పరుగెత్తి చొరబడినట్లు భగవంతుని దగ్గర మనం పోలేము. మన తలను కత్తితో నరికి కింద పెట్టి వెళ్లాలి – అంటే అహంకారమనే తలను నరికినప్పుడే భగవంతుని ఇంటిలోకి (మోక్షానికి) మనం పోవడానికి అర్హులం.

ప్రొ. లక్ష్మీ అయ్యర్, రాజస్థాన్. ఫోన్: 968 027 6038.



– డి. కృష్ణారెడ్డి


అజంతమైన తెలుగు భాషకు జానపద మాండలికాలు ఆణిముత్యాలు, గ్రామీణ యాస, పలుకుబడే జనం శ్వాస భాష. అనాదిగా నేటి జనం ఉచ్చారణ కాలగమనంలో ఆయా ప్రాంతాల భౌగోళిక పరిస్థితులు, సామాజిక జీవన స్థితిగతులు తొలుత శబ్ద, సౌంజ్ఞ, దేహ హావభావాలు, స్వరపేటిక ద్వారా చిప్పిల్లే నానారకాల శబ్దాలు ఆయావ్యక్తులు వెలువరించే శారీరక సంకేతాల్ని ఎదుటివారు గ్రహించి అందుకు అనుగుణంగా ప్రవర్తించే ప్రక్రియ మూగ అయినా సంకేతాలతో మూకుమ్మడిగా ఎవరి పనులు వారు సజావుగా చేస్తూ జనం జీవనయానం సజావుగా సాగేది.

వేలవేల సంవత్సరాల మానవకేళిలో జనులు అనేక యుగాలను దాటి జననైపుణ్యంతో లిపి, భాషగా అక్షరాలు పదాలుగా, పదాలు వాక్యాలుగా మాట్లాడడం, అక్షరాలలో లిఖించే స్థాయికి జనం చేరువకావడానికి ఎన్నో కష్టనష్టాలను అధిగమించి భాష అక్షరీకరణతో గ్రంథరూపం దాల్చింది. భాషా పరిణామాలు ఎన్నయినా పల్లెల నుండి పట్టణాలకు, నగరాలకు, మహానగరాలకు ఈ సంస్కృతి ననలుబారి కొసలు కొసలు మీటుతూ తీగలు విస్తరించినట్లు ధరిత్రిని లిఖితపూర్వక ఆయా ప్రాంతాల సంస్కృతిననునరించి సాంప్రదాయాలకనుగుణంగా అల్లిబిల్లిగా అల్లుకుపోయి ఆయా కాలల జనజాగృతితో పల్లవించింది. ఇప్పట్టున నే చెప్పదలచుకొన్నదేమిటంటే సర్వజగత్తు భౌగోళిక, సంస్కృతి సంప్రదాయాలు ఆయా ప్రాంతాలలో, ఆయా తెగల, వృత్తిపనుల జన జీవన విధానాలకు అనుగుణంగా భాష గ్రంథాల రూపాన వెల్లివిరిసింది. దేశానికైనా, ప్రపంచానికైనా రాష్ట్రాలకైనా నగరాలకైనా, పట్టణాలకైనా సంస్కృతి సాంప్రదాయ ఆచార వ్యవహారాలకు ముడినరుకులాంటిది గ్రామాలు మారుమూల వాడలు అవిద్యతో, అత్యాధునిక నాగరికత, సాంకేతికత, నైపుణ్యం కొరవడి జానవదులు ముడిసరుకునందించే ముల్లెలుగా మిగిలిపోయాయి.

ముడిసరుకు భాషాపరమైన మౌఖికతకు ఆటపట్టులై జానపదుల అపూర్వ సంస్కృతి మౌఖికంగా తరతరాల వారసత్వ సంపదగా మిగిలిపోయింది. చరిత్ర పుటలకు ఎక్కని స్తబ్దతతో ఆయా ప్రాంతాలు, గ్రామాలు, వాడలు, జానపద సంస్కృతిని కులవృత్తుల పరంగా సాగే జానపద విజ్ఞానం లోతైన అజ్ఞానపు నేలపర్రల క్రిందపడి నలిగి నుజ్జుగా ఆ మట్టిలో మట్టిగా కలిసిపోయే క్రమం ఆక్రమించుకొంటూ అజ్ఞాతంలోకి పయనం సాగించే దిశగా పయనిస్తుంది. పాత తరాల సాంఘీక జీవన విధానాల్ని వెలికితీసే ప్రయత్నాలకు నేటి సాహితీవేత్తలు నిబ్బరంగా, నిబద్ధతతో ఆనాటి ప్రాచీన జానపద సాహితీ సంపదను వెలికితీసి మకిలి అంటుకొన్న జానపద మణిమాణిక్యాలను, అబ్బురపరిచే వజ్ర సంకల్ప జాతి జానపదగాథల్ని సానపట్టే దిశగా వయనించే మహత్తర ప్రయత్నం జరిగితే భాషాపరమైన అపూర్వ సాహితీసంపదతో భాషా సాహిత్యం మరింతగా బలం పుంజుకొని భావితరాలకు భాషాపరంగా మరింత సాహిత్య పెనుసంపదను సమకూర్చే వీలుంది.

గ్రామాల సమగ్రాభివృద్ధితోనే దేశ ప్రగతి ఆధారపడి ఉందని, దేశ సంపూర్ణ ప్రగతికి పల్లెలే తల్లివేరులాంటిదని పూజ్యబాపూజి ఎంతగానో నొక్కినొక్కి చెప్పారు. జాతికి ఖ్యాతిని సమకూర్చే మట్టివాసనల జానపద పాటలను (ఈ వ్యాసరచయిత) ఎంతగానో శ్రమించి క్షేత్రస్థాయికి వెళ్ళి చిత్తూరు జిల్లా పడమటి ప్రాంతాలలోని జానపద కళాకారులు మౌఖికంగా పాడుకొనే పాటల్ని సేకరించటం జరిగింది. ఈ జానపద పాటల పరిమళాల పూగుత్తులకు "పులినాడు జానపద సరిగమలు" అనే పేరుతో వ్యాసం ప్రారంభిస్తున్నాను.

చిత్తూరు జిల్లా ప్రాంతంలో తాము చేసే శ్రమ శక్తిని అలవోకగా ఆదమరచి పాడుకొనే పాటలలో పాండిత్యము, ఛందస్సు, శాస్త్రీయ పరిశోధన లేకపోయినా, పరిమళభరితమైన లయ, భావస్ఫోరకం, హృదయాలకు మందమారుతంలా చల్లదనాన్నిచ్చే కథనం, కర్ణపేయమైన అనుభూతిని వీటిలో జమిలిగా స్పందించే మహత్తు పెనగొని ఉంటాయి. తమ పాటలలో శృంగారము, భక్తిపాటలు, వ్యవసాయ సంబంధమైన, స్థల చరిత్రలపై



వ్యక్తిత్వాలపై, చేసే పనులపైనా మూకుమ్మడిగా పాడుకొనే పాటలు, వ్యక్తులకు సంబంధించిన గీతాలు పైరగాలిలా పనిగట్టుకొని వీవెనల భావనలు వెల్లివిరుస్తుంటాయి. సేద్యంలో స్వేధంలో పొలాల శ్రమైక జీవనయానంలో కొనసాగే పల్లీయులు సాగుపట్ల తోటిరైతు నిర్లక్ష్యం చూపితే చూస్తూ ఊరుకోలేరు. అలాంటి నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ పాడేపాటే....

ఏలేస్తివి నరసప్పా చెరుకుతోట / నీవేలేస్తివి నరసప్పా చెరుకుతోట
చుట్టుపట్ల తోటలన్ని / చుట్టకాని కొచ్చినాయి
నరసప్పా నీ తోటలో నక్కా, రకను పిచ్చిలేదు
గానిగింట్లో నీ చెరుకు / గజ్జలోగినట్లుంది
చెరుకుతోట్లో నీ చెరుకు శెంకూదినట్లుంది
పెనంలోని నీ బెల్లం / పీకులాట నాకులాట
ఏంటికోయి నరసప్పా / ఈ నగుబాటు సేద్యం...

– అంటూ పాటకొనసాగుతుంది. సాటిరైతులు నరసప్ప సేద్యాన్ని గేలిచేస్తారు. చేసే సాగుపట్ల నిర్లక్ష్యం చేస్తే, పంట చేతికి రాకపోగా పరిగిలితనంతో దేనికీ పనికిరాకుండా పోతావని హెచ్చరింపు ఈ పాటలో తొంగిచూస్తుంది.

శృంగారపరంగా యువతి మొగుడు యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తుంటాడు. పాటలోని నాయిక పైలాపచ్చీసుగా మంచి యౌవనంలో ఉంటుంది. కోరికలు తీరేమార్గంలేక వరుసకు మామయిన ఒక వయస్సు కుర్రాణ్ణి ప్రేమిస్తుంది. మనసుపడిన యువతి మామతో లేచిపోవాలనుకుంటుంది. మామ వరుస కుర్రాడికి ఆమెపైన వ్యామోహం ఉంది కానీ ఆమెకు అండగా ఉంటున్న అన్నదమ్ములు ఏం చేస్తారోనని భయం. భయంగియం మానుకో నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డువేసి జీవితాంతం ఏ లొసుగులు లేకుండా సాకేందుకు డబ్బుతో పాటు బంగారం కూడా ఉంది వెళ్ళి హాయిగా జీవితాన్ని గడిపేద్దామని నాయిక హామీ ఇచ్చినా వాడి భయం, తొట్రుపాటు వాడిది.

నాయిక: ***"ఎక్కుమామా! రైలెక్కుమామా!***
ఎనకాముందు చూడద్దు మామా! ఎక్కుమామా

నాయకుడు: ***నేనెక్కలేనే రైలెక్కలేనే***
నేనెక్కలేనే గుండెలదరతాయే
ఆ ప్రియభామ ఊరడిస్తూ
"ఎక్కు ఎక్కు దిగులుపడకు
యెనకా ముందు దిక్కులు చూడకు
ఎగబడోయి నీ ఆకు జినగ" *(తిట్టు)*

– అంటూ మందలిస్తుంది నాయిక. అతడేమో వణుక్కుంటూ...

పదిమంది మీ అన్నదమ్ములు / పైపై బడి గుడ్లురుముతుంటే
ఎలా ఎక్కనే రైలు నేనెక్కలేనే

– అంటూ సణుగుతాడు, వణుకుతాడు.

పదిమంది నా వాళ్ళ పై బడి వస్తాపుంటే
నా పైట కొంగు ముసుగేసి / నీ ప్రాణాలు కాపాడుతాను

– అంటూ ఆమె నెత్తిమీద వట్టేసి హామీ ఇచ్చింది. అంతేవాడు బతికే దెట్టాని భయపడుతున్నావా?

కస్తూరి కమ్మలున్నాయి / కమ్మలకు జుమ్మిలున్నాయి
కుంచెళ్ళలో నీ బంగారు దోపుకున్న
బతుకుభయం నీకొద్దు
రైలెక్కి రావోయి బంగారు నామామ! బంగారు నా మామా

– అంటూ బ్రతిమలాడి రైలెక్కించే ఝంఝూంని

ఎక్కతానే రైలెక్కతానే / ఎవ్వరితోను భయం లేదు ఎదురుగా నీవుంటే

– అంటూ రైలెక్కి ప్రణయయాత్రకు పరుగులు పెట్టారు.

ఇప్పటిలాగా ఆ కాలంలో పుట్టి నాల్గాకులు వేయగానే బుద్ధిబలం ఉండబోదు. లౌకీకం అలసే లేదు. ఆకారపుష్టి ఉందిగాని అవగాహనలేని అమాయకత్వం. వెంటపడితే వంతపాడి తానా... అంటే తందానా అనే అమాయకత్వం. చెప్పదగినదాకాదా? అనే ఇంగితజ్ఞానంలేని భోళాతనం. అందుకే ఆ అమాయకపు యువకుడు ఆవురావురంటూ అమ్మా! నేనీ బాధ భరించలేనే అంటూ జరిగింది జరిగినట్లు తన బాధను తట్టుకోలేక గుట్టురట్టూ గాలికొదిలేసి అమాయక సుఖాన్ని చెప్పుకొన్నాడు.

యువకుడు: ***'గునిగంటి చెర్వులోన గుర్రాలు మేపుతుంటే***
పడమటి గెద్దదంట పసిమిరంగు ఛాయది
పందులజోగిదంట / నను పట్టుకులాగింది
మేలి బుటాల చీర / తేనీగ రంగు రవికె
మనసునిల్వకుపోయే / మత్తుమందుజల్లిదో
చిత్తుచిత్తుగ ముద్దులెట్టి / ముని పంట బుగ్గకొరికి
ఉక్కిరిబిక్కిరి చేసింది / నా వొళ్ళంత తిమ్మిరి
వదలక కౌగలించుకొంది / అబ్బో నేను తాళలేక
రెండు గుండ్లు నడుమన / సెలయేరు పారినట్లు
చెలిమ నడిమి సెలయేట్లో / చెలిమి నేస్తినే తల్లి
ఇచ్చింది ఒక రూకే / ఇంకొంచెం అదిమిపట్టి
నలిపేయరానన్ను / నవనవలాడే కుర్రాడా
ఏందేందో చేశానే / ఎంతో బాగుంది కానీ
అమ్మా! ఏమందు ఏం చెబ్దూ

మాపిటేలకే నా వొళ్ళు / మసిగెడ్డయిపోయింది
భగభగలతో నా వొళ్ళు / భగ్గుమంటోంది
సురాలమంటుతోంది / మందయినా మాకయినా
ఇచ్చి పుణ్యెం గట్టుకోవే!
ఇంకా యిట్టాంటిపన్లు / యీ జన్మలో చేయనే

– అంటూ అమాయకపు కుర్రాడు కళ్ళునీళ్లు కారుస్తూ అమ్మ కాళ్ళు పట్టుకొన్నాడు. విషయ మెరిగిన తల్లి మందూ మాకు తీసుకురావడానికి వెళ్ళింది.

సంసారంలో మొగుడి ప్రొద్దిరుగుడు పువ్వు వ్యవహారం పొసగకుండా, చెడు తిరుగుళ్ళకు అలవాటు పడిన మొగున్ని మార్చలేని బేలతనంతో ఇలా వాపోతూ పాటగా సాగిపోతుంది.

ఈతచెట్టు ఇల్లుకాదు / తాటిచెట్టు తల్లి కాదు
తగరం బంగారు కాదు / తగిలినోడు మొగుడు కాదురా
ఓ రెరికిలి తగరం బంగారు కాదురా

– అంటూ కన్నీరు మున్నీరౌతుంది ఆ మొగనాలు. మొగుడి డోలతనాన్ని వెల్లడిస్తుంది. నాయికా, నాయకులు ముఖపరిచయమై ఓ చోట వ్యాహ్యాళికెళ్లుతారు. మొదటి చూపులోనే ఒకరికొకరు పచ్చిగా నచ్చుతారు. నాటకీయంగా పలకరించుకొనే దిశగా నాయకుడు నాయికని ప్రశ్నించే ఈ జానపదం కోలాటం పాట ఇలా కొనసాగుతుంది. నాయకుడు

ఏమే భామా! భామ నీ పేరేమి?
నీ ఊరి పేరేమి నిలిచి మాట్లాడు – అంటూ దర్పాన్ని ప్రదర్శిస్తాడు. నాయిక మాత్రం తక్కువదేం కాదు. ఇలా పాటలోనే గంభీరంగా సమాధానం ఇస్తుంది.

ఊరు గొప్పదిరా!
ఉగ్రఛండికరా / పుంగమ్మ ఏలేటి పుంగనూరు మాది

– అంటూ "ఉగ్రఛండిక"ను, వత్తిపలుకుతూ అందులోనే నా పేరుందంటూ నర్మగర్భంగా తెలుపుతుంది. ఇది పల్లె పట్టులలో నాయికా నాయకుల ప్రేమకు నాందీ పలికి చేరువ చేసే శృంగార ఘట్టం. పాట అలవోకగా పరిచయాలు పెంచుకోవడమే కాదు ఊరు ఉనికిని తెలిపే ప్రణయ ప్రబంధం.

పుడిపట్ల ఎల్లమ్మ గ్రామదేవతగా వెలసిన ఐతిహ్యం. చిత్తూరు జిల్లా చౌడేపల్లి మండలం లద్దిగం గ్రామ పంచాయితీలో పుదిపట్ల చెర్వుగట్టుమీద గ్రామదేవత ధరించేందుకు మారుబట్టలు లేక ఆకట్టపై దద్దిలంలో తలదాచుకొన్నవైనం, ఊరి తలారిరాముడు అమ్మవారిని శాశ్వతంగా తమ చెర్వుకట్టపైనే ఉండాలని ఆలోచించి తను ఇచ్చిన మాటను తప్పిన ఉదంతం నేడు ఈ ప్రాంతంలో సామెతగా మారి "తలారి రాముడిమాట వింటే పుదిపట్ల ఎల్లమ్మగతే" అంటూ ప్రజలు పదే పదే పునఃశ్చరణ చేసుకొంటారు. విహారార్థమై జగజ్జనని అయిన ఎల్లమ్మ తల్లి నిండి పొంగారుతున్న పుదిపట్ల చెర్వును చూసి జలకాలాడాలని నిశ్చయించుకొని చెర్వులో జలక్రీడలు మొదలుపెట్టింది. ఆమెకు ఎప్పటికోగానీ స్నానం తర్వాత పొడిబట్టలు ధరించాలనే తలంపురాలేదు. ఆ స్పృహరాగానే వళ్ళంత జలదరించి గుండె చెర్వంత అయ్యేలా వగచి వగచి ఏడ్చింది. ఆసరా కోసం ఎదురు చూస్తుండగా చెర్వు భద్రతను పరిరక్షించే తలారి రాముడు తటస్థపడి అమ్మా! దిగులు చెందకు కూతవేటు దూరంలో ఉన్న పుంగనూరు పట్నానికి వెళ్ళి కొత్త దుస్తులు కొని తెస్తానని నమ్మబలికి గంటలు, దినాలు గడిచిపోయినా రాముడు రాకపోవడంతో తడిబట్టలతోనే మాన సంరక్షణకోసం చెర్వుకట్టపైగల దద్దిలంలో తలదాచుకొంది అమ్మవారు. రాముడేమో తాను కొత్త బట్టలు తీసుకువచ్చి యిస్తే దేవత వెళ్ళిపోతుందని గ్రామదేవతగా ఇక్కడే ఉండిపోవాలనే దుష్ట తలంపుతో ఉండిపోగా ఎల్లమ్మ తల్లికి పుదిపట్ల చెర్వుకట్టే స్థిరనివాసమై ఆ ప్రాంత ప్రజల పూజలు, ఉత్సవాలు, జాతరల సంబారాలలో తలమునకలై నిండుగా స్థిరపడిపోయింది.

ఆ చెర్వు ఈ చెర్వు పుదిపట్ల చెర్వు
చెర్వులో ఎల్లమ్మ జలకాలాడుతోంది ॥ ఆ చెర్వు ॥

జానపదుల శృంగారంలో పినరంత రసికత పిడికెడంత ఆత్మీయత, దోసెడంత ప్రణయకలహాలు, బారెడంత ఛీత్కారాలు, బానెడంత మక్కువ, చెరువంత వల్లమాలిన ప్రేమ, చెప్పలేనంత అనురాగము, చేరువయ్యే కొద్దీ తీరని దాహం ఇలా ఇలా తనకు నచ్చినోన్ని చచ్చినా జారవిడుచుకోలేని మక్కువ కనబడుతుంటుంది. సంసారంలో ఆటుపోట్లున్న సాన్నిహిత్యంలో విడదీయలేని ఆంతరంగిక అనుబంధం, వల్లెటూరి జంటలకు ఆయువుపట్టు. చిన్నుగానిపాట, ఈ ప్రాంతంలోనే కాకుండా మరెన్నో ప్రాంతాల్లో ఆయా ప్రాంతాలకు, ఊర్లుకు సంబంధ బాంధవ్యాలతో ఎవరికి తోచిన రీతిలో వారు పాడుకొంటారు.

ఓరోరి చిన్నుగా వగలమారి చిన్నుగా
కలదాటిపోతుంది / కనుకోరా చిన్నుగా

చిన్నుగాడు: పుంగనూరు సంతకు పోదామే చినదాన – అంటూ జోడీని బులిపిస్తాడు. నాయిక కోరిక కోరుకుంటుంది.

పుంగనూరు సంతకుపోదాము చిన్నుగా
పుంగనూరు సంతలోన పువ్వులంగడి కాడ
పువ్వులు కొని ఇస్తావా?
చేతిలో కాసుల్లేవని, చేతులెత్తివేస్తావా?

– అంటూ వయ్యారి వెటకరిస్తుంది. అంతలో ఊరుకోక

రామసముద్రం సంతకు వెళదామా చిన్నుగా
రామసముద్రం సంతలోన రైకలు కొనియిస్తావా

రైక లేదు గియకలేదు / చేతిలో రొక్కంలేదని రయ్యని పరుగెడతావా! – అంటూ దెప్పిపొడుస్తుంది. చిన్నుగాడు ఊరకుంటాడా ఏమిటి?!

రైకల్లేవ్, కోకల్లేవ్ / జోబీలో పైసల్లేవ్
రంగూను కెళ్దామే రైకలు, కోకలు కొన్దామే – అంటూ బులిపిస్తాడు.

వగలాడి హొయలు పోతూ–

రైకల్లేవ్, కోకల్లేవ్ / నోటికి వక్కాకు లేదు
గత్తర మాటలువద్దు / గప్పున నన్నొదలిపోరా

– అంటూ విదిలించి, దులిపేస్తుంది వయ్యారి. చిన్నుగాడు చిన్నబోతాడా, *ఓ అమ్మీ! నా గొప్ప నీకు తెల్దు*

మనసులోన పడిందంటే నడుముల వడ్డాణమిస్త
నాజూకు కమ్మలిస్త / నడకలోన కులికిమొగే ముప్పలు కొనిస్తా

– అంటూ గొప్పలు పోతాడు. వయ్యారికి వొళ్ళు పులకిస్తుంది. వలపు కల్వరిస్తుంది. చిన్ను బావమీద ప్రేమ పుట్టుకొస్తుంది.

బావా! నువ్వు ఇంకేమి చెప్పొద్దు / ఓట్టుపెట్టి నా ప్రేమను గిలకొద్దు
నువ్వేనా పేనం / నూరేళ్ల సంసారం

– అంటూ రివ్వున గువ్వలా రెక్కలొచ్చి వొదిగిపోతుంది.

కోలుకాడు మొగుడు, కోకిలమ్మ భార్య వరుసకు మేనమామ. ఈడుజోడు కుదిరింది. పందిరి మంచం అదిరింది.

కోలుకాడా! నిన్నే మడిగితి / జోడుకాడా నిన్నేమడిగితి

– అంటూ పెనగొన్న గువ్వల జంట ఏమడిగితి నిన్నేమడిగితి అంటూ జానవద యుగళగీతంతో హోరెత్తించి, హుషారు రేకెత్తిస్తారు.

ఏడుకొండలవాడా వెంకట రమణా
ఏల స్వామి మాయింటికి రావు
మా ఇంటికి రావు – మా దొడ్డికి రావు
మా ఇంటికొచ్చేందుకు దోవలెన్నో ఉన్నాయి
డొంకలెన్నో ఉన్నాయి / సుట్టుతిరగానే సున్నపుగోడ
నట్టనడమన నాగుళ్ళ చవితి
గుత్తమైన నా నగరు గుజ్జుమామిళ్ళు...

– అంటూ శ్రీ వేంకటరమణుని అలివేలు మంగమ్మ అభ్యర్థించే పాట తేట తేనియల తెలుగు పలుకులుతో అభ్యర్థనేకాదు. అలకలో ఆలూమగల ఆజ్ఞాపిత నర్మగర్భ చమత్కారాలు, చెణుకులు పొదగట్టి జనమనోరంజకమౌతుంది.

మానవుడు నేను, నాదీ నాదనే ఆశతో ఆరాటపడి సంసార ఝంజాటంలో పడి తహతహలాడడం జీవికి సహజం. నీదీ, నీదనేది ఏదీ లేదని తెలుసుకొన్నవాడు పరమాత్మ తప్పా సర్వమూ శూన్యమనే ఆధ్యాత్మిక జానపదగీతాలు కూడా లేకపోలేదు.

ఇల్లు ఇల్లంటావు ఉల్లాసపడతావు నీ ఇల్లు ఎక్కడే చిలకా
అల్లంత దూరాన వల్లకాటిలోన నీ ఇల్లు ఉన్నదే చిలకా
... పుట్టుక నేడుంటే చావు వదలబోదు
నీది ఏదీ కాదు, నీ దేహమే తప్పా!

అంటూ పాడుకొనే తత్త్వచింతన కూడా జానపదాలలో లేకపోలేదు.

జానపదులలో చిగురుటాకులలో ధ్వనించే ఓంకార ప్రణవనాదంతోపాటు భారత, భాగవత, రామాయణ వేదలహరులను తమదైన రీతిలో మలచుకొని పాలు, వాటికి వరువాల చిందులు, వెన్నెల రాత్రులలో పల్లెపడుచుల జక్కిలు, జానుతెనుగును యాస భాషలో ఎక్కడెక్కడి విరులలో సేకరించిన జుంటి తేనీయల పలుకుల పాటలు ఇదంతా ఓపికగా, వొప్పారు నేర్పుతో, గుండెలనిండా పొదువుకున్న జనసాహిత్యం వెలుగులోకి తీసుకురాగలిగితే జగత్తే జానవదమయమై, జలధి తరంగాల హోరై భువిని దివిని కలిపే ఇంద్రచాపమై తరించే తరుణం కోసం ఎదురుచూడడం మానవాళిగా మన కర్తవ్యం.

(వ్యాసం క్లుప్తత కోసం జానపద గీతాల పూర్తి పాఠాన్ని వివరించలేకపోవడం జరిగింది.)

డి. కృష్ణారెడ్డి
పుంగనూరు, చిత్తూరు జిల్లా. ఫోన్: 939 258 2015.

వలసాంధ్రలో వితంతు పునర్వివాహోద్యమ స్వర్ణయుగం: ధీర స్త్రీ పురుషుల పట్టిక (1881-1939)

– షేఖ్ మహబూబ్ బాషా

బ్రిటిష్ పాలనాకాలం నాటి ఆంధ్రలో ముమ్మరంగా సాగిన సంఘ సంస్కరణోద్యమంలో మహోజ్జ్వలమైనది హిందూ వితంతు పునర్వివాహోద్యమ ఘట్టం. "యుగపురుషుడు"గా సరిగ్గానే కీర్తించబడిన కందుకూరి వీరేశలింగం పుట్టక ముందునుంచే వలసాంధ్రలో సంఘ సంస్కరణ భావాలు ప్రచారంలో ఉన్నప్పటికీ, అవి స్పష్టమైన వుద్యమ రూపం తీసుకున్నది మాత్రం వీరేశలింగం, అతని సహచరులూ, అనుచరుల నిరంతర, నిర్భయ కృషి వల్లనే. తెలుగునాడులో వితంతు పునర్వివాహోద్యమం అన్న వెంటనే సాధారణంగా వీరేశలింగం పేరు గుర్తుకొస్తుంది. కొంతమంది శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మమ్మనూ తలచుకుంటారు. వితంతు పునర్వివాహోద్యమాన్ని నడపడంలో రాజ్యలక్ష్మమ్మ – వీరేశలింగం దంపతులకు ఎంతోమంది స్త్రీలూ, పురుషులూ, మరీముఖ్యంగా విద్యార్థులు, అన్నిరకాలుగా సహకరించారు. కానీ చరిత్ర రచనా పద్ధతిలో బలంగా వేళ్ళూనుకొన్న 'గొప్ప వ్యక్తి' పూజ కారణంగా చరిత్రను ముందుకు నడిపిన బండి చక్రంలోని యిరుసు మాత్రమే ప్రధానమైపోయి, చక్రాన్ని చక్రంగా నిలబెట్టే అనేక పలగడలు (కొయ్య చువ్వలు) మరుగున పడిపోతున్నాయి. చరిత్ర రచనా శాస్త్రం (Historiography)లోని ఈ లోపంవల్ల ధీరత్వాన్ని ప్రదర్శించిన అనేకమందికి 'గొప్ప' పురుషులూ, 'గొప్ప' స్త్రీల సరసన కాసింతైనా చోటు దొరకడంలేదు.

ఈ వ్యాసం చరిత్ర చీకటి కొట్లో అట్టడుగునపడి కనిపించకుండాపోయిన కొంతమంది ధీర వనితలూ, ధీర పురుషులకు సంబంధించింది. పునర్వివాహం చేసుకోవడానికి వితంతువులూ, వితంతువుల్ని పెండ్లాడడానికి పురుషులూ సంసిద్ధులై ధైర్యంగా ముందుకు రాకపొయ్యుంటే వితంతు పునర్వివాహోద్యమం కనీసం రూపుదాల్చేదా? వితంతు పునర్వివాహం హిందూ పతివ్రతా ధర్మానికి గొడ్డలిపెట్టనీ, పునర్వివాహిత స్త్రీలు "కులాంగనలు" కారనీ, చచ్చిపోయినా, బ్రతికున్నా హిందూ స్త్రీకి భర్త ఒక్కడేననీ, పునర్వివాహం చేసుకోవడమంటే వ్యభిచరించడమేననీ ఛాందసవాద కారుమేఘాలు భయంకరంగా గర్జిస్తుండిన చారిత్రక సందర్భంలో కొంతమంది ధీర వనితలూ, ధీర పురుషులూ పునర్వివాహం చేసుకోవడానికి ముందుకొచ్చి సంఘ సంస్కరణా దీపాన్ని మరింత ప్రకాశవంతం చేశారు. కానీ మనలో చాలామందికి కనీసం వాళ్ళ పేరైనా తెలియవు! ఇంతకీ వాళ్ళ పేర్లుగానీ, వివాహానంతరం వాళ్ళ జీవితాల గూర్చిగానీ మనకెందుకు తెలియకుండాపోయాయి? సామాజిక బెదిరింపులకూ, పులికంటే బలమైన, భయంకరమైన 'వెలి'కీ, పోలీస్ కేసులకూ, కోర్టు వ్యాజ్యాలకూ బెదరకుండా పట్టుదలతో పునర్వివాహోద్యమాన్ని కొనసాగించిన రావ్‌బహదూర్ కందుకూరి వీరేశలింగం తన స్వీయచరిత్రము లో పునర్వివాహం చేసుకొన్న యువతుల పేర్లైనా ఇవ్వలేదనీ, "వారి పేర్లు రాయటం ముఖ్యమనిపించలే"దనీ కొంతమంది భావిస్తున్నారు. అవునూ, ఆయన వాళ్ళ పేర్లను ఎందుకు ప్రస్తావించలేదు; అదేమంత ముఖ్యమైన విషయం కాదులే అనుకోవడంవల్లా? కాదు; ముమ్మాటికీ కాదు. పునర్వివాహం చేసుకొన్న వితంతువుల పేర్లను అస్సలు ప్రస్తావించకుండా వదిలేయలేదన్న విషయాన్ని ముందు గుర్తించాలి. ప్రత్యేకించి చెప్పాలనుకున్నప్పుడు పేర్లను తప్పకుండా ప్రస్తావించాడాయన. ఇద్దరు సీతమ్మల గూర్చీ (వీళ్ళలో ఒక సీతమ్మ గంజాంలోని అసికా నుండి రాజమహేంద్రానికి వచ్చారు), శ్రీమతి వేంకట రమణమ్మ గూర్చీ, యింకొంతమంది గూర్చీ రాశారు. రాజ్యలక్ష్మమ్మ–వీరేశలింగం దంపతుల్లాగే అంతే పట్టుదలతో వితంతు పునర్వివాహోద్యమ చక్రాన్ని ముందుకు నడిపించారు దరిశి చెంచయ్య, ఆయన మొదటి భార్య దరిశి అన్నపూర్ణమ్మ. చెంచయ్య కూడా తన దివ్య స్మృతులు లో వితంతువుల పేర్లు ప్రస్తావించలేదు. ఇంకోచోట ఆయన 'దురదృష్టవతులైన స్త్రీల'ను గూర్చి రాసినప్పుడూ వాళ్ళ పేర్లు బయటపెట్టకుండా "రు... అను వితంతువు", "జా... అను వితంతువు", "కా... అను వితంతువు", "న... అను వితంతువు", "శ్రీమతి వి... ముక్కు పచ్చలారని ముగ్ధ" అని ప్రస్తావించారు. వాళ్ళు అప్రధానం అనుకున్నందువల్లనే పేర్లు ప్రస్తావించలేదని అనుకుందామా?

ఎందుకు వితంతు వివాహితల పేర్లు బహిరంగపరచడానికి సంకోచించేవారంటే: యింతకు ముందు మనం ప్రస్తావించుకున్నట్లు వితంతు పునర్వివాహాల్ని ఛాందసవాదులైన పురుషులూ, స్త్రీలూ తీవ్రాతి తీవ్రంగా వ్యతిరేకించేవారు. ముఖ్యంగా పునర్వివాహితలను 'కళంకితురాల్లు'గా చూసేవారు. వాళ్ళు "కులాంగనలు" కాదని ఈసడించేవారు. ఇలాంటి చారిత్రక సందర్భంలో, అదే సమాజంలో నివసించాల్సి వచ్చిన పునర్వివాహ దంపతులు గుట్టుగా తమ సంసారాల్ని నడుపుకొనేవారు. సంస్కారవంతులమనుకునే వాళ్ళెవ్వరూ వారిని కలవడంగానీ; మంచికైనా, చెడుకైనా పిలవడంగానీ చేసేవాళ్ళు కాదు. వాళ్ళు "సభ్య" సమాజానికి బహిష్కృతులు. ఒక ఉదాహరణ: పునర్వివాహం చేసుకున్న ఒక స్త్రీ 1911లో ఒక మహిళా సమావేశానికి వెళ్ళారు. ఆమె రాకను చాలా మంది తీవ్రంగా గర్హించారు. ఆమె సమావేశానికి ఎలా వచ్చిందన్న విషయంపై పెద్ద రభస జరిగి కాకినాడలోని ప్రముఖ మహిళా సంఘమైన 'శ్రీవిద్యార్థినీ సమాజం' చీలిపోయింది. స్త్రీలలో వాదోపవాదాలు చెలరేగి సుమారు ఒక సంవత్సరంపాటు సమకాలీన పత్రికలు – ముఖ్యంగా స్త్రీల పత్రికలు – అక్షర యుద్ధ భూములయ్యాయి. దీన్నిబట్టి "పునర్వివాహిత"లపట్ల వ్యతిరేకత ఎంత తీవ్రంగా వుండేదో సులభంగా వూహించవచ్చు. తిరస్కారాలకూ, అవమానాలకూ గురౌతూ, సామాజికామోదం

సరిగ్గా లేకపోవడంవల్ల ముందుగానే కుంగిపోయి గుంభనంగా జీవితం గడుపుకొనే వాళ్ళ పేర్లు బయటపెట్టి వాళ్ళను మరిన్ని యిబ్బందులకు గురిచేయదలచుకోలేదు వీరేశలింగం, చెంచయ్య లాంటి పురుష సంఘ సంస్కర్తలు. దాదాపుగా దేశవ్యాప్తంగా జరిగిందిదే. కాస్తంత వామపక్ష భావాలు యేర్పడి, ప్రజల ఆలోచనల్లో కొంచెం మెరుగైన మార్పులు చోటుచేసుకుంటున్న సందర్భంలో పునర్వివాహం చేసుకొన్న కొండపల్లి కోటేశ్వరమ్మ పెళ్ళికి ముందూ, తర్వాతా ఎలాంటి సమస్యలెదుర్కొన్నారో తన నిర్జనవారధిలో చెప్పుకొచ్చారు. అందుకే చారిత్రక సందర్భాన్ని అర్థం చేసుకోవడం చాలా ముఖ్యం. అప్పుడే చరిత్రను నిరామయంగా చూడగలం; రాయగలం. ఛాందసత్వానికి భయపడకుండా వితంతు పునర్వివాహోద్యమాన్ని నిర్మించిన ధీర వనితలూ, ధీర పురుషులూ ఎందరో వున్నారు. దట్టంగా కమ్ముకొన్న చీకట్లో కాస్తంత వెలుగు ప్రసరించడానికి ముందుకొచ్చిన దీపశిఖలు వాళ్ళు. నలుగుతూనే నిరుడు కొంత వెలిగారు; నేడు ప్రజల స్మృతిపథం నుండి పూర్తిగా మరుగయ్యారు. సమాజం మరచిపోయిన దాన్ని చరిత్ర గుర్తు చేస్తుంది. చరిత్ర కేవలం నోస్టాల్జియా కాదు; భావికి స్ఫూర్తి. వితంతు పునర్వివాహోద్యమ చరిత్ర నిర్మాణంలో సమభాగులైన స్త్రీ, పురుషుల పేర్లను ఈ క్రింది పట్టికలో పొందుపరచాను. క్రమ సంఖ్య 1 నుండి 59 వరకు 'మధురకవి' నాళము కృష్ణరావు రచించిన *వితంతు వివాహ చరిత్ర (1904 సం. వరకు)* నుండి గ్రహించాను. అయితే ఆయన తయారుచేసిన పట్టికను కొద్దిగా మార్పు చేశాను (అడ్డం అమరికలో). కృష్ణరావు యిచ్చిన సమాచారాన్ని వీరేశలింగం యిచ్చిన సమాచారంతో సరిపోల్చి పొరబాటుగా ఏర్పడ్డ కొన్ని తప్పుల్ని సవరించాను. కృష్ణరావు తయారు చేసిన పట్టికలో వితంతు వివాహ వధూవరుల వయసూ, వివాహం జరిగిన ప్రదేశమూ లేవు. దొరికినంత వరకు ఆ సమాచారాన్ని పొందుపరచాను. క్రమ సంఖ్య 60 నుండి 96 వరకు జె.యన్.యు.కు సమర్పించిన నా పిఎచ్.డి. సిద్ధాంత వ్యాసం 'Print Culture and Women's Voices: A Study of Telugu Journals, 1902-1960' కోసం చేసిన పరిశోధనలో భాగంగా తయారు చేసిన వివరణాత్మకమైన పట్టికలోనివి. క్రమ సంఖ్య 97 నుండి 103 వరకు ప్రొఫెసర్ బి. కేశవనారాయణ వ్యాసం 'Widow Marriage Movement in Andhra' (*Itihas*, Vol. 2, No. 1, January-June 1974) నుండి తీసుకున్నాను. వితంతు పునర్వివాహాలకు సంబంధించి విలువైన సమాచారాన్నందించిన సమకాలీన పత్రికల్లో కొన్నిసార్లు పునర్వివాహ వధూవరుల వయస్సు కూడా యిచ్చేవారు. లభ్యమైనంతవరకు ఆ సమాచారాన్ని ఆయా స్త్రీ, పురుషుల పేర్ల పక్కన బ్రాకెట్స్‌లో ఇచ్చాను. వివాహం జరిగిన ప్రదేశాన్నీ పేర్కొన్నాను. చాలాసార్లు ప్రాథమికాధారాలు వధూవరుల పేర్లివ్వకుండా కేవలం వితంతు పునర్వివాహాలు జరిగిన తేదీ, నెల, సంవత్సరం, ప్రదేశం మాత్రమే యిచ్చాయి. అలాంటివన్నీ ఈ పట్టికలో చేర్చలేదు. ఇంకా పరిశోధిస్తే వితంతు పునర్వివాహం చేసుకొన్న ఎంతోమంది సాహసవంతులైన స్త్రీలూ, పురుషులూ వెలుగులోకి రాగలరనేది ఈ వ్యాసకర్త ప్రగాఢ విశ్వాసం.

క్రమ సంఖ్య	వధువు పేరు	వరుడి పేరు	శాఖ/కులం	వివాహం జరిగిన తేది	వివాహం జరిగిన ప్రదేశం
1	గవరమ్మ	గోగులపాటి శ్రీరాములు (22)	నియోగి/ బ్రాహ్మణ	11.12.1881	రాజమహేంద్రవరం
2	రత్నమ్మ (12)	రాచర్ల రామచంద్రరావు	నియోగి/బ్రాహ్మణ	15.12.1881	రాజమహేంద్రవరం
3	సీతమ్మ	తాడూరి రామారావు	మధ్వ/బ్రాహ్మణ	22.01.1882	రాజమహేంద్రవరం
4	శేషమ్మ	పులవర్తి శేషయ్య	వైదికి/బ్రాహ్మణ	03.01.1883	రాజమహేంద్రవరం
5	సూరమ్మ (18)	ముంజులూరి గోపాలము (20)	నియోగి/బ్రాహ్మణ	30.01.1883	రాజమహేంద్రవరం
6	వెంకమ్మ (17)	చేబోలు వెంకయ్య (23)	వైదికి/బ్రాహ్మణ	13.03.1883	రాజమహేంద్రవరం
7	రామలక్ష్మమ్మ (10)	బోడా శ్రీరాములు (20)	వైశ్య	11.4.1883 (కృష్ణరావు ఇచ్చిన పట్టికలో తేది '17' అని వుంది. కానీ వీరేశలింగం తన స్వీయ చరిత్రములో తేది'11' అని యిచ్చారు.)	రాజమహేంద్రవరం
8.	కోపమ్మ (12)	తణుకు చలపతిరావు	నియోగి/బ్రాహ్మణ	08.06.1883	
9	రత్నమ్మ	సలాది రామయ్య	వైశ్య	18.08.1883	
10	సుబ్బమ్మ (13)	నల్లగొండ కోదండ రామయ్య	యాజ్ఞవల్క్య/బ్రాహ్మణ	05.01.1884	

11	పూర్ణమ్మ (వీరేశలింగం స్వీయ చరిత్రములో వధువు పేరు వల్లూరి పున్నమ్మ అని వుంది)	కొమ్మరాజు గోపాలము	నియోగి/బ్రాహ్మణ	06.07.1884 (వీరేశలింగం స్వీయ చరిత్రములో ఈ పెళ్ళి 06.07.1888లో జరిగిందని యిచ్చారు.)	
12	--- (15)	చిత్తూరు సుబ్బారావు	నియోగి/బ్రాహ్మణ	12.02.1885	బళ్ళారి
13	--- (12)	జటప్రోలు రామారావు	నియోగి/బ్రాహ్మణ	12.02.1885	బళ్ళారి
14	విశ్వేశ్వరమ్మ	తుముకూరు రామారావు	మధ్వ/బ్రాహ్మణ	18.07.1885	
15	నరసమ్మ	పటానేని వెంకయ్య	కరణకమ్మ	20.12.1885	
16	మంగమ్మ	నల్లగొండ కోదండ రామయ్య	యాజ్ఞవల్కి/బ్రాహ్మణ	17.10.1888	
17	కామేశ్వరమ్మ	పటానేని వెంకయ్య	కరణకమ్మ	02.02.1889	
18	అమ్మన్న	గ్రంధి వెంకటరెడ్డి	వైశ్య	21.03.1889 (వీరేశలింగం స్వీయ చరిత్రములో తేది '29' అని వుంది)	
19	లక్షమ్మ	తణుకు నరసింహం	నియోగి/బ్రాహ్మణ	25.9.1892	
20	సీతమ్మ (16)	కూనూరి పురుషోత్తం	మధ్వ/బ్రాహ్మణ	06.11.1892	
21	నరసమ్మ	గని సుబ్బారావు	మధ్వ/బ్రాహ్మణ	18.09.1893	
22	సీతమ్మ	ఆదిపూడి సోమనాథరావు	నియోగి/బ్రాహ్మణ	28.06.1893	
23	అభిరామమ్మ	హెచ్. బాజీరావు	బ్రాహ్మణ	18.11.1894	
24	తులశమ్మ	ద్రోణంరాజు శేషగిరిరావు	మధ్వ/బ్రాహ్మణ	09.08.1895	
25	రంగనాయకి	కోపల్లి శేషగిరిరావు	మధ్వ/బ్రాహ్మణ	30.06.1896	
26	పార్వతమ్మ	నాళ్లచెరువు కృష్ణారావు	మధ్వ/బ్రాహ్మణ	08.10.1896	
27	వరలక్ష్మి	తుముకూరు రామారావు	మధ్వ/బ్రాహ్మణ	01.01.1897	
28	పార్వతమ్మ	పుల్లాభట్ల గవరయ్య	వైదికి/బ్రాహ్మణ	16.10.1897	
29	సన్నమ్మ	కొమ్మరాజు గోపాలము	నియోగి/బ్రాహ్మణ	23.10.1897	
30	శేషమ్మ	నందుల గోపాలస్వామి	వైదికి/బ్రాహ్మణ	27.08.1898	
31	రత్నమ్మ	పటానేని వెంకయ్య	కరణకమ్మ	27.09.1898	
32	బంగారమ్మ	ఆదిపూడి గోపాలశర్మ	నియోగి/బ్రాహ్మణ	26.01.1899	
33	మహాలక్ష్మమ్మ (20పైన)	న్యాపతి శేషగిరిరావు (40పైన)	మధ్వ/బ్రాహ్మణ	26.02.1900	గజపతినగరం
34	చిట్టెమ్మ	గోపాలకృష్ణయ్య	వైదికి/బ్రాహ్మణ	--.--.1900	
35	సీతమ్మ	లింగాల వీరభద్రయ్య	నియోగి/బ్రాహ్మణ	28.10.1900	
36	లక్ష్మీబాయి	మహదేవ మొదల్యారు	వెల్లాల	05.11.1900	
37	మహాలక్ష్మి	ఓగిరాల లక్ష్మీనారాయణ	నియోగి/బ్రాహ్మణ	22.01.1901	
38	కౌసల్య	పుల్లాభట్ల గవరయ్య	వైదికి/బ్రాహ్మణ	31.12.1901	
39	చిరంజీవమ్మ	కోకా వెంకటసుబ్బారావు నాయుడు	ఆదివెలమ (వీరేశలింగం "నాయఁడు శాఖ" అన్నారు)	03.01.1901	చెన్నపట్టణము

40	చిట్టెమ్మ	మంజులూరి గోపాలం	నియోగి/బ్రాహ్మణ	12.05.1901	
41	చొక్కమ్మ	శేషయ్యంగారు	వైష్ణవ	11.07.1902	
42	రమణమ్మ	పారనంది రామచంద్రరావు	వైదికి/బ్రాహ్మణ	13.09.1902	
43	వేంకట రమణమ్మ	బేతపూడి జోగి సూర్యప్రకాశరావు	నియోగి/బ్రాహ్మణ	11.10.1902	గుంటూరు
44	వేంకట లక్ష్మమ్మ	తిరుమెళ్ళ వెంకట సుబ్బారావు	నియోగి/బ్రాహ్మణ (శాఖాంతర వివాహం)	14.10.1902	రాజమండ్రి
45	సీతారామమ్మ	భట్టిప్రోలు శరభయ్య	నియోగి/బ్రాహ్మణ	19.11.1902	
46	కామాక్షమ్మ	భండారు దండపాణి	నియోగి/బ్రాహ్మణ	--.--.1902	
47	శేషమ్మ	ధేరం వెంకటేశ్వరరావు	వైదికి/బ్రాహ్మణ	26.12.1902	
48	అన్నపూర్ణ	కొత్తుర్తి నమశ్శివాయ	విశ్వకర్మ	14.02.1903	
49	వరలక్ష్మి	సి.యస్. శ్రీనివాసాచారి	వైష్ణవ	12.03.1903	
50	సీతారామమ్మ	ఉప్పులూరి సుబ్బారావు	నియోగి/బ్రాహ్మణ	26.06.1903	
51	సీతారామమ్మ	కస్తూరి సుబ్బారావు	నియోగి/బ్రాహ్మణ	16.07.1903	
52	వెంకుబాయ్	పసుమర్తి కృష్ణమూర్తి	నియోగి/బ్రాహ్మణ	30.09.1903	
53	రత్నమ్మ	పుట్రేవు సుబ్బారావు	నియోగి/బ్రాహ్మణ	01.04.1904	
54	నాగరత్నమ్మ	ఉప్పులూరి సుబ్బారావు	నియోగి/బ్రాహ్మణ	17.07.1904	
55	హనుమాయమ్మ	అధరాపురపు సంజీవరావు	మధ్వ/బ్రాహ్మణ	14.08.1904	
56	హనుమాయమ్మ	బండ్లమూడి వెంకట్రావు	వైదికి/బ్రాహ్మణ	10.11.1904	
57	రంగనాయకి	మేళ్ళచెర్వు తాండవకృష్ణయ్య	వైదికి/బ్రాహ్మణ	25.12.1904	
58	కృష్ణమ్మాళ్	వెంకట వరదయ్యంగారు	వైష్ణవ	31.07.1892	
59	---	చిత్తూరు సుబ్బారావు	బ్రాహ్మణ	31.07.1887	
60	---, అత్తలూరి శ్రీశైలపతిగారి కుమార్తె	నాగభూషణాచార్యులు	విశ్వబ్రాహ్మణ	08.12.1912	అత్తోట, తెనాలి తాలూకా
61	రుక్మిణమ్మ (16) (ఈమెకు 6 సం.ల వయస్సులో పెండ్లి చేశారు. కొద్దిరోజుల్లోనే వితంతువయ్యారు)	పచ్చిపులుసు కన్నయ్య శెట్టి	వైశ్య	22.12.1926	గుంటూరు
62	రుక్మిణమ్మ (16)	పురం రంగయ్య శెట్టి (30)	వైశ్య	17.11.1927	ఏలూరు
63	కనక దుర్గాంబ (12) (మొదటి వివాహం 8 సం.ల వయస్సులో; రజస్వల కాకపూర్వమే వితంతువయ్యారు)	నరసపల్లి చెన్నప్ప శెట్టి	వైశ్య	03.02.1928	బళ్ళారి
64	వరలక్ష్మమ్మ (16)	రంగయ్య శెట్టి (25)	వైశ్య	19.08.1928	మదనపల్లి
65	గుడివాడ మహాలక్ష్మమ్మ	రెడ్డి రామయ్య	వైశ్య	04.12.1928	బెజవాడ
66	జానకమ్మ	అత్యం శ్రీరాములు	వైశ్య	07.04.1929	ఏలూరు
67	రాములమ్మ (14)	శింగపు దామోదరం (27)	వైశ్య	25.09.1929	సికిందరాబాదు
68	గవరమ్మ (16)	పచ్చిపులుసు సత్యనారాయణ (28)	వైశ్య	(?).11.1929	విశాఖపట్టణం
69	నారాయణమ్మ	సంకా విశ్వనాథం శ్రేష్ఠి	వైశ్య	18.11.1929	ఏలూరు

70	కనకరత్నం (12)	రామారావు (20)	వైశ్య	19.12.1929	విశాఖపట్టణం
71	--- (22)	పాలూరు చిన్న తిమ్మయ్య శెట్టి (35)	వైశ్య	28.12.1931	మద్రాసు
72	గున్నా మహాలక్ష్మి	మేజర్ యమ్.ఆర్. గంధి ఎం.బి.సి.ఎం., ఐఎంఎస్	వైశ్య	05.06.1932	మద్రాసు
73	కమలమ్మ	శ్రీరాములు	వైశ్య	05.06.1932	మద్రాసు
74	సుబ్బమ్మ	కామయ్య	వైశ్య	05.06.1932	మద్రాసు
75	శ్యామల (18)	కారంశెట్టి వెంకట రంగయ్యశెట్టి	వైశ్య	23.06.1932	మద్రాసు
76	రామలక్ష్మమ్మ (18) (వధువు కడప జిల్లా బద్వేలు తాలూకా గొల్లపల్లె గ్రామస్థుడైన శ్రీ రామయ్య కుమార్తె)	సుబ్బయ్య (వరుడు కడప జిల్లా వేంపల్లె గ్రామస్థుడైన శ్రీ తల్లం సుబ్బయ్య కుమారుడు)	వైశ్య	07.07.1932	మద్రాసు
77	సత్యవతీదేవి	బోలిశెట్టి	వైశ్య	27.07.1933	చీరాల
78	పార్వతీ వర్ధనమ్మ	చీమకుర్తి సుబ్బరాయ గుప్త	వైశ్య	14.09.1933	మద్రాసు
79	లక్ష్మమ్మ	యస్. వెంకట్రామయ్య	వైశ్య	14.09.1933	మద్రాసు
80	వెంకట సుబ్బమ్మ (14)	తడికమళ్ల వెంకయ్య (22)	వైశ్య	01.01.1933	తెనాలి
81	రామతులసమ్మ	రామబ్రహ్మం బి.ఏ.,	---	25.01.1934	ఏలూరు
82	సుందరమ్మ	బోయిన వెంకటప్పయ్య	వైశ్య	ఖచ్చితంగా తెలియదు; బహుశా జనవరి లేదా ఫిబ్రవరి 1934	నరసన్నపేట (ప్రస్తుతం ఒడిశాలో వున్న గంజాం జిల్లా)
83	సుబ్బమ్మ	చినస్వామి శెట్టి	వైశ్య	30.10.1935	కావలి
84	మంచిరాజు (16)	బుచ్చిరాజు (23)	వైశ్య	08.11.1935	కొయ్యలగూడెం
85	ముత్యం (15)	మాటూరి పంచాక్షరి	వైశ్య	08.11.1935	కొయ్యలగూడెం
86	విశాలక్ష్మమ్మ (18)	తాటిపర్తి వెంకట నారాయణ (28)	బ్రాహ్మణ	09.02.1938	(?) నరసాపురం
87	కమలాదేవి	పుత్తేటి సుబ్రహ్మణ్యాచార్యులు	విశ్వబ్రాహ్మణ	20.02.1938	మద్రాసు
88	సోమవల్లి	పందిరి సత్యానందము	---	16.03.1938	రాజమహేంద్రవరం
89	సీతామహాలక్ష్మమ్మ	పెరుమాళ్ళ కృష్ణమూర్తి	---	22.03.1938	గంగపట్టు
90	మాణిక్యమ్మ	శ్రీనివాస శెట్టి	వైశ్య	06.03.1938	సేలం (తమిళనాడు)
91	ఎనికేపల్ళి రంగమ్మ	పోలా కృష్ణయ్య	వైశ్య	30.09.1938	సికిందరాబాదు
92	పంకజమ్మ	లింగమల్లు గోపాలరావు	వైశ్య	13.10.1938	మద్రాసు
93	కోటిరత్నం	దేవరశెట్టి గురునాథం	వైశ్య	26.10.1938	---
94	జ్ఞానప్రసూనాంబ	వెంకట సూర్యనారాయణమూర్తి	వైశ్య	02.02.1939	వేటపాలెం
95	రాజరత్నము	పాలకుర్తి రంగారావు	వైశ్య	10.02.1939	మందపల్లి (తూర్పు గోదావరి)
96	లక్ష్మీదేవమ్మ (14)	రాజశ్రీ చిల్లా నారాయణ స్వామి శెట్టి (30)	వైశ్య	బహుశా అక్టోబరు లేదా నవంబరు 1935	గుడిపల్లె (మైసూర్ స్టేట్)
97	మహాలక్ష్మమ్మ	పి. సీతారామ వెంకట రామయ్య	---	02.11.1932	
98	వెంకట సుబ్బమ్మ	టి. రామయ్య	---	01.10.1933	
99	సుకన్య	కె. సత్యమూర్తి	---	18.04.1934	
100	హనుమాయమ్మ	బి. శేషయ్య పంతులు	---	01.08.1936	

ఆఫ్రికాలో సఫారీ

– నిమ్మగడ్డ శేషగిరిరావు

ఎన్నో అనుభవాలు, అనుభూతులు నింపుకున్న ఆ రోజు చాలా సుదీర్ఘమనిపించింది ఆ సాయంత్రానికి. అయిదు గంటలకల్లా కిబు లాడ్జ్ చేరిపోయాము. వడలిపోయిన మేము స్నానంతో బడలిక కొంతవరకు వదిలించుకుని, వేడి వేడి టీ కోసం లాడ్జ్ టెర్రెస్ మీదకు చేరిపోయాము. అక్కడి నుండి లోయలో అడవి మసక వెలుతురులో మార్మికంగా మైమరపించింది. మా లాడ్జ్ సమీపంలో గజెల్స్ అనబడే ఒక రకమైన లేళ్ళు, కొన్ని జిరాఫీలు తారాట్లాడుతూ కనిపించాయి. కొంచెం దూరంగా ఒక గుంపు ఏనుగులు. సుమారు ఒక కిలోమీటరు దూరంలో మరొక ఏనుగుల గుంపు. మెల్లగా మందంగా నడచిపోతున్నాయి. బహుశా మాలాగే అలసిపోయాయేమో. రాత్రి తావరానికి సాగిపోతున్నట్టున్నాయి. అడవి విస్తారంలో ఏనుగులు చీమల్లా కనిపించాయి. చీమలు చీకట్లో కలసిపోయేవరకు, చిట్టడవి చిమ్మచీకట్లోకి కరగిపోయే వరకు అక్కడ నుండి లేవలేకపోయాము. ఆ కాసేపట్లో ఆ గజరాజులు కొన్ని కిలోమీటర్లు సాగిపోయుంటాయి.

సెరంగెటిలో మూడవ రోజు:

మరునాడు ఉదయాన్నే, కెఫా సారధ్యంలో జంతుదర్శనవేట కోసం, సవన్నా గడ్డినేలలో విహారానికి బయలుదేరిపోయాము. అది జీబ్రాల ఆవాసమట. వందలాది జీబ్రాలు గుంపులు గుంపులుగా మా చుట్టూ ఉన్నాయి. కదలిపోతున్న నలుపు తెలుపు చారలు కనికట్టు చేస్తున్నాయి. ఇన్ని చారల్లో ఏ చారలు ఏ తల్లివో, ఏ బిడ్డవో ఎలా తెలుసుకుంటాయో పాపం అనిపించింది. కానీ రక్తసంబంధం గుర్తు పట్టటానికి రూపురేఖల ఆనవాలు అవసరం వాటికి లేదేమో. ఇంకాస్త దూరంలో ఒక సింహ పరివారం కనిపించింది. ఒక మగ, రెండు ఆడ, మూడు సింబాలు. రక్తపు తడి ఆరని జీబ్రా కళేబరం మీద పడి, ఆనందంగా పీక్కుతింటూ అవి ఆనందంగా విందు చేసుకుంటున్నాయి. గడ్డితింటూ, అమాయకంగా మందతో జీవించే జీబ్రా, మాంసభక్షణ చేసే మృగరాజుకు విందుభోజనం. తప్పనటానికి లేదు. దాని ఆకలి దానిది. దాని పిల్లల ఆకలి దాని బాధ్యత. ఎవరి గోల వాడిది అన్నట్టు, సింహపరివారం తినగా మిగిలిన మాంసం కోసం ఆకాశంలో గిరికీలు కొడుతున్న రాబందులు. బక్కజీవులైనా, కలసికట్టుగా ఉండే తెలివితో సింహాలనైనా బురిడీ కొట్టించే హైనాలు సరైన సమయం కోసం చూస్తున్నట్టు, వాటి చుట్టూ తారాట్లాడుతున్నాయి. కష్టపడి, వాటికిష్టమైన ఆహారాన్ని సంపాదించుకున్నవి సింహాలు. ఏమీ కష్టపడకుండా జిత్తులతో వేటను కైవశం చేసుకోవాలని చూసేవి ఈ జీవాలు. వాటి నుండి కూడా నేర్చుకోవలసినది ఒకటుంది. గుంపుగా కలసికట్టుగా ఉండటం. వాటి సంఖ్య తక్కువగా ఉన్నంతవరకు సింహరాజుకు ఎటువంటి ఇబ్బంది లేదనుకుంటా. ఏమైనా, అడవి న్యాయం ఎంతవరకు న్యాయం? గడ్డిపరకలు తిని బ్రతికే జీబ్రా ఎవరికేమన్యాయం చేసింది? సింహానికి ఆకలి వేసినప్పుడల్లా ఒక జీబ్రా బలి అవ్వాలంటే అదెలా సమంజసం? కాని మానవ చరిత్ర కూడా ఇంతే కదా? చరిత్ర కళ్ళ ముందు పరచుకుని చూస్తే, జరిగినది, జరుగుతున్నది కూడా ఇంతే కదా? బలవంతులైన రాజులు బలహీనమైన రాజ్యాలను ఆక్రమించుకోవటం, జంతుప్రవృత్తితో గూండాగిరి చలాయించటం, స్త్రీల మీద అత్యాచారాలు చేయటం.. చెప్పుకుంటూపోతే ఎన్నో. ఇవన్నీ ఎంతో నాగరికత సంతరించుకున్న తరువాత. చట్టాల చట్రాలు ఏర్పరచుకున్నాక. మరి అవేమీ లేని ఈ అడవిలో అమాయకపు మూగజీవాలు బ్రతకటం ఎట్లా? చూస్తుంటే సింహాల సంఖ్య కంటే జీబ్రాల సంఖ్య చాలా రెట్లు ఎక్కువగా



ఉంది. బహుశా ఇదొక జీవరహస్యమేమో. క్రూర జంతువులబారినపడినా, పర్యావరణంలో మిగలటానికి ఇబ్బడి ముబ్బడిగా సంతానోత్పత్తి చేసుకోవటం, సమిష్టి జీవనం గడపటం, వేగంగా పరుగెత్తటం నేర్చుకోవటం, నక్క జిత్తుల తెలివి అలవరచుకోవటంలాంటివి చేయలేని జీవులు అంతరించిపోతాయనుకుంటా.

నా ఆలోచనలలో నేనున్నా కెఫా మాత్రం మమ్మల్ని ముందుకు తీసుకుపోతూనే ఉన్నాడు. తేరుకుని చుట్టూ చూసేసరికి మందలు మందలుగా అడవి దున్నలు కనిపించాయి. కొన్ని వందలుంటాయి అవి. మందలో ఉన్నప్పుడు సింహాలు కూడా వాటికి జడుస్తాయని కెఫా చెపుతున్నాడు. ఏ ఒక్కటైనా సింహపు బారిన పడితే మిగిలినవన్నీ గుంపుగా దండెత్తి వస్తాయట. ఎంతటి సింహమైనా అంతటితో తోకముడవవలసినదేనట. అటువంటప్పుడు ఆ సింహాన్ని, దున్నలు చంపిన సందర్భాలు కూడా ఉన్నాయట. అవి తల్లి నుండి దూరంగా వచ్చిన సింహపు పిల్లలను కూడా తొక్కి చంపుతాయట. అవును మరి. ఇప్పుడు పిల్లలైనా, పెరిగి పెద్దయ్యాక వాటి పాలిట మృత్యువులే కదా! ఇవన్నీ కూడా బ్రతక నేర్పే విద్యలే కదా! అందుకే ఎంతటి మృగరాజైనా, జబ్బు పడో, దెబ్బ తగిలో మంద నుండి వేరైన దున్నల కోసం చూస్తూ, మాటేసి మెడ పట్టి చంపుతాయట. ఇంకొంచం దూరంలో వినయాలు పోతున్న నక్క కుటుంబం కనపడింది.

కొంచెంసేపటికి ఒక బురద ఊబి దగ్గర ఆగాము. కెఫా ఒక మొసలిని చూపించాడు. నేను చిన్నప్పుడు విన్న కథల ప్రకారం అది దొంగ కన్నీరు కార్చుతున్నట్టే కనపడింది! ఆ దగ్గరలో బనాగి నది కనపడింది. ఈ నది మారా నది నుండి నీటిని గ్రహించి, గ్రోమెటి నదిలో వదులుతూ విక్టోరియా సరస్సులో కలుస్తుంది. మేము ఆగిన చోటు నీటి ఏనుగుల (హిప్పోలు) జలాశయం. కొన్ని వందల హిప్పోలు నీళ్లలో మునిగి సేద తీరుతున్నాయక్కడ. చూడవలసిన బిగ్ ఫైవ్‌లో ఇక మిగిలినదల్లా రైనో (ఖడ్గ మృగం). కెఫా తన రేడియో ఫోన్‌లో ఎవరెవరితోనో మాట్లాడి సమాచారం సేకరించాడు. పెద్దగా చెట్లు లేని మైదానంలో ఒక గంట ప్రయాణం తరువాత మాకు ఒక ఖడ్గమృగాల గుంపు కనపడింది. వాటిని దూరం నుండి చూడటంతోటే వేము సరిపెట్టుకోవలసి వచ్చింది. బిగ్ ఫైవ్ చూడాలని సెరంగెటి వెళ్ళినవాళ్ళు చాలామంది రైనోలను చూడకుండానే వెళ్ళిపోవటం జరుగుతుందట. అందువలన మేము అదృష్టవంతులమని కెఫా అన్నాడు.

సెరంగెటిలో అడవి జంతువుల సందోహాలు కన్నుల పండుగగా ఉంటాయి. రెండు రోజుల వ్యవధిలో ఎన్నో సింహాలు, చిరుతపులులు, చీటాలు, అడవి దున్నలు, ఏనుగులు, నీటి ఏనుగులు, తోడేళ్ళు, రకరకాల లేళ్ళు, దుప్పులు, జిరాఫీలు, విల్డర్ బీస్ట్‌లు, ఇంపాలాలు, ఖడ్గమృగాలు, ఎన్నో రకాల వక్షులు, ఇలాంటి జీవరాశుల వైభవాన్ని, ప్రకృతిలో భాగంగా, శృంఖలాలు, హద్దులు లేని సహజ ఆవాసంలో, అతి చేరువలో, మన కళ్ళ ముందే చూడగలగటం ఇక్కడే సాధ్యం. సెరంగెటి అనుభవం వర్ణనాతీతం. అనుభవేకవేద్యం. జంతు ప్రవృత్తిని పట్టి చూపే డేవిడ్ ఆటెన్‌బరో చిత్రాలలోకి మనం కూడా ప్రవేశించి, జీవించిన అనుభవం అది. అక్కడక్కడా కొన్ని పెద్ద వాహనాలు, యాత్రికులు ఉన్న మాట నిజమే. కానీ అంచులు లేని ఆ విశాల ఆవరణలో ఇవన్నీ సూక్ష్మ రూపంలో ఉన్నట్టు కనిపిస్తున్నాయి. ఆ వాహనాల రంగులు, వాటిని నడిపేవారి ఖాకీ బట్టలు కూడా ఆ పరిసరాలలో కలసిపోవటంవలన, పర్యావరణ సహజత్వానికి ఏ మాత్రం భంగం కలిగించటంలేదు.

2013 ఫిబ్రవరిలో విహార యాత్రలకు, కొందరు పర్యావరణ పరిరక్షణ నిష్ణాతులు ఆఫ్రికాలోని సహజమైన ప్రకృతి అద్భుతాలలో ఏడింటిని ఎంపిక చేశారు. వాటిలో మూడు టాంజానియాలోనే ఉన్నాయి. అవి కిలిమంజారో శిఖరం, సెరంగెటి జాతీయ ఉద్యానవనం, ఇంకా మూడవది న్గోరోన్గోరో బిలం. మిగిలిన నాలుగు నైలు నది, ఒకవాన్గో సాగుభూమి, సహారా ఎడారి.. ఇంకా చివరిగా ఎర్ర సముద్రంలోని పగడపు దిబ్బలు.

ఓల్దువాయ్ గోర్జ్:

మా తరువాత లక్ష్యం న్గోరోన్గోరో బిలం. అయితే మార్గ మధ్యంలో మానవ పరిణామక్రమానికి ఆలవాలమైన ఓల్దువాయ్ గోర్జ్ వద్ద ఆగాము. గోర్జ్ అంటే వాగు ప్రవాహం సాగే లోయ. కొండల మీద పడిన వర్షపు నీరు జాలువారిపోయే క్రమంలో ఏర్పడిన లోయ ఇది. అతి పురాతనమైన నరన్సు గట్టునానుకుని సాగిపోయే ఈ వాగువంపు ఎంతో విలువైన ఆదిమానవ శిలాజాల ఖజానా. దగ్గరలో ఉన్న ఒల్మోటి, కెరిమసి అనే

అగ్నిపర్వతాల నుండి కొట్టుకొని వచ్చిన బూడిద వీటిని పదిలపరచింది. ఇది తూర్పు ఆఫ్రికాలో 50 కి.మీ. పొడవున సాగిన రిఫ్ట్ మహా లోయలో భాగం. స్థానికంగా దీనిని ఓల్దుపాయ్ అంటారు. ఓల్దుపాయ్ అనే మసాయి పదానికి అర్థం, అడవి సిసాల్ చెట్లు విపరీతంగా పెరిగే ప్రాంతమని అర్థమట. వీటిని 'యుక్కా' అని కూడా అంటారు. ఇవి ఒక రకమైన బ్రహ్మజెముడులాంటివి. వీటి నుండి గట్టి నార తయారవుతుందట. 'టెక్విలా' అనబడే మద్యపానీయం కూడ వీటినుండి తయారవుతుంది.

భూశకలాలు (టెక్టోనిక్ ప్లేట్) క్రమంగా వ్యతిరేకదిశలో కదలి విడిపోతుండటంవలన లెబనాన్ నుండి మొజాంబిక్‌వరకు సాగి ఏర్పడిన రిఫ్ట్ లోయ ఎన్నో నైసర్గిక స్వరూపాల కలబోత. ఇది సన్నగా, పొడవుగా, లోతుగా, వెడల్పుగా.. ఇలా రకరకాలుగా కనిపించే సరస్సులతో, విలక్షణమైన పర్యావరణ విశేషాలతో విలసిల్లుతోంది. దీని పొడవు దాదాపు 6000 కి.మీ. ఇది సుమారు మూడు కోట్ల సంవత్సరాల క్రితం అవతరించిందని తెలుస్తోంది. ఈ లోయ పడమటి అంచు నూబియన్ భూశకలమని, తూర్పు అంచు సోమాలి భూశకలమని పిలువబడుతోంది. ఈ లోయ దక్షిణ భాగంలో తూర్పు ఆఫ్రికాలో అతి పెద్ద సరస్సులైన తుర్కానా, టాంగన్యికా, న్యాసా సరస్సులు ఉన్నాయి. ఉత్తర ప్రాంతం ముందుకు గురై ఎర్ర సముద్రంగా మారి హిందూ మహాసముద్రంలో కలుస్తోంది.

చతుష్పాద జంతుస్థితి నుండి పరిణమించిన తొలి ద్విపాదచరులు, హోమినిడ్ ఆదిమానవులు సుమారు 19 లక్షల సంవత్సరాల క్రితమే ఇక్కడ నివసించినట్టు ఇక్కడ లభించిన అవశేషాలు సూచిస్తున్నాయి. ఇక్కడ లభించిన త్రవ్వకాలవలన, మానవ పరిణామక్రమాన్ని సహేతుకంగా అవగతం చేసుకోవటానికి వీలయింది. 1959లో పురాతత్వశాస్త్రజ్ఞులైన లూయీ, మేరీ లీకే దంపతులు, ఈ ప్రాంతంలో తిరుగుతూ, దాదాపు 20 లక్షల సంవత్సరాలనాటి, పెద్ద పెద్ద దంతాలతో ఉన్న హోమినిడ్ పుర్రెను కనుగొనటంతో ఈ లోయ విశిష్టత వెలుగులోకి వచ్చింది. ఈ అవశేషానికి తరువాత జింన్జాన్థోపస్ బోయసీ అని పేరు పెట్టారు. మానవ పరిణామక్రమం తెలుసుకోవాలనుకునే శాస్త్రజ్ఞులకు ఈ ప్రాంతం ఒక గని.

హోమినిడ్లు వాడిన రాతి పనిముట్లు కూడా ఇక్కడ లభించాయి. మానవ పరిణామక్రమంలో పనిముట్ల వాడకం ఒక నూతన శకారంభాన్ని సూచిస్తుంది. పని సులువు చేసుకోవటానికి పనిముట్లు సహాయ పడతాయని తెలుసుకుని, వాటిని కావలసిన విధంగా తయారు చేసుకోగలిగే జ్ఞానాంకురం... మానవజాతి మెదడు, తెలివితేటల ఎదుగుదలకు సూచిక. లీకే దంపతులిద్దరూ, తమ జీవితాంతం ఈ పనికే అంకితమైపోయారు. వీరి తరువాత వారి కుమారుడు జోనధన్ లీకే పరిశోధనలు కొనసాగించాడు. ఈ లోయలో దీని సమీపంలో ఉన్న ఒక కొండ మీద మానవ పరిణామక్రమంలో ఈ ప్రాంతపు పాత్రను కళ్ళకు కట్టినట్లు చూపించే ఒక పురావస్తు ప్రదర్శనశాల ఉంది. అక్కడ ఒక బోర్డు మీద 1871లో, The Descent of Man, అనే ఛార్లెస్ డార్విన్ పుస్తకం నుండి సంగ్రహించిన ఆ క్రింది వాక్యాలు కనిపించాయి.

In each great region of the world the living mammals are closely related to the extinct species of the same region. It is therefore probable that Africa was formerly inhabited by extinct apes closely allied to the Gorilla and Chimpanzee; and as these two species are now man's nearest allies, it is somewhat more probable that our early progenitors lived on the African continent than elsewhere.

డార్విన్ ప్రతిపాదించిన మానవజాతి పరిణామ సిద్ధాంతం ఆసక్తి కరం. అక్కడి నుండి బయలుదేరి మళ్ళీ మా గమ్యం వైపు సాగిపోయాము.

న్గోరోన్గోరో:

నాకు తెలిసినంతవరకు, ఒక్క ఆఫ్రికాలోనే కాదు, ఈ యావత్ప్రపంచంలోనే న్గోరోన్గోరో ప్రాంతంతో సరితూగేది మరొకటి లేదు. ఒక ఇసుక దిబ్బ కొన మీద, అండాకారపు వస్తువుతో నొక్కినట్టుగా, కోలగా ఉన్న డిప్పలా కనిపిస్తుంది ఈ ప్రాంతం. అగ్నిపర్వతం నుండి లావా ఎగసి, కొనభాగం శిధిలమై, చల్లారిన తరువాత ఏర్పడిన బిలం (క్రేటర్) ఇది. కొవ్వొత్తి వెలిగించినప్పుడు జ్వాలకు కరగిన మైనం కూడా చల్లారి ఇటువంటి ఆకారమే సంతరించుకుంటుంది. దీనిని జ్వాలాముఖి అనవచ్చేమో.

కేంద్ర స్థానంలో దీని వెడల్పు 19 కి.మీ. దాని విస్తీర్ణం 264 చ.కి.మీ. అంచుల వద్ద నిలువు కొలత సుమారు 400 మీ. నుండి 600 మీ. వరకు ఉంటుంది. దీనికొక

ప్రత్యేకత ఉంది, అదేమిటంటే, ప్రపంచంలో ఇంకెక్కడా కనపడనంత వన్యమృగ సాంద్రత. క్యూర మృగ సాంద్రత కూడా. నరివడా మృష్ట భోజనంగా శాకాహార మృగరాశులు దొరికే ప్రదేశాలకే క్యూర మృగాలు చేరతాయి. వైల్డ్ బీస్ట్‌లు, జీబ్రాలు, గజెళ్ళు, దున్నలకు కావలసిన వృక్షజాలం పెరగటానికి శిధిలమైన లావా అత్యంత అనుకూలం. మనుష్యులు నదీ పరివాహిక ప్రాంతాలకు చేరినట్లే, సకల మృగ జాతులు ఇక్కడికి చేరాయి. ఒకదాని కోసం మరొకటి. ఆహార శోధన మీద ఆధారపడిన గొలుసుకట్టు జీవన విధానాన్ని ప్రతిబింబించే చోటు ఇది.

ఆ రాత్రి మా బస న్గోరోన్గోరో క్రేటర్ అంచున ఉన్న సెరినా లాడ్జ్‌లో. ఇదొక కొండరాతి భవనం. కొంత అనాగరికంగా, మోటుగా కనిపిస్తున్న ఈ భవనం పరిసరాలకు తగ్గట్టుగా ఉండి, అక్కడ ఇమిడిపోయింది. సముద్ర మట్టం నుండి 7400 అడుగుల ఎత్తులో ఉన్న ఈ లాడ్జ్ చూడముచ్చటగా ఉంది. హోటల్ బాల్కనీ నుండి, విస్తారమైన క్రేటర్ మొత్తం పరచుకుని కనిపిస్తోంది. ఏనుగులు, జీబ్రాలు, జిరాఫీలు, రైనోలు, కొన్ని సింహాలు కూడ యధేచ్ఛగా తిరుగుతూ కనిపిస్తున్నాయి అక్కడి నుండి. వెంటనే నాకు, బైబిల్ కథలలో ఒకటైన నోవా'స్ ఆర్క్ గురించి చిన్న పిల్లలకు వర్ణించి చెప్పే ఒక పాట గుర్తుకొచ్చింది.

ప్రపంచం పాపపంకిలమైనప్పుడు, భగవంతుడు నోవా అనే సత్యసంధునికి కనిపించి, రాబోయే కాలంలో ప్రపంచం జలప్రళయంలో మునిగిపోబోతోందని, ఈలోపుగా ఒక పెద్ద ఓడను తయారు చేసుకుని, ప్రళయ సంకేతాలు కనపడగానే, అతని కుటుంబంతో పాటు, రకరకాల జంతువులను, ఒక ఆడ ఒక మగ జంటలుగా కూర్చి ఓడలో ఎక్కించుకుని, ప్రళయానంతరం పాపరహిత నవజీవన నిర్మాణం కోసం సంరక్షించమని చెపుతాడు. ఆ క్రమంలో జంతువులన్నీ మొదట కొన్ని ఒకటొకటిగా, రెళ్ళు రెళ్ళుగా, మూడు మూడుగా అంటూ మొదలైన పాట... పదులు పదులుగా ఓడ ఎక్కుతున్నాయి అంటూ సాగుతుంది. అది ఇప్పుడు నాకు వందలు వందలుగా అన్నట్టు నాకు దర్శనమయింది. ఎక్కువ లోతు లేని ఒక పెద్ద మూకుడులాంటి ఆకారంలో ఉన్న ఆ ప్రదేశం



నిజంగానే ఒక పెద్ద ఓడలా నాకు కనపడింది. ఈ కథలో వర్ణించినట్టు నిజంగా జలప్రళయం వచ్చి ప్రపంచం మునిగిపోతే, నూతన ప్రపంచ నిర్మాణానికి రకరకాల పశు పక్ష్యాదులను రక్షించవలసి వస్తే, మసాయి వీరులతో కూడుకుని నోవా'స్ ఆర్క్ లా ఉన్న ఈ ఒక్క ప్రాంతాన్ని రక్షిస్తే చాలేమోనని నాకనిపించింది. నిజంగా ఈ భూమి మీద ఆది దంపతులు ఆడమ్, ఈవ్‌లు నివసించిన, 'గార్డెన్ ఆఫ్ ఈడెన్' అనేది ఒకటుంటే అది ఇదేనేమో!

'బిగ్ ఫైవ్' జంతువులన్నిటినీ ఒకేరోజు ఒకే చోట ఒక చిన్న ప్రదేశంలో చూడగలిగే అవకాశం ఉన్న ఆవరణ న్గోరోన్గోరో. ఇక్కడ సింహసందోహాల సాంద్రత కూడా ఎక్కువగా కనిపించింది. 19 కి.మీ. వెడల్పుతో ఉన్న ఈ ఆవరణ దాదాపు 25000 అతి పెద్ద అడవి జంతువుల నివాసం. చుట్టూ పెట్టని గోడలాంటి నిట్ట నిలువు అంచులతో పరిరక్షించబడుతున్న ఈ క్రేటర్ పర్యావరణం దానికదే ప్రత్యేకం. అరుదుగా కనిపించే ఆఫ్రికన్ నల్ల ఖడ్గమృగాలు కూడా ఇక్కడ ఉన్నాయి. ఆఫ్రికాలో ప్రకృతి నహజ సౌందర్యోన్నత్యాన్ని చూడదలచినవారు, తప్పనిసరిగా చూడవలసిన ప్రదేశం ఇది. పచ్చిక బయళ్ళు, చిట్టడవులు, బురద నేలలు, కొలనులు, సరస్సుల లాంటి భౌగోళిక, పర్యావరణ విశేషాలతో నిండిన భూభాగమిది. ఇక్కడ ఉన్నవాటిలో మగాడి సరస్సు అతి పెద్దది. అంత ఎక్కువ లోతేమీ లేని ఈ ఉప్పునీటి సరస్సు గులాబి రంగు ఫ్లెమింగో పక్షులతో కనువిందు చేస్తుంది.

ఇంతటి అద్భుతమైన ప్రకృతి సౌందర్యాతిశయం ప్రపంచంలో ఇంకెక్కడా కనపడదేమో. ఇదెలా సాధ్యమయిందని మాలో మేమే చర్చించుకుంటున్నప్పుడు, శిధిలమైన లావా నుండి తయారైన సారవంతమైన భూమి,

దాని మీద పెరిగిన వృక్ష సంతతి, వాటి మీద ఆధారపడి బ్రతికే సాధు జంతువులు, వాటిని తిని జీవించే క్రూర జంతువులతో విరాజిల్లే ప్రదేశాలలో.. వాటి మధ్య ఉన్న అవినాభావ సంబంధాన్ని కెఫా మరోసారి మాకు గుర్తు చేశాడు. పరస్పరాధారితంగా ఉన్న ఈ సంబంధం వలన అవి ఆహారాన్నో, మరోకదాన్నో వెతుక్కుంటూ వేరెక్కడికీ వెళ్ళనవసరం లేకుండానే తరాల తరబడి అక్కడే చక్రభ్రమణంలాంటి సహజీవనం సాగిస్తూ ఉంటాయి. అదేమీ శాంతియుత సహజీవనం కాదు. ఇక్కడ బలవంతునికే అగ్ర స్థానం. కానీ ఇక్కడ బ్రతికినంత కాలం శాకాహార జంతువులకు, మాంస భక్షకులకు కూడా కావలసినంత ఆహారం లభిస్తుంది. సెరంగెటి జంతువుల మాదిరి ఆహారాన్ని వెతుక్కుంటూ దూరప్రాంతాలకు వలస వెళ్ళ వలసిన అవసరం ఇక్కడి జంతువులకు లేదు. బ్రతికినంతకాలం స్వేచ్ఛగా, యధేచ్ఛగా జీవించటం కంటే వీటికి కావలసినదేమీ లేదనుకుంటా! బలవంతుడికి ఆహారమవ్వవలసిన జంతుజాతులు, ఇబ్బడిముబ్బడిగా సంతానోత్పత్తి చేసుకుంటూ జాతిరక్షణ చేసుకుంటున్నాయి. నాకేదో కొత్త జీవనరహస్యం అర్థమౌతున్నట్టనిపించింది. ఇదే ఆదిమానవ సంస్కృతేమో. ఈ కాలంలో కూడా మనుష్యులలో ఇటువంటి ప్రవృత్తులు చూస్తూ ఉంటాము. తరచి చూస్తే, ఈ జంతువులకు మనకు తేడాల కంటే, పోలికలే ఎక్కువ కనపడుతున్నాయి. ఎందుకంటే అవి మన పూర్వీకులు. తేడా ఏమిటంటే అవి సహజత్వాన్ని పోగొట్టుకోలేదు. మనం ముందుకెళ్ళామనుకుంటూ సహజతత్వాన్ని కప్పిపుచ్చుకుంటున్నాము. అయితే, మనం చెప్పుకున్న సకల జంతువులకు స్వర్గధామంగా ఉన్న ఈ ప్రదేశంలో జిరాఫీలు లేవు. నిట్టనిలువుగా ఉన్న క్రేటర్ గోడలు ఎక్కి అవి ఇందులోకి రాలేవట.

ఇక్కడ ఉన్న సమయంలో మేము ఆహారపు వేటలో ఉన్న సింహాలఘువాన్ని ప్రత్యక్షంగా చూడగలిగాము. ఒక సింహాల గుంపు మా వాహనాన్ని చుట్టుముట్టింది. ఆ కుటుంబ పెద్ద బాధ్యత తీసుకుని, మమ్మల్ని మట్టు పెట్టాలనుకుందో ఏమో, మా వాహనం కిటికీ మీదకు ఎగబాకింది. పలుచని అద్దానికి అటువైపు కోపదారి మృగరాజు. ఇటు మేము. కొన్ని క్షణాలు ప్రాణాలు కడగట్టాయి. అటువంటి పరిస్థితిలో ఏమి చెయ్యాలో కెఫా ముందే మాకు చెప్పటంతో, మృగరాజును నవాలు చెయ్యాలనే ప్రాణాంతక ప్రవృత్తిని అణచుకుని, కళ్ళకు మాత్రమే పని చెప్పి, ప్రాణాలు అరచేతిలో పట్టుకుని, ఊపిరి బిగబట్టి కదలకుండా కూర్చున్నాము. దానితో మృగరాజు అహం చల్లారి తనదోవన తనే చక్కాపోయింది. సెరంగెటిలో 'బిగ్ ఫైవ్'ను చూడటానికి మాకు రెండున్నర రోజులు పడితే, ఇక్కడ కొంచంసేపట్లోనే అన్నీ కనిపించాయి. ఆ సాయంకాలానికి కెఫా మమ్మల్ని తిరిగి మోషికి చేర్చాడు.

అరుషా నేషనల్ పార్క్:

న్గోరోన్గోరో నుండి మోషి తిరిగి వచ్చేసరికి, మా కిలిమంజారో టీమ్ చాలావరకు అక్కడకు చేరుకున్నారు. అటు తరువాత, తొమ్మిది రోజులపాటు సాగిన మా కిలిమంజారో ప్రస్థానం విజయవంతంగా సాగిన మా అనుభవాలు మీ అందరితో ఇంతకు ముందే పంచుకున్నాను.

మాలో చాలామంది విజయోత్సాహంతో ఇంటి ముఖం పట్టారు. కాని నాతో పాటు ఇంకొందరికి ఇంకో రెండు రోజుల సమయం ఉంది. సెరంగెటి, న్గోరోన్గోరోలలో మా అనుభవ నేపధ్య ప్రభావంతో, మొత్తం ఆరుగురం అరుషా నేషనల్ పార్కులో సఫారీకి ప్రయాణం కట్టాము. ఇది ఒక్క రోజు ప్రయాణం.

సుమారు 15000 చ.కి.మీటర్ల సెరంగెటి, 2850 చ.కి.మీటర్ల తారెంజైర్‌లతో పోల్చితే, ఇది చాలా చిన్నది. దీని విస్తీర్ణం కేవలం 552 చ.కి.మీటర్లు మాత్రమే. శంఖు ఆకారంలో ఉండే మేరు అగ్ని పర్వత శిఖరం ప్రక్కనే ఉన్న అందమైన పార్కు ఇది. చిన్న న్గోరోన్గోరో అనబడే అతి సుందరమైన 'న్గుర్డోటో' క్రేటర్ ఇందులో ఉంది.

ఇక్కడ జంతుజాలం విశేషంగా లేకపోయినా, దీనిని గమనింపులోకి రానివ్వనంత దృశ్యసౌందర్యం పోగుపడి ఉందక్కడ. జిరాఫీలు, అడవి దున్నలు, వార్ట్ హోగ్ అనబడే అడవి పందులు కనపడటంతో సరిపెట్టుకున్నాము. ఫ్లెమింగోలకు ఇది పునరుత్పత్తి కేంద్రమట. ఇక్కడ యాత్రికుల హంగామా అంతగా లేకపోవటం కూడా మాకు నచ్చింది. ఆ రోజు ఆహ్లాదంగా గడచిపోయింది. తిరిగి వచ్చిన తరువాత, మాలో నలుగురు విమానాశ్రయాలకు వెళ్ళిపోయారు. నేను, నా మిత్రుడు

సింహం, ఇద్దరం వీనస్ ప్రీమియర్ హోటల్‌కు వెళ్ళాము.

అవీ ఇవీ అన్నీ:

కొంచెంసేపు సేద తీరాక క్షుద్బాధ తెలిసింది. ఇంటి భోజనం కోసం జిహ్వ తపించింది. మా హోటల్ రిసెప్షనిస్ట్ 'హాట్ ప్లేట్' అనేచోట మంచి భారతీయ భోజనం దొరుకుతుందని చెప్పింది. ఆత్రంగా టాక్సీలో అక్కడకు చేరుకున్నాము. మమ్మల్ని అక్కడ దింపి డ్రైవరు హడావుడిగా వెళ్ళిపోయాడు. ఆ ప్రాంతమంతా అంత గొప్పగా లేదు. అక్కడ రెస్టారెంట్‌లాంటిది ఏమీ కనపడలేదు. సరైనచోటుకే వచ్చామా? అని సందేహ పడ్డాము. కొంచెం సేపు వెతికిన తరువాత, ఎక్కడో పొదల మాటున, పెద్దగా హంగామా ఏమీ లేని, ఒక చిన్న సామాన్యమైన 'ఇండియన్ రెస్టారెంట్' కనపడింది. అక్కడ, కొందరు భారతీయులతో పాటు, స్థానికులు కూడా భోజనం చేస్తూ కనపడటంతో కొంత నమ్మకం కుదిరింది. 1970ల బాలీవుడ్ సంగీతం, కిషోర్ కుమార్ స్వరంలో వినిపిస్తోంది. ఆ వాతావరణమంతా, మా మెడిసిన్ చదువుకాలంనాటి మా కాకినాడను గుర్తు చేయటంతో, ఇంటికి వెళ్ళిన భావం కలిగింది.

రెండు బీర్‌లతో చల్లబడిన తరువాత, మెరూ చూస్తే అందులో, తెలంగాణా స్పెసీ చికెన్, ఆంధ్రా చికెన్ కర్రీ కనిపించాయి. తెలుగు సోదరులకు ప్రియమైన రుచులు, ఇంటికి ఇంత దూరంలో కనిపించేసరికి ప్రాణం లేచొచ్చింది. ఆబగా ఆర్డర్ పెట్టాము. అవి తయారై వచ్చేలోపు, మా కిలిమంజారో సాహసయాత్రలో గుర్తుండిపోయే క్షణాలను నెమరేసుకున్నాము. అంతలోనే, కరివేపాకుతో అలరిస్తున్న తెలంగాణా కోడి కూర వడ్డించబడింది. అంత రుచికరమైన కోడి కూర నేను తెలంగాణాలో కూడా తినలేదనటంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. మిగిలినవన్నీ మరచిపోయి, ఆంధ్రా, తెలంగాణా కోడికూరలు, రోటీలు, అన్నంతో ఊదేశాము. దేశం కాని దేశంలో, 16 రోజుల పాటు సరైన భోజనం దొరకని మాకు ఇంత చక్కని ఇంటి భోజనం పెట్టిందెవరా అని ఆరా తీశాము. ఆ భోజనశాల యజమాని రితేష్ వచ్చి మాతో కూర్చున్నాడు. అతను కేరళ నుండి వచ్చి ఇక్కడ స్థిరపడ్డాడట. ఇంత చక్కని తెలుగు రుచులు పండించటం ఎలా సాధ్యమయిందని అడిగాము. ఎట్టకేలకు ఆ రహస్యం బయటపడింది. ప్రధానమైన వంటవాడు ఇర్ఫాన్, హైదరాబాదీ అట. అతను కొంచెం సిగ్గరి. మాతో మాట్లాడిన కొద్దిసేపట్లో, కొంపల్లి నుండి వచ్చానని అతను చెప్పాడు. మాకు వడ్డించిన కూరలు ఎక్కడ నేర్చుకున్నావని అడిగినప్పుడు, చిన్నప్పటి రుచులు మనసులో ఉంచుకుని, తన సొంత పద్ధతిలో వండటం మొదలు పెట్టాడట. అందరూ మెచ్చుకోవటంతో అదే పద్ధతి కొనసాగిస్తున్నాడట. ఏమైనా, ఆ రోజు మాకు విందు చేసినవారికి, 'అన్నదాతా సుఖీభవ' అనుకుంటూ మనసులోనే మనసారా కృతజ్ఞతలు తెలుపుకున్నాము. ఇర్ఫాన్, రితేష్‌లతో మాట్లాడుతుండగానే, మక్వానా అనే వ్యాపారస్తుడు కలిశాడు. అతను గుజరాత్ నుండి వచ్చిన టాంజానియన్. అతను మాకు వీలైతే, అక్కడున్న లక్ష్మీనారాయణ మందిరం చూడమని చెప్పాడు. దాదాపు 800 మంది భారతీయులతో ఒక మంచి సంఘం ఉందట అక్కడ. వీరందరూ కలసుకోవటానికి ఈ మందిరం దోహదపడుతోందని అతను చెప్పాడు. ప్రపంచ వ్యాప్తంగా స్థిరపడుతున్న భారతీయులు సంస్కృతి, సంప్రదాయాలను మననం చేసుకోవటానికి, ఇటువంటి మందిరాలను ఏర్పరచుకుంటున్నారు. ఇది ముదావహం.

ఒక విధంగా, సెరంగెటి, తారంజైర్, న్గోరోన్గోరో మొదలైన ఉత్తర టాంజానియా సఫారీలన్నింటికి అరూషా తొలి మెట్టని చెప్పవచ్చు. ఈ పట్టణంలో ఎటునుండి చూసినా మేరు పర్వతం ఉన్నతంగా కనిపిస్తూనే ఉంటుంది. మా తిరుగు ప్రయాణం మరునటిరోజు సాయంత్రాన అవటంవలన, మాకు అరూషాలో ఇంకొక రోజు ఉంది. ఆ రోజు అక్కడ ఉన్న మ్యూజియమ్‌లను చూడాలనుకున్నాము. మా టాక్సి డ్రైవరు మమ్మల్ని, ఆఫ్రికన్ కళారూపాలను విక్రయించే మార్కెట్‌కు తీసుకెళ్ళాడు. నల్ల కర్ర, ఇంకా ఇతర రకాల చెక్కలో చెక్కిన కళారూపాలు అద్భుతంగా ఉన్నాయి. అక్కడ మాకు సైఫుద్దీన్ భాయ్ అనే వ్యక్తి కలిశాడు. అతను, అతని భార్య, అక్కడ టాంజనైట్ విభాగాన్ని నిర్వహిస్తారు. కొంత పరిచయం తరువాత అతను మాకు ఇంకొన్ని విశేషాలు తెలిపాడు.

టాంజనైట్ విలువైన రాయి. ఇది డైమండ్‌కంటె 1000 రెట్లు అరుదు. మనకు లభించే టాంజనైట్ మొత్తం ఒక గనిలో నుండే రావటంవలన, దీనికి విశేషమైన గొప్పదనం, విలువ ఆపాదించబడింది. మాన్యారా ప్రాంతంలోని మెరెలను కొండలలో, నాలుగు

కి.మీ. పొడవున సాగిన భూభాగంలో ఉన్న ఒకే ఒక్క గనిలో ఈ రత్నం లభిస్తుంది. ప్రపంచం మొత్తానికి టాంజనైట్ ఎగుమతి చేసేది తనే అని, సైఫుద్దీన్ భాయ్ సగర్వంగా చెప్పుకున్నాడు. అతను, టాంజానియాలో పుట్టి పెరిగిన, నాల్గవతరం గుజరాతీ అట. తాతముత్తాతలు భారతదేశం నుండి టాంజానియా వలస వచ్చిన తొలి వ్యాపారస్తులట. నగరం నడిబొడ్డున అతని తండ్రి చేస్తున్న ప్రాచీన వస్తువులు, కళాఖండాల విక్రయ వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోందట. సైఫ్ ఇంగ్లండ్‌లో చదువుకున్న వ్యక్తి. కేంబ్రిడ్జ్ కార్పస్ క్రిస్టీ కళాశాలలో మెడిసిన్ చదవటానికి ఎంపికైన ప్రతిభావంతుడు. ఆఫ్రికన్ కళారూపాల విక్రయ వ్యాపారం మీద ఉన్న మక్కువవలన మిగిలిన అవకాశాలన్నింటినీ వదిలేసుకున్నాడట. మక్కువతో చేసే పనులు ఫలించే విధానం ఎలా ఉంటుందో చూడాలంటే, సైఫ్ భాయ్ వాణిజ్య సామ్రాజ్యం చూస్తే చాలు. యూరోపియన్ రాజకుటుంబీకులకు కూడా, టాంజనైట్ ఆభరణాలను అతను అందచేశానని చెప్పాడు. అక్కడి గోడల మీద ఉన్న ఫోటోలు, ఫ్రేముల్లోని ఉత్తరాలు, ప్రశంసలు అతను మాతో చెప్పిన విషయాలకు తార్కాణాలుగా కనిపించాయి. అతని భార్య జాహ్రా కూడా ఆభరణాలను రూపొందిస్తుందట.

వ్యాపారంతో పాటు అతను ఒక మ్యూజియమ్‌ను కూడా నిర్వహిస్తున్నాడు. మమ్మల్ని వెంటపెట్టుకుని అక్కడికి తీసుకువెళ్ళాడు. అందమైన ఒక పెద్ద భవనంలో ఉన్న ఈ మ్యూజియమ్‌లో, కొన్ని అంతస్థులలో ఎన్నో విలువైన ఆధునిక కళారూపాలు, ప్రాచీన వస్తువులు కూడా ప్రదర్శించబడుతున్నాయి. ఈ భవనం న్యూయార్క్ గుగ్గెన్‌హమ్ మ్యూజియమ్ నమూనాలో నిర్మించబడింది. అతని వద్ద ఉన్న వస్తువులన్నీ కళాభిరుచి, వస్తు సేకరణాభిరుచి ఉన్నవారిని అలరించేవే. ఇంతటి ఆఫ్రికన్ కళారూపాల సేకరణను చూసుకుని సైఫ్ గర్వపడటం తప్పేమీ కాదనిపించింది. ఇక్కడున్న ఒక్కొక్క వస్తువు విలువ కొన్ని వేల డాలర్లుంటుంది. అరుదైన కొన్ని నల్లకర్ర వస్తు విశేషాల విలువ మిలియన్ డాలర్ల వరకు కూడా ఉంది.

అటు తరువాత అతను మమ్మల్ని 'లంచ్'కు తీసుకెళ్ళాడు. సమోసా, వేయించిన కసావా (కర్ర పెండలం) ముక్కలు, బిస్కెట్లు, టీలతో మాకు మంచి భోజనం పెట్టించాడు సైఫ్. అక్కడున్నవారితో అతను స్వహేలీ భాష మాట్లాడటం మేము గమనించాము. కెన్యా, ఉగాండా, రువాండా మొదలైన తూర్పు ఆఫ్రికా దేశాలలో ఎక్కువ భాగం ప్రజలు స్వహేలీ మాట్లాడినా, ఒక్క టాంజానియా మాత్రమే దీనిని అధికారిక జాతీయ భాషగా ఎంచుకుంది.

రక్షణ కోసం ఏర్పాటు చేసుకున్న కెవేరాలో, రాజగృహంలా ఉన్న తన ఇంటిని చూపిస్తూ, రాత్రి భోజనానికి ఆహ్వానించాడు. సమయాభావంవలన మర్యాదగా నిరాకరించాము. ఈసారి అరుషా వచ్చినప్పుడు తప్పకుండా తన అతిథులుగా ఉండాలని నవ్వుతూ చెప్పాడు. సైఫ్, గుజరాత్, ముంబాయ్‌లలో స్థిరపడిన సంపన్న బోహ్రా ముస్లిం కుటుంబానికి చెందినవాడని మాటల సందర్భంలో తెలిసింది. వీరి కుల పెద్దను, 'హిజ్ హైనెస్' అని సంబోధిస్తారు. వీళ్ళలో చాలామంది పారిశ్రామికవేత్తలుగా, వ్యాపార వేత్తలుగా గణుతికెక్కారు. కొందరు సైఫ్ కుటుంబంలా విదేశాలలో స్థిరపడ్డారు. మేము కూడా మా తాహతుకు తగిన టాంజనైట్ ఆభరణాలు కొన్ని సైఫ్ నుండి కొనకుండా ఉండలేకపోయాము. సైఫ్‌కు వీడ్కోలు పలికి అక్కడి నుండి బయల్దేరిపోయాము. ఇంకో రెండు గంటల సమయం ఉంది. అరూషా జనజీవన స్రవంతిలో కలసి వీధులలో తిరుగుదామని ఆశపడ్డాము. కానీ అదంత తేలికగా కనపడలేదు. విపరీతమైన వేడి, నడవటానికి వీలుగా లేని వీధులు, దుమ్ము, ధూళి ఇవన్నీ కలసి మమ్మల్ని ఆ ఆలోచన మానుకోమని హెచ్చరించాయి. నిజానికి ఇంకా అక్కడ తిరిగితే, అప్పటివరకు మా మనసులో ప్రత్యేక స్థానం ఆక్రమించి ఉన్న కిలిమంజారో, సెరంగెటి, తారంజైర్, న్గోరోన్గోరో అనుభవాలు అన్నీ చెరిగిపోయే ప్రమాదం కనిపించింది. విమానం పైకెగరగానే, కిలిమంజారో ఛాయామాత్రమైపోతూ మనసును ఒక విధమైన వేదనకు గురి చేసింది. భారమైన గుండెతో ఆ మహా శిఖరానికి, అసామాన్యమైన ఆ దేశానికి నమస్కరిస్తూ, ఇక శెలవని చెప్పాము.

* * *

రచయిత: డాక్టర్ నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లండ్) ఆంగ్లంలో రాసిన ఈ యాత్రావిశేషాలను – తెలుగు చేసింది జయశ్రీ అట్లూరి గారు (ఇంగ్లండ్).

డా. నిమ్మగడ్డ శేషగిరిరావు

ఇంగ్లాండ్, e-mail: srnimmagadda@googlemail.com

చిత్రగీతాలు
జావళీలు

– ఎమ్. పురుషోత్తమాచార్య

అందాల బొమ్మతో ఆటాడవా


చిత్రం : అమరశిల్పి జక్కన్న (1964)

రచన : దాశరథి

సంగీతం : ఎస్. రాజేశ్వరరావు

గానం : పి. సుశీల

నృత్యం : బి. సరోజాదేవి



కాఫీ–ఆది

అందాలబొమ్మతో ఆటాడవా ప
సందైన ఈ రేయి నీదోయి స్వామీ ॥అం॥

1. *కనులు చేపలై గంతులువేసె*
మనసు తోటలో మల్లెలు పూచె
దోసిట వలపుల పూవులు నింపి నీ
కోసమె వేచితి రావోయి ॥అం॥

2. *చల్లగాలితో కబురంపితిని*
చందమామలో వెదకితినోయి
తారతారను అడిగితినోయి
దాగెదవేల రావోయి ॥అం॥

3. *నల్లని మేఘము జల్లు కురియగా*
ఘల్లున ఆడే నీలినెమలినై
నినుగని పరవశమందెదనోయి
కనికరించి యిటు రావోయి ॥అం॥

కథానాయిక సినిమాలో పరిచయమయ్యే ఘట్టమిది. ఆమె ఒక దేవాలయంలో నృత్యాన్ని ప్రదర్శిస్తున్నది. శిల్పనిర్మాణానికి మంచి ప్రేరణకై అన్వేషిస్తున్న కథానాయకుడు ఈ సన్నివేశంలో అభినయిస్తున్న నృత్యాంగనను తిలకించి పులకించాడు. బి. సరోజాదేవి, అక్కినేని నాగేశ్వరరావులు నాయికా నాయకులుగా నటించారు.

ఉదాత్తత, మెత్తదనం, కళాహృదయాలను తొలుచుకుంటూ వెళ్ళే శైలి దాశరథి కవితకు పెట్టని సొమ్ములు. అవి ఈ పాటలో జిగేల్మని మెరిశాయి. పాటంతా యతిప్రాసల నియమాలను చక్కగా అనుసరించినారు. పాట కోసమే రాసినట్లుండే కృతకత్వం ఇందులో ఎక్కడా కనిపించదు. సహజసుందరంగా ఆ నియమాలు ఆయన శైలిలో చక్కగా ఒదిగిపోయాయి.

శిల్పికి ప్రేరణ కలిగించాలి కాబట్టి నాయికను బొమ్మగా నిర్దేశించారు. బి. సరోజ నిజంగానే 'అందాలబొమ్మ'గా సాక్షాత్కరించిందని చెప్పవచ్చు. కళ్ళు చేపలుగా గంతులు వేస్తుంటే, మనస్సు అనే తోటలో కోరికల మల్లెలు పూచాయట. ఆ మనోహరుడు ఎలా ఉంటాడో, ఎక్కడ ఉంటాడో ఊహించుకోమంటూ చల్లగాలితో కబురు పంపించిందట. చందమామలో వెతుకుతూ, ప్రతి తారనూ అడిగిందట. అయినా దొరక్కుండా ఎక్కడో దాక్కున్నాడు. మబ్బును చూసిన నెమలిగా ప్రియుని చూచి మురిసి పరవశిస్తానన్న ఆమె కోరికను అతగాడు జతగాడై నెరవేర్చాడుగదా!

సాలూరువారికి 'కాఫీ' రాగప్రీతి ఎక్కువ. ఇంతకు ముందు మల్లీశ్వరి, విప్రనారాయణ సినిమాల్లోని పాటలు కొన్ని ఈ రాగంలోనే విన్నాం. ఈ పాట ప్రారంభంలో ఏ ఆర్భాటాలూ లేకుండా పల్లవి మొదలైంది. 1958లో వచ్చిన 'ఆడపెత్తనం' సినిమాలో 'తారాశశాంకం' అంతర్నాటకంలోని రాజసులోచన అభినయించిన 'రాకాసుధాకరా' పాట ఎత్తుగడనే యథాతథంగా 'అందాల బొమ్మతో'ను అనుసరించడాన్ని శ్రద్ధగా వింటే గమనింపవచ్చు. తారషడ్జమం నుంచి పల్లవిని ప్రారంభించి పాటనంతటిని ఆదితాళం అక్షరకాలంతో పటిష్ఠంగా నడిపించారు. 'ఆటాడవా' దగ్గర వదిలేయగా సమం నుంచి ప్రారంభించి వయొలిన్స్, వేణువు, సితార్, వైబ్రోఫోన్, గజ్జెల వాద్యసమాహారంతో రెండు ఆవర్తాలలో బిట్టును అందించగా మొదటి చరణం 'కనులు చేపలై'ని చతుశ్రుతిదైవతం నుండి ఒక అక్షరం జాగా వదిలి అంటే అనాగతంలో ఎత్తుకున్నారు. మూడో పంక్తిని మాత్రం రెండోసారి పాడుతూ 'పూవులు' దగ్గర ఇంచుకంత పల్చని సంగతిని వినిపించడం మురిపెంగా ఉంది.

రెండో చరణానికి ముందు బిట్‌వర్క్ ధోరణిని పూర్తిగా మార్చారు. నాలుగు ఆవర్తాలలో బిట్టును ఇస్తూ చివరి ఆవర్తంలో ముక్తాయింపును వినిపించి పంచమం దగ్గర వదిలారు. అప్పుడు ఇది కూడా దైవతం మీది నుండే ఒక అక్షరం జాగా వదిలి అనాగతంగా 'చల్లగాలితో' అని ప్రారంభమైంది. 'కబురంపితిని' పదాన్ని మొదటిసారి

'నరిమనిదమపా' బాణీలోను, రెండోసారి 'నరిమవదనిదమపా' అనే చక్కని సంగతితోనూ వినిపించారు. ఎందుకంటే చల్లగాలిలో కబురు అంత వేగంగా వెళుతుందన్నమాట. 'తారతారను' పదాన్ని తారస్థాయి గాంధారంలో సాభిప్రాయంగా పలికించారు. 'దాగెదవేల'ను మరింత పెంచి ప్రశ్నిస్తున్న ధోరణిలో పాడడం ఎంతో భావాత్మకంగా సాగింది.

మూడో చరణానికి ముందు బిట్వర్క్ మరోతీరుగా, మిగిలిన రెంటికన్న విభిన్నంగా సాగింది. అతీత పద్ధతిలో 'సరిమపా' అంటూ 8వ అక్షరం కాగానే ప్రారంభమై ఆరు ఆవర్తాలలో సాగింది. మూడు, నాలుగు ఆవర్తాలలో అతిద్రుతగతిని పాటించారు. 5వ ఆవర్తంలో మృదంగ సంచారం వినిపించారు. ఆరో ఆవర్తంలో మొదటి అర ఆవర్తాన్ని మృదంగ విన్యాసంతో నింపారు. రెండో అర ఆవర్తంలో వయొలిన్స్‌తో ద్రుతగతిలో ముక్తాయింపును వినిపించారు. ఆధార షడ్జమం దగ్గర వదిలేశారు. అప్పుడు ఒక అక్షరం జాగా వదిలి అనాగతంగా మధ్యమం నుండి 'నల్లని మేఘము' ప్రారంభమై విభిన్నమైన ధోరణిలో కొనసాగింది. 'మేఘము' దగ్గర రెండు రకాల సంగతులను వినిపిస్తూ మేఘవిలాసాన్ని స్ఫురింపజేశారు. మొదటి రెండు పాదాల్లో ముఖ్యంగా 'మేఘము' దగ్గర 'మేఘ్' రాగాన్ని స్పష్టంగా వినిపించారు. 'నీలి నెమలినై' దగ్గర నెమలి చేసే నాట్యపు కులుకులను చిత్రిస్తూ 'దనిసరి నిదనిసా' అంటూ రెండు నిషాదాలనూ కలుపుతూ 'మేఘ్' రాగలక్షణంతో పాడిన తీరు ఆకర్షణీయంగా ఉంది. దీని తరువాత ఒక ఆవర్తంలో సితార్, వైబ్రోఫోన్‌లతో బిట్టును ఇచ్చి నెమలి నాట్యాన్ని స్ఫురింపజేశారు.

చివరకు పల్లవిని మొత్తం పాడి 'ఆటాడవా' దగ్గర ఆపారు. తరువాత 7 ఆవర్తాలలో మృదంగం, వయొలిన్స్ నడక వినిపించి తారషడ్జమంలో ముగించారు. ఈ విధంగా మూడు చరణాలు, వాటి బిట్‌వర్క్‌లు కూడా ఒకదానితో మరొకటి కలవకుండా విభిన్న శైలిలో వినిపించడం సాలూరివారి గొప్ప ప్రతిభా విశేషం.

అందాల నారాజ అలుకేలరా

చిత్రం : మంగమ్మశపథం (1965)
రచన : సి. నారాయణరెడ్డి
సంగీతం : టి.వి. రాజు
గానం : పి. సుశీల, నృత్యం : ఎల్. విజయలక్ష్మి

నాటకురంజి–ఆది

అందాల నా రాజ అలుకేలరా
ఔనని కాదని అనవేలరా ॥అం॥

1. *చందురుదాపైన సందడి చేసేను*
డెందము లోలోన తొందర చేసేను
అందని వలపుల గంధము పూసేను
సుందరి జాలిగ చూసేనురా ॥అం॥

2. *మరులను చిలికించు చిరునవ్వులేమాయె*
మనసును కవ్వించు కనుసన్నలేమాయె
మదనుని తూపులు మరిమరి పదునాయె
మౌనము చాలించి నన్నేలరా ॥అం॥

చిత్రంలో తండ్రీ కొడుకులుగా ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేశారు. కొడుకు పాత్రలో ఉన్నప్పుడు తాను ప్రేమించిన యువతిపై ఎందుకో అలకబూనినపుడు ఆ ప్రేయసి
బుజ్జగిస్తున్నట్లుగా ఈ పాట పాడుతూ నర్తిస్తున్నది. ప్రేయసి పాత్రలో నటనర్తకీమణి ఎల్. విజయలక్ష్మి హావభావాలతో ఈ పాటను అభినయించారు.

పల్లవిలోనూ, రెండవ చరణంలోనూ యతి నియమాన్ని, మొదటి చరణంలో ప్రాసనియమాన్ని చక్కగా అనుసరించారు కవిగారు.


చంద్రుడు ఏదో సందడి చేస్తున్నాడు. హృదయం తనలో తానే కలవరపడుతూ దేనికో తొందరపడుతున్నది. ఇంకా అందుకోకుండా ఉన్న ప్రేమగంధాన్ని పూస్తానంటున్నది. అన్నీ ప్రియునికి వివరించింది ఆమె. అయినా అతని మొహంలో చిరునవ్వు కనిపించలేదు. అందుకు వగజెందిన ప్రేయసి అలనాటి చిరునవ్వులు, కనుసన్నలు ఏమైపోయాయని నిగ్గదీస్తున్నది. ఏదన్నా మాట్లాడమని వేడుకుంటున్నది.

పాటను అపురూపమైనది, సాధారణంగా ఎక్కువమంది స్వీకరింపనిది, అరుదైనది అయిన నాటకురంజి రాగంలో టి.వి. రాజుగారు హృద్యంగా స్వరపరచారు. ప్రారంభంలో రెండు ఆవర్తాలలో మృదంగవిన్యాసం వినిపించి తారషడ్జమం నుంచి వయొలిన్స్, వీణ వాద్యాలతో ఆరు ఆవర్తాలలో చక్కని స్వరసంపుటిని వినిపిస్తూ షడ్జమం దగ్గర ముగించారు. వెంటనే పల్లవిని సమంగా రిషభం నుంచి పాడడం ప్రారంభించారు. మొదటి పాదం పాడాక మిగిలిన జాగాను

వేణువు బిట్టుతో నింపారు. పల్లవిని రెండోసారి పాడేప్పుడు 'అనవేలరా'ను మరో చిన్న నంగతితో పాడారు. 'అలుకేలరా' దగ్గర చిన్న ఆలాపనను ఒక ఆవర్తంలో వినిపించారు. తరువాత స్వరతబలాలతో ప్రారంభమైన బిట్‌వర్క్ ఆరు ఆవర్తాలుగా రాగస్వరూపాన్ని ఆవిష్కరిస్తూ సాగింది. వీటిలో 4, 5 ఆవర్తాలలో మృదంగవిన్యాసం వినిపించి ఆరో ఆవర్తంలో ముక్తాయిని ఇచ్చారు. అక్కడ ఒక అక్షరం వదిలి మొదటి చరణాన్ని దైవతం నుండి 'చందురుడాపైన'ను అందుకున్నారు. మూడో పాదంలో 'పూసేను' దగ్గర అవరోహణ, ఆరోహణల గమకాలను ద్రుతగతిలో ఒక ఆవర్తంపాటు పాడి, 'అందని' పాదాన్ని పాడారు. 'సుందరి' దగ్గర ఆపి 'జాలిగ' వదాన్ని జాలిగొలిపేలా పాడుతూ పాదాన్ని ముగించి 'చూసేనురా'ను తారరిషభంలో పాడి వల్లవిని ఎత్తుకున్నారు. తరువాత మళ్ళీ స్వరతబలాలతో బిట్టును ప్రారంభించి, వీణ, వయొలిన్స్ సంయుక్తంగా ఉండే స్వరసంపుటిని వినిపిస్తూ, మృదంగం, మోర్సింగ్, గజ్జెలు తోడ్పడగా ఆరు ఆవర్తాలలో మొదటి చరణంకన్న భిన్నమైన రీతిలో బిట్వర్క్ ఇచ్చారు. 'మరులను' అనే చరణం ప్రారంభం కూడా ఒక అక్షరం జాగా వదిలి దైవతం నుండే ప్రారంభమైంది. మూడో పాదంలోని 'పదునాయె' దగ్గర మరోరకమైన ఆలాపనను ఒక ఆవర్తంలో పాడి తిరిగి 'మదనుని' ఎత్తుకుని చివరి పాదం పాడాక 'నన్నేలరా'లో 'రా' మీద తారస్థాయి గాంధారం నుంచి ద్రుతగతితో అవరోహణలోకి వచ్చే ఆలాపనతో పాటకు నిండుదనం తెచ్చారు. పల్లవిని మొత్తం పాడి 'అలుకేలరా' దగ్గర ఒక ఆవర్తంలో అందమైన ఆలాపన చేసి గానాన్ని ముగించారు. తరువాత తబల, మృదంగవిన్యాసాలను జోడిస్తూ ఆరు ఆవర్తాలలో వాద్యసంగీతాన్ని వినిపిస్తూ పై షడ్జమంలో ముగించి పాటనంతటిని నునంవన్నం చేశారు. సినిమాలలో శుద్ధమైన బాణీలో రాగాన్ని పలికించి శాస్త్రాన్ని పోషించిన ఉత్తమ గీతాలలో ఇది ప్రముఖమైనది.

సరిలేరు నీకెవ్వరు

చిత్రం : కంచుకోట (1967)
రచన : సి. నారాయణరెడ్డి
సంగీతం : కె.వి. మహదేవన్
గానం : పి. సుశీల & ఎస్. జానకి
నృత్యం : ఎల్. విజయలక్ష్మి, జయశ్రీ



యమన్-ఆది

ను.	సరిలేరు నీకెవ్వరు నరపాలసుధాకర	
	సరిలేరు నీకెవ్వరు	॥సరి॥
	సురవైభవాన భాసురకీర్తిలోన	॥సరి॥
జా.	సరిలేరు నీకెవ్వరు రతిరాజసుందరా	
	సరిలేరు నీకెవ్వరు	॥సరి॥
	సిరిలోన గాని మగసిరిలోన గాని	॥సరి॥
ను. 1.	ప్రజలను నీ కంటిపాపలుగా కాచి	
	పరరాజులదరంగ కరవాలమును దూసి	
	శాంతిని వెలయించి మంచిని వెలిగించి	
	జగతిని లాలించి పాలించినావు	॥సరి॥
జా. 2.	మరుడే తొందర చేయ విరిబోణులను గూడి	
	మధువే పొంగులువార మనసార తూగాడి	
	నవ్వులు చిలికించి మువ్వలు పలికించి	
	యవ్వనవీణలు కవ్వించినావు	॥సరి॥
ను. 3.	రాజభోజ రవితేజ దానజిత కల్పభూజ జోహార్	
జా.	నీటుగుల్కి సుమకోటి తేనెలానేటి తేటి జోహార్	
ను.	అసమప్రభావ జోహార్	
జా.	రసికావతంస జోహార్	
ఇ.	జోహార్ జోహార్ జోహార్ జోహార్	

చిత్రంలో రాజసభలో రాజనర్తకి; యువరాజు అభ్యంతర మందిరంలో బోగపు నర్తకి నృత్యాల మీద ఈ పాటను చిత్రించారు. మహారాజుగా నాగయ్య; యువరాజుగా ఉదయకుమార్; రాజనర్తకిగా ఎల్. విజయలక్ష్మి; బోగపు నర్తకిగా జయశ్రీ మనోహరంగా అభినయించారు.

యతిప్రాసల నియమాన్ని పాక్షికంగా పాటించారు. ఒకవైపు రాజభక్తి, మరొకవైపు రసికానురక్తి రెంటినీ నమపాళ్ళలో మేళవించారు. మొదటి చరణంలో

రాజస్తోత్రం, రెండవ చరణంలో రసికవిలాసం చక్కగా వర్ణింపబడింది. నవ్వులు, మువ్వలు, యౌవన, కవ్వించి వంటి మాటలు తేటలై హృద్యంగా ఉన్నాయి. మూడవ చరణంలో అనుప్రాస సౌందర్యం, ధారాశుద్ధి, దీర్ఘసమాస వైభవం కనిపిస్తాయి.

ప్రారంభంలో మృదంగం, మోర్సింగ్, ఘటం వాద్యాల విన్యాసం రెండు ఆవర్తాలలో సాగింది. తరువాత సితార్ బిట్ రెండు ఆవర్తాలలో వినిపించి ఆధారషడ్జమం మీద వదిలేయగానే సుశీల పల్లవిని పంచమం నుండి సమంగా ప్రారంభించారు. 'నీకెవ్వరు' దగ్గర వీణతో 'సాగామాపా' అనే బిట్టును ఇచ్చాక మళ్ళీ పల్లవిని ప్రారంభించారు. రెండోసారి ఈ జాగాలో 'సామాగాగారీసా' అని వీణతోనే అనిపించారు. 'నురవైభవాన'ను ఆధారషడ్జమం నుండి సమంలో అందుకుని రెండుసార్లు పాడి చివరలో 'లోన'లో 'న' మీద చక్కని సంగతిని వినిపించి పల్లవిని అందుకున్నారు. వెంటనే రసిక మందిరానికి దృశ్యం మారుతుంది. కనుక వేణువు, తబలాలతో లలితసంగీత ధోరణిలో రెండు ఆవర్తాల బిట్టును ఇచ్చారు. దీనిలో శుద్ధమధ్యమ స్పర్శను చూపి రాగధర్మాన్ని నిర్వహించారు. మూడో ఆవర్తంలో తబలా విన్యాసాన్ని ముక్తాయితో వినిపించారు. అప్పుడు జానకి సమం నుండి పంచమం మీద పల్లవిని ఎత్తుకున్నారు. పల్లవికి మధ్య బిట్టుగా రెండు సార్లకును వేణువును వినిపించారు. తరువాత పల్లవిలో 'నీ' అక్షరం మీద చక్కని సంగతిని వినిపించారు.

పల్లవి రెండుసార్లు అయ్యాక సితార్, మృదంగం, ఘటం, మోర్సింగులతో మూడు ఆవర్తాలుగా బిట్టును ఇచ్చి షడ్జమంపై వదిలాక మొదటి చరణం 'ప్రజలను నీకంటి'ని ఒక అక్షరం జాగా వదిలి రిషభం నుంచి ప్రారంభించారు. 'కాచి' దగ్గర చిన్న ఆలాపన చేసి తిరిగి అదే పాదాన్ని పాడారు. తరువాతి పాదాన్ని పాడాక 'దూసి' దగ్గర మృదంగనాదాన్ని అర ఆవర్తంలోనే వినిపించడం వలన ఆదితాళవు అక్షరకాలం చెదిరిపోయింది. మృదంగనాదం తరువాత చరణాన్ని మొదటి నుంచి పాడారు. మూడవ పాదాన్ని రెండుసార్లు రెండు రకాల సంగతులతో పాడారు. తరువాత నాలుగవ పాదాన్ని పాడుతూ 'నావు' దగ్గర చక్కని సంగతిని వినిపించి పల్లవిని ఎత్తుకున్నారు.

రెండో చరణానికి ముందు వేణువుతో బిట్టును ప్రారంభిస్తూ శుద్ధమధ్యమాన్ని కలువుకోవడంవల్ల 'శంకరాభరణరూపం' వచ్చింది. ఇలా రెండు ఆవర్తాలలో వేణువు బిట్టును ఇచ్చి, మూడవ ఆవర్తంలోఎలక్ట్రిక్ బాంజోను తీసుకుని ఇదే రాగంలో బిట్టును ఇస్తూ ఆధారషడ్జమం దగ్గర ముగించగా అక్కడినుంచే సమంలో జానకి 'మరుడే తొందర' అనే చరణాన్ని ప్రారంభించారు. 'తూగాడి' దగ్గర శంకరాభరణంలోనే ఆలాపనను వినిపించి చివరలో అవరోహణాగమకాన్ని గలగలా వినిపించి తిరిగి చరణాన్ని ఎత్తుకున్నారు. మూడో పాదాన్ని రెండుసార్లు పాడి నాలుగవ పాదాన్ని కొనసాగించి వల్లవిని అందుకున్నారు.

తరువాత బిట్టు ఏదీ లేకుండానే నేరుగా 3వ చరణాన్ని సుశీల సమంలో గాంధారం నుంచి ఎత్తుకుని మొదటిపాదం పాడారు. వెంటనే మృదంగాది లయవాద్యాలు ఒక ఆవర్తంలో విన్యాసాన్ని చూపాయి. జానకి 'నీటుగుల్కి' పాదాన్ని వెంటనే పాడారు. ఇక్కడ ఒక ఆవర్తంలో తబల వినిపించాక మళ్ళీ 'రాజభోజ' నుంచి అందుకున్నారు. ఇద్దరూ చెరొక పాదం ముందులాగే పాడారు. సుశీల పాడుతున్నప్పుడు మృదంగం, జానకి పాడుతున్నప్పుడు తబల అనుసరించడం భేషుగ్గా ఉంది.

మూడో పాదాన్ని సుశీల అతీత విధానంలో 8వ అక్షరం కాగానే 'అనమప్రభావ జోహార్' పాడారు. మృదంగం విన్యాసం వినిపించాక 'రసికావతంస'ను జానకి కూడా అతీత విధానంలోనే అందుకుని పాడారు. ఇక్కడ తబలా ముక్తాయిని వినిపించారు. ఈ రెండు పాదాలను ఇద్దరూ వేరువేరుగా మళ్ళీ పాడాక, ఇద్దరూ వంతులు వేసుకుని 'జోహార్'ను రెండేసి మారులు అతీత విధానంలో పాడారు. తరువాత ఇద్దరూ విడివిడిగా చిన్నపాటి ఆలాపనను ఒకటిన్నర ఆవర్తాలలో పాడి ఆపారు. ఏ వాద్యమూ అనుసరించకుండానే మళ్ళీ చెరో ఆలాపనను పాడారు. తరువాత సుశీల పల్లవిని అందుకున్నారు. వెంటనే జానకి తన భాగంలోని అనుపల్లవిని పాడారు. 'నీకెవ్వరు'లో 'రు' మీద చంక్రమణపు గమకాన్ని వినిపించారు. చివరగా సుశీల తన భాగపు పల్లవిని పాడి పాటనంతటినీ ముగించారు.

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ. ఫోన్: 939 661 1905.



భౌతిక సత్యాలు

కలయా - మిథ్యా - మాయా?

– అవధానం రఘుకుమార్


మాయామయ మిదం అఖిలం హిత్వా
బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా

అన్న శంకరుల భావయుక్తమైన మాట ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మిగారి గాత్రంలో రాగయుక్తమై దూరంగా దేవాలయపు లౌడ్-స్పీకరులో నుండి మంద్రంగా వినిపిస్తోంది. అది అక్టోబరు నెల, మొదటివారం. ప్రతి సంవత్సరంలాగే 2022 సంవత్సరానికి కూడా అనేక విభాగాలలో నోబెల్ బహుమతుల ప్రకటనలు వెలువడుతూ ఉన్నాయి. ఈసారి "క్వాంటం మెకానిక్స్"లో జాన్. ఎఫ్. క్లాజర్, అల్లెన్ ఆస్పెక్ట్, ఆంటన్ జీలింగర్‌లకు ఇచ్చారట. ప్రతి సంవత్సరం ఇలా సైన్సు, ప్రపంచశాంతి విభాగాలలో నోబెల్ ప్రైజులు ఇచ్చారనే ప్రకటనను కొంచెం జాగ్రత్తగానే చూస్తాను. ముఖ్యంగా ఫిజిక్స్‌లో!

ఫిజిక్స్ అనగానే ప్రేమను తృణీకరించి వదలిపోయిన మొదటి ప్రేయసిలాంటి జ్ఞాపకాలు గుర్తుకు వస్తాయి. ఆ పైన ఎన్నో ప్రేమకావ్యాలు మొలకెత్తినా, అంతిమంగా ఫలించినా – తొలిప్రేమ – మిగిల్చిన మధుర జ్ఞాపకాల సౌందర్యం వేరు! నాకు గుర్తున్న చిన్నతనం నుండీ ఫిజిక్స్ అంటే ఏదో అర్థం కాని ఇష్టం. కానీ గ్రాడ్యుయేషన్ తరువాత జీవితపు సుడిగాలిలో ఎదురీదనూ లేక మునకే నయమనీ అనుకోనూ లేక, ఎక్కడెక్కడికో కొట్టుకొనిపోయి, నలభైఏళ్ళ మధ్యందిన కాలాన న్యాయశాస్త్రంలో పిహెచ్.డి.తో తేలిన నాకు – ఇంకా ఇప్పటికీ కలలలో కలవరపెట్టే తొలిపరిచయం – ఫిజిక్స్!

నిజం చెప్పాలంటే డిగ్రీ చదివేటప్పటి కాలపు రెండు మూడు తాత్విక సంఘర్షణల నేపథ్యాలు – ఈ ఫిజిక్స్ నుండే వచ్చాయి. రెండో సంవత్సరం బి.యస్సీ (ఎమ్.పీ.సీ)లో మా లెక్చరర్‌గారు థెర్మో డైనమిక్స్‌లో ఒక పాఠం చెబుతూ – "ఎంట్రపీ" అనే విషయం గురించి వివరిస్తున్నారు. అందరం శ్రద్ధగా వింటున్నాం, నోట్స్ రాసుకుంటున్నాం. "ఎంట్రపీ అంటే ఒక సిస్టమ్‌లో ఉపయోగకరమైన పనిచేయడానికి అందుబాటులో లేని థెర్మల్‌శక్తిని కొలిచే పద్ధతి. ఒక యూనిట్ ఉష్ణోగ్రతకు అది ఎంత ఉందో – అది ఎంట్రపీ." అదేమిటి? పనిచేయడానికి అందుబాటులో లేని శక్తి ఏమిటి? మాస్టారు ఇంకా వివరిస్తోన్నారు. అణువుల క్రమమైన కదలికలతో వచ్చేది "పని." శిక్షణ తప్పితే? అది "డిసార్డర్." క్రమశిక్షణా రాహిత్యం. ఈ క్రమశిక్షణా రాహిత్యం ప్రతి క్లోజ్‌డ్ సిస్టెమ్‌లోనూ నిరంతరం పెరుగుతూ ఉంటుంది అంటుంది "ఎంట్రపీ" సిద్ధాంతం! "డిసార్డర్" పెరగడం ఏమిటి?

క్లాస్ అయిపోయింది. ఆ రోజు సాయంత్రం హాస్టల్ రూములో ముగ్గురు, నలుగురు మిత్రులం మాట్లాడుకుంటున్నాం. అందులో ఒకరు బయాలజీ విద్యార్థి, ఒకరు హిస్టరీ, ఇద్దరం ఫిజిక్స్ విద్యార్థులం. మధ్యలో ఈ "ఎంట్రపీ" మళ్ళీ చర్చకు వచ్చింది. "క్లోజ్‌డ్ సిస్టమ్" అనే మాటని భౌతికశాస్త్రంలో ఒక నిశ్చితమైన నిర్వచనంలో వాడతారు. అంటే తన నుండి బయటికి, బయటినుండి తనలోకి పదార్థ బదిలీని అనుమతించని ఒక వ్యవస్థ. ఇందులో శక్తిరూపంలో బదిలీ ఉంటే ఉండవచ్చును. కానీ పదార్థ రూపంలో బదిలీ ఉండదు. ఒక క్లోజ్‌డ్ వ్యవస్థలో "ఎంట్రపీ" నిరంతరం పెరుగుతోంది అంటే అందులో క్రమశిక్షణా రాహిత్యం, ఆందోళన, విశృంఖలత్వం..... పెరుగుతూ ఉంటాయి. ఇలా ఆలోచిస్తూ, విశ్లేషిస్తూ వెనక్కి ప్రయాణం చేస్తూ పోతే ఏ క్లోజ్‌డ్ సిస్టమ్‌లోనయినా ఇప్పుడు ఉన్న స్థితికంటే అంతకు



ముందు మరింత మెరుగైన "ఆర్డర్" ఉండాలి. అలా ఆలోచిస్తూపోతే ఒక- "పెర్ఫెక్ట్ ఆర్డర్" నుండి క్రమంగా విశృంఖలత్వం, డిజార్డర్‌వైపు ఒక క్లోజ్‌డ్ సిస్టమ్ నిరంతరంగా ప్రయాణం చేస్తుంది. అంటే - మొదట ప్రారంభంలో ఒక సంపూర్ణమైన, అత్యంత క్రమబద్ధమైన స్థితి ఉండాలి. అది కాలం గడిచేకొద్దీ పతనం అవుతూ ఉండాలి.

విచిత్రంగా ఉంది కదూ? ఇదే కదా ఈ విశ్వం భగవత్ సృష్టి అనే ఆలోచన? ఇదే కదా - కృతయుగం, త్రేతాయుగం, ద్వాపరయుగం, కలియుగం అనే పతనంలోనూ ఉన్నది. ఇదే కదా - అద్భుతమైన ఈడెన్ గార్డెన్‌లో ఆనందంగా ఏ సిగ్గూ బిడియమూ లేని సౌందర్యలోకం నుండి జ్ఞానఫలం తినడం, స్వర్గం నుండీ పతనం అవ్వడం! ఇంతకీ "ఎంట్రపీ" అనే ఒక భౌతికశాస్త్ర విషయం నన్ను ఈ రకంగా ఇబ్బంది పెట్టిన కొద్ది రోజులకు, మూడవ సంవత్సరంలో వెర్నర్ హైసన్‌బర్గ్ సూత్రం- "అనిశ్చిచి" (థియరీ ఆఫ్ అన్-సెర్టనిటీ) వెంటపడటం మొదలుపెట్టింది. క్వాంటం మెకానిక్స్‌లో ఒక ఎలక్ట్రాన్ లేదా ప్రోటాన్.... ఇలా ఒక పార్టికల్‌ను ఇది ఇక్కడ ఉంది అని ఇదమిత్థంగా చేర్చలేని ఓ అయోమయం. అప్పటిదాకా ఖచ్చిత శాస్త్రాలుగా పేరున్న గణితం, భౌతిక, రసాయనిక శాస్త్రాలు కూడా మెల్లగా మేమేమి అంత ఖచ్చితమైన శాస్త్రాలము కాదూ అని ఒప్పుకుంటున్నాయి. ఈ "అనిశ్చిత సిద్ధాంతం" కూడా నాలో అనేక ప్రకంపనలనే కలిగించింది. అంతకు ముందే ఎంత తలలు బ్రద్ధలు కొట్టుకున్నా కొరకుబడని - అయిన్‌స్టీన్ సాపేక్షిక సిద్ధాంతం కలవరపెట్టింది. అయితే అది సైన్సు ఖచ్చితత్వపు రక్షణవలయంలోనే ఉంది. ఎందుకంటే ఈ విశ్వంలో కాంతిని మించిన వేగంతో ఏదీ ప్రయాణం చేయదు, చేయలేదు. కనుక సాంప్రదాయ విజ్ఞాన శాస్త్రాలలో సాపేక్షికంగానైనా ఖచ్చితత్వం అయితే ఉంది.

సైన్సులో తొలి పాఠాలు నేర్చుకొనే నన్నే అంత కలవరపెడితే, ఇక నిష్ణాతులైన భౌతికశాస్త్ర మేధావులు ఊరికే ఉంటారా? వెర్నర్ హైసన్ బర్గ్ (1901-1976) జర్మనీకి చెందిన భౌతిక శాస్త్రవేత్త. క్వాంటం మెకానిక్స్ తొలి సిద్ధాంత కర్తలలో మరచిపోలేని పేరు. 1927లో ఆయన ప్రతిపాదించిన "అస్థిరత్వ" నియమం (నిజానికి "అనిశ్చితి" అనే పదమే సరయినది) అతనికి 1932లో నోబెల్ బహుమతి ఇప్పించింది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత "మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్"కు డైరెక్టరుగా కూడా పనిచేశాడు. (ఈ సంస్థకు పూర్వ నామం కైజర్ విల్‌హెల్మ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్). ఆ తరువాత "మాక్స్ ప్లాంక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజిక్స్ & ఆస్ట్రోఫిజిక్స్"కు డైరెక్టర్.

ఈ మాక్స్ ప్లాంక్ కూడా జర్మనీ భౌతిక శాస్త్రవేత్తే! ఈయననే క్వాంటం ఫిజిక్స్‌కు ఆద్యుడు అంటారు. ఈయన 1918లో నోబెల్ బహుమతి గ్రహీత. ఈయన ప్రతిపాదించిన క్వాంటం సిద్ధాంతం ప్రకారం పదార్థం నిరంతరంగాకాక అడపాదడపా చిన్న-చిన్న మూటలుగా (ప్యాకెట్స్‌గా) శక్తిని బయటికి ప్రసారం చేస్తూ ఉంటుంది. లోపలికి తీసుకుంటూ ఉంటుంది. అప్పటిదాకా కాంతి నిరంతరాయంగా సరళరేఖలో కానీ, తరంగాలుగా కానీ ప్రవహిస్తూ ఉంటుంది అనేది సైన్స్ ఈ ప్యాకెట్లను "క్వాంటం" అంటాం. ఇదే ఈ భౌతిక శాస్త్రపు ఖచ్చితత్వ ప్రతిపాదనలకు మొదటి విఘాతం. ఇక అక్కడ నుండీ ఈ ప్రయాణం వడుతూ, లేస్తూ.... సాగుతూనే ఉంది. హైసన్‌బర్గ్ "అనిశ్చితి" ఈ ప్రయాణంలో ఒక ముఖ్యమైన మలుపు.

ఒక్కసారి నిశ్చలంగా ఉన్న భౌతికశాస్త్రం ఉలిక్కిపడ్డది. ప్రశాంత విజ్ఞాన సరోవరంలో క్వాంటం రాయి అనేక విచలిత తరంగాలనే కలగచేసింది. అయిన్‌స్టీన్‌లాంటి సాపేక్షవాది కూడా చలించక తప్పలేదు. "కాదు కాదు" - భౌతికశాస్త్రంలో అనిశ్చితి ఉండదు "ఉండకూడదు". ఏదో తప్పు జరిగింది. ఎక్కడ లెక్కలు తప్పాయి. లెక్కలలోకి తీసుకోని ఏవో పదార్థాలు ఈ అనిశ్చితికి, ఈ గందరగోళానికి కారణం. ఇది మంచిది కాదు. భౌతికశాస్త్రంలో నిత్య భౌతిక సత్యం లేకపోతే ఎలా?" అంటూ హైనన్ బర్గ్‌ని, ఆయన అనిశ్చితిని తొలగించేందుకు - "అయిన్‌స్టీన్ - పోడోవ్‌స్కీ రోజన్ ప్యారడాక్స్" అనే సిద్ధాంతం (ఈ.పి.ఆర్.) 1935లో ముందుకు వచ్చింది.

1935లో అయిన్‌స్టీన్, ఆయన శిష్యులూ - పోడోల్‌స్కీ - రోజెన్‌లు అయిన్‌స్టీన్‌తో కలిసి ఈ

"ప్యారడాక్స్"ను తెచ్చారు. ప్యారడాక్స్ అంటే ఓ రకమైన విభాన, వైరుధ్యం. ఈ సిద్ధాంతంలో వారు చెప్పినదేమిటంటే, క్వాంటం సిద్ధాంతం ముఖ్యంగా హైసన్‌బర్గ్ ప్రతిపాదించిన "అనిశ్చితి" కేవలం ఓ విభాస! ఓ భ్రాంతి! "రజ్జు సర్ప భ్రాంతిలా!" పరిగణనలోకి తీసుకోవలసిన ఏవో అంశాలను పరిగణించకపోవడంవల్ల హైసన్‌బర్గ్‌లో "అనిశ్చితి" వచ్చింది. క్వాంటం థియరీలో లేని మూలపదార్థాలు ఏవో ఉన్నాయి. ఈ "ఈ.పీ.ఆర్" సిద్ధాంతం కూడా భౌతిక ప్రయోగ సిద్ధాంతం కాదు. ఇంతకు ముందు ఐన్‌స్టీన్ సాపేక్షతలా ఇదీ ఒక ఆలోచనల ప్రయోగం (థాట్ ఎక్స్‌పెరిమెంట్). దీన్ని వివరించడానికి ఒక చిక్కుముడిని లేదా ఎన్టాంగ్‌ల్డ్ స్థితిని ఒకదాన్ని ఊహించారు. దాన్నే ఒకరకమైన "చిక్కుబడ్డ పదార్థాలు" (ఎన్టాంగ్‌ల్డ్ ఎలిమెంట్స్) అంటారు. అంటే అనిశ్చితి సిద్ధాంతంలో ఒక విలువను అంటే స్థానం కాని, వేగంకాని లేదా పదార్థం కాని, శక్తి కాని కొలిచేప్పుడు మరొకటి పరిగణనలోనికి రాని చిక్కుముడి అయి ఉంటుంది. అందువల్ల అనిశ్చితి వచ్చిందే కానీ, పదార్థ భౌతికశాస్త్రంలో ఖచ్చితత్వమే ఉంది ఈ ఈపిఆర్ ప్రతిపాదన. ఒకటి కొలిచేప్పుడు మరొకటి జారుకుంటోంది. ఒకటి ముడి విప్పేప్పుడు, మరొకటి ముడి పడుతోంది.

అయితే అదే సమయంలో నీల్‌బోర్ అనే మరో శాస్త్రవేత్త అయిన్‌స్టీన్ వారి మిత్రుల వివరణలను ప్రశ్నిస్తూనే ఉన్నాడు. ఇక ఐన్‌స్టీన్ జీవితమంతా అనిశ్చితిని తప్పు అని తన ఖచ్చితత్వమే నరయినది అని బుజువు చేయడంలోనే గడచిపోయింది. సాంప్రదాయ భౌతిక శాస్త్రంలో ఈ ఖచ్చితత్వం అనేది ప్రధాన, బలమైన ప్రాతిపదిక. ఆ ఖచ్చితత్వమే దెబ్బతింటే విజ్ఞానశాస్త్రాల ఉనికికే ప్రమాదం అని భావించేవారు. ఐన్‌స్టీన్ ఈ సాంప్రదాయ భౌతికశాస్త్రానికి దాదాపుగా ఒక చివరి స్తంభం అనుకోవచ్చును.

సాంప్రదాయ ఫిజిక్స్‌లో ''ది ప్రిన్సిపిల్ ఆఫ్ లొకాలిటీ"కి చాలా ప్రాధాన్యత ఉంది. అంటే ఒక వస్తువు లేదా పదార్థం తన సామీప్యతలో ఉన్న పదార్థాలతోనే ప్రభావితం అవుతుంది. అంటే పదార్థాల మధ్య దూరం పెరిగేకొలదీ వాటి పరస్పర ప్రభావం కూడా తగ్గుతూ వస్తుంది. సుదూరంగా ఉన్న పదార్థాల మధ్య బహుశః ఏ ప్రభావశీలత ఉండదు. అంటే ఈ.పీ.ఆర్. సిద్ధాంతం ప్రకారం ఈ చిక్కుముడిపడ్డ పదార్థాలు కూడా దగ్గరలోనే ఉండాలి. కానీ క్వాంటం ఫిజిక్స్ దానికి వ్యతిరేకంగా విశ్వంలో ఎక్కడ ఎంత దూరంలో ఉన్నా పార్టికల్స్ ఒక్క దానిని మరొక్కటి వెంటనే ప్రభావం చేసుకోగలవు అంటుంది. ఈలోగా 1964లో జాన్ స్టూవర్ట్ బెల్ అనే శాస్త్రవేత్త కూడా ఈ క్వాంటం సిద్ధాంతం క్లాసికల్ (లేదా సాంప్రదాయ) భౌతికశాస్త్రపు ప్రాథమిక సూత్రాలకు వ్యతిరేకం అని కొన్ని గణిత సూత్రాల ద్వారా బుజువు చేసే ప్రయత్నం చేశాడు. దీన్నే "బెల్ థియరీ ఆఫ్ ఇన్ ఈక్వాలిటీ" అంటారు. బెల్ అంచనా ప్రకారం తన సిద్ధాంతాన్ని ప్రయోగాల ద్వారా పరీక్ష చేసుకోవచ్చును అంటాడు. అంతేకాదు క్వాంటం ఫిజిక్స్ అసలు "ఫిజిక్స్" అనే పేరుతో ఇముడుతుందా అన్నదే ఒక ప్రశ్న అన్నదాకా వెళ్ళాడు.

అయితే ఈ చర్చ సాగుతూనే ఉంది. ఈలోగా ఫిజిక్స్ అనేక సైద్ధాంతిక ప్రతిపాదనలతో ఉద్ధీపనం అవుతూనే ఉంది. అంతకు ముందు కూడా "డార్క్ మ్యాటర్" అనే ప్రతిపాదన, ఆ విషయంలో జరిగిన ప్రయోగాలు, సాంప్రదాయ భౌతికశాస్త్రానికి పెను సవాళ్ళు విసిరాయి. దాదాపు 1933లలోనే ఫ్రిడ్జ్ జ్వీక్కీ అనే ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ఈ విశ్వపు రహస్యాలలో మనకు కనబడని పదార్థం ఒకటి ఉందనీ, అది విశ్వాన్ని కేవలం భౌతిక వాస్తవంగా అర్థం చేసుకోవడాన్ని ప్రశ్నిస్తుందని భావించాడు. అదే ఈ "డార్క్‌మ్యాటర్". ఈ "డార్క్‌మ్యాటర్" విశ్వపు రూపురేఖలని అర్థం చేకోవడంలో చాలా అవసరమనీ అన్నాడు. జ్వీక్కీ (1898–1974) స్విస్ దేశపు ఖగోళ, అంతరిక్ష శాస్త్రజ్ఞుడు. ఈ "డార్క్‌మ్యాటర్". అనే ప్రతిపాదన పదార్థం అనే భావనకు వ్యతిరేకం. మరింత ఆధునిక సిద్ధాంతాల ప్రకారం విశ్వంలోని పదార్థశక్తి రూపాల మొత్తంలో 30శాతం పైగా డార్క్‌మ్యాటర్. మిగతా పదార్థశక్తి రూపంలో 69 శాతం డార్క్‌ఎనర్జీ. మనకు కనబడే భౌతికరూప పదార్థం విశ్వం మొత్తంలో 0.5 శాతం! అంటే ఎంత షాకింగ్ విషయం! మొత్తం మీద మనం చూసే దృశ్యమయ, రూపమయ, పదార్థమయ విశ్వం – మాయా? భౌతిక వాస్తవికతలో చాలా ఇన్–సిగ్నఫికెంట్ విషయమా? "అలోకమా?"

లోకంబులు లోకేశులు
లోకస్థులు తెగినతుది నలోకంబగు పెం
జీకటి కవ్వల నెవ్వ
డేకాకృతి వెలుగు నతనినే సేవింతున్

అంటాడు పోతన భాగవతంలో. ఈ లోకాలూ, లోకేశులు, లోకస్థులు తెగిన తరువాత, చివ్వరి "అలోకాన్ని" దర్శించిన పోతన. అలోకము అంటే పెంజీకటి (డార్క్‌మ్యాటర్). దానిని కూడా దాటి ఆ తరువాతి ఏకాకృతితో ఉన్న వెలుగునూ దర్శించాడు.

ఇప్పుడు 2022లో ఫిజిక్స్‌లో నోబెల్ బహుమతి తిరిగి ఈ చర్చను మన మధ్యకు తెచ్చింది. బెల్ 1964లో చేసిన ప్రతిపాదనలపై ప్రయోగాల ఫలితమే ఈ సంవత్సరపు (2022) నోబెల్ బహుమతి. అలైన్ ఆస్పెక్ట్, జాన్ క్లాజర్, ఆంటన్ జీలింగర్‌ల ప్రయోగాల ఫలితమే– "పదార్థాలు విశ్వంలో అనంత దూరాలలో ఉన్నా ఒకదాన్ని మరొకటి తత్కాలీనంగానే, వెంటనే, అదే క్షణాన ప్రభావితం చేయగలవు.'' ఫోటాన్‌లలోని చిక్కుముడులు (ఎంటాగ్ల్‌మెంట్స్), బెల్ సిద్ధాంతంలోని అసమానతలు లాంటి సమస్యలను పరిష్కరించడానికి చేసిన ప్రయోగాల ఫలితం విశ్వంలో చాలా దూరంగా ఉన్న పదార్థాలు ఒకే ఒక యూనిట్‌గా పనిచేయగలగడం అంటే సాంప్రదాయ భౌతిక సిద్ధాంతపు పదార్థవాదాన్ని ప్రశ్నించడమే! నిజానికి ఈ వార్త తరువాత ఒక్కసారిగ భౌతికవాదులు, హేతువాదులూ విచిత్రమైన మౌనం వహించారు. ముఖ్యంగా మన స్థానిక సోషియల్ మీడియా మాధ్యమాలలో ఎప్పుడూ విజ్ఞాన శాస్త్రాలలో నోబెల్ బహుమతులూ, వేరే ఏదైనా ముఖ్యమైన ఆవిష్కరణలూ జరిగినప్పుడు పుంఖాను పుంఖంగా రాసేవారు – ఎందుకో ఈసారి (2022) నోబెల్ బహుమతి విషయంలో కొంచెం నిశ్శబ్దం పాటించారు. అర్థంకాక మౌనమా? అర్థవంతమైన మౌనమా? నిజానికి శాస్త్ర సాంకేతిక రంగాల పరంగా సంవత్సరపు ఫిజిక్స్ నోబెల్ బహుమతికి అనేక వేరే అంతిమ లక్ష్యాలు ఉన్నాయి. ఇది మరో క్రొత్త సాంకేతిక శాస్త్రానికి, క్వాంటం కంప్యూటర్ల నిర్మాణానికి క్వాంటం ఆధారిత నెట్ వర్కింగ్, కమ్యూనికేషన్ల వ్యవస్థల నిర్మాణానికి ఉపయోగపడుతుంది. అది ఇప్పుడున్న ఇన్ఫర్మేషన్ రంగాన్ని మరో ఉన్నతస్థాయికి తీసుకుపోతుంది అని అంచనా.

అయినా ఈ సాంప్రదాయ భౌతిక శాస్త్రం, దానిలోని స్థానీయ సిద్ధాంతాలు, భౌతిక వాస్తికత ఇవన్నీ సంపూర్ణ సత్యం కావు అన్న ఆలోచనలు, విశ్వసత్యాలలో భౌతిక సత్యం చాలా చాలా చిన్నది (0.5 శాతం!) అన్న జ్ఞానోదయం – తాత్వికరంగాన్ని కూడా మరో కుదుపు కుదిపి ఒక్కసారిగా అనేక ఉన్నతుల శిఖరాలకి చేర్చుతుంది. "కలయో, నిజమో, వైష్ణవమాయో, తెలిసీ తెలియని అయోమయంలో..." అన్నట్టూ. కాసింత గందరగోళం నెలకొన్న ఇందులో మరింత స్పష్టత వస్తుంది. రావాలి కూడాను. శంకరుని అద్వైతం జీవాత్మ, పరమాత్మల అద్వైతాన్ని ప్రతిపాదిస్తుంది. మనం చూస్తూన్న దృశ్యమయ ప్రపంచం మాయ అని, అది అవిద్యవల్ల కలిగే భ్రాంతి అనీ అంటారు. హ్యారీ మీడో అనే ఒక బ్రిటిష్ అద్వైత వాది మెలకువలో మనం చూసే ప్రపంచం, కలలో చూసే మరో ప్రపంచం గురించి చర్చిస్తూ ఇలా అంటాడు. "ఈ కల నుండి మనలను మేల్కొల్పడం, సరైన జ్ఞానం ద్వారా నిజమైన స్వీయ, వాస్తవితకు మనలను మేల్కొల్పడం శంకరుని ఉద్దేశ్యం" (హ్యారీ ఓల్డ్ మీడో, ది మ్యాథెస్టన్ ట్రస్ట్, లండన్ ! శంకరుడి మాయా సిద్ధాంతం, ఏసియన్ ఫిలాసఫీ, 1992 వ్యాసంలో). ఈ 2022వ సంవత్సరపు ఫిజిక్స్ నోబెల్ బహుమతి తరువాత అనేకమంది అద్వైతులు ఈ "మాయ"ను గురించి వివరిస్తూ అనేక మాధ్యమాలలో పోస్టులు పెడుతున్నారు. సాంప్రదాయ సైన్స్ ఇపుడు ఎదుర్కొంటోన్న అనేక సమస్యల మధ్య "ఖచ్చిత మైన నిజాలు'' కొంత అనుమానాస్పదమే! ''అనిశ్చితి!'' "అనిశ్చితి!" "అనిశ్చితి!" భౌతిక సత్యమే అనుమానాస్పదం అనేదాకా వెళుతోన్న అనిశ్చితి.

డా. అవధానం రఘు కుమార్ - హైదరాబాద్. ఫోన్: 944 101 5709.

టూలూజ్ లాట్రెక్ – పోస్టర్ సృష్టికర్త
(Toulouse - Lautree)
(1864-1901)

– టి.వి. ప్రసాద్

హెన్రీ డి టూలూజ్ లాట్రెక్ దక్షిణ ఫ్రాన్స్ అల్బీలో (Albi) స్వచ్ఛమైన కులీన కుటుంబంలో జన్మించి కళా జగతిలో మహోన్నత గౌరవాన్ని పొందాడు. తండ్రి టూలూజ్ – లాట్రెక్ మోన్ఫా తమ పూర్వీకుల గురించి, ఫ్రాన్స్‌లో 13వ శతాబ్దం నుండి పేరుగాంచిన గొప్ప దొరల కుటుంబంతో తమ మూలాలున్నాయని చెప్పుకునే డంబాచారపు మనిషి. తల్లి కూడా పేరు గాంచిన కుటుంబానికి చెందినదే! ఆల్బీ బార్డో (Bordeaux) భూస్వామ్య దొరలు. తల్లిదండ్రులెన్నడూ కష్టపడ్డవారు కాదు. గొప్ప దర్పం, జీవనశైలితో ఊహకందని తలపొగరు మనుషులు. సంపన్న కుటుంబాలకు సహజంగా అబ్బిన కళ పట్ల అభిరుచి, ఆదరణ కలిగినవారు. అలాంటి కుటుంబంలో నిజాయితీలేని కుమారుడు లాట్రెక్ పుట్టడాన్ని వారి పాప ఫలంగా భావించారు.

గత వైభవంలో ఊహల్లో బతికే తండ్రికి తగ్గట్టుగా టూలూజ్ లాట్రెక్ గుర్రాలన్నా, వాటి పై స్వారీ చేయడమన్నా, ఇతర క్రీడలన్నా అమితంగా యిష్టపడేవాడు. దురదృష్టవశాన జరిగిన రెండు మూడు ప్రమాదాల్లో కిందపడి రెండు తొడ ఎముకలూ విరిగి పోగా ప్రాణాల్తో బయటపడ్డాడు. కానీ జీవితకాలం అంగవైకల్యంతో బతికాడు. నడుం పైభాగం మామూలుగా పెరుగుతుంది కానీ కాళ్ళలో ఎముకల లోపంవల్ల పెరుగుదల ఆగిపోవడంతో వింత మరగుజ్జు ఆకారంతో బతికాడు. అతడే కళా ప్రియుడు కాకపోయివుంటే బార్డో కోటలోపలి చీకటి గదుల్లో మగ్గిపోయి వుండేవాడు. ఫలితంగా గుర్రపుస్వారీ చేయవలసినవాడు కేవలం ప్రేక్షకుడిగా మిగిలిపోవలసి వచ్చింది. యుక్తవయసులో లాట్రెక్ పెయింట్ చేసిన గుర్రాలను, అడవి జంతువుల చిత్రాల్ని చూసి తండ్రి చాలా గర్వపడతాడు. కానీ తర్వాత పారిస్‌లో ఆ ప్రతిభంతా బూడిదలో పోసిన పన్నీరైపోయిందని ఉగ్రుడవుతాడు. కొడుకు 23 సంవత్సరాల వయసులో అతణ్ణి కుటుంబ వారసత్వం నుండి వెలివేసి బతకాడానికి ఏదో ఏర్పాటు చేస్తాడు. కొంత సొంత ఆస్తి, ఆదాయం సమకూరడంతో టూలూజ్ మాన్ మార్‌ట్రేలో (Monmortre) ఛాందస భావాల ప్రముఖ పెయింటర్ డెగాస్ (Degas) న్యూడియో వక్కన సొంత న్యూడియోకు యజమాని అవుతాడు. అప్పుడు జరిగిన ఓ అసాధారణ సంఘటన. కౌంట్ ఆల్ఫోన్స్ కుమారుడు టూలూజ్ లాట్రెక్ వింత, అసాధారణ పెయింటర్; శారీరక లోపం ఉన్నా తన సమకాలికులకన్నా తెలివితేటల్లో మిన్న ఐనవాడు. ఫ్రాన్స్ ఉన్నతాధికారులు, సంపన్నవర్గాల వారు యిష్టపడే లాట్రెక్, ఇష్టపూర్వకంగా చీకటి, మురికిలోకంలో మునిగితేలే పాపపు, వక్ర బుద్ధులతో, నీచ మానవులతో సాంగత్యం పెట్టుకోవడం, నాసిరకం సంగీత, నాట్యశాలలు, సర్కస్‌లు సందర్శించడాన్ని తన మార్గంగా ఎంచుకున్నాడు. వేశ్యలతో బతికాడు. అతనికి తోడుగా తల్లి తరఫు బంధువుతో రాత్రి తిరుగుళ్ళు తిరిగేవాడు. ఆ బంధువు సన్నగా, పొడుగ్గా వుండే డాక్టరు. అతనిపక్కన లాట్రెక్ సగం ఎత్తు ఉండేవాడు. ఈ వింత జంట హాస్పిటళ్ళ చుట్టూ తిరుగుతూ ఉండేవారు. లాట్రెక్ అక్కడ చేసే ఆపరేషన్లు గమనిస్తూ స్కెచ్‌లు వేసేవాడు. ప్రతిఫలంగా తనకు పరిచయమైన మాన్‌మార్‌ట్రే ఆడపిల్లలతో హాస్పిటల్ రోగులకు మూవీ స్టార్లు యుద్ధంలో గాయపడ్డ సైనికులను తమ ఆట పాటలతో అలరించినట్లు – వినోదం కలిగించేవాడు.


Toulouse - Lautree

28–30 సంవత్సరాల మధ్య ఆర్టిస్టుగా లాట్రెక్‌ది ఉచ్ఛస్థితి. ఆ సమయంలోనే అనితర సాధ్యమైన తైలవర్ణ చిత్రాలు పోస్టర్లు సృష్టించాడు. మాన్‌మార్‌ట్రే ఆధోలోకపు జాకీలు, తార్పుడుగాళ్ళు, కేన్‌కేన్ డాన్సర్లు, స్వలింగ స్త్రీ సంపర్కులు, ప్రతిభ వుండీ పనికిమాలిన వ్యక్తులుగా జీవించేవారు లాట్రెక్ ఇతివృత్తాలు. అతడు మూలాన్ రూజ్ (Moulin Rouge) రెండో నివాసంగా వేశ్యావాటికలు మూడో నివాసంగా గడిపాడు. వేశ్యలతో సహ జీవనం సహజమై పోగా వారాల తరబడి వారితో గడిపేవాడు. వేశ్యలు కూడా ఏ మాత్రం బిడియం లేకుండా అది తమ బాధ్యత అన్నంతగా అతనితో ఆత్మీయంగా మసలుకొనేవారు. శారీరక సుఖం కోసం తమతో గడిపే పురుషుల మాదిరి కాకుండా అతని వింత, విపరీత ప్రవర్తనను భరించేవారు. లాట్రెక్ అంగీకరిస్తే చాలు అతనికి పడక సుఖం ఇవ్వడానికి సిద్ధంగా వుండేవారు. వారిని రేస్ కోర్సులకు, నౌకా విహారాలకు తీసుకపోయి బయట ప్రపంచపు రుచి చూపించి ఊరట కలిగించేవాడు.

అతని పరోపకార బుద్ధికన్నా, గొప్ప కుటుంబం నుంచి వచ్చినవాడు అన్న గౌరవంతో బాగా చూసుకునేవారు. తాగుడు వ్యభిచారంలాంటి ఉన్మాద కార్యకలాపాల్లో పాల్గొన్నా పని పట్ల నిబద్ధత పాటించి, నిరంతరం శ్రమపడేవాడు. విపరీతమైన తాగుడు నుండి బయట పడ్డానికి చికిత్సా కేంద్రంలో (Assylum) చేరాడు. పరిస్థితి బాగా విషమించడంతో తండ్రి 'వాణ్ణి ఇంగ్లండు పంపించండి, అక్కడి దొరల్లాగా నిత్యం తాగి తందనాలాడతాడు' అంటాడు. చికిత్సా సమయంలోనే సుమారుగా 50 డ్రాయింగులు వేశాడు. చికిత్సా కేంద్రం నుండి బయటపడ్డ రోజే నేరస్తుడిగా విచారణ నెదుర్కొంటున్న ఆస్కార్ వైల్టును చూడ్డానికి ఇంగ్లండు వెళ్ళాడు. అతని బొమ్మను స్కెచ్‌గా వేసి, అలంకరణతో నింపి అతనికి ఇచ్చి వస్తాడు. వేశ్యా యువతులు అలంకరించుకుంటున్న చిత్రాలతో (Elles) కార్యకలాపాలను సాగిస్తాడు. నిజానికి లాట్రెక్ పనిచేసి సంపాదించవలసిన అలవసరం లేకున్నా, కథా చిత్రాలు (ఇల్లస్ట్రేషన్లు), పోస్టర్ల ద్వారా జీవితం సుఖంగా గడుపుతాడు. ప్రస్తుతం మనం చూస్తున్న పోస్టర్ల సృష్టికర్త అతడే. వాటిని కళాఖండాల స్థాయికి చేర్చిన ఆద్యుడు. ఆ తర్వాతి తరంవారిలో ఒక్కరైనా పోస్టర్ డిజైన్‌లో అతని సమీపానికి చేరగలవారు కన్పించరు. టూలూజ్ లాట్రెక్ 1988లో. అందమైన ఇంగ్లీషు బార్ మెయిడ్‌ను తమ పూర్వీకుల తరఫున గౌరవించడానికి నార్వే వెళ్తాడు. తాను ఎప్పుడో చూసిన ఆమెను కలవడానికి వెళ్తూ ఆమె చిత్రాలన్ని వేసి 'ఇంగ్లీష్' పేరు పెట్టి ఆమెకు ఇవ్వాలనుకుంటాడు. కాని ఆ అందాల బార్‌మెయిడ్ ఒక తొత్తుతో లేచిపోయిన సంగతి తెలుసుకొని విచారిస్తాడు.

తన అంత్య దశ సమీపించిందని పసిగట్టి బార్డోలో వున్న తల్లి చెంతకు చేరి అక్కడే 36వ యేట చనిపోగా అతని మరణంతోనే అతని వైభవం (ennoble) అంతా మట్టిలో కలిసిపోతుంది. లాట్రెక్ పందొమ్మిదవ శతాబ్దపు గొప్ప డ్రాఫ్ట్స్‌మన్, పెయింటర్లలో ఒకడు. సాహిత్యపరంగా గైడిమపాసాకు సాటి. ఇద్దరూ తమ తమ మాధ్యమాల్లో నిర్దయగా (harsh) నిజాయితీగా, ఏరకమైన సెంటిమెంటు లేకుండా ధైర్యంగా ఫ్రెంచి వారి బలహీనతల్ని ఎండగట్టిన వారే. లాట్రెక్ తన మోడళ్ళనుకేవలం మోడళ్లుగా కాకుండా, జీవమున్న వ్యక్తులుగా సమాదరించాడు. అతని పోట్రేట్ల మోడళ్ళు కొద్దిమంది ప్రసిద్ధులతో సంబంధాలు ఉన్నవారు తప్ప మిగతావారంతా అధో జగతి జీవులే. వారిని అమిత గౌరవంగా చూసుకున్నాడు. చనిపోయినవారంతా లాట్రెక్ చిత్రాల్లో, పోస్టర్లలో సజీవంగా మిగిలిపోయారు. జేన్ ఆవ్రిల్ (Jane Avril) అతని అభిమానపాత్రురాలైన మోడల్, మూలాన్ రూజ్ డాన్సరు, బక్కపల్చగా వుండేది. ఆమెను సంపన్నులు ఈర్ష్య పడేంతగా తనతో పారిస్ అంతా తిప్పాడు. ఆమె అసాధారణ అందం, ఆకర్షణ అతనికి నిత్యం ఉత్తేజం కలిగించేది. మరో గద్దముఖం యువతి గూలూ (La Goulue) అనే డాన్సర్‌ల పెయింటింగులు లూవర్ మ్యూజియంలో ప్రదర్శితాలు.

ఈవెట్ గిల్బర్ట్ (Yuette Guibert), మూలాన్ రూజ్ గాయకురాలొకర్తి చాలా త్వరగా పేరు ప్రఖ్యాతులు గడించిన చిన్న యువతి, బక్కపల్చగా, మగ వాడి ఛాతీతో చిన్న పిల్ల లాంటి కళ్ళతో అమాయకంగా కన్పించేది. ఆమెపాటలు అశ్లీలంగా, హాస్యస్ఫోరకంగా వుండేవి. వయసు పెరిగే కొద్దీ మరీ సుకుమారంగా, ఒత్తైన రాగి రంగు జుట్టుతో ముఖంలో హావభావాలను బాగా పలికించేది. కానీ ముఖంలో ఆకర్షణ లోపించేది. తన వికారాన్ని ఎక్కడ బయటపెట్తాడోనన్న భయంతో లాట్రెక్‌కు దూరంగా వుండేది. ఐనా ఆమె పోస్టర్‌ను అందంగా రూపొందించి మెప్పు పొందుతాడు. అది లాట్రెక్ సృష్టించిన పోస్టర్లన్నింటికిన్నా గొప్పదిగా పరిగణించబడుతోంది. బొహీమియన్ జీవనశైలి, దుర్మార్గులు, సైతాన్‌కు అనుంగు సోదరీలు, దళారులు, వ్యభిచారులు శతాబ్దాంతానికల్లా మరుగునపడి పోగా, అలాంటి అధోలోక జీవులకు తన చిత్రాల ద్వారా అమరత్వం కలిగించాడు. అదీ లాట్రెక్ జీవితం. అతని జీవితం సంగ్రహం, దారుణం ఐనా ఉత్పాదక సామర్థ్యంతో విజయం సాధించాడు. (ఇంతవరకు థామస్ క్రేవెన్ టూలూజ్ లాట్రెక్ ఆంగ్ల వ్యాసానికి స్వేచ్ఛానువాదం).

లాట్రెక్ ఇతివృత్తాలు : 18వ శతాబ్ది చివరి, 19వ శతాబ్ది తొలిదశకాల నాటి సర్కస్ జనాలు, రోత జీవితం, చీకటి కార్యకలాపాలు, నేరస్తుల జీవితాలు లాట్రెక్ చిత్రాలకు, పోస్టర్లకు ముడిసరుకు. వారిపై సానుభూతి చూపి తన చిత్రకళ ద్వారా అమరత్వం కల్పించాడు.

శైలీ వైవిధ్యం : లాట్రెక్ శైలి ఏ ఒక్క 'బడి'కీ కట్టుబడిందికాదు. ఏ చట్రంలో యిమిడేది కాదు. ఎంచుకున్న చిత్రం, మాధ్యమం, రంగుల్ని బట్టి శైలిలో వైవిధ్యం చూపాడు. ప్రముఖంగా కన్పించే బొమ్మల కూర్పు, నూతన సాంకేతికతో కొన్ని చిత్రాల్లో గీతల ప్రాముఖ్యత, మరి కొన్నింటిలో వర్ణాల ప్రాముఖ్యత చూపించాడు. నీడలతో సృజించిన (Silbouttes) చిత్రాలు, గీతల మధ్య పాటించిన సంయమనం తాను ముందు ముందు వేయబోయే పోస్టర్లకు ఉపోద్ఘాతాలనిపిస్తాయి. చిత్రంలోని నేపథ్యాన్ని (background) అతి శ్రద్ధగా నిర్దిష్టతో ఉపయోగించుకోవడాన్ని గమనిస్తాం. 1895 నాటి పారిస్

రాత్రి ప్రపంచాన్ని చిత్ర బద్ధం చేశాడు. బైసికిళ్ళు, కార్లు, నిండైన స్త్రీలు, విదూషకులు మొదలగు వారిని చూపించడంలో సాధికారత చూపించాడు. కారికేచర్లను నిర్లక్ష్యంగా, వేగంగా రచించాడు. చిత్రానికి ఇతివృత్తం ముఖ్యం కానీ ఆదర్శం కాదు అన్న సందేశాన్ని రాబోయే తరాల పెయింటర్లకు ముందే సూచించాడు. ముద్రావాద అనంతర పెయింటర్ల వలె కాకుండా, డెగాస్ చిత్రాల ప్రభావంతో ఇతివృత్తాలను నైపుణ్యంతో, అత్యంత శ్రద్ధతో పెయింట్ చేశాడు. ప్రాచ్య కళాధోరణుల ప్రభావంతో లిథోగ్రఫీలో నూతన సాంకేతికను ప్రయోగించాడు. పోస్టర్లలో జపాన్ కళతో యుకియో-యీ (Ukiyo-E)తో విలాస జీవితాన్ని చిత్రబద్ధం చేశాడు. పోస్టర్లను కళాఖండాల స్థాయికి చేర్చాడు. లాట్రెక్ చిత్రాల్లో ఎక్కడా నైతిక సందేశం కన్పించదు. సామాజిక స్పృహతో సాటి మనుషులపై దయ, సానుభూతి చూపడం అవసరం కానీ వ్యంగ్యం, విమర్శ అవసరమా అని ప్రశ్నిస్తాడు.

లాట్రెక్ పరిశీలనాశక్తి : లాట్రెక్ పెయింటింగుల్లో కన్పించే వివిధ రంగుల దుస్తులు, దుస్తుల్లోని ముడతలు, డాన్సర్ల శిరోజాలంకరణ, ముఖంలోని భావాలు, జారిపడే చమట చుక్కలు, వెలుగు నీడల వైవిధ్యం, డాన్సర్ల కదలిక అతని పరిశీలనాశక్తికి నిదర్శనాలు. డాన్స్‌హాల్‌లో నాట్యకత్తె తొడలు కన్పించేలా స్కర్టును పైకెత్తి చూపడం, నిండుగా బట్టలు వేసుకున్న మరో డాన్సర్ పైకెత్తిన ముఖంలో ముక్కును ప్రముఖంగా చూపించడం, ఇంకొక పెయింటింగులో చలాకీగా నాట్యం చేస్తున్న నాట్యకత్తెలు గిరగిరా తిరిగే బొంగరంలా చూపించడంలో లాట్రెక్ వైవిధ్యం చూపించాడు.

జీవించిన కొద్ది కాలంలోనే నిరంతరం చిత్రకళకు న్యాయం చేస్తూ 737 కాన్వాస్ పెయింటింగులు, 275 వాటర్ కలర్స్, ప్రింట్లు, పోస్టర్లు, 5084 డ్రాయింగులు; సిరామిక్, గ్లాస్ వస్తువులు సృజించగా, లెక్కకు రాని ఇతరాలు ఇంకెన్నో ఉంటాయి. లాట్రెక్ తైలవర్ణ చిత్రాలు, పోస్టర్లు సమానస్థాయిలో ంటాయి.

వాటిల్లో బాగా ప్రసిద్ధి గాంచిన ఒక పది చిత్రాలు :

● **మూలాన్‌రూజ్ :** 1889లో ప్రారంభించబడిన కాబరే డాన్సర్ల పెయింటింగులు అనేకం 1892-1895ల మధ్య చిత్రించినవి. అవన్నీ చారిత్రక ప్రాధాన్యత గలిగినవి. ఒక పెయింటింగులో కాన్వాస్‌పై తైలవర్ణ చిత్రంలో లాట్రెక్ కన్పించడం దీనిలోని విశేషం.

● ద లాండ్రెస్ (1889) (The Laundress) ఇది క్రిస్టీస్ 2005వ సంవత్సరం వేలంలో 22.4 మిలియన్ డాలర్లకు అమ్ముడుపోయి కొత్త రికార్డు సృష్టించింది.



● విన్సెంటో వాంగో పోర్ట్రేట్ (1887) పేస్టల్ (pastal) చిత్రీకరణ. 23 ఏండ్ల లాట్రెక్ స్నేహితుడు వాంగోకు చిత్రరూపం కల్పించాడు. పేస్టల్‌లో చిత్రించిన అనితర సాధ్యమైన పోర్ట్రేట్ ఇది.

● మార్సెల్ లెండర్ బోలెరో నాట్యం చేస్తున్న చిత్రం లాట్రెక్‌కు అభిమాన చిత్రం. కారణం అతడు నృత్యకళాభిమాని కావడం.

● లా గులే (La Goulue) పేరుగాంచిన కేన్ కేన్ (can can) డాన్సర్ మూలాన్ రూజ్‌లో ప్రవేశించడం (1891), చార్‌కోల్ పోస్టర్ ప్రచార చిత్రం (154 × 118 సె.మీ)

● ఆరిస్టైడ్ బ్రాంట్ (Aristride Bruant) కాబరేలో, కాన్వాస్‌పై తైలవర్ణ చిత్రం, బ్రాంట్ హాస్య గాయని, కాబరే ఆర్టిస్టు.

● రైనీ డి జోయ్ (Reine De Joie) 1892, సంతోషపురాణీ (Queen of Joy) అని అర్థం. బాంకర్‌ను ఎంటర్‌టైన్ చేయడానికని రూపొందిన పోస్టర్. అదే పేరిట వచ్చిన నవలను ప్రమోట్ చేయడానికి ఉద్దేశించబడింది.

● జేన్ ఆవ్రిల్ (Jane Avril) 1893. లాట్రెక్ శానటోరియంలో ఉన్న సమయాన చిత్రించిన పోస్టర్.

● ఇవాట్ గిల్‌బర్ట్ (Yuette Guilbert) ప్రేక్షకులు అభివాదం చేస్తున్న ఫొటోగ్రాఫిక్ ప్రింట్. పల్చని తైలవర్ణంలో చిత్రించబడింది. లాట్రెక్ చిత్రాలు శ్రద్ధగా ఏకాగ్రతతో రూపొందినవి. కొన్ని చిత్రాల్లో స్లేకర్ (Slacker) డ్రాయింగ్ శైలిని పాటించాడు. నిర్లక్ష్యంగా, తొందరగా రూపొందిన చిత్రాలవి. లాట్రెక్ చిత్రాలు వివిధ దేశాల మ్యూజియాల్లో ప్రదర్శించబడుతున్నాయి. ఒక ఆల్బీలోనే 1000 చిత్రాల దాకా వుంటాయి. మరికొన్ని పారిస్, జర్మనీ,న్యూయార్క్, ఇంగ్లండు, నెదర్లాండ్స్ మ్యూజియాల్లో పదిలపరచబడినాయి.

లాట్రెక్ చిత్ర ప్రదర్శనలు ఎక్కడ జరిగినా అవి విజయవంతమయ్యాయి.

లాట్రెక్ జీవిత విశేషాలు:

లాట్రెక్ జీవితం సంగ్రహం, దారుణం ఐనా అద్భుతమైన ఉత్పాదనా సామర్థ్యంతో రాణించాడు. ప్రాన్స్‌లోని అత్యంత సంపన్న కుటుంబంలో జన్మించినా తన వారసత్వ సంపదను కాదనుకుని మాన్ మాంట్రే జీవితాన్ని ఎంచుకోవడం, చిత్రాలన్నిటికీ అక్కడి సంగీతశాలలు, కాబరే నృత్యాలు,

సర్కస్‌లు, వేశ్యలు ఇతివృత్తాలు కావడం విశేషం. సమకాలీన ఫాషన్‌ను, సాంప్రదాయ చిత్రకళను నిరశించి తన స్వీయ కాలక్షేపం కోసం కళాసృష్టి చేసిన పెయింటర్లలో అగ్రగణ్యుడు. అతనికున్న ఒకే ఒక శత్రువు బద్ధకము, పనిచేయకుండా వుండడం. పక్షపాతం (prejudice) బొత్తిగా లేని, హాస్య ప్రవృత్తి అతని నైజం లిథోగ్రఫీని కనిపెట్టి, పోస్టర్‌ను కళాఖండ స్థాయికి చేర్చాడు. ఆధునిక శైలికి బాటలు వేసిన ఆద్యుడు. మూలాన్‌రూజ్‌లో లాట్రెక్ విఐపి. ఏబ్సింథ్‌లో (Absimth) మునిగితేలే 19వ శతాబ్ది పారిస్ రాత్రి జీవితాన్ని ప్రేమించాడు. తన అంగవైకల్యాన్నే బలంగా అనుకూలంగా చేసుకున్నాడు. 5 అడుగుల కన్నా కొంచెం తక్కువ ఎత్తైనా నాటి చిత్ర కళలో మహోన్నతంగా ఎదిగాడు. కొత్త కాక్‌టెయిల్‌ను కనిపెట్టాడు. దాన్ని 'అర్త్ క్వేక్' (Earth Quake) అని అంటారు. వంశ పారంపర్యంగా వచ్చిన జీన్స్‌లోపానికి కారణం అమ్మమ్మ, నాయనమ్మ అక్క చెల్లెళ్లు కావచ్చు.

లాట్రెక్ సినిమా : లాట్రెక్‌ను ఇంప్రెషనిజం అనంతర ఆర్టిస్టుగా చూపిస్తూ బాగా ఖర్చు పెట్టి నిర్మించిన జీవితకథ (Bio-Pic). దీని నిర్మాణం 1998, వ్యవధి 2 గంటల 5 నిమిషాలు. రోజర్ ప్లాంచెన్ (Roger Planchon) ప్రెంచి నాటక రచయిత డైరెక్టర్, నిర్మాత. నాటి పారిస్‌ను కళ్ళకు కట్టినట్లు చూపించేచిత్రం ఐనా పాత్రల ఎన్నిక, వారి నటన పేలవంగా వుండటంతో చిత్రం విఫలమైంది. ఒక రోజీస్ రోయర్ (Rogis Royar) మాత్రం లాట్రెక్ పాత్రలో రాణిస్తాడు. కథలో నాటకీయత లోపించిందన్నది విమర్శ. ముగింపు ఆశించిన స్థాయిలో లేకపోవడం చిత్రంలో నిజాయితీ లోపించడం లోపం. ఐనా వెనిస్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో (1998), టోరెంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో పాల్గొని ఉత్తమ నటనకూ, ఉత్తమ నిర్మాణ పథకానికీ, (Production Design) రెండు అవార్డులు గెలుచుకుంది. అది కేవలం కాబరే మూవీ అనీ, మంచిరంగుల చిత్రమే కాని ప్రేక్షకులను కథలో లీనం చేయడంలో విఫలమైందనీ విమర్శకుల అభిప్రాయం. ఆ తర్వాత లాట్రెక్ పోస్టర్లు ప్రింట్లు, పెయింటింగుల ఆధారంగా మూలాన్‌రూజ్ ఫిల్మ్ నిర్మించబడింది.

వివరణలు :

1. మాన్‌మార్‌ట్రే (Montmartre) పారిస్ నగర ఉత్తర విభాగంలో సెయిన్ నది కుడిగట్టున 130 మీ. ఎత్తున, 150 ఎకరాల విస్తీర్ణంలో వున్న కొండ. చారిత్రక ప్రాముఖ్యత వల్ల బాగా పాపులర్ ఐన టూరిస్టు ప్రదేశం. 18, 19 శతాబ్దాల్లో ప్రముఖ పెయింటర్లు ఇక్కడే స్టూడియోలు నిర్మించుకుని పెయింట్ చేసినవారిలో క్లాడ్‌మానే, రినాయిర్, డెగాస్, పికాసో, పిసారియో, విన్సెంట్ వాంగో మొదలైన కళాకారులు కొందరు. హెన్రీ టూలూజ్ లాట్రెక్ స్టూడియో కూడా ఇక్కడే డెగాస్ స్టూడియో పక్కనే వుండేది. కొండ అగ్ర భాగాన తెల్లని డోమ్‌తో జీనన్ వవిత్ర (Sacre-Cour) బాసిలికా 1417లో నిర్మించబడింది. నైట్ క్లబ్‌లకు, కాబరేలకు ప్రసిద్ధి గాంచింది. విజయవంతమైన అనేక చిత్రాలు ఇక్కడే తీయబడినాయి.

2. మూలాన్ రూజ్ (Moulin Rouge) ప్రెంచి మాటకు అర్థం (రెడ్‌మిల్) అంటే పాతకాలపు గాలిమర. 1889లో స్థాపించబడిన పారిస్‌లోని తొలి కాబరే. కాన్-కాన్ డాన్స్ ఇక్కడే పుట్టి అభివృద్ధి చెంది క్రమంగా కాబరేగా యూరప్ అంతటా వ్యాపించింది.

3. కేన్‌కేన్ డాన్స్ : 19వ శతాబ్దపు తొలి దశకాల్లో వ్యర్థకాలక్షేపానికి అర్థ నగ్న నాట్యాలకు నెలవుగా వెలిసింది. ప్రజాభీష్టాన్ననుసరించి పారిన్‌లో 1830లో పుట్టిన 'బాల్' డాన్స్. పారిస్ విలాస పురుషులు రాత్రుల్లో కాలక్షేపం కోసం ఈ డాన్స్ కార్యక్రమాలకు వెళ్ళేవారు. అందమైన, చురుకైన ప్రతిభావంతులైన యువతులు, కురచ లోదుస్తుల్తో చేసే అర్థనగ్న ప్రదర్శన. కాళ్ళను వేగంగా కదుపుతూ ప్రేక్షకులను ఉన్మాత స్థితికి తీసుకవెళ్ళే డాన్స్. మొదట పారిస్‌లో పుట్టిన అర్థనగ్న (Salacious & Scandalous) డాన్స్, కాలక్రమంలో కాబరేగా రూపాంతరం చెందింది.

4. యుకియో-యీ (Ukiyo-E): జపాన్ భాషలో విలాస జీవితానికి సంబంధించిన చిత్రకళ అని అర్థం. తీరిగ్గా తింటూ తాగుతూ వేశ్యల ఆట పాటలను ఆనందించడం, అలాంటి దృశ్యాలను చూపే పెయింటింగుల్ని, ఇంట్లోనే వుండి ఆనందించడాన్ని కూడా యుకియో-యీ అంటారు. ఈ కళను అభివృద్ధిచేసి, పెయింటింగులు, ప్రింట్లుతో జపాన్ యూరోపియన్ దేశాలతో వ్యాపారం చేసింది. తర్వాత ప్రపంచ దేశాలన్నింటా వ్యాపించింది. సూక్ష్మంగా జపాన్ అలంకరణ కళ.

5. ఏబ్సింథ్ (Absinthle) : మన నాటు సారాలాగా ఘాటైన లిక్కర్. రకరకాల మొక్కల ఆకులు, పూలనుండి తయారవుతుంది. లేత ఆకు పచ్చరంగు మత్తు పానీయం, స్విట్జర్లాండులో 18వ శతాబ్ది చివర్లో పుట్టింది. 19, 20 శతాబ్దాల్లో ఫ్రాన్స్, ముఖ్యంగా పారిస్ కళాకారులు, రచయితలు విరివిగా తాగేవారు. బొహీమియన్ సంస్కృతితో ఏబ్సింథ్ ముఖ్య భాగం.

టి.వి. ప్రసాద్ - హైదరాబాద్. ఫోన్: 798 139 8250.

కాలాతీత వ్యక్తులు

(డా. పి. శ్రీదేవి)

ఈ నవల ప్రధానంగా ముగ్గురు యువతులు, మరో ముగ్గురు యువకుల మధ్య నడిచిన కథ. కథాకాలం 1950వ దశకం. అప్పటి కాలాన్ని దాటి, దూరదృష్టితో ఎన్నో దశాబ్దాల ముందే ఈనాటి జీవన రీతిని ఊహారూపంగా ప్రతిష్ట చేసిన నవల. ఆ ప్రతిభ అద్భుతం. మనస్తత్వ చిత్రణ, మనోభావాల సంఘర్షణ, మంచిచెడ్డల బేరీజు, ఉద్వేగాల ఆవేశం... నిర్లక్ష్య ధోరణి, ఇలా అనేకానేక జీవన పార్శ్వాలని కొత్తరీతిలో కళ్ల ముందు నిలిపి, చదువరులకి కొత్తలోకాన్ని చూపించిన నవల ఇది.

ఇందిర, కళ్యాణి, వసుంధర ముగ్గురు అమ్మాయిలు. ప్రకాశం, కృష్ణమూర్తి, డాక్టరు చక్రవర్తి – ఈ ముగ్గురు యువకులు. ఈ ఆరుగురి మధ్య గడిచిన ఘటనల సమాహారం కాలాతీత వ్యక్తులు. పూసగుచ్చినట్టు వరసగా కథ చెప్పిన నవల కాదిది. ఈ ఆరుగురి పరస్పర అనురాగాలు, వ్యామోహాలు, కలతలు, విముఖత్వాలు, మళ్లీ వేరొకరితో సంబంధాలు వీటన్నింటి వెనుక, ఒక మూసలో ఒదగని వీరి విలక్షణ మనస్తత్వాలు, చివరికి వారి తత్వాలకి అనుగుణంగా కుదుటపడటం ఈ నవలా స్వరూపం. వరసగా ఓ కథలా ఉండని ఈ నవల నిడివి 320 పేజీలు. ఆలోచనలు, ఊహలు, పరస్పర భాషణలు... ఓసారి ఆరంభిస్తే చివరిదాకా ఒడలలేనంత ఆసక్తికరంగా ఉన్నాయి. వాళ్ల జీవితాలు మనతో కలిసిపోయినట్టు, అవేమైపోతాయో అన్న దిగులు మనని ఆవరించి ముందుకు చదివించేలా ప్రతి పేజీ ఉండటం విశేషం.

ఆ ఇంటి క్రింద భాగంలో, ఇందిర ఆమె తండ్రి ఆనందరావు, పై భాగంలో ప్రకాశం అద్దెకి ఉంటున్నారు. ప్రకాశం మెడికల్ కాలేజీలో చదువుతున్నాడు. ఇందిరకి గవర్నమెంట్ ఉద్యోగం. ఆమె తండ్రి ఆనందరావుకి కూతురి సంపాదన మీద కులాసాగా బతికెయ్యటమే అలవాటు. ఇందిరకి చొరవ ఎక్కువ. ప్రకాశం తన పని తను చూసుకునే రకం. అయినా కొద్ది కాలంలోనే నువ్వు అని పిలవటం, తనని ఏకవచనంతో పిలిపించుకోవటం ప్రకాశానికి అలవాటు చేసింది. బీచ్‌కి తీసికెళ్లటం, కలిసి భోజనం చేయటం సాధారణమైంది.

ప్రకాశం స్నేహితుడు కృష్ణమూర్తి. బాగా డబ్బున్నవాడు. సరదాగా కాలక్షేపం చేస్తుంటాడు. ప్రకాశం ద్వారా ఇందిరతో పరిచయం పెంచుకున్నాడు. ఇందిర అతనితోనూ చనువుగానే ఉంటుంది. బీచ్‌కి షికార్లు చేస్తుంటుంది.

కళ్యాణి ఇందిర స్నేహితురాలు. గతంలో క్లాస్‌మేట్స్. స్థిరమైన ఆదాయం లేని కుటుంబం కళ్యాణిది. కట్నం ఇచ్చి పెళ్లిచెయ్యలేక కూతుర్ని చదివిస్తున్నాడు ఆమె తండ్రి. ఖర్చు తగ్గుతుందని హాస్టల్‌లో ఉన్న కళ్యాణిని తనింటికి మారమంది ఇందిర. కళ్యాణి అలాగే చేసింది. కళ్యాణిని చూసీచూడగానే, ఆమె నెమ్మదితనం, మృదుత్వం ప్రకాశాన్ని ఆకర్షించాయి. ఆమెతో మాట్లాడాలన్నా, కలిసి గడపటమన్నా ఇష్టంగా మారిందతనికి. కళ్యాణికి టైఫాయిడ్ జ్వరం రావటంతో ప్రకాశం, ఇందిర ఆమెని మెడికల్ కాలేజి హాస్పిటల్‌లో చేర్చారు. ప్రకాశం దగ్గరుండి చూసుకున్నా డామెను. ప్రకాశానికి, కళ్యాణికి పరస్పరం ప్రత్యేక అభిమానం, మమకారం ఏర్పడ్డాయి.

ఒకవైపు ఇందిర, మరోవైపు కళ్యాణి ప్రభావం ప్రకాశం మీద బలంగా పడుతున్నాయి. ఇందిరలో మాటకారితనం ఉంది. చొరవగా ఉంటుంది. కళ్యాణి నవ్వులో అభిమానం కురుస్తుంది. ఆమె చూపుల్లో ఏదో బాంధవ్యం ఉందని పిస్తుంది. ప్రకాశానికి ఉక్కిరిబిక్కిరిగా


ఉంది. కళ్యాణి, ప్రకాశంల మధ్య జరిగిన దగ్గరి సంఘటనతో చివరికి ఆమెతోనే తన జీవితం అనుకున్నాడు ప్రకాశం. కళ్యాణి భావనలూ అలాగే ఉన్నాయి. ఆ రాత్రంతా ఇద్దరూ సరిగ్గా నిద్రపోలేదు.

ఒకరోజు తండ్రి దగ్గర నుంచి వచ్చిన ఉత్తరంవల్ల దిగులుగా ఉంది కళ్యాణి. ప్రకాశం చొరవతో ఉత్తరంలోని విషయాలతో పాటు, తన గతం చెప్పుకొచ్చింది. కళ్యాణి పుట్టగానే ఆమె తల్లి మరణించింది. అప్పటి నుంచి కూతురే ఆ తండ్రికి లోకమైంది. కూతుర్ని చదివించాలని తాపత్రయం. అందుకోసం నానా ప్రయాసపడ్డాడు. ఉన్న ఒక్క ఇల్లు అప్పులవల్ల వేలానికి వచ్చింది. అతని ఆరోగ్యమూ బాగాలేదు. చదువు సాగుతుందో లేదో? భవిష్యత్తు అయోమయం.

ప్రకాశం చిన్నతనంలోనే తండ్రి పోయాడు. పదెకరాల పొలం ఉంది. ప్రకాశాన్ని తీసుకుని అన్నగారి పంచన చేరింది తల్లి. ప్రకాశం మేనమామ వాళ్ల ఆస్తిని మింగటమేకాక, దయతో ప్రకాశాన్ని చదివిస్తున్నట్టు ప్రవర్తిస్తుంటాడు. ఏ నెలకి ఆ నెలే డబ్బు లేదంటాడు. అందువల్ల ప్రకాశం చదువు ఏ క్షణాన్నైనా ఆపేయవచ్చు. పరస్పరం తమ దైన్యస్థితి చెప్పుకోవటంవల్ల కళ్యాణి, ప్రకాశం మనసులు మరింత దగ్గరై ఒకరికొకరు తోడు అనుకున్నారు.

తండ్రికి సీరియస్‌గా ఉందని కళ్యాణికి ఉత్తరం వచ్చింది. ఇందిర, ప్రకాశం ఆమెని రైలెక్కించారు. తిరిగి కళ్యాణి వస్తుందో రాదోనన్న సందేహంతో ప్రకాశం దిగులుగా ఉన్నాడు. అది గమనించిన ఇందిర కళ్యాణి లేకపోతే అంత బెంగా? అని దెప్పింది. "ఉంటారులే లోకంలో నంగనాచులు. విశాలమైన కళ్లు తిప్పి, వలవల ఏడ్చేస్తే నీలాంటి జాలిగుండె మగవాళ్లు ఆదుకుంటారు, నేను నిలబడి ఇంకొకరికి బలమివ్వాలనే తత్త్వం నాది," అంది ఇందిర. అలా కళ్యాణి ధ్యాసలో ఉన్న ప్రకాశాన్ని తన జాణతనంతో విచలితుణ్ణి చేసింది. యౌవనోద్రేకంలో ప్రకాశం మునిగిపోయాడు. అతని దృష్టి చెదిరిపోయింది. రెండోనాటి రాత్రి బాగా ముస్తాబై ఇందిర ప్రకాశానికి తన శరీరం కానుక చేసింది.

తండ్రి మరణంతో కళ్యాణి పూర్తిగా ఒంటరైపోయింది. ఊరి మునసబు రామినాయుడు కళ్యాణిని కన్న కూతురిలా ఆదరించాడు. అన్ని రకాలుగా ధైర్యం చెప్పి రైలెక్కించాడు. ఒంటరిగా రైలెక్కిన కళ్యాణికి ప్రయాణంలో క్లాస్‌మేట్ వసుంధర కనిపించింది. ఆమె ఓదార్పుతో కొంత ధైర్యం తెచ్చుకుంది. ఎప్పుడైనా సరే కళ్యాణి వచ్చి తనతో తనింట్లోనే ఉండొచ్చునని ఆహ్వానించింది వసుంధర.



ప్రకాశం పూర్తిగా ఇందిర మోజులో పడిపోయాడు. ప్రకాశం తీరని అన్యాయం చేశాడని కళ్యాణికి తెలుసు. ఆ అపరాధభావన అతనిలోనూ ఉంది. కానీ ఇందిర ఎంతో నైపుణ్యంగా కళ్యాణిపట్ల అతనిలో విముఖత్వం కలిగించింది. ఇల్లు చేరిన కళ్యాణికి కొద్దిగంటల్లోనే అర్థమైపోయింది ప్రకాశం, ఇందిర ఒక్కటని. తనింక ఆ ఇంట్లో ఉండటం నరక సమానమని రాత్రికి రాత్రే వసుంధర దగ్గరికి వెళ్లిపోయింది కళ్యాణి.

ఈ నవలలో వ్యక్తుల మనస్తత్వాలు, ప్రవర్తనా తీరే ప్రధాన దినుసులు. చాలీచాలని జీతంరాళ్లతో నెట్టుకొచ్చే పరిస్థితిలో ఇందిరకెప్పుడూ రాజీకుదరలేదు. చుట్టూ ఉండే పరిస్థితులు, వ్యక్తులు ఆమెకి నచ్చేలాగే ఉండాలి. అందుకేం చేయ డానికైనా సిద్ధం. తండ్రి ఆనందరావు అలాంటి జీవితాన్ని అడ్డదారిలో జయిం చేశాడు. క్షణం గడవటం కోసం ఎవరినైనా వాడుకోగలదు, కూతురితో సహా! ఆమె అర్ధరాత్రిళ్లు ఎవరితో, ఎక్కడికెళ్లినా పట్టించుకోడు.

నాలుగుతరాల వరకూ తరిగిపోని ఆస్తి కృష్ణమూర్తిది. ఇందిర ఇన్నాళ్లూ అతనికొక ఆట బొమ్మగా కన్పించింది. హాయిగా ఆడుకున్నాడు. అలా అని అతను దుర్మార్గుడు కాదు. అతని వల్ల ఎవరికీ ఏ హానీ జరగలేదు. కళ్యాణి అంటే అతనికి మంచి అభిప్రాయం. సుతిమెత్తని మనిషన్న నమ్మకం. కళ్యాణి ఇల్లు వదిలి వెళ్లేలా చేశారని ఇందిర, ప్రకాశాల మీద అతనికి కోపమొచ్చింది. ఆమెను ఆదుకోవాలని అతని తపన.

ఆ కాలానికి అతీతమైన మనస్తత్వమే వీళ్లందరిది. సంప్రదాయానికి తల వంచి బానిసల్లా బతుకుతున్న ఆ కాలంలో ఇటువంటి స్వతంత్ర ప్రవర్తనతో ఉన్న పాత్రల్ని పాఠకులు అమితంగా ఆదరించారు. 1950వ దశకంలోనే ఇప్పటి జీవన విధానాన్ని ఊహించగలిగిన రచయిత్రి

పి. శ్రీదేవి ముందుచూపు పాఠకుల కళ్లు మిరుమిట్లుగొలిపేలా చేసింది. ఓ వింత ఆకర్షణ పాఠకుల్ని కమ్మేసింది. కథ మరింత మైమరపు కలిగించేలా ముందుకు సాగింది.

ప్రకాశం మేనమామ శేషావతారం తనకి అందిన ఆకాశరామన్న ఉత్తరంతో వాల్తేరు వచ్చాడు. ప్రకాశాన్ని, కృష్ణమూర్తిని, ఇందిర, ఆనందరావులని దుమ్ము దులిపేశాడు. ప్రకాశం చదువుకి ఇంక పంపడానికి డబ్బులేదని వెంటనే ఊరు రమ్మని ఆర్డరు వేసి వెళ్లాడు.

కృష్ణమూర్తికి అనుకోకుండా కళ్యాణి కనపడింది వసుంధరతో పాటు. అతనోసారి కళ్యాణిని చూడ్డానికి వసుంధర ఇంటికి వెళ్లాడు. కళ్యాణి కోసం వచ్చిన రామినాయుడుకు అకస్మాత్తుగా గుండెపోటు రావటంతో తన స్నేహితుడు డాక్టర్ చక్రవర్తిని తీసుకొచ్చాడు కృష్ణమూర్తి. హాస్పిటల్‌లో చేర్పించినా ఫలితం దక్కలేదు. ఆయన చనిపోయాడు. కళ్యాణికి చక్రవర్తికి పరస్పరం అభిమానం ఏర్పడింది. వసుంధరకి కృష్ణమూర్తి నచ్చాడు. మేనమామ ఎత్తుగడకి ప్రకాశం మారిపోయి ఓ డబ్బున్న అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. కొన్ని పరిస్థితులవల్ల కళ్యాణి చక్రవర్తి దగ్గరికి వచ్చేసింది.

ఈ నవలలో ఈ జంటల మధ్య ఇన్ని రకాల మార్పులు జరిగినా అన్నీ సబబే అనిపిస్తాయి. ఇందిరంటే మూర్తి విముఖతతో ఉన్న కృష్ణమూర్తికి ఓ రాత్రి తారసపడిందామె. బలవంతంగా ఇంటికి తీసుకెళ్లింది. ఆ రాత్రికి తనతోపాటే ఉంచేసుకుంది. ఇందిర తండ్రి ఆనందరావు జైల్లో ఉన్నాడు. అపుడు తండ్రి జీవితమంతా చెప్పింది ఇందిర.

అందరి పిల్లలకి పెద్దలు దిక్కు. కానీ ఇందిరే తండ్రికి గార్డియన్. తండ్రి జైల్లో ఉన్నా సినిమాకెళ్లింది ఇందిర. కృష్ణమూర్తితో కులాసాగా గడపగలుగుతోంది. ఆమె తీరే అంత. ఆమెకి పరిస్థితుల మీద ఓ రకం కసి, తనమీద తనకి విపరీతమైన ధీమా. ఆమె ఓ రకంగా విచలితంగా ఉంటే, కృష్ణమూర్తి వసుంధర విషయంగా అస్థిమితంగా ఉన్నాడు. ఇద్దర్నీ ఆ రాత్రి ఏకం చేసింది. ఇందిరను పొందిన కృష్ణమూర్తి ఆలోచనే మారిపోయింది. ఆమెని పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. చక్రవర్తి, కళ్యాణిల అనుబంధం బలపడింది. ఈ రెండు జంటలు తిరుపతి వెళ్లి పెళ్లిచేసుకోటం నవలకు ముగింపు.

నవలలో కథకన్నా, కథ చెప్పిన తీరు, వ్యక్తులను వివరించిన, విశ్లేషించిన విధానం గొప్పవి. అందుకే కథ తెలుసుకుంటే చాలదు. నవలని చదివి ఆస్వాదించాలి. ఈ నవలకి పూర్తి విభిన్నతని సాధించింది ఇందిర పాత్ర. అలాగని మిగిలిన పాత్రలు తక్కువేం కాదు. ఆ కాలాన్ని సవాలు చేసినవే.

మంచి గుణగణాలు, పవిత్రత కలిగిన యువతీ యువకులే నవలల్లో హీరో హీరోయిన్లుగా ఉన్న నవలలు వస్తున్న కాలంలో కాలాతీత వ్యక్తులు రచన ఓ సాహసం, ఓ రచనా విప్లవం!

మగవాడికి ఎదురులేని ఆ కాలంలో, 'ఈ వెధవ ప్రపంచం ఎప్పుడూ ఇలాగే ఉంటుందేమో. అంచేత వేటికోసమూ బెంగపెట్టుకోకుండా హాయిగా ఎక్కడికక్కడ సదుపాయంగా బతకటమే నా ఆశయం,' అనే ఇందిర పాత్ర కల్పన అసాధారణం! 'బతుకులో నాకు కావల్సిందొకటి... దొరుకుతున్నది ఇంకోటి. అంచేత కసికొద్దీ లోకాన్ని ధిక్కరిస్తున్నాను', 'ఏ పని చేసినా నేను కళ్లు తెరిచే చేస్తాను. ఏడుస్తూ ఏదీ చెయ్యను. ఏం జరిగినా ఏడవను.' ఇవన్నీ ఇందిర భావాలు. స్వతంత్రంగా బతకాలన్న ఇచ్ఛ కళ్యాణి, వసుంధర, వైదేహిలో కూడా పుష్కలంగా ఉన్నాయి. అప్పటి సమాజాన్నే కాదు, రాబోవు కాలపు సమాజాన్ని అక్షరబద్ధం చేసిన రచన ఇది!

స్త్రీ స్వేచ్ఛనే కాదు, స్త్రీవాదాన్ని కూడా ఎన్నో ఏళ్ల ముందుగానే చూపించిన నవల. తెలుగు నవలాకాశంలో ఓ ధృవతార.


(నవలా హృదయం)

వి. రాజారామమోహనరావు
హైదరాబాద్. ఫోన్: 939 473 8805.

చదవండి...

– మిసిమి


(1) భారతీయ కథలు: ఈ నమకాలీన కథలు అనువాదం చేసింది రంగనాథ రామచంద్ర రావు. విశ్వమానవాళిని కలిపే సాహిత్య ప్రక్రియ అనువాదం!



25 కథలు, 25 భాషల్లో నుంచి, తెలుగులోకి అనువాదం చేశారు రంగనాథ రామచంద్రరావు – అయితే ఇన్ని భాషలు వీరు నేర్చారా? మరి ఏ భాష వీరికి వారథి? ఇవేమీ అనువాదకులు – చివరిగా రాసిన నలిమెల భాస్కర్‌గాని – ప్రకాశకులు గాని చెప్పినట్లు లేదు – ఏమయినా ఇది చాలా మంచి ప్రయత్నం – పాఠకునికి – తెలుగు కథలతో విసిగిపోయిన పాపం చదువరికి ఇది గొప్ప 'రిలీఫ్' – అందుకైనా ఇది కొని చదవతగిన పుస్తకం – 'కన్నడ – తెలుగు' వారథిగా నిలిచిన 'రంగనాథ రామచంద్ర'గారిని ఎంతైనా అభినందించాలి.

పేజీలు: 172, వెల: ₹ 160/-

(2) మరవరాని మన చరిత్ర: కందిమళ్ల ప్రతాపరెడ్డి. ఇవన్నీ రాజకీయ, సాంస్కృతిక వ్యాసాలు – తెలంగాణా పోరాటానికి సంబంధించినవి.



పరిశోధన మీద ఆసక్తి ఉన్నవారికి ఈ వ్యాసాలు చాలా ఉపయోగపడతాయి. ఆస్వాదనకంటే ఆకళింపు చేసుకోవలసిన అంశాలు – ఎక్కువగా ఉంటాయి. కొన్ని అపోహలు పోగొట్టటానికి ఈ వ్యాసాలు దోహదం చేస్తాయి. 4 దశాబ్దాలకు పైగా కాలం ఇందులో ఉంది కాబట్టి ఇది సమీప చరిత్రగా పరిగణించాలి! నవచేతన వారు ముద్రింపజేశారంటే ఇది వామపక్ష ఉద్యమాలను ఈ వ్యాసాలు వినిపిస్తున్నాయని. *పేజీలు: 259, వెల: ₹ 200/-*

పై రెండు ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, 12-1-493/వి౨, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.ఎస్.ఐ. పోస్ట్, హైదరాబాద్ – 68.

ఫోన్: 040-29884453/54.


జన్యులిపి: కవిత్వం – దేవరాజు మహారాజు. వీరు డి.ఎన్.ఎ.ని జన్యులిపి అంటున్నారు. వీరు రాసిన కవితలన్నీ సమాజపు జన్యులిపి అని వారే చెప్తున్నారు. సాహిత్యం అంతా జన్యులిపి కాదా? మనిషిని, సమాజాన్ని ఆలోచనలను, భావావేశాలను తెలియజెప్పేదే కవిత్వం – సాహిత్యం – అంతా జన్యులిపిగానే ఉంటుంది. 'తమను తాము జయించుకోవటం భ్రమ' అంటారు. ఎవరిని వారు రక్షించుకోవటం వాస్తవమంటారు – మీరు అంగీకరిస్తారా – చదివి తెలుసుకోండి. 50 కవితలున్న ఈ జన్యులిపి స్పృశించని అంశం లేదు – పలకరించని వ్యక్తీ లేదు – ఈ సమాజంలో.



పేజీలు: 108, వెల: ₹ 100/-

ప్రతులు: అన్ని ప్రముఖ పుస్తక షాపులలో లభ్యం.

మంచి మనిషి: కథలు – ఎన్.ఆర్. పృథ్వి – పృథ్విగారు స్పెషల్ జుడిషియల్ (2nd Class) మేజిస్ట్రేట్. వారి పరిధిలోకి సమాజంలోని అనేక వ్యక్తుల స్వభావాలను అంచనా వేసుకోవడానికి ఆస్కారం ఉంటుంది – వీరి కథలకు ఈ నేపథ్యం గొప్పగా అమిరింది – వీరు అభినివేశంతో కథలు మనకు వినిపిస్తారు – అందుకని ఇవి వాస్తవంగా జరిగిన సంఘటనలనే అనుకోవచ్చు. 24 కథలున్న ఈ 'మంచి మనిషి' సంపుటి సమాజ దర్పణంగా మనం పరిగణించవచ్చు.




పేజీలు: 112, వెల: ₹ 150/-

ప్రతులకు: శ్రీమతి పి. ఉషారాణి, 104-6-140, ఎమ్.జి. స్ట్రీట్, రామకృష్ణ నగర్, రాజమండ్రి-533 101.

ఫోన్: 94927 04750.

***

కరుణశ్రీగా ప్రపంచానికి తెలిసిన డా. జంధ్యాల పాపయ్య శాస్త్రిగారిని కలిస్తే వారు చిన్న పిల్లవానిగా




అనిపిస్తారు. ఆయనలోని పిల్లవాని మనస్తత్వమే ఇవిగో ఈ పిల్లల బొమ్మల పుస్తకాలు తెచ్చింది!

1. కలిసిరాని మిత్రుడు, 2. సుహరాబ్ - రుస్తుమ్, 3. ధర్మో రక్షతి రక్షితః, 4. పిట్ట కథలు. ఈ నాల్గు పుస్తకాలు ఒక్కొక్క పుస్తకంలో 8 కథలున్నాయి. మీరు మీ పిల్లలకో మనవళ్లకో చదివి వినిపించండి – మధుకర్ – సంకలించిన 'పిట్ట కథలు' – ఇది వివిధ రచయితలు రాసిన పిల్లల కథలు – ఇందులో 32 కథలున్నాయి. తప్పనిసరిగా పిల్లలున్న ఇంట్లో ఉండవలసిన పుస్తకాలు పై నాలుగు. బొమ్మలన్నీ బాలిగారు చక్కగా వేసి ఇచ్చారు.




1. కలిసిరాని మిత్రుడు –

పేజీలు: 48, వెల: ₹ 60/–



2. సుహరాబ్ - రుస్తుమ్ –

పేజీలు: 40, వెల: ₹ 50/–



3. ధర్మో రక్షతి రక్షితః –

పేజీలు: 48, వెల: ₹ 60/–

4. పిట్ట కథలు

– *పేజీలు: 80, వెల: ₹ 100/–*

పై నాల్గు ప్రతులకు: *నవచేతన పబ్లిషింగ్ హౌస్, 12-1-493/వి౨, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), జి.ఎన్.ఐ. పోస్ట్, హైదరాబాద్ – 68. ఫోన్: 040-29884453/54.*

* * *



డా. కాసర్ల రంగారావు. కెమిస్ట్రీ, రసాయన శాస్త్రం చదివి 'చీఫ్ కెమిస్ట్'గా పదవి నిర్వహిస్తూ సాహితీ రసానందాన్ని పాఠకులకు పంచిపెడుతూ, **(1) తెలుగు వెలుగులు, (2) అక్షర శిల్పాలు, (3) నానోలు, (4) భాషాంజలి** పుస్తకాలు వెలువరించారు. వీరి ప్రతిభను (సాహిత్యంలో) నందిని సిధారెడ్డి, డా. అయాచితం శ్రీధర్, నెల్లుట్ల రాధామనోహర్‌రావు, కె.ఎల్. కాంతారావు, గడియారం శివఫణి శర్మ, కవిగారు, మండవ వెంకట ప్రసన్న, యస్.వి. నారాయణ, డా. దిలావర్, ఎమ్మెస్సార్, మాల్యశ్రీ లాంటి లబ్ధప్రతిష్టలు, వీరి శతకాలను, మిగతా గ్రంథాల వైశిష్ట్యాన్ని వేనోళ్ల మెచ్చిదాలు తెలియజేస్తూ రాశారంటా – వీరి గురించి నేను వేరే చెప్పాలా – తెలుగు – తెలుగుతో పాటు మరి మూడు పుస్తకాలు చదవండి – చక్కటి చిక్కటి తెలుగు అలవడుతుంది! అన్ని పుస్తకాల ధర సరసంగానే ఉంది.



(1) తెలుగు వెలుగులు

–*పేజీలు: 94, వెల: ₹ 100/–*



(2) అక్షర శిల్పాలు

–*పేజీలు: 58, వెల: ₹ 75/–*




(3) నానోలు

–*పేజీలు: 84, వెల: ₹ 50/–*


(4) భాషాంజలి

–*పేజీలు: 92, వెల: ₹ 100/–*

ప్రతులకు: శ్రీమతి కాసర్ల శారదాదేవి, 6-8-27. బ్రాహ్మణవాడ, హన్మకొండ – 506 011. ఫోన్: 98668 37741, 94931 22306.



ముఖారి: రొక్కం కామేశ్వరరావు. ఇది కవిత్వం అని వారే ట్యాగ్‌లైన్ పెట్టారు. మనిషిలోని మృగాన్ని వేటాడుతున్న ఆయుధం కవిత్వమేనా అంటాడు కామేశ్వరరావుగారు. ఈ కవి అంతర్ముఖుడు – అంతర్వీక్షణం రాని నగ్నంగా అగ్నిలోకి దూకుతున్న మరో దిగంబరుడు. దిగంబరులను చదవాలంటే పెద్దగా పదాలు రావలసిన పనిలేదు. కానీ వారి మండే గుండెను తాకాలంటే చేతులు కాల్తాయి.



పేజీలు: 113, వెల: ₹ 100/–

ప్రతులకు: యస్. అబ్దుల్ అజీజ్, 46/633, 34, బుధవారపేట, కర్నూలు – 518 002. ఫోన్: 91331 44138, 81063 67175.

మిసిమి
మాసపత్రిక

మీరు చందాదారులుగా చేరండి బహుమతిగా పంపండి

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ *(994 951 6567)* లేదా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com)* ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.


చందా వివరాలు:

₹ 600/- (సంపత్సర చందా),
₹ 1200/- (రెండు సంపత్సరాలకు),
₹ 1800/- (మూడు సంపత్సరాలకు),

Scan QR to Pay
Misimi Publication

మిసిమి ప్రచురణలు



నోబెల్ వ్యాసాలు



మిసిమి పార్థసారథి వ్యాసాలు



చిత్రకళా నీరాజనం



నరిసెట్టి ఇన్నయ్య మిసిమి వ్యాసాలు


పురస్కార సాహిత్యం


వ్యాస మంజూష


సారస్వత వ్యాసాలు


చార్లీ చాప్లిన్


రజ్జు సర్ప భ్రాంతి



భైరన్



సిద్ధార్థ



సప్తపర్ణి



పెళ్లి జీవిత కథ



దోసిట చిన్నుకులు



నృత్యభారతి



పారిజాతం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.